
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14+8 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 17
మంగళవారం 9-4-2024
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్య్రానికి అర్థం లేదు'

సోనోవిజన్ ఉగాది డిస్కౌంట్ సేల్

సోనోవిజన్ ఉగాది డిస్కౌంట్ సేల్‌లో వడ్డీ గాని, డిబిడి గాని లేకుండా లభించే ఫైనాన్స్ లాభదాయకంగా ఉంది. అంతే కాకుండా 15% వరకు లభించే క్యాష్‌బ్యాక్ పట్ల కొనుగోలుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అన్ని పెద్ద కంపెనీల నుండి ఎ.సి, రిఫ్రిజిరేటర్స్, ఎయిర్ కూలర్స్, వాషింగ్ మెషిన్స్, ఎల్.ఇ.డి, మొబైల్స్ & ల్యాప్‌టాప్స్ మరియు గృహోపకరణములు ఈ సంవత్సరంలో ఎప్పుడూ లేనంత ఎక్కువ డిస్కౌంట్‌తో లభిస్తున్నాయి.


'అవినీతి, అసత్య వార్తలు
క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+8 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 17

మంగళవారం 9-4-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'రాష్ట్రాన్ని, దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+8 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 17

మంగళవారం 9-4-2024

పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు
సాక్షి ఉగాది శుభాకాంక్షలు

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



లూటీ లైసెన్స్ రద్దు చేశా

కాంగ్రెస్ పార్టీ లూటీ లైసెన్స్ విధానానికి చరమగీతం పాడానని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు.

వివరాలు 6లో ▸



కవిత బెయిల్ పిటిషన్ కొట్టివేత

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను ఢిల్లీ కోర్టు కొట్టేసింది.

వివరాలు IVలో ▸



ఈసీ ఆఫీస్ వద్ద టీఎంసీ ధర్నా

ఎన్ఐఏ, ఈడీ, సీబీఐ, ఐటీ అధిపతులపై చర్యలు తీసుకోవాలని టీఎంసీ నేతలు ఢిల్లీలోని ఈసీ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు.

వివరాలు 6లో ▸



పల్నాడు జిల్లా చింతలచెరువు వద్ద వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న సీఎం జగన్

టీడీపీలో 'ఆడియో' దుమారం



- వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఫోన్ సంభాషణతో ఆ పార్టీలో కలవరం.. సర్వేపల్లిలో సోమిరెడ్డి ఓడిపోతాడు
- ఆత్మకూరులో 'ఆనం'కు పదివేలతో ఓటమి ఖాయం
- వైఎస్సార్‌సీపీని వీడిపోవడం నాకిష్టం లేదు
- ఎన్నికల్లో విజయం సాధించకుంటే క్విట్ అవుతాం
- కలకలం రేపుతున్న టీడీపీ కోవూరు అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వ్యాఖ్యలు
- ఆడియో విడుదల చేసిన ఎమ్మెల్యే ప్రసన్న సోదరుడు
- ఎవరూలేక వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీ అభ్యర్థుల్ని దిగుమతి చేసుకుంది : విజయసాయిరెడ్డి
- నా సోదరుడికి రూ.3 కోట్లు ఆఫర్ ఇచ్చినా తిరస్కరించాం: నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

4లో



పల్నాడు జిల్లా వినుకొండలో సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న అశేష జనసందోహంలో ఓ భాగం

అవ్వాతాతలూ ఆలోచించండి

పింఛనుదారులతో ముఖాముఖిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

చంద్రబాబు చెప్పేవన్నీ హద్దుల్లేని అబద్ధాలే

8లో

- మీ బిడ్డకు మోసం చేయడం తెలియదు
- నాకు తెలిసింది విలువలు, విశ్వసనీయతే
- బాబు హయాంలో పెన్షన్లు 39 లక్షలు
- మన ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్లు ఏకంగా 66.34 లక్షలు
- నాడు పెన్షన్ల ఖర్చు రూ.400 కోట్లు
- నేడు నెలకు రూ.2 వేల కోట్లు
- 58 నెలల్లో ఏకంగా రూ.90 వేల కోట్లు పెన్షన్ రూపంలో పంపిణీ
- బాబు మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేశాడు
- మేం చెప్పిన ప్రతి హామీని 99% నెరవేర్చాం
- మంచి చేసే విషయంలో మనతో ఎవరూ పోటీ పడలేరు.. అవ్వాతాతల విషయంలో అసలు తగ్గే పరిస్థితే ఉండదు

" వాళ్లు ఎలాగూ చేసేది లేదు కాబట్టి చెప్పడానికేముంది? నోటికి అడ్డేముంది? అబద్ధాలకు రెక్కలు కట్టేస్తే చాలు.. ఎలాగూ చేసేది లేదు కదా! అనే మనస్తత్వం వాళ్లది. మీ బిడ్డ అలా కాదు. ఏదైనా చెప్పాడంటే కచ్చితంగా చేసి చూపిస్తాడు.

- పింఛన్‌దారులతో సీఎం జగన్

మీతోనే మా పయనం

మేమంతా సిద్ధం బస్సు యాత్రలో జన నినాదం

- పదికాలాల పాటు సుపరిపాలన అందించాలని ఆకాంక్ష
- ముఖాముఖిలో సీఎం జగన్‌ను ఆశీర్వదించిన అవ్వాతాతలు
- సంక్షేమాభివృద్ధికి మరోసారి పట్టాభిషేకం చేస్తామని ప్రతిన
- మండుటెండను లెక్క చేయక ఊరూరా ఘన స్వాగతం
- కురిచేడు, వినుకొండలో జన సంద్రాన్ని తలపించిన రోడ్‌షో

- వివరాలు 9లో



వేడిని కాస్త చల్లార్చిన ద్రోణి

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రానికి సోమవారం కాస్త ఉపశమనం లభించింది. ద్రోణి ప్రభావంతో వేడి చల్లారింది. ఐదారు రోజుల నుంచి గరిష్ట ఉష్ణోగ్రతలు 42నుంచి 46 డిగ్రీల వరకు నమోదవుతుండగా.. సోమవారం 44 డిగ్రీలకు తగ్గాయి. నంద్యాల జిల్లా గోస్పాడులో 44.4, వైఎస్సార్ జిల్లా వెదురూరులో 44.3, కర్నూలు జిల్లా వగరూరులో 43.8, అనంతపురం జిల్లా తెరన్నపల్లిలో 43.2 డిగ్రీల చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న నాలుగు రోజులు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి జిల్లాల్లోను, 11, 12 తేదీల్లో తూర్పు గోదావరి, ఎన్టీఆర్, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, కర్నూలు, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఒకటి, రెండు చోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

సీఐడీ కేసుల్లో దోషులకు శిక్ష ఖాయం

5 కేసులు దర్యాప్తు చేస్తున్నాం

పూర్తి ఆధారాలతో కోర్టులో చార్జిషీట్లు దాఖలు.. కేస్ డైరీలు, ఇతర ఆధారాలన్నీ న్యాయస్థానానికి ఇచ్చాం



- అందుకోసం లక్షల పేజీల ఫొటోస్టాట్ కాపీలు తీశాం.. సక్రమంగా రాని కాపీలను చిత్తుగా పరిగణించి కాల్చివేశాం
- ఇది అన్ని దర్యాప్తు సంస్థలు పాటించే విధానమే.. దీన్ని వక్రీకరిస్తూ ఓ వర్గం మీడియా దుష్ప్రచారం
- కేసుల ఆధారాలన్నీ భద్రంగా ఉన్నాయి
- నిబంధనల ప్రకారమే హెరిటేజ్ ఐటీ రిటర్న్‌లు తీసుకున్నాం
- హెరిటేజ్ నుంచి కూడా కొన్ని పత్రాలు తీసుకున్నాం.. సిట్ స్పష్టీకరణ

2లో



కూటమిని వీడని గందరగోళం

- 20కిపైగా ఎమ్మెల్యే, రెండు ఎంపీ స్థానాల్లో అభ్యర్థులను మార్చేందుకు ప్రయత్నాలు
- నర్సాపురం ఎంపీ సీటుపై ఊహాగానాలు
- ఆ సీటును బీజేపీ నుంచి వెనక్కి తీసుకుంటున్నారని ప్రచారం
- రఘురామకృష్ణరాజు టీడీపీలో చేరికతో అయోమయం

4లో

రాజకీయాల్లోనూ పవన్‌ది నటనే



- స్వార్థం కోసమే పవన్ జనసేనను స్థాపించారు
- త్యాగం పేరుతో లోపాయికారి ఒప్పందాలతో నాలాంటి వారిని నట్టేట ముంచారు
- భీమవరం నుంచి పిఠాపురం ఎందుకు మారారో పవన్ చెప్పాలి
- అనకాపల్లి సీటునూ ఎందుకు త్యాగం చేశారు?
- జన సైనికులను జెండా కూలీలుగా, టీడీపీకి బానిసలుగా మార్చారు
- పార్టీని పూర్తిగా నాశనం చేసిన నాదెండ్ల మనోహర్
- జనసేనకు రాజీనామా చేసిన ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన మహేష్

2లో

అధికారికంగా క్రోధి ఉగాది వేడుకలు

2లో

నేడు రాష్ట్రస్థాయిలోను, అన్ని జిల్లాల్లోను దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహణ

ప్రతి జిల్లాలో ఇద్దరు అర్చకులు, ఒక వేదపండితుడికి సత్కారం

ఇదం జగత్



ఇప్పుడు ఎందుకు రెచ్చగొట్టార్సార్! ఇప్పుడు చూడండి వాళ్ల తడాఖా చూపిస్తున్నారు!!



డిజైన్ టెక్ ఆస్తులను ఈడీ జప్తు చేయడం సబబే

4లో

- ఆ ఆస్తిని నేరం ద్వారా సంపాదించారనేందుకు ఆధారాలు ఉంటే జప్తు చేయొచ్చు
- స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో డిజైన్ టెక్‌కు గట్టి ఎదురుదెబ్బ
- కుంభకోణం తీవ్రత, ప్రజాధనం దృష్ట్యా డిజైన్ టెక్ వాదనను ఆమోదించలేం
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి కీలక తీర్పు
- అడ్జుడికేటింగ్ అథారిటీ షోకాజ్ నోటీసులకు సమర్థన.. డిజైన్ టెక్ పిటిషన్ కొట్టివేత

ప్రభుత్వ స్కూళ్లలో 'వాటర్ బెల్'

రోజూ మూడుసార్లు విద్యార్థులకు శుద్ధమైన తాగునీరు



ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా, వడదెబ్బ బారిన పడకుండా పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. మొత్తం 45 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 'వాటర్ బెల్' విధానం అమలు చేస్తోంది. రోజూ ప్రత్యేకంగా మూడుసార్లు వాటర్ బెల్ మోగించి.. విద్యార్థులంతా తప్పనిసరిగా మంచినీరు తాగేలా చర్యలు తీసుకుంది. ప్రస్తుత విద్యా సంవత్సరం ఈనెల 23తో ముగియనుంది. పాఠశాలల పునఃప్రారంభం తర్వాత కూడా వాటర్ బెల్‌ను అమలు చేయనుంది.

3లో

మళ్లీ పలికిన బాబు చిలక..

నాడు లగడపాటిలా నేడు పీకే చిలక జోస్యం

చంద్రబాబు విసిరే ప్యాకేజీ కోసం పచ్చగూటికి చేరిన ప్రశాంత్ కిశోర్



- అవసరమైనప్పుడల్లా బాబుకు అనుకూల ప్రకటనలు.. మళ్లీ వైఎస్సార్‌సీపీ గెలుస్తుందని దజనుకు పైగా జాతీయ మీడియా సంస్థల సర్వేల్లో వెల్లడి
- ఏ యంత్రాంగం లేని పీకే.. ప్యాకేజీ కోసమే చంద్రబాబు మాటలు
- 2019లోనూ లగడపాటి రాజగోపాల్‌తో చిలక జోస్యం చెప్పించిన చంద్రబాబు
- ఆ జోస్యం వికటించడంతో మాయమైన లగడపాటి.. ఈ ఎన్నికల తర్వాత పీకే కూడా మాయమవడం ఖాయం
- రాజకీయంగా కలిసిరాక దిక్కుతోచని స్థితి
- దాంతో ఇం'ధనం' కోసం ఎవరికి నచ్చినట్లుగా వారికి చిలక జోస్యం
- తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో వికటించిన జోస్యం

IVలో

గవర్నర్ ఉగాది శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజలకు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ క్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపినట్లు రాజ్‌భవన్ వర్గాలు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశాయి. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు ఈ కొత్త సంవత్సరం శాంతిని, శ్రేయస్సును కలిగించి మరింత సంతోషాన్ని, సామరస్యాన్ని తీసుకువస్తుందని గవర్నర్ ఆకాంక్షించారని ప్రకటనలో పేర్కొన్నాయి.

తెలుగు ప్రజలకు సీఎం జగన్ ఉగాది శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ క్రోధి నామ సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు అన్నీ శుభాలు జరగాలని.. విజయాలు సిద్ధించాలని, సమృద్ధిగా వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని, రైతులకు మేలు కలగాలని, సకల వృత్తుల వారు ఆనందంగా.. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, పల్లెల్లో, పట్టణాల్లో ప్రతి ఇల్లూ కళకళలాడాలని, మన సంస్కృతీ సంప్రదాయాలు కలకాలం వర్ధిల్లాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

అధికారికంగా క్రోధి ఉగాది వేడుకలు

దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ

సాక్షి, అమరావతి: క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుంది. మంగళవారం తెలుగు సంప్రదాయాలను పాటిస్తూ పంచాంగ శ్రవణ కార్యక్రమంతో పాటు వేదపండితులు, ఆలయ అర్చకులను సత్కరించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో విజయవాడలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఉదయం 9 గంటలకు కప్పగంతుల సుబ్బరామ సోమయాజులు ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా 18 మంది వేద పండితులను ఘనంగా సత్కరిస్తారు. అన్ని జిల్లాల్లో ఉగాది ఉత్సవాల నిర్వహణలో భాగంగా వేదపండితులు, అర్చకులకు సన్మాన కార్యక్రమాల నిర్వహణకు దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ఈ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్దేశించారు. ప్రతి జిల్లాలో 62 ఏళ్లకు పైబడిన అర్చకులు ఇద్దరిని, ఒక వేద పండితుడిని సత్కరించాలని సూచించారు. సన్మాన గ్రహీతలకు ప్రశంసాపత్రం, రూ.10,116 సంభావన, శాలువా, కొత్తవస్త్రాలు, పండ్లు అందజేస్తారు.

సీఐడీ కేసుల్లో దోషులకు శిక్ష ఖాయం

- 5 కేసులు దర్యాప్తు చేస్తున్నాం
- సిట్ స్పష్టీకరణ

సిట్ దర్యాప్తు చేస్తున్న కేసులకు సంబంధించిన పత్రాలన్నీ న్యాయస్థానాల్లో ఉన్నాయి. ఆ కేసుల్లో దోషులకు శిక్షలు పడటం ఖాయం.
– సిట్‌కు నేతృత్వం వహిస్తున్న ఐజీ కొల్లి రఘురామరెడ్డి

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి, కుంభకోణాలపై సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నమోదు చేసిన కేసుల్లో దోషులకు శిక్ష ఖాయమని తేలడంతో ఎల్లో గ్యాంగ్ బెంబేలెత్తుతోంది. దాంతో సిట్‌పై దుష్ప్రచారం చేసేందుకు యత్నించి బోర్లా పడింది. చంద్రబాబు కేసుల పత్రాలను సిట్ కార్యాలయం ప్రాంగణంలో కాల్చివేస్తున్నారంటూ ఎల్లో చానళ్లు సోమవారం హడావుడి చేశాయి. ఈ ఎన్నికల తరువాత వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని భావించే సిట్ అధికారులు ఇలా పత్రాలను కాల్చివేస్తున్నారంటూ వక్రీకరించిన కథనాలతో ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు యత్నించాయి. కానీ తాము దర్యాప్తు చేస్తున్న అయిదు కేసుల్లో పూర్తి ఆధారాలతో న్యాయస్థానాల్లో చార్జ్‌షీట్లు దాఖలు చేశామని, అంతకు ముందే కీలక కేస్ డైరీలు, ఆధారాలుగా ఉన్నఒరిజినల్ పత్రాలను కూడా న్యాయస్థానాలకు సమర్పించామని సిట్ స్పష్టం చేసింది. ఆ సందర్భంగా తీసిన లక్షలాది ఫొటోస్టాట్ కాపీల్లో సరిగా రాని వాటిని చిత్తుగా పరిగణించి కాల్చివేశామని వెల్లడించడంతో ఎల్లో మీడియా నోళ్లు మూతపడ్డాయి. అసలు కేసులకు సంబంధించిన పత్రాలను రహస్యంగా కాల్చివేసే ఉద్దేశమే ఉంటే ఎక్కడో రహస్యంగా చేస్తారు. అది పెద్ద కష్టమేమీ కాదు. కానీ, సిట్ కార్యాలయ ప్రాంగణంలో.. అదీ పట్టపగలు అందరూ చూస్తుండగా ఎందుకు చేస్తారు? ఈ చిన్న లాజిక్‌ను మర్చిపోయిన ఎల్లో మీడియా బోల్తా పడింది.

అదిగో తోక.. ఇదిగో పులి

తాడేపల్లిలోని సిట్ కార్యాలయం ఉన్న గేటెడ్ కమ్యూనిటీ ప్రాంగణం సమీపంలో కొన్ని చిత్తుకాగితాలను సిబ్బంది సోమవారం ఉదయం కాల్చివేశారు. అది చూసి టీడీపీ నేతలు, ఆ పార్టీకి కొమ్ముకాసే ఎల్లో మీడియా చానళ్లు హడావుడి మొదలుపెట్టాయి. చంద్రబాబుపై నమోదు చేసిన కేసుల కీలక పత్రాలను సిట్ అధికారులు రహస్యంగా దహనం చేసేస్తున్నారని, వాటిలో హెరిటేజ్ ఫుడ్స్‌కు సంబంధించిన పత్రాలు ఉన్నాయంటూ ప్రచారం ప్రారంభించాయి. అనుమతి లేకుండా సిట్ అధికారులు తీసుకున్న హెరిటేజ్ ఫుడ్స్, నారా భువనేశ్వరిల ఆదాయ పన్ను రిటర్న్ కాపీలు వీటిలో ఉన్నాయని ఊదరగొట్టాయి. చంద్రబాబుపై అక్రమంగా కేసులు నమోదు చేశారని, లోకేశ్‌ను అక్రమంగా విచారించారని, అందుకే ఆ కేసుల కాపీలను దహనం చేసేస్తున్నారని కూడా చెప్పుకొచ్చాయి. అంతే కాదు.. ఈ ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బండారం బయటపడుతుందనే ఆందోళనతోనే సిట్ అధికారులు ఇలా పత్రాలను రహస్యంగా దహనం చేసేస్తున్నారని కూడా ఇష్టానుసారం వక్రీకరణలతో కూడిన కథనాలను ప్రసారం చేశాయి. ఎన్నికల వేళ ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు పడరాని పాట్లు పడ్డాయి.



To
Sri Umakanta Barik,
Company Secretary & Compliance Officer,
Heritage Foods Limited,
Hyderabad.

Sir,

Sub:- Reply to your email dt.08.04.2024 regarding safe custody of documents belonging to M/s Heritage Foods -Regarding.

With reference to your email cited in the above subject, it is to inform that all the documents- both hard & soft copies secured from M/s Heritage Foods during the course of investigation over a period of time are in safe custody.

The following are the documents received from Heritage Foods either in Hard or Soft copies and their present status.

Sl No.	Nature of the document with Lr. Reference No. & Date	Received on	Present status of the document	Remarks
1	Book No.5 of Board Meeting Minutes 2013 2015 (Original) April 2013 to March 2015 (Page Nos. 1267 to 1652)	04.10.2023	Submitted to Hon'ble Court of Special Judge for SPE & ACB cases & III Addl. Sessions Judge, Vijayawada on 05.10.2023	Court CF.No 3181/2023
2	Book No.3 of Management Committee Meeting (Original) 25th June 2013 to 24th December 2019 (Page Nos. 481 to 730)	04.10.2023	Submitted to Hon'ble Court of Special Judge for SPE & ACB cases & III Addl. Sessions Judge, Vijayawada on 05.10.2023	Court CF.No 3181/2023
3	Bank Statement of Heritage Foods Ltd holding in Bank of Baroda, Himayat Nagar Branch, Hyderabad regarding payment to LEPL Projects Ltd	04.10.2023	Submitted to Hon'ble Court of Special Judge for SPE & ACB cases & III Addl. Sessions Judge, Vijayawada on	Court CF.No 3181/2023

ఏ డాక్యుమెంట్ ఎక్కడ ఉన్నదీ తెలియజేస్తూ హెరిటేజ్‌కు సీఐడీ రాసిన లేఖ

దుష్ప్రచారాన్ని తిప్పికొట్టిన సిట్

టీడీపీ నేతలు, ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని సిట్ ఓ ప్రకటనలో సమర్థంగా తిప్పికొట్టింది. 'సిట్ కార్యాలయం సమీపంలో దహనం చేసినవి చిత్తు ప్రతులే. మేము దర్యాప్తు చేస్తున్న 5 కేసుల్లో పూర్తి ఆధారాలతో ఇప్పటికే విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో చార్జిషీట్లు దాఖలు చేశాం. ఈ కేసుల కేస్ డైరీలు, ఇతర కీలక ఆధారాలను న్యాయస్థానానికి ఎప్పటికప్పుడు సమర్పించాం. ఆధారాల్లో వేటినీ ధ్వంసం చేయలేదు. ఆధారాలన్నీ భద్రంగా ఉన్నాయి. పూర్తి ఆధారాలతో నమోదు చేసిన ఈ కేసుల్లో దోషులకు శిక్షలు పడటం ఖాయం. ప్రతి కేసులో 40 మంది వరకు నిందితులు ఉన్నారు. ఒక్కో కేసులో ఒక్కో నిందితునికి సంబంధించి దాదాపు 10 వేల పేజీలను ఫొటోస్టాట్ కాపీలు తీయాల్సి వచ్చింది. లక్షలాది పేజీలు కాపీలు తీసే క్రమంలో మెషిన్లు వేడెక్కడం కాగితాలు వాటిలో ఇరుక్కుపోవడం, ఇంకు తగ్గిపోవడం వంటి కారణాలతో చాలా కాపీలు ఫేడ్ అవుట్ అయ్యాయి. వీటిని పక్కనపెట్టేసి కొత్తగా మళ్లీ కాపీలు తీయాల్సి వచ్చింది. ఫేడ్ అవుట్ అయిన వాటిని చిత్తుగా పరిగణించి కాల్చివేశాం. ఇది అన్ని దర్యాప్తు సంస్థల్లో, సాధారణ ఆఫీసుల్లో కూడా పాటించే ప్రక్రియే' అని సిట్ అధికారులు పేర్కొన్నారు.

నిబంధనల ప్రకారమే హెరిటేజ్ ఐటీ రిటర్న్‌లు తీసుకున్నాం

హెరిటేజ్ ఫుడ్స్ కంపెనీ, చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యుల ఆదాయ పన్ను రిటర్న్ కాపీలను అక్రమంగా తీసుకున్నారని, అందుకే వాటిని దహనం చేశారన్న ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని కూడా సిట్ తిప్పికొట్టింది. తాము నిబంధనల ప్రకారమే హెరిటేజ్ ఫుడ్స్, ఇతర నిందితుల ఆదాయ పన్ను రిటర్న్ కాపీలను తీసుకున్నామని తెలిపింది. ఆదాయ పన్ను శాఖకు అధికారికంగా లిఖిత పూర్వకంగా కోరి వారి నుంచి ఆ కాపీలను తీసుకున్నామని చెప్పింది. హెరిటేజ్ ఫుడ్స్ కంపెనీ నుంచి కూడా అధికారికంగానే లేఖ రాసి మరీ చాలా పత్రాలను తీసుకున్నామంది. ఆ ఐటీ రిటర్న్‌లు, హెరిటేజ్ ఫుడ్స్ నుంచి తీసుకున్న పత్రాల ఆధారంగానే ఈ కేసులో లోకేశ్, ఇతర నిందితులను విచారించామని సిట్ తెలిపింది. ఆ దర్యాప్తు నివేదికను కూడా న్యాయస్థానానికి సమర్పించామని చెప్పింది. ఓ వర్గం మీడియా ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేయడాన్ని సిట్ తీవ్రంగా ఖండించింది. ఆ మీడియా చానళ్లు దుష్ప్రచారాన్ని మాని వాస్తవాలను తెలుసుకోవాలని హితవు చెప్పింది.

'హెరిటేజ్'కు దీటైన జవాబు ఇచ్చిన సిట్

చంద్రబాబుపై నమోదైన కేసులకు సంబంధించిన తమ కంపెనీ పత్రాల భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ హెరిటేజ్ ఫుడ్స్ రాసిన లేఖకు సీఐడీ దీటైన సమాధానం ఇచ్చింది. హెరిటేజ్ ఫుడ్స్‌కు సంబంధించిన పత్రాలపై ఎలాంటి ఆందోళన అవసరం లేదని, అవన్నీ న్యాయస్థానానికి తాము ఎప్పుడో సమర్పించామని, అన్ని పత్రాలు భద్రంగా ఉన్నాయని స్పష్టం చేసింది. ఈమేరకు సిట్ అధికారులు హెరిటేజ్ ఫుడ్స్ కంపెనీ సెక్రటరీ ఉమాకాంత బారిక్‌కు సోమవారం ఓ లేఖ రాశారు. తాము హెరిటేజ్ ఫుడ్స్‌కు అధికారికంగా లేఖ ద్వారా కోరి 2022 సెప్టెంబరు 12 నుంచి 2023 అక్టోబరు 4 వరకు ఏడుసార్లు పొందిన ఆ కంపెనీ పత్రాల వివరాలను వెల్లడించారు. ఆ ఒరిజినల్ పత్రాలను న్యాయస్థానానికి సమర్పించిన వివరాలను సీఎఫ్ఆర్ నంబర్లతో సహా తెలిపారు. ఓ వర్గం మీడియా ఉద్దేశపూర్వకంగా చేసిన దుష్ప్రచారాన్ని ఖండిస్తూ తాము జారీ చేసిన ప్రెస్ నోట్‌ను కూడా ఈ లేఖకు జతపరిచారు. ఆ వర్గం మీడియా రాజకీయ దురుద్దేశాలతో సిట్‌పై చేస్తున్న దుష్ప్రచారంపై ఎన్నికల కమిషన్‌కు చేసిన ఫిర్యాదు కాపీని కూడా హెరిటేజ్ ఫుడ్స్‌కు అందించారు.

విలువలు లేని దుర్మార్గుడు చంద్రబాబు

మంత్రి జోగి రమేశ్ ధ్వజం



కంకిపాడు: రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత లేని దుర్మార్గుడు, మోసగాడు చంద్రబాబు అని గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్ ధ్వజమెత్తారు. మామకు వెన్నుపోటు పొడిచి అడ్డదారిలో సీఎం అయ్యారన్నారు. సూట్‌కేస్‌లకు సీట్లు అమ్ముకున్నారని మండిపడ్డారు. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం గంగూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జోగి రమేశ్ సోమవారం మీడియాతో మాట్లాడారు. ఉయ్యూరు ప్రజాగళం సభలో చంద్రబాబు తనపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. బాబు రోడ్‌షోకు, ఉయ్యూరు సభకు జనం నుంచి ఏ మాత్రం స్పందన లేదన్నారు. చంద్రబాబు ఎప్పుడు ఎవరితో పొత్తు పెట్టుకుంటాడో, పొర్లాడతాడో, తెగతెంపులు చేసుకుంటాడో, కాళ్ల బేరానికి వెళ్లి కాళ్లు పట్టుకుంటాడో తెలియదని ఎద్దేవా చేశారు. పనికిమాలిన రాజకీయాలు చేసే ఘనత ఆయనకే సొంతమన్నారు. ముఖ్యమంత్రి పదవి కోసం పోటీ పడటం కాదని, కనీసం కుప్పంలో అయినా ఎమ్మెల్యేగా గెలవటం కోసం ఆరాటపడుతున్నారన్నారు. అయితే కుప్పంలో కూడా చంద్రబాబుకు ఓటమి తప్పదన్నారు. వెన్నుపోటు రాజకీయాలపై దమ్ముంటే తనతో చర్చకు రావాలని సవాల్ విసిరారు. యూత్ కాంగ్రెస్ నేతగా, వంగవీటి మోహన రంగా అనుచరుడిగా రాజకీయంగా ఎదిగానన్నారు. వైఎస్సార్ మనసు గెలుచుకున్నానని, జగనన్న పక్కన చోటు దక్కించుకున్నానని తెలిపారు. చంద్రబాబులాగా దొడ్డి దారిలో తాను ఏ పదవీ పొందలేదన్నారు. ఎమ్మెల్యే పార్థసారథి పెనమలూరు సీటు ఆశిస్తే అడ్డంగా మోసం చేసి నూజివీడు పంపలేదా? అని నిలదీశారు. రెండుసార్లు ఎంపీగా గెలిచిన బీసీ నేత కొనకళ్ల నారాయణకు కనీసం సీటు కూడా ఇవ్వకుండా మోసం చేయలేదా? అని ప్రశ్నించారు. బోడె ప్రసాద్ ఇక్కడ గెలవలేడని, కాల్‌మనీ, సెక్స్ రాకెట్ అభియోగాలు ఉన్నాయని పక్కనపెడితే ఆయన కుటుంబం అంతా కన్నీరుమున్నీరుగా ఏడ్చింది చంద్రబాబు వల్ల కాదా? అని మండిపడ్డారు. మైలవరం సీటు రూ.100 కోట్లకు చంద్రబాబు అమ్ముకున్నాడని దేవినేని ఉమా విమర్శించలేదా? అని ప్రశ్నించారు. మోసపూరిత, వెన్నుపోటు రాజకీయాలకు కేరాఫ్ చంద్రబాబని నిప్పులు చెరిగారు.

బాబూ.. కాపులను మరోసారి మోసం చేయొద్దు

చంద్రబాబుకి కాపు ఐక్యవేదిక బహిరంగ లేఖ

సాక్షి, అమరావతి: ఓటుబ్యాంకు రాజకీయాల కోసం కాపులను మరోసారి మోసం చేయవద్దని చంద్రబాబుకు కాపు ఐక్యవేదిక హితవు పలికింది. పశ్చిమగోదావరి జిల్లా పర్యటనకు పవన్‌తో కలిసి వస్తున్న చంద్రబాబు కాపు రిజర్వేషన్లపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు చంద్రబాబుకు సోమవారం బహిరంగ లేఖ రాసింది. ఈ లేఖను మంగళవారం పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో ఇంటింటికి కరపత్రాల రూపంలో పంపిణీ చేయనున్నట్టు ప్రకటించింది. దీనికి సంబంధించిన వివరాలను కాపు ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోటిపల్లి అయ్యప్ప, కన్వీనర్ పెద్దిరెడ్డి మహేష్, కో–కన్వీనర్లు పంచాది రంగారావు, ఎన్.వి.రామారావు మీడియాకు విడుదల చేశారు. మూడు దశాబ్దాలుగా అమలుకు నోచుకోని కాపు రిజర్వేషన్లపై చంద్రబాబు నాన్చుడు ధోరణి అవలంబిస్తున్నారని పేర్కొన్నారు. 2014 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో కాపులకు రిజర్వేషన్లు ఇస్తానని చెప్పిన చంద్రబాబు మోసం చేశారని గుర్తుచేశారు. కేంద్రం ఇచ్చిన 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లలో కాపులకు ఐదుశాతం అంటూ ఆచరణ సాధ్యం కాని మాటలు చెప్పారని పేర్కొన్నారు.

చంద్రబాబుపై ఈసీకి ఎమ్మెల్యే విష్ణు ఫిర్యాదు

- టీడీపీ సోషల్ మీడియాపైనా ఫిర్యాదు
- బహిరంగ సభల్లో బాబు ప్రవర్తన జుగుప్సాకరం
- కూటమి అభ్యర్థులు ఎన్నికల నియమావళిని పాటించడంలేదు
- ఎమ్మెల్యే మల్లాది విష్ణు

సాక్షి, అమరావతి: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు, ఆ పార్టీ సోషల్ మీడియాపై ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. సోమవారం వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనాను కలిసి ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో కూటమి అభ్యర్థులు ఎక్కడా ఎన్నికల నియమావళిని పాటించడం లేదని చెప్పారు. ముఖ్యంగా బహిరంగ సభల్లో చంద్రబాబు ప్రవర్తన జుగుప్సాకరమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి బచ్చా అనడం, విషం చిమ్ముతున్నారంటూ మాట్లాడటం బాబు అనైతికతకు అద్దం పడుతోందని తెలిపారు. చంద్రబాబు వ్యాఖ్యలు ఓటర్లలో విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్నాయని చెప్పారు. వీటన్నింటిని వివరించి, తగిన చర్యలు తీసుకోవాలని ఈసీని కోరినట్లు తెలిపారు. సీఎం జగన్‌పై తప్పుడు ప్రచారమే చేయడం చంద్రబాబు ఏకైక అజెండా అని, ప్రజలకు మంచి చేసే ఉద్దేశం ఆయనకు లేదని అన్నారు. ఎంతకాలం వైఎస్సార్‌సీపీపై బురదచల్లుతారని నిప్పులు చెరిగారు. కోర్టు పరిధిలో ఉన్న వివేకానందరెడ్డి కేసు గురించి చంద్రబాబు, లోకేశ్, షర్మిల, సునీత పదేపదే మాట్లాడుతున్నారని, పైగా హంతకుడంటూ వైఎస్ అవినాశ్‌రెడ్డిని ఏ విధంగా విమర్శిస్తారని ప్రశ్నించారు. పింఛన్‌దారుల మృతిపైనా టీడీపీ వెబ్‌సైట్లలో ఏ విధంగా పోస్టులు పెడుతున్నారో ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. శవ రాజకీయాలను మానుకోవాలని సూచించారు. రాయలసీమలో పర్యటిస్తున్న సీఎం జగన్ ఓ పేద ముస్లిం సోదరుడి సమస్యను పరిష్కరిస్తే, వాహనం ఆపలేదని టీడీపీ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం దిగజారుడుతనం కాదా అని ప్రశ్నించారు. మైనార్టీలను కేబినెట్లో పక్కన కూర్చోబెట్టుకోలేని అసమర్థ నేత చంద్రబాబుకు మైనార్టీల గురించి మాట్లాడే అర్హత ఉందో లేదో ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. టీటీడీపైనా రాజకీయాలు చేయడం బాధాకరమన్నారు. కలియుగ దైవం జోలికి వస్తే ఈసారి టీడీపీ పూర్తిగా భూస్థాపితం కావడం ఖాయమని చెప్పారు. కూటమి నేతలు కులాలు, మతాల ప్రస్తావన మానుకోవాలని సూచించారు.

పవన్ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

గుర్తింపు లేని జనసేనకు అధినేత, పోటీ చేసిన రెండు చోట్లా ఘోర పరాజయం పాలైన పవన్.. 151 స్థానాలతో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్‌ని దుర్భాషలాడతారా అంటూ విష్ణు ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలైన స్కాంస్టార్లు ఎవరో జనసేన నేతలే బయటకు వచ్చి చెబుతున్నారన్నారు. జనసేన అధినేత తన మాటలను ఉపసంహరించుకునేలా చర్యలు తీసుకోవాలని ఈసీని కోరినట్లు తెలిపారు. ఓట్లు నివాసాలలో ఉండాలనే నిబంధనకు విరుద్ధంగా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బోండా ఉమా ఓ కార్యాలయంలో ఓట్లు నమోదు చేసి ఉంచడాన్ని కూడా ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మలసాని మనోహర్ రెడ్డి, నాగ నారాయణమూర్తి, శ్రీనివాసరెడ్డి, ఒగ్గు గవాస్కర్, కొండపల్లి బుజ్జి పాల్గొన్నారు.

రాజకీయాల్లోనూ పవన్‌ది నటనే

జనసేనకు రాజీనామా చేసిన ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన మహేష్

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): జనసేన అధినేత, సినీనటుడు పవన్‌కళ్యాణ్ రాజకీయాల్లోనూ అద్వితీయంగా నటించి జనసేన నాయకులను నట్టేట ముంచుతున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన మహేష్ తీవ్రస్థాయిలో విమర్శించారు. జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వానికి, పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను పార్టీ అధిష్టానానికి పంపినట్లు ఆయన చెప్పారు. విజయవాడలోని తన కార్యాలయంలో సోమవారం పోతిన మహేష్ మీడియాతో మాట్లాడారు. ప్రజలకు, కార్యకర్తలకు భరోసాను, నమ్మకాన్ని కలిగించే వారే నాయకులవుతారని, రాజకీయాల్లో నటించే వారు నాయకుడు కాలేరని పవన్‌పై ఆయన విరుచుకుపడ్డారు. పవన్‌ను నమ్మి అతనితో అడుగులు వేశామని.. కానీ, ఆయనతో ప్రయాణం చేసినందుకు ఇప్పుడు తమపై తమకే అసహ్యం వేస్తోందన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

2014లో పోటీచేయకపోయినా 2019లో ఒక్క సీటు గెలిచినా, 2024పై ఆశలు పెట్టుకున్నాం. కానీ, పార్టీలో జరుగుతున్నది, జరిగిన పరిణామాలను చూస్తే ఏమీ అర్థంకాక పిచ్చెక్కుతోంది. ఇంత జరుగుతున్నా పవన్‌కళ్యాణ్ నుంచి ఎలాంటి స్పందనలేదు. జనసేన నాయకులను దారుణంగా మోసం చేసిన పవన్ రాష్ట్ర ప్రజలకు, కాపు యువతకు, నాలాంటి కొత్తతరం నాయకులకు సమాధానం చెప్పాలి. గడిచిన ఐదేళ్లలో పార్టీ నిర్మాణంపై ఎక్కడా దృష్టిపెట్టలేదు. పవన్‌కళ్యాణ్ స్వార్థం కోసమే పార్టీని పెట్టినట్లు స్పష్టమవుతోంది. నిజానికి.. ఆయన సిద్ధాంతాలు ప్రజలకు అర్థంకావట్లేదని అనుకున్నాం.. కానీ, స్వార్థంతో ఉన్న పవన్‌ను ప్రజలు గ్రహించారు. అందుకే జనసేనపట్ల వారికి నమ్మకం కుదరలేదు. అసలు 21 సీట్లతో రాష్ట్ర ప్రజలకు, జనసేనకు పవన్ ఏం భవిష్యత్తు ఇవ్వగలరు? అందులో సగానికి పైగా టీడీపీకి చెందిన వారికి సీట్లు కేటాయించారు.. ఒకవేళ గెలిచిన నాయకులు పార్టీ కోసం నిలబడతారా? లోపాయికారి ఒప్పందాలతో, త్యాగం పేరుతో నాలాంటి కొత్త నాయకులను పవన్ నట్టేట ముంచారు. నిజానికి.. రాజధాని ప్రాంతమైన విజయవాడ పరిసర ప్రాంతాల్లో జనసేన పార్టీని నేను ఎంతో కష్టపడి నిలబెట్టా. కానీ, జనసేన నన్ను రాజకీయంగా చంపేసింది. జనసేనకు తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న పోతిన మహేష్

కాపు-బీసీల మధ్య గొడవకు పవన్ కుట్ర

రాష్ట్రంలో కాపు, బీసీల మధ్య గొడవ పెట్టి తద్వారా తాను రాజకీయ లబ్ధి పొందాలనే భారీ కుట్రకు పవన్ ప్రయత్నిస్తున్నారు. 21 సీట్లలో పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని కాపులు హెచ్చరించి పార్టీకి దూరంగా వెళ్లిపోయారు. అయితే, వారిని దగ్గర చేసుకోవడం కోసం బీసీలకు సీట్లు ఎగ్గొట్టి కాపులకు బీసీలకు మధ్య గొడవ పెట్టాలని కుట్ర పన్నారు. బీసీలు సీట్ల కోసం ప్రశ్నిస్తే కాపులు తనకు మద్దతుగా నిలిచి బీసీలపై దాడిచేస్తారన్నది ఆయన ఉద్దేశం. పవన్.. దయచేసి కాపులను బలిచెయ్యొద్దు.

గెలిచే భీమవరం వదిలి పిఠాపురం ఎందుకెళ్లారు

పార్టీ బలంగా ఉన భీమవరం స్థానాన్ని వదిలి పిఠాపురం ఎందుకు వెళ్లారో పవన్ స్పష్టంచేయాలి. అక్కడ మీకు అండగా నిలిచిన వ్యక్తికి సీటు ఇవ్వకుండా టీడీపీకి ఆ సీటు వదిలేయటం ఏమిటి? దీనిలో ఏ ప్రయోజనం ఆశించి బయటకొచ్చారో చెప్పాలి. అలాగే, అనకాపల్లి సీటు నాగబాబుకు అని చెప్పి తరువాత దానిని వదులుకున్నారు. అక్కడకు నాగబాబు వచ్చాక పారిశ్రామికవేత్తల నుంచి భారీగా ఫండ్స్ వసూలుచేశారు. వారంతా ఫిర్యాదు చేసేందుకు ముందుకు రాగానే అక్కడి నుంచి బయటకొచ్చారు.

మేం ఆస్తులు అమ్ముకుంటే మీరు కొనుక్కున్నారు

నేను, నాలాంటి నాయకులు పార్టీలో చేరి మా ఆస్తులు అమ్ముకుంటే మీరు మాత్రం ఆస్తులు కూడబెట్టుకున్నారు. పార్టీ పెట్టింది రాష్ట్ర ప్రయోజనాల కోసం కాదు.. వ్యక్తిగత ప్రయోజనాల కోసమని స్పష్టంగా తెలుస్తోంది. ఈ విషయాలన్నింటినీ త్వరలో అన్ని ఆధారాలతో బయటపెడతా. నిజానికి.. మా రక్తమాంసాలపై మీరు భవంతులు కట్టుకున్నారు. సుజనాచౌదరి గతంలో తన బినామీ ఛానల్‌లో తన తల్లిని దూషించారని పవన్‌కళ్యాణ్ స్వయంగా ట్విట్టర్‌లో పోస్టు పెట్టారు. అలాంటి సుజనాకు పవన్ టికెట్ ఎలా ఇప్పించారు? సుజనా గెలుపు కోసం మీరు ఎలా భాగస్వాములు కావాలనుకుంటున్నారు? కన్నతల్లిని విమర్శించి, పచ్చనోటు పడేస్తే అన్నీ మర్చిపోయారా?

జనసేనను మనోహర్ పూర్తిగా నాశనం చేశారు

జనసేన అనే బస్సు స్టీరింగ్‌ను పవన్‌కళ్యాణ్ నాదెండ్ల మనోహర్ చేతికిచ్చారు. కానీ, ఆ బస్సును మనోహర్ కొండకు ఢీకొట్టి పార్టీని నాశనం చేశారు. పవన్, మనోహర్ ఇద్దరూ కలిసి జనసైనికులను జెండా కూలీలుగా, టీడీపీకి బానిసలుగా చేశారు. ఇప్పుడు చంద్రబాబును, ఆ తర్వాత ఆయన కొడుకును, ఆపైన దేవాన్షును ముఖ్యమంత్రులను చేసేందుకు జనసేనని జనసైనికులను బలిచేస్తున్నారు. అసలు నాదెండ్ల మనోహర్ బాగోతమంతా తెనాలిలో ప్రెస్‌మీట్ పెట్టి చెబుతా. ఇక చివరిగా నాదో కోరిక.. దానిని పవన్‌కళ్యాణ్ తీర్చాలి. పిఠాపురంలో మీ ఇంటి గృహ ప్రవేశానికి అన్నా లెజినోవాతోనే రావాలి. ముమ్ముందు ఇంకా చాలా విషయాలను ఆధారాలతో బయటపెడతా.

వైఎస్సార్‌సీపీలోకి కొనసాగుతున్న చేరికలు



ఎమ్మెల్యే అనిల్ సమక్షంలో పార్టీలో చేరిన వారు

పమిడిముక్కల/గుడివాడ టౌన్: కృష్ణా జిల్లా పమిడిముక్కల మండలం మంటాడ ఎస్సీ కాలనీకి చెందిన 200 మంది టీడీపీ, కాంగ్రెస్ శ్రేణులు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సమక్షంలో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గుడివాడ 34వ వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ మరదాని వెంకటరమణ, ఆమె భర్త వెంకటేశ్వరరావు ఎమ్మెల్యే కొడాలి నాని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.

ప్రధాన నగరాలు, పట్టణాల్లో సోమవారం నమోదైన ఉష్ణోగ్రతల

నగరం/పట్టణం	గరిష్టం	కనిష్టం
కడప	42.6	26.4
కర్నూలు	42.5	29.2
అనంతపురం	42.0	26.0
రెంటచింతల	41.2	26.8
మార్కాపురం	41.0	26.0
తిరుపతి	41.0	22.0
రాజమహేంద్రవరం	40.0	25.0
గుంటూరు	39.0	26.0
తాడేపల్లిగూడెం	39.0	25.0
చిత్తూరు	39.0	21.0
నెల్లూరు	38.2	25.8
విజయనగరం	38.0	32.0
ఏలూరు	37.0	27.0
విశాఖపట్నం	34.6	28.2
శ్రీకాకుళం	34.0	25.0

ప్రభుత్వ పాఠశాలల్లో 'వాటర్ బెల్'

రోజూ మూడుసార్లు విద్యార్థులకు శుద్ధమైన తాగునీరు

- అధిక ఎండ, వడదెబ్బ, డీహైడ్రేషన్ నుంచి రక్షణకు చర్యలు
- జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న పాఠశాల విద్యాశాఖ
- ఈ మేరకు 45 వేల ప్రభుత్వ స్కూళ్లలో ప్రత్యేక ప్రణాళిక
- పాఠశాలల పునఃప్రారంభం తర్వాత కూడా వాటర్ బెల్ అమలు


ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా తిమ్మారెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో మంచినీరు తాగుతున్న విద్యార్థులు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా, వడదెబ్బ బారిన పడకుండా పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ప్రస్తుతం వేసవి తీవ్రతతో ఎండలు పెరుగుతుండటంతో ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మొత్తం 45 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 'వాటర్ బెల్' విధానం అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా రోజూ ప్రత్యేకంగా మూడుసార్లు వాటర్ బెల్ మోగించి.. విద్యార్థులంతా తప్పనిసరిగా మంచినీరు తాగేలా చేస్తున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ఈనెల 23తో ముగియనుంది. అప్పటివరకు 'వాటర్ బెల్' కొనసాగించడంతో పాటు వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే జూన్ 12 నుంచి కూడా ఇదే విధానాన్ని విద్యాశాఖ కొనసాగించనుంది. డీహైడ్రేషన్‌పై విద్యార్థుల్లో అవగాహన పెంపునకు ప్రత్యేక పోస్టర్లను సైతం పాఠశాలల్లో ఏర్పాటు చేయనుంది. విద్యాశాఖ ఆదేశాలతో ఏప్రిల్ 1 నుంచే విద్యార్థుల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

ఎదిగే పిల్లల్లో నీటిలోపం లేకుండా చేసేందుకే..

శరీరంలో నీటిశాతం తగ్గినప్పుడు డీహైడ్రేషన్‌కు గురవుతారు. ఇదొక్కటే కాకుండా పలు అనారోగ్య సమస్యలు కూడా తలెత్తుతాయని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా ఎదిగే పిల్లల్లో నీటి లోపం లేకుండా చూసేందుకు వాటర్ బెల్ విధానం ఉపయోగపడుతుంది. ప్రధానంగా మూత్రం ఏ రంగూ లేకుండా పారదర్శకంగా ఉంటే శరీరంలో తగినంత నీరు ఉందని, సరిపడినంత నీరు తాగుతున్నారని అర్థం. మూత్రం లేత గోధుమ రంగులో ఉంటే ఆరోగ్యంగా ఉన్నారని భావించవచ్చు. లేత పసుపు రంగులో ఉంటే సాధారణ స్థితి అని, ఆరోగ్యంగా ఉన్నట్లు సంకేతం . ముదురు పసుపు రంగులో మూత్రం ఉంటే నీరు తక్కువగా తాగుతున్నారని, మరికొంత నీరు శరీరానికి అవసరమని అర్థం. తేనె రంగులో ఉంటే శరీరానికి తగినంత నీరు అందడం లేదని సంకేతం. ముదురు గోధుమ రంగులో మూత్రం ఉంటే వెంటనే ఎక్కువ నీరు తాగాలని అర్థం. ఈ మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో మూత్రశాలల వద్ద పోస్టర్లు అంటిస్తారు.

రోజూ మూడుసార్లు వాటర్ బెల్

రాష్ట్రంలో 45 వేల ప్రభుత్వ పాఠశాలల్లో రోజూ ఉదయం 9.45, 10.05, 11.50 గంటలకు మొత్తం మూడుసార్లు వాటర్ బెల్ మోగిస్తున్నారు. బెల్లు మోగిన వెంటనే ప్రతి విద్యార్థి మంచినీరు తాగాల్సిందే. పాఠశాలల పునఃప్రారంభం తర్వాత కూడా వాటర్ బెల్ విధానాన్ని కొనసాగించాలని జిల్లా విద్యాధికారులను పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆదేశించారు. రోజూ వాటర్ బెల్ నిర్వహణను పర్యవేక్షించాలని డీఈవోలకు సూచించారు. అంతేకాకుండా మూత్రం రంగును బట్టి తమ శరీరంలో నీటి లోపాన్ని విద్యార్థులు తెలుసుకునేలా మూత్రశాలల వద్ద పోస్టర్లు అంటించాలని ఆదేశించారు. దీనిద్వారా నీరు తాగే అలవాటును విద్యార్థుల్లో పెంపొందించవచ్చన్నారు.

పోస్టాఫీసుల ద్వారా ఓటు హక్కుపై అవగాహన

పోస్టర్లను ఆవిష్కరించిన ఏపీసీఈవో ముఖేష్‌కుమార్ మీనా

సాక్షి, అమరావతి: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువను తెలియజేసేందుకు తపాలా శాఖతో కలిసి ఎన్నికల సంఘం ప్రచార కార్యక్రమాలు నిర్వహించనుంది. ఈ మేరకు తపాలా శాఖ ముద్రించిన పలు రకాల ఓటర్ల అవగాహనా పోస్టర్లను సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమబద్ధమైన ఓటరు విద్య, ఎన్నికల భాగస్వామ్యం (స్వీప్-సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమం అమల్లో భాగంగా ఓటర్ల అవగాహనా కార్యక్రమాలు నిర్వహించేందుకు భారత ఎన్నికల సంఘం పోస్టల్ శాఖతో ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పలు రకాల పోస్టర్లను తపాల శాఖ ముద్రించినట్లు చెప్పారు. ఆయా పోస్టర్లతో రాష్ట్రంలోని 57 హెడ్ పోస్టాఫీసులు, 1,512 సబ్ పోస్టాఫీసులు, 9,101 బ్రాంచ్ పోస్టాఫీసుల ద్వారా ఓటర్ల అవగాహనా కార్యక్రమాలను విస్తృత స్థాయిలో నిర్వహించనున్నట్లు వివరించారు. ఓటు విలువను, ఎన్నికల ప్రాముఖ్యతను రాష్ట్ర ప్రజలు, ప్రత్యేకంగా యువత గుర్తించి రానున్న ఎన్నికల్లో తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ఎన్నికల సంఘం అదనపు సీఈవో ఎంఎస్ హరేంధిర ప్రసాద్, అసిస్టెంట్ పోస్టుమాస్టర్ జనరల్ కందుల సుధీర్‌బాబు పాల్గొన్నారు.

యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ డీమ్డ్ యూనివర్సిటీ(కాంచిపురం)లో 2024–25 విద్యా సంవత్సరానికి యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ గుళ్లపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఇంజనీరింగ్, ఆయుర్వేదం, మేనేజ్‌మెంట్, ఇతర కోర్సుల్లో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని చెప్పారు. విజయవాడ సత్యనారాయణపురంలోని కంచి కామకోటి వారి సంప్రదాయ కళాశాల ప్రాంగణం(శారదా కళాశాల)లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీ కంచి కామకోటి పీఠం చారిటబుల్ ట్రస్ట్ ఈ యూనివర్సిటీ నిర్వహణ బాధ్యతలు చూస్తున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియెట్‌లో ప్రతిభ కనబరిచినవారికి స్కాలర్‌షిప్ సౌకర్యం ఉందన్నారు. రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టుల పిల్లల కోసం ప్రత్యేక రాయితీలు ఇస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా తెలుగు రాష్ట్రాల్లో వేదం, స్మార్తము, ఆగమము చదువుకునే బ్రాహ్మణ విద్యార్థులకు వైదిక విద్యతో పాటుగా ఆంగ్ల విద్య, సంప్రదాయ విద్య 6 నుంచి 10వ తరగతి వరకు, ఇంటర్మీడియట్ కూడా ఉచితంగా బోధించే ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, కళాశాలలు కూడా నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ విద్యాసంస్థల్లో ఉచిత విద్య, ఉచిత హాస్టల్ సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలలో అడ్మిషన్ల కోసం 9912626900 నంబరులో, యూనివర్సిటీలో అడ్మిషన్లు, ఇతర వివరాల కోసం 9629032323, 9629001144, 8098001630, 9912626900 నంబర్లలో సంప్రదించాలని కోరారు. అనంతరం 50 మందికి అడ్మిషన్లు ఇచ్చారు. ఈ సమావేశంలో కామకోటి పీఠం చీఫ్ కో–ఆర్డినేటర్ బ్రహ్మశ్రీ యామిజాల నరసింహమూర్తి, కంచి విశ్వవిద్యాలయం అడ్మిషన్స్ డీన్ ప్రొఫెసర్ కె.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్

ఓ అద్భుతం

- ఇది భగీరథ ప్రయత్నం
- వాటర్ గ్రిడ్ నిర్మించిన సీఎం వైఎస్ జగన్‌కు సెల్యూట్
- సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి



కాశీబుగ్గ: శ్రీకాకుళం జిల్లా ఉద్దాన ప్రాంతంలోని కిడ్నీ బాధితుల కోసం కిడ్నీ రీసెర్చ్ సెంటర్, వాటర్ గ్రిడ్ నిర్మించడం భగీరథ ప్రయత్నమని సినీ నిర్మాత, ప్రముఖ సినీనటుడు ఆర్.నారాయణమూర్తి అన్నారు. పలాసలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌ను ఆయన సోమవారం సందర్శించి అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఉద్దాన ప్రాంతంలోని కిడ్నీ వ్యాధులను 1995లో స్థానిక వైద్యులు గుర్తించారని, అనంతరం వచ్చిన నాయకులు, ప్రభుత్వాలు అనేక ప్రయత్నాలు చేశారని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన పాదయాత్రలో ఉద్దానవాసులు పడుతున్న అవస్థలు గుర్తించి ఇచ్చిన మాట ప్రకారం రూ.85 కోట్లతో కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి, డయాలసిస్ కేంద్రం, రూ.700 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు నిర్మించడం భగీరథ ప్రయత్నమన్నారు. ఇంత చక్కటి ఆస్పత్రిని చూస్తుంటే సీఎం వైఎస్ జగన్‌కు సెల్యూట్ చేస్తున్నానని అన్నారు. తాను ఏ పార్టీకి చెందిన వాడిని కాదని, ఏ ప్రభుత్వంలో ఎవరు మంచి చేశారన్నా ఒప్పుకోవాలని, తప్పు చేశారంటే ఖండిస్తానని అన్నారు. విద్య, వైద్యానికి సీఎం ప్రాధాన్యత ఇవ్వడం మంచి పరిణామమన్నారు. తిరుమల తిరుపతి వెంకన్న సాక్షిగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తానని ప్రకటించిన మోదీ దాన్ని అమలు చేయలేదన్నారు. 32 మంది త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు పూనుకుంటున్నారని ధ్వజమెత్తారు. విశాఖకు రావాల్సిన ముడి ఖనిజం, అదానీ, జిందాల్ వంటి కార్పొరేట్ దిగ్గజాలకు అమ్మేస్తున్నారని ఆరోపించారు. సోంపేట థర్మల్ ప్రాజెక్ట్ పోరాట నాయకులు, పర్యావరణ నేత డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ ఖగేశ్వరరావు, డాక్టర్ బాలాజీ, ఎం.కాగేశ్వరరావు, లండ రుద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

దేవగుడిలో సీసీ కెమెరాలతో పోలింగ్ నిర్వహించాలి

స్టేట్ చీఫ్ ఎలెక్షన్ ఆఫీసర్ ముఖేష్‌కుమార్ మీనాకు ఫిర్యాదు



ముఖేష్‌కుమార్ మీనాకు ఫిర్యాదు చేస్తున్న రఘురామిరెడ్డి

జమ్మలమడుగు: వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు మండల పరిధిలోని దేవగుడి గ్రామానికి సంబంధించిన పోలింగ్ కేంద్రాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఓటింగ్‌లో పాల్గొనేలా చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది చాగంటి రఘురామిరెడ్డి ఫిర్యాదు చేశారు. సోమవారం విజయవాడలోని స్టేట్ చీఫ్ ఎలెక్షన్ ఆఫీసర్ ముఖేష్‌కుమార్ మీనాను కలిసి ఆయన వినతిపత్రం సమర్పించారు. అందులో 83వ పోలింగ్ కేంద్రం నుంచి 90వ పోలింగ్ కేంద్రం వరకు.. అలాగే 149, 150, 151, 152 పోలింగ్ కేంద్రాల్లో గత ఎన్నికల్లో రిగ్గింగ్ చేసుకుంటూ వచ్చారని, ప్రజాస్వామ్యబద్ధంగా ఓటింగ్ జరుగలేదని పేర్కొన్నారు. కాబట్టి ఎన్నికల కమిషన్ సాయుధ బలగాలను, పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా చూడాలని కోరారు.

ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిని అనర్హుడిగా ప్రకటించండి


అసెంబ్లీ సెక్రటరీ జనరల్‌కు అప్పిరెడ్డి ఫిర్యాదు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికై పార్టీ ఫిరాయించిన జంగా కృష్ణమూర్తిపై అనర్హత వేటు వేయాలని శాసనమండలిలో విప్ లేళ్ల అప్పిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం అసెంబ్లీ సెక్రటరీ జనరల్ పీపీకే రామాచార్యులును కలిసి ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిపై అనర్హత పిటిషన్ దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని ఉల్లంఘించి జంగా కృష్ణమూర్తి ఇటీవల టీడీపీలో చేరారని ఫిర్యాదు చేశారు. అనంతరం అప్పిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీ నిబంధనల ప్రకారం ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

పలువురు ఐఏఎస్ అధికారులకు పోస్టింగ్‌లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారులకు పోస్టింగ్‌లు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న జి.లక్ష్మీశాను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ సీఈవోగా, పి.రాజాబాబును ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా, ఎం.గౌతమిని టీటీడీ జేఈవో (హెల్త్ అండ్ ఎడ్యుకేషన్)గా, బి.ఆర్.అంబేద్కర్‌ను మధ్యాహ్న భోజన పథకం, పాఠశాలల పారిశుధ్యంశాఖ డైరెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ కె.వెంకటరమణారెడ్డికి పౌరసరఫరాల కార్పొరేషన్ వీసీఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎస్ ప్రభాకర్‌రెడ్డికి అడిషనల్ సీసీఎల్ఏ కమ్ సెక్రటరీగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు కేటాయించారు.

అనివార్య పరిస్థితుల్లోనే కూటమి: పురందేశ్వరి



కొవ్వూరు: అనివార్య పరిస్థితుల్లోనే రాష్ట్రంలో బీజేపీ, జనసేన, టీడీపీ కలిశాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి అన్నారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో సోమవారం నిర్వహించిన మూడు పార్టీల ఉమ్మడి సమావేశంలో ఆమె మాట్లాడారు. టిడ్కో ఇళ్ల శిథిలావస్థకు చేరుకున్నాయని, పేదలకు అందడం లేదన్నారు. కరోనా సమయం నుంచీ అందిస్తున్న మనిషికి ఐదు కిలోల ఉచిత బియ్యాన్ని డోర్ డెలివరీ పేరుతో జగన్‌మోహన్‌రెడ్డి వ్యాన్‌ల ద్వారా ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. మహిళల రక్షణ కోసం దిశ యాప్ పెట్టి, ఫోన్ ఊపితే సరిపోతుందన్నారని, మహిళలు ఊపుతూనే ఉన్నారని విమర్శించారు.

సీపీఎం అభ్యర్థుల ప్రకటన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఒక ఎంపీ, తొమ్మిది ఎమ్మెల్యే స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థుల జాబితాను సీపీఎం రాష్ట్ర కమిటీ ఆమోదించింది. ఇందుకు సంబంధించిన వివరాలను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అరకు లోక్‌సభ నియోజకవర్గం నుంచి పాచిపెంట అప్పలనర్స పోటీ చేస్తున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో రంపచోడవరం–లోతా రామారావు, అరకు–దీసరి గంగరాజు, కురుపాం–మండంగి రమణ, గాజువాక–మరడాన జగ్గునాయుడు, విజయవాడ సెంట్రల్–చిగురుపాటి బాబురావు, గన్నవరం–కళ్ళం వెంకటేశ్వరరావు, మంగళగిరి–జొన్నా శివశంకర్, నెల్లూరు సిటీ–మూలం రమేష్, కర్నూలు–డి.గౌస్‌దేశాయి, సంతనూతలపాడు–ఉబ్బా ఆదిలక్ష్మి పోటీ చేస్తారని సీపీఎం ప్రకటించింది. వీటిలో ఐదు అసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్‌తో ఒప్పందం కుదిరిందని, మరో ఐదు స్థానాల్లో సీపీఎం, సీపీఐ పరస్పర సహకారంతో పోటీ చేస్తున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు.

కూటమిని వీడని గందరగోళం

అన్ని స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించినా ఇంకా స్పష్టత కరువు

- 20కిపైగా ఎమ్మెల్యే, రెండు ఎంపీ స్థానాల్లో అభ్యర్థులను మార్చేందుకు ప్రయత్నాలు
- నర్సాపురం ఎంపీ సీటుపై ఊహాగానాలు
- ఆ సీటును బీజేపీ నుంచి వెనక్కి తీసుకుంటున్నారని ప్రచారం
- రఘురామకృష్ణరాజు టీడీపీలో చేరికతో అయోమయం
- ఏలూరు ఎంపీ అభ్యర్థిని మారుస్తున్నట్లు ప్రచారం
- పలు సీట్లకు ప్రకటించిన అభ్యర్థుల పైనా చంద్రబాబు పునరాలోచన
- తలలు పట్టుకుంటున్న తమ్ముళ్లు



సాక్షి, అమరావతి: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమైతే కట్టాయి కానీ, ఆ మూడూ ఒక్కటిగా లేవు. పట్టుమని పది సీట్లు గెలుస్తామన్న నమ్మకం వాటికే లేదు. ఒంటరిగా పోటీ చేసే బలం ఒక్క పార్టీకీ లేదు. అసలు ప్రజలకి ఆ పార్టీలపై నమ్మకమే లేదు. అయినా లేని బలాన్ని ఊహించుకుని ఎంత హడావుడి చేస్తున్నా ఆ కూటమిలో ఉన్న డొల్లతనం ఎప్పటికప్పుడు బయటపడుతూనే ఉంది. నానా ప్రయాసలు పడి సీట్ల సర్దుబాటు చేసుకున్నా, అతి కష్టం మీద 175 ఎమ్మెల్యే, 25 ఎంపీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించినా మూడు పార్టీల్లో గందరగోళం కొనసాగుతూనే ఉంది. తమదే సీటు అని అభ్యర్థులు ధైర్యంగా ముందుకెళ్లే పరిస్థితి ఒక్క చోటా లేదు. అందుకు తగ్గట్టుగానే జాబితాలు ప్రకటించాక పలు స్థానాల్లో అభ్యర్థులను మార్చారు. ఇంకా మారుస్తున్నారు. సుమారు 50 నియోజకవర్గాల్లో తిరుగుబాట్లు, అసంతృప్తుల ఆందోళనలతో ఏ రోజున ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. సీట్లు ఖరారైనా అదే తుది నిర్ణయం కాదని టీడీపీ అధినేత చంద్రబాబే చెప్పారు. మరికొన్ని ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల్లో అభ్యర్థులను మార్చడానికి చంద్రబాబు కసరత్తు కూడా చేస్తున్నారు. 20కి పైగా ఎమ్మెల్యే అభ్యర్థులను మార్చడానికి చంద్రబాబు చర్చలు జరుపుతుండడంతోపాటు ఆ నియోజకవర్గాల్లోని నేతలకు సంకేతాలు కూడా ఇచ్చారు. కీలకమైన రెండు, మూడు ఎంపీ స్థానాలపైనా తర్జనభర్జన పడుతున్నారు. బీజేపీ, జనసేన సీట్లు కూడా ఒకటి, రెండు మారే అవకాశం ఉందనే ప్రచారం జోరుగా జరుగుతోంది. దీంతో కూటమిలో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. చాలామంది అభ్యర్థులు అసలు ప్రచారం చేసుకోవాలా వద్దా అన్న మీమాంసలో పడిపోయారు.

నర్సాపురం ఎంపీ సీటుపై ఊహాగానాలు

ప్రధానంగా నర్సాపురం ఎంపీ స్థానంపై వస్తున్న రకరకాల ఊహాగానాలు కూటమిలో అయోమయాన్ని సృష్టించాయి. ఈ సీటును బీజేపీకి కేటాయించి, శ్రీనివాసవర్మను అభ్యర్థిగా ప్రకటించారు. అయితే ఇక్కడి నుంచి పోటీ చేయడానికి విశ్వప్రయత్నాలు చేసి విఫలమైన రఘురామకృష్ణరాజు ఇప్పటికీ ఆ సీటు తనదేనని అంటున్నారు. బీజేపీ శ్రీనివాసవర్మను మార్చి రఘురామకు ఆ సీటు ఇస్తుందని కొద్దిరోజులు ప్రచారం జరిగింది. అయితే, రఘురామకృష్ణరాజు టీడీపీలో చేరడంతో అది జరిగే పని కాదని తేలిపోయింది. బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్ నర్సాపురంలో తమ అభ్యర్థిని మార్చే అవకాశమే లేదని సోమవారం తేల్చి చెప్పేశారు. అయినా దీనిపై టీడీపీ నాయకులు ఇంకా రగడ సృష్టిస్తూనే ఉన్నారు. నర్సాపురం లోక్‌సభ స్థానాన్ని బీజేపీ నుంచి వెనక్కి తీసుకొని, ఏలూరు లోక్‌సభ స్థానం కేటాయిస్తారని, అప్పుడు రఘురామకృష్ణరాజు నర్సాపురం నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతారని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇందుకు తగ్గట్టుగానే ఏలూరు బీజేపీ సీటు ఆశించిన తపన ఫౌండేషన్‌కు చెందిన గారపాటి చౌదరి అక్కడ ప్రచారం చేసుకుంటున్నారు. ఏలూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌పై స్థానికంగా వస్తున్న వ్యతిరేకతతో ఆయన్ని మారుస్తారనే ప్రచారమూ దీనికి తోడైంది. మరోవైపు రఘురామకృష్ణరాజుకు ఉండి అసెంబ్లీ సీటు ఇవ్వకూడదంటూ అక్కడ టీడీపీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. ఆయనకిస్తే తిరుగుబాటు చేస్తామని కూడా హెచ్చరించాయి. దీంతో నర్సాపురం, ఏలూరు లోక్‌సభ స్థానాల్లో కూటమి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

పాతపట్నం, శ్రీకాకుళంలో మార్పు తప్పదా?

పాతపట్నం, శ్రీకాకుళం సీట్లలో కూడా మార్పు తథ్యమని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఆ రెండు స్థానాలకు అభ్యర్థులుగా ప్రకటించిన మామిడి గోవిందరావు, గొండు శంకర్‌పై కేడర్ నుంచి వ్యతిరేకత రావడంతో చంద్రబాబు మనసు మార్చుకున్నానని తెలుస్తోంది. పాతపట్నం సీటును మాజీ ఎమ్మెల్యే కలమట వెంకట రమణకి ఇస్తే ఎలా ఉంటుందని ఆలోచిస్తున్నారు. శ్రీకాకుళం సీటుకు గుండా లక్ష్మీదేవి పేరును పరిశీలిస్తున్నారు. దీంతో ఇప్పటికే టికెట్లు వచ్చాయని అన్ని ఏర్పాట్లతో ప్రచారం చేసుకుంటున్న నేతలు ఏం చేయాలో తెలియక జుట్టు పీక్కుంటున్నారు. మరోవైపు తూర్పుగోదావరి జిల్లా అనపర్తి సీటుపైనా ప్రతిష్టంభన కొనసాగుతోంది. పొత్తులో బీజేపీకి వెళ్లిన ఈ సీటును తిరిగి టీడీపీకి ఇస్తారనే సమాచారంతో బీజేపీ స్థానిక నేతల్లో అయోమయం ఏర్పడింది. జనసేనకు కేటాయించిన యలమంచిలి, నర్సాపురం స్థానాల్లోనూ అభ్యర్థులు మారతారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మరికొన్ని స్థానాలపైనా జరుగుతున్న రకరకాల ప్రచారాలు మరింత గందరగోళాన్ని సృష్టిస్తున్నాయి.

దివ్యాంగులను గాలికి వదిలేసింది చంద్రబాబే

వైఎస్సార్‌సీపీ విభిన్న ప్రతిభావంతుల విభాగం అధ్యక్షుడు కిరణ్‌రాజ్

సాక్షి, అమరావతి/గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): దివ్యాంగులను గాలికి వదిలేసింది చంద్రబాబేనని వైఎస్సార్‌సీపీ విభిన్న ప్రతిభావంతుల విభాగం అధ్యక్షుడు బందెల కిరణ్‌రాజ్ ధ్వజమెత్తారు. దివ్యాంగులను సీఎం జగన్ గాలికి వదిలేశారని చంద్రబాబు ఆరోపించటం తగదని హితవు పలికారు. ఆయన సోమవారం తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ.. దివ్యాంగులకి పెన్షన్ ఇచ్చే విషయంలో చంద్రబాబు వ్యత్యాసాలు చూపిస్తే, సీఎం జగన్ ఎలాంటి వ్యత్యాసాలు చూపించకుండా రూ.3 వేలు అందజేశారని గుర్తుచేశారు. పాదయాత్రలో దివ్యాంగుల బాధను అర్థం చేసుకున్న మనసున్న సీఎం జగన్ తాను అధికారంలోకి రాగానే రూ.3 వేలు పెన్షన్ ఇస్తానని చెప్పాన్నారు. ఎక్కడ ఓట్లు పోతాయోనని చంద్రబాబు తన పాలనా కాలంలో చివరి నాలుగు నెలలు మాత్రమే.. వైకల్యం 40 నుంచి 80 శాతం ఉంటే రూ.2 వేలు, 80 నుంచి 100 శాతం ఉంటే రూ.3 వేలు ఇచ్చారని చెప్పారు. అది కూడా జన్మభూమి కమిటీ ద్వారా టీడీపీకి నచ్చినవారికి ఇచ్చారన్నారు. అదే సీఎం జగన్ వైకల్యం పర్సంటేజీతో సంబంధం లేకుండా రూ.3 వేలు పెన్షన్ ఇచ్చారని తెలిపారు. దివ్యాంగులకు ఈ ఇద్దరు చేసిన సహాయాన్ని పరిశీలిస్తే.. ఎవరు మానవతావాదులో అర్థమవుతుందని చెప్పారు. పేదలకు సాయం చేయటంలో సీఎం జగన్ కాలిగోటికి కూడా చంద్రబాబు సరిపోరన్నారు. అప్పుడు పెన్షన్ కోసం కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు ప్రభుత్వం ఒకటో తేదీనే ఇంటివద్దకే వచ్చి పెన్షన్ ఇస్తోందన్నారు. జగనన్న ప్రభుత్వం వికలాంగుల హక్కుల చట్టం–2016 అమలు చేసి ఎంతోమంది దివ్యాంగులకు న్యాయం చేసిందన్నారు.

టీడీపీలో 'ఆడియో' దుమారం

వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఫోన్ సంభాషణతో ఆ పార్టీలో కలవరం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఇటీవల కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సోదరుడు రాజేంద్రనాథ్‌రెడ్డితో జరిపిన ఫోన్ సంభాషణ రాజకీయంగా పెద్ద దుమారం రేపుతోంది. నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో పార్లమెంట్ అభ్యర్థి విజయసాయిరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో కలిసి రాజేంద్రనాథ్‌రెడ్డి సోమవారం ఆ ఆడియో సంభాషణను విలేకరుల సమావేశంలో బహిర్గతం చేశారు. ఈ ఆడియో తనది కాదని ప్రశాంతిరెడ్డి కామాక్షమ్మ అమ్మవారి సాక్షిగా చెప్పగలరా అని రాజేంద్రనాథ్‌రెడ్డి సవాల్ విసిరారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాం నుంచి వారి కుటుంబంతో తమకు అనుబంధం ఉందన్నారు. నేటికీ జగన్‌మోహన్‌రెడ్డితో ఆ అనుబంధం కొనసాగుతోందని ఆయన స్పష్టంచేశారు.



మాట్లాడుతున్న రాజేంద్రనాథ్‌రెడ్డి. చిత్రంలో విజయసాయిరెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి తదితరులు

ఓడితే ముఖం చాటేస్తారు: విజయసాయిరెడ్డి

వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పెద్దల పట్ల అగౌరవంగా మాట్లాడడం, ఒకవేళ ఎన్నికల్లో ఓడిపోతే రాజకీయాల నుంచి వైదొలగుతాం అని చెప్పడం చూస్తే వారి వ్యవహారం ప్రజలకు బాగా అర్థమవుతుందన్నారు. ఓడిపోతే విదేశాల్లో వ్యాపారాలు, లావాదేవీలు చేసుకుంటూ ప్రజా జీవితంలోకి రారని వారి మాటల బట్టి తెలుస్తోందన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు కావాలో ఓడిపోతే ముఖం చాటేసే టీడీపీ అభ్యర్థులు కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. ఎవరూలేకే టీడీపీ వైఎస్సార్‌సీపీ నుంచి అభ్యర్థులను దిగుమతి చేసుకుందన్నారు.

నా సోదరుడికి రూ.3 కోట్లు ఆఫర్ ఇచ్చారు: ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇక తన సోదరుడు రాజేంద్రకు ప్రశాంతిరెడ్డి రూ.3 కోట్లు ఆఫర్ ఇచ్చి పార్టీలోకి ఆహ్వానించినా వారి ప్రలోభాలకు తలొగ్గలేదని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. ప్రశాంతిరెడ్డి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని వాడు అని సంబోధించడం చూస్తే ఎంత అహంకారంతో మాట్లాడుతోందో అర్థమవుతోందన్నారు.

ఆడియో సంభాషణ ఇలా..

రాజేంద్ర: హలో ప్రశాంతక్కా.. బావున్నావక్కా..

ప్రశాంతి: ఎక్కడున్నావ్?

రాజేంద్ర: అక్కా బెంగళూరులో ఉన్నా. అక్కా ఇక్కడ రెండు పీజీలు ఏర్పాటుచేశాను

ప్రశాంతి: నీవు ఇక్కడ లేవా?

రాజేంద్ర: పీజీలు ఏర్పాటుచేసి ఇక్కడే ఉన్నాను. వచ్చిపోతుంటాను అక్కా.

ప్రశాంతి: నేనెందుకు చేశానంటే.. ఇప్పడే నీవు చెప్పొద్దు.. కోవూరు నుంచి పోటీచేయమని అడుగుతున్నారు వాళ్లు.. సర్వేపల్లి నుంచి పోటీ చేయమని అడిగారు.. ఈ పార్లమెంట్ నియోజకవర్గం కాదు కదా అని వద్దన్నాను. కోవూరు తీసుకోమన్నారు.. ఫస్ట్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి అల్లుడు కోసం ఉంచారు.. ఆయన పార్టీలోకి రాకపోవడంతో నన్నే చేయమంటున్నారు.

రాజేంద్ర: అక్కా.. అక్కా..

ప్రశాంతి: ఇంకా వాళ్లు (వైఎస్సార్‌సీపీ) మా వెంట పడే ఉన్నారు. నాక్కూడా పార్టీ మారడం ఇష్టం లేదు, ఫస్ట్ నుంచి ఈ పార్టీ అంటే ఇష్టం నాకు.. మరీ వాళ్లు ఈ మాదిరి చేసేసరికి అన్నను కన్విన్స్ చేయలేక పోయా. నాకు ఇంత అవమానం జరిగితే ఇంకా వెంటపడతావా అన్నారు. నాది చేతగానితనం అనుకుంటావా. నాకు రాజకీయం అవసరంలేదు. నేను పోటీచేస్తా.. గెలిస్తే గెలుస్తా.. లేకుంటే ఓడిపోతా. ఆ తర్వాత క్విట్ అయిపోతా.. పోటీచేయకుండా ఉండనన్నాడు..



రాజేంద్ర: అక్కా.. అక్కా..

ప్రశాంతి: వీళ్లందరూ నన్ను ఉండమంటున్నారు. లేదులే మేం ఎంపీ ఎలక్షన్ చేసుకుంటాం అన్నాను.. లేదులే అన్నాను. కోవూరు అయితే ఆదాల అల్లుడు అనుకున్నారు. కావలిలో కావ్య కృష్ణారెడ్డి ఉన్నాడు. కోవూరే తీసుకోమంటున్నారు.

రాజేంద్ర: అవును కదక్కా అందరం ఇంట్లో వారం కదా.

ప్రశాంతి: ఇంట్లో వారమే కానీ వాళ్లు పోటీచేయమంటున్నారు.. అన్న కూడా పార్టీ వీడుతున్నారు కాబట్టి వైఎస్సార్‌సీపీ నుంచి ప్రెజర్స్ ఉంటాయి.. ఆత్మకూరు అయితే పదివేలతో ఆనం రామనారాయణరెడ్డి ఓడిపోతాడు.. అయితే, విక్రమ్ బాగా చేస్తున్నాడు.. రామనారాయణరెడ్డి పోయినా కూడా ప్రాబ్లమ్ అవుతుంది..

రాజేంద్ర: అక్కా.. నేను మధ్యస్తంగా ఏమి చెప్పలేను.. నాకు ఇద్దరు కావాలక్కా.. ఈ మధ్య అన్నకు దూరంగా ఉన్నా.

ప్రశాంతి: మీడియాకు వీడియోలు పెడుతున్నావు కదా.. ప్రతి ఎలక్షన్‌కు అన్నదమ్ముల మధ్య మామూలే కదా..

రాజేంద్ర: కానీ, మా మధ్య ఏమీలేవక్కా.. అన్న గెలుపు కోసం గట్టిగా కృషిచేసేవాళ్లం.

ప్రశాంతి: ఎక్కడా చెప్పకు రాజేంద్ర.. మేమైతే ఇంకా ఓకే చెప్పలేదు రాజేంద్ర. అంతా బంధువులు కదా.. సర్వేపల్లి గురించి చెప్పినా నేను ఒప్పుకోలేదు. నీవు సర్వేపల్లిలో అయితే గెలుస్తావన్నారు.. గెలవనని కాదు. నాకు ఇష్టంలేదు అని చెప్పా.. మరీ ఆయనకు (సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి) టికెట్ ఇవ్వమనే చెప్పారు.. నేను వద్దని చెప్పాను.. ఎవరు ముందుకు రాకపోతే ఆయనకే టికెట్ ఇస్తారు కదా పాపం..

ఓటమి భయంతో టీడీపీ అడ్డదారులు

- ప్యాకేజీలతో ఆయారాం గయారాంలకు వల
- కోవూరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సోదరుడికే రూ.3 కోట్ల ఆఫర్
- రంగంలోకి దిగిన 'వేమిరెడ్డి' టీమ్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ రాష్ట్రంలో టీడీపీ గ్రాఫ్ రోజురోజుకూ దిగజారిపోతుండడంతో ఓటమి భయం పట్టుకున్న ఆ పార్టీ అభ్యర్థులు చివరికి అడ్డదారులు ఎంచుకున్నారు. ఆయారాం, గయారాంలను గుర్తించి ప్యాకేజీ ఆఫర్లతో వారిని కొనుగోలు చేసేందుకు ప్రలోభాలకు గురిచేస్తున్నారు. గత ఎన్నికల్లో టీడీపీకి పనిచేసి ఆ పార్టీ ఓడిపోయాక అధికారం కోసం వైఎస్సార్‌సీపీ చెంత చేరిన నేతలే ఇప్పుడు టీడీపీ నేతల ప్యాకేజీలకు కక్కుర్తిపడుతున్నారు. నిఖార్సైన వైఎస్సార్‌సీపీ నేతలు మాత్రం వారిచ్చే ప్యాకేజీలకు లొంగకుండా పార్టీ కోసం కష్టపడుతున్నారు. ఇక టీడీపీ నేతల బరితెగింపును చూస్తున్న ఓటర్లు మాత్రం వారిని ఛీదరించుకుంటున్నారు. తాజాగా.. టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఏకంగా కోవూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సోదరుడు రాజేంద్రరెడ్డిని పార్టీలో చేర్చుకునేందుకు రూ.3 కోట్లు ఆఫర్ ఇవ్వడం బట్టబయలు కావడంతో టీడీపీ అభ్యర్థుల బాగోతం వెలుగులోకి వచ్చింది. నిజానికి.. వేమిరెడ్డి దంపతులు ఓట్ల కొనుగోలుకు నోట్ల కట్టలను విచ్చలవిడిగా విసురుతున్నారు. గంపగుత్తగా ఓట్లు కొనుగోలు చేసేందుకు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు భారీ మొత్తంలో ఎరవేస్తున్నారు. ఇటీవల కోవూరు నియోజకవర్గంలోని ఇందుకూరుపేట మండలం కృష్ణాపురంలో మత్స్యకార గ్రామాల్లో దురాయి ఆచారాన్ని అడ్డం పెట్టుకుని ఓట్ల కొనేందుకు రూ.80 లక్షలకు బేరం పెట్టిన విషయం బయటకు పొక్కింది. ఈ వ్యవహారంపై అధికార యంత్రాంగం నిఘా ఉంచడంతో వీరు తాజాగా ప్రజాప్రతినిధులపై దృష్టిసారించారు.

ప్రజాప్రతినిధులకు ప్యాకేజీలు..

ఇక నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను టార్గెట్ చేసిన టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వారికి ప్రత్యేక ప్యాకేజీలు ఆఫర్ చేస్తున్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలతోపాటు స్థానిక లీడర్లకు రూ.15 లక్షలు.. ఎంపీపీలు, జెడ్పీటీసీలకు రూ.25 లక్షల చొప్పున రేటు ఫిక్స్ చేశారు. వీరి పరిధిలో ఓట్లు వేయించే బాధ్యత మీదే అంటూ టార్గెట్లు పెడుతున్నారు. అలాగే, ఆత్మకూరు, ఉదయగిరి, నెల్లూరు రూరల్, నెల్లూరు సిటీ, కందుకూరు నియోజకవర్గాలతో పాటు తన సతీమణి పోటీచేస్తున్న కోవూరు నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులకు రేట్లు ఫిక్స్‌చేసి ప్రలోభాలకు గురిచేయడం వెలుగులోకి వచ్చాయి. ప్రధానంగా కోవూరు నియోజకవర్గంలో ఆయారాం, గయారాంలను ఒకొక్కరిని రహస్యంగా తమ శిబిరాలకు పిలిపించుకుని మాట్లాడుతున్నారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని వవ్వేరు బ్యాంకు చైర్మన్‌లుగా పనిచేసిన ఇద్దరు నేతలకు బంపర్ ఆఫర్ ఇచ్చి పార్టీలో చేర్చుకున్నారు. వారిలో ఒకరు గత ఎన్నికల్లో టీడీపీకి పనిచేసిన నేత కావడం గమనార్హం. ఎన్నికల వేళ ప్యాకేజీ ఆఫర్ పెంచుకుని తిరిగి సొంత పార్టీలోకి మారారని టీడీపీ నేతలే ఆరోపిస్తున్నారు. అలాగే, జొన్నవాడ ఆలయ మాజీ చైర్మన్ కూడా ఇదే తరహా ప్యాకేజీలతో పార్టీ ఫిరాయించారని చెబుతున్నారు. నేతలకు ప్యాకేజీలతో పాటు ఓటర్లకు సైతం భారీగానే డబ్బులిస్తామని, ఆ డబ్బుల పంపిణీ బాధ్యత కూడా మీదే అని ఆశపెట్టి మరీ పార్టీ కండువా కప్పుతున్నారు. ఇలా ప్రజాప్రతినిధులతో పాటు ఆయా గ్రామాల్లో బలమైన నేతలకు సైతం ప్యాకేజీలు అందించేందుకు వేమిరెడ్డి తన బంధుగణంతో ఏర్పాటుచేసుకున్న టీమ్‌తో వ్యవహారాలు నడిపిస్తున్నారు.

రివర్స్ అవుతున్న ఓటర్లు..

కోవూరు నియోజకవర్గంలో వేమిరెడ్డి దంపతులు మండల స్థాయి నేతలకు రూ.కోట్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు రూ.లక్షల్లో ప్యాకేజీలు ఇస్తున్నారు. ప్యాకేజీలు తీసుకున్న వారు ఈ దఫా ఎన్నికల్లో ప్రశాంతిరెడ్డికి ఓట్లు వేద్దామని స్థానికులకు చెబుతుండడంతో 'ఎంత డబ్బులు తీసుకున్నారు వాళ్ల దగ్గర'.. అంటూ భగ్గుమంటున్నారు. తమకు సీఎం జగన్ రూ.లక్షల్లో సాయం అందించారని, ఇప్పుడు మీరు చెప్పిన వాళ్లకు ఓటేసి ఆయనకు ద్రోహం చేయలేమని ఓటర్లు తెగేసి చెబుతున్నారు.

డిజైన్ టెక్ ఆస్తులను ఈడీ జప్తు చేయడం సబబే

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి కీలక తీర్పు

సాక్షి, అమరావతి: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో కీలక పాత్రధారైన డిజైన్ టెక్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ సంస్థకు చెందిన రూ.31.20 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లను జప్తు చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జారీ చేసిన ప్రాథమిక జప్తు ఉత్తర్వులను (పీఏవో) హైకోర్టు సమర్థించింది. అలాగే మనీలాండరింగ్ చట్టం కింద డిజైన్ టెక్‌కు అడ్జ్యుడికేటింగ్ అథారిటీ జారీ చేసిన షోకాజ్ నోటీసులు సైతం సబబేనని పేర్కొంది. ఈడీ జారీ చేసిన ప్రాథమిక జప్తు ఉత్తర్వులను, అడ్జ్యుడికేటింగ్ అథారిటీ జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ డిజైన్ టెక్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. ఈడీ జారీ చేసిన ప్రాథమిక జప్తు ఉత్తర్వులను అడ్జ్యుడికేటింగ్ అథారిటీ ముందే తేల్చుకోవాలని డిజైన్ టెక్‌కు స్పష్టం చేసింది. ఈ విషయంలో ఈడీ తరఫు న్యాయవాది జోస్యుల భాస్కరరావు చేసిన వాదనతో న్యాయస్థానం ఏకీభవించింది. ఈ కుంభకోణం తీవ్రత, ఇందులో ప్రజాధనం ముడిపడి ఉన్న నేపథ్యంలో ఈడీ ఉత్తర్వులు, అడ్జ్యుడికేటింగ్ అథారిటీ నోటీసుల విషయంలో డిజైన్ టెక్ వాదనను ఆమోదించలేమని తేల్చిచెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ఇటీవల కీలక తీర్పు వెలువరించారు.

ఆధారాలను బట్టి జప్తు చేసే అధికారం ఈడీకి ఉంది

'మనీలాండరింగ్ చట్టంలోని సెక్షన్ 5 ప్రకారం ఈడీ అధికారులు ఏ వ్యక్తి ఆస్తినైనా జప్తు చేయొచ్చు. ఆ ఆస్తిని నేరం ద్వారా సంపాదించారనేందుకు తమ ముందున్న ఆధారాలను బట్టి జప్తు చేసే అధికారం అధికారులకు ఉంది. ఈ అధికారాన్ని ఉపయోగించే స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో డిజైన్ టెక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లను ఈడీ జప్తు చేసింది. నేరం ద్వారా సంపాదించిన డబ్బు లేదా ఆస్తి (ప్రొసీడ్స్ ఆఫ్ క్రైం)కి విస్తృత నిర్వచనం ఉంది. సీఐడీ జప్తు చేసే నాటికి బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.2.8 కోట్లను మాత్రమే ప్రొసీడ్స్ ఆఫ్ క్రైంగా భావించవచ్చని, అంతకు మించిన మొత్తాలను జప్తు చేసే అధికారం ఈడీకి లేదన్న డిజైన్ టెక్ తరఫు సీనియర్ న్యాయవాది వాదనలు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. వాస్తవానికి సీఆర్‌పీసీ సెక్షన్ 102 కింద సీఐడీ చేపట్టిన చర్యలు, మనీలాండరింగ్ చట్టం కింద ఈడీ చేపట్టిన చర్యలు పరస్పరం భిన్నమైనవి. సీఐడీ జప్తుపై కింది కోర్టు, హైకోర్టు, సుప్రీంకోర్టు ముందు దాఖలైన వ్యాజ్యాల్లో ఈడీ ప్రతివాది కాదు. ఈ కోర్టులన్నీ కూడా కేవలం సీఐడీ జప్తు అంశానికే పరిమితమయ్యాయి. అందువల్ల ఈడీ జారీ చేసిన జప్తు ఉత్తర్వులను 'రెండో జప్తు' అనడానికి ఏమాత్రం వీల్లేదు' అని న్యాయమూర్తి తన తీర్పులో స్పష్టం చేశారు.

డిజైన్ టెక్ వాదనలో ఏమాత్రం పస లేదు..

'అడ్జ్యుడికేటింగ్ అథారిటీ ఇచ్చిన షోకాజ్ నోటీసులకు వివరణ ఇచ్చేందుకు, ఈడీ జారీ చేసిన ప్రాథమిక జప్తు ఉత్తర్వులపై అభ్యంతరం తెలిపేందుకు ఉన్న ప్రత్యామ్నాయాలను డిజైన్ టెక్ ఉపయోగించుకోవచ్చు. అడ్జ్యుడికేటింగ్ అథారిటీ నోటీసులకు వివరణ ఇచ్చినట్లు డిజైన్ టెక్ చెబుతోంది. అందువల్ల ఈడీ ప్రాథమిక జప్తు ఉత్తర్వులను కూడా ఆ అథారిటీ ముందే తేల్చుకోవచ్చు. అడ్జ్యుడికేటింగ్ అథారిటీ ముందుకు వెళితే తమకు ఇబ్బంది కలుగుతుందన్న డిజైన్ టెక్ వాదనలో ఏమాత్రం పస లేదు. ఈ కేసు తీవ్రత దృష్ట్యా, ఇందులో ప్రజాధనం ముడిపడి ఉన్న కారణంతో ఆ వాదనను ఆమోదించలేకున్నాం. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకుని డిజైన్ టెక్ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని కొట్టేస్తున్నాం. ఈ తీర్పులో వ్యక్తం చేసిన అభిప్రాయాల ప్రభావానికి లోనవకుండా అడ్జ్యుడికేటింగ్ అథారిటీ ఈ వ్యవహారాన్ని పరిష్కరించాలి' అని జస్టిస్ రవి తన తీర్పులో పేర్కొన్నారు.



స్కిల్ కుంభకోణంపై రంగంలోకి దిగిన ఈడీ..

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ఏర్పాటు పేరుతో వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని లూటీ చేసిన సంగతి తెలిసిందే. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ కుంభకోణంపై సీఐడీ కేసు నమోదు చేసింది. చంద్రబాబు, అప్పటి మంత్రి అచ్చెన్నాయుడులతో పాటు పలువురు అధికారులను సీమెన్స్, డిజైన్ టెక్ తదితరులను నిందితులుగా చేర్చింది. వందల కోట్ల రూపాయల ప్రజాధనం దారి మళ్లడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. దర్యాప్తులో భాగంగా డిజైన్ టెక్ బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.31.20 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు స్కిల్ కుంభకోణానికి సంబంధించినవేనని తేల్చింది. ఈ మొత్తాన్ని జప్తు చేస్తూ గతేడాది ఏప్రిల్ 21న ఈడీ ప్రాథమిక జప్తు ఉత్తర్వులు ఇచ్చింది. అనంతరం అడ్జ్యుడికేటింగ్ అథారిటీకి ఫిర్యాదు చేసింది. దీంతో అడ్జ్యుడికేటింగ్ అథారిటీ.. డిజైన్ టెక్‌కు షోకాజ్ నోటీసులు ఇచ్చింది. గతేడాది జూలై 13లోపు ఈ నోటీసులకు సమాధానం ఇవ్వాలని డిజైన్ టెక్‌ను ఆదేశించింది. ఈడీ ప్రాథమిక జప్తు ఉత్తర్వులను, అడ్జ్యుడికేటింగ్ అథారిటీ షోకాజ్ నోటీసులను సవాల్ చేస్తూ డిజైన్ టెక్ చైర్మన్ కమ్ ఎండీ వికాస్ వినయ్ ఖాన్వేల్కర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ఈడీది రెండో జప్తు అవుతుంది..

డిజైన్ టెక్ తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు, ఈడీ తరఫున సీనియర్ స్టాండింగ్ కౌన్సిల్ జోస్యుల భాస్కరరావు వాదనలు వినిపించారు. డిజైన్ టెక్ బ్యాంకు ఖాతాలో ఉన్న నగదును సీఐడీ జప్తు చేసిందని, దానిపై తాము కింది కోర్టును ఆశ్రయించామని ఆదినారాయణరావు చెప్పారు. బ్యాంకు ఖాతా నిర్వహణకు అనుమతినిచ్చిన కింది కోర్టు.. నగదును ఫిక్స్‌డ్ డిపాజిట్లుగా మార్చాలని ఆదేశించిందన్నారు. తరువాత ఈడీ ఆ ఫిక్స్‌డ్ డిపాజిట్లను జప్తు చేస్తూ ప్రాథమిక జప్తు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. వాస్తవానికి ఆ డబ్బును వినియోగించుకునేందుకు హైకోర్టు తమకు అనుమతినిచ్చిందని ఆదినారాయణరావు తెలిపారు. సీఐడీ జప్తు చేసిన మొత్తాలను తిరిగి ఈడీ జప్తు చేయడం రెండో జప్తు కిందకు వస్తుందని, ఒకే ఆస్తికి రెండు జప్తు ఉత్తర్వులు చెల్లవన్నారు. అందువల్ల ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని విన్నవించారు. బ్యాంకులో ఉన్న నగదు ఖాతాదారులకు చెల్లించాల్సిన మొత్తమన్నారు. తాము అడ్జ్యుడికేటింగ్ అథారిటీ ముందుకు వెళితే నిర్దిష్ట గడువు లోపు చేయాల్సిన చెల్లింపులు చేయలేమని, దీంతో ఖాతాదారుల నుంచి సివిల్, క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని కోర్టుకు నివేదించారు.

సీఐడీ, ఈడీ జప్తులు వేర్వేరు

డిజైన్‌టెక్ వాదనలను ఈడీ తరఫు న్యాయవాది భాస్కరరావు తోసిపుచ్చారు. ఈ మొత్తం వ్యవహారంపై అడ్జ్యుడికేటింగ్ అథారిటీ విచారణ పూర్తి కాకుండా ఈ వ్యాజ్యం దాఖలు చేశారని, అందువల్ల ఇది అపరిపక్వ వ్యాజ్యమని.. దీన్ని కొట్టేయాలని కోరారు. అడ్జ్యుడికేటింగ్ అథారిటీ ఉత్తర్వులపై డిజైన్ టెక్‌కు అభ్యంతరం ఉంటే అప్పిలేట్ అథారిటీ వద్దకు వెళ్లాలని, ఆ తరువాతే హైకోర్టుకు రావాల్సి ఉంటుందన్నారు. ఈడీ జప్తు చేసిన మొత్తాలకు, నేరానికి సంబంధం లేదని నిరూపించుకోవాల్సిన బాధ్యత డిజైన్ టెక్‌పైనే ఉందన్నారు. షోకాజ్ నోటీసుకు ఆ సంస్థ ఇచ్చిన వివరణను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాల్సింది అడ్జ్యుడికేటింగ్ అథారిటీయేనన్నారు. సీఆర్‌పీసీ సెక్షన్ 102 కింద సీఐడీ జారీ చేసిన జప్తు ఉత్తర్వులకు, మనీలాండరింగ్ కింద ఈడీ జారీ చేసిన ఉత్తర్వులకు ఏ మాత్రం సంబంధం లేదని, అవి రెండూ వేర్వేరని నివేదించారు. బ్యాంకు ఖాతాల్లో ఉన్న మొత్తాల విషయంలో కింది కోర్టు, హైకోర్టు, సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు సీఐడీ జప్తునకు సంబంధించినవే తప్ప, ఈడీ జప్తుకు సంబంధించినవి కావన్నారు. అందులో ఈడీ పార్టీ కూడా కాదన్నారు. అందువల్ల తమ జప్తు ఉత్తర్వులు రెండో జప్తు కిందకు రావని స్పష్టం చేశారు. ఈ మేరకు ఇరుపక్షాల వాదనలు విని గతేడాది అక్టోబర్ 10న తీర్పును వాయిదా వేసిన న్యాయమూర్తి జస్టిస్ రవి ఇటీవల తన తీర్పును వెలువరించారు.

కూచిపూడిలో హైకోర్టు న్యాయమూర్తి కిరణ్మయి


కూచిపూడి కళాపీఠంలో జస్టిస్ కిరణ్మయి(మధ్యలో)

కూచిపూడి(మొవ్వ): ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి మండవ కిరణ్మయి కృష్ణాజిల్లా కూచిపూడిలో తాను చదువుకున్న శ్రీసిద్ధేంద్ర జెడ్పీ ఉన్నత పాఠశాలను, శ్రీసిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్య కళాపీఠాన్ని సోమవారం సందర్శించారు. ఆమె స్వగ్రామమైన మొవ్వ మండలం బార్లపూడికి వెళుతూ మార్గ మధ్యంలోని కూచిపూడి పాఠశాలను సందర్శించి ఆమె గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం శేషసాయి కుమార్ న్యాయమూర్తిని శాలువా కప్పి, పూలమాలతో సత్కరించారు. అనంతరం కళాపీఠాన్ని సందర్శించి కళాపీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి, అధ్యాపకులు ఏలేశ్వరపు శ్రీనివాసులు, చింతా రవి బాలకృష్ణ, డాక్టర్ వెంకట దుర్గాభవాని, లైబ్రేరియన్ ఫణి కుమార్ ద్వారా నాట్య విశేషాలను తెలుసుకున్నారు. ముందుగా మండలంలోని పెడసనగల్లులోని తమ బంధువులను కలిశారు.

నేడు శ్రీశారదాపీఠంలో ఉగాది వేడుకలు

పెందుర్తి: శ్రీక్రోధి నామ తెలుగు సంవత్సరాది పర్వదినం సందర్భంగా విశాఖ శ్రీశారదాపీఠంలో మంగళవారం ఉగాది వేడుకలు నిర్వహించనున్నారు. ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి సారథ్యంలో ఉదయం పంచాంగ శ్రవణం, తర్వాత పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అనుగ్రహ భాషణం ఉంటుంది.

కరెంటు ఆపడం కొత్తేం కాదు

ప్రముఖుల రోడ్ షోలో ప్రజలు, నాయకుల భద్రతకు పటిష్ట చర్యలు

- ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా విద్యుత్ సరఫరా నిలిపివేత
- సహజంగా జరిగేదానిపై రామోజీ వంకర రాత
- ఈనాడు రోత రాతలపై మండిపడ్డ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు



సాక్షి, అమరావతి: ఉరుములు, మెరుపులు వస్తున్నప్పుడు, వేగంగా తుపాను గాలులు వీస్తున్నప్పుడు, అల్పపీడనం కారణంగా జోరుగా వాన కురుస్తున్నప్పుడు మాత్రమే కాదు రోడ్డు మీద భారీ లోడ్‌తో ఉన్న వాహనం వెళుతున్నప్పుడు కూడా ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తుంటారు. లక్షలాది జనం ఒకే రహదారి వెంట బారులుతీరినప్పుడు, తమ నాయకుడిని చూడాలని వేలాది మంది భవనాలపై నిలబడినప్పుడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంటు తీగలు తగిలే అవకాశాలు చాలా ఎక్కువ. ఇలాంటి సమయాల్లో అనుకోనిది ఏదైనా జరిగి తీగలు తెగి జనం మీద పడినా, ట్రాన్స్‌ఫార్మర్ తగిలి షాక్‌కు గురైనా అమాయకుల ప్రాణాలు క్షణాల్లో పోతాయి. అలాంటి ప్రమాదం జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా ప్రముఖుల పర్యటనలు, బహిరంగ సభలు, రోడ్ షోలు జరుగుతున్న ప్రదేశాల్లో అధికారులు విద్యుత్ సరఫరాను కాసేపు నిలిపివేస్తుంటారు. ఇది అందరి భద్రతను దృష్టిలో ఉంచుకుని చేస్తున్న చర్య మాత్రమే. దీనిని కూడా రాజకీయం చేయాలని చూశారు ఈనాడు రామోజీ. 'జగన్ వస్తే కరెంట్ వైర్లకు కత్తిరింపే' అంటూ ఈనాడులో వంకర రాతలు రాశారు. ప్రజల ప్రాణాలు పోతే మా కెందుకు మా అజెండా మాదే అన్నట్లు రాసిన ఆ తప్పుడు కథనాన్ని విద్యుత్ సంస్థలు తీవ్రంగా ఖండించాయి. 'మేమంతా సిద్ధం' పేరుతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న బస్సు యాత్రకు ప్రజల నుంచి వస్తున్న విశేష ఆదరణను చూసి మరోమారు అక్కసు వెళ్లగక్కారు.

ఈ అసత్య రాతలపై ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీసీపీడీసీఎల్) సీఎండీ కె.సంతోషరావు తీవ్రంగా మండిపడ్డారు. ప్రముఖుల రోడ్ షో సందర్భంగా భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడం సహజంగా జరిగేదేనని ఆయన వివరించారు. అంతేకాకుండా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో జన సందోహం ఎక్కువై విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని, ఆ ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఏ రాజకీయ పార్టీ ప్రముఖుల పర్యటన జరిగినా ఇదే పద్ధతిని అవలంభిస్తున్నామని స్పష్టం చేశారు. నిజానికి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ వంటి వారి పర్యటనల సమయంలోనూ ముందు జాగ్రత్త చర్యగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తుంటారు. అప్పుడు మాత్రం ప్రభుత్వం కావాలనే, వారి పర్యటనకు ఆటంకం కలిగించడం కోసమే విద్యుత్ సరఫరా నిలిపివేసిందంటూ ఇదే ఈనాడు కథనాలు రాస్తోంది. ఇటీవల పవన్ పర్యటనలో ఫ్లెక్సీ కడుతూ విద్యుత్ షాక్‌కు గురై ముగ్గురు యువకులు దుర్మరణం పాలయ్యారు. అలాంటి దుర్ఘటనలు జరగకూడదనే విద్యుత్ శాఖ అధికారులు కరెంటు నిలిపివేస్తుంటే దానిపైనా పడి ఏడ్వడం రామోజీకే చెల్లింది.

మాజీ ఎమ్మెల్యే వంశీకి ప్రతిష్టాత్మక ఐఎస్బీ పట్టా

'ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్' పట్టా అందుకున్న తొలి రాజకీయ నేతగా గుర్తింపు



ఐఎస్బీలో పట్టా అందుకుంటున్న వల్లభనేని వంశీమోహన్

గన్నవరం : నిత్యం ప్రజా సేవలో తలమునకలై ఉంటూనే ప్రతిష్టాత్మక ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్బీ)లో కోర్స్‌ను విజయవంతంగా పూర్తిచేసి పట్టా అందుకున్నారు గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్. ప్రజాప్రతినిధిగా కొనసాగుతూ ఐఎస్బీలో పట్టా అందుకున్న తొలి రాజకీయ నాయకుడిగా ఆయన గుర్తింపు సాధించారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచాక 2021లో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఆయన సీటు సాధించారు. భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ సంయుక్తంగా రూపొందించిన పబ్లిక్ మేనేజ్‌మెంట్ కోర్సులో ఆయన చేరారు. సాధారణంగా ఐఎస్బీలో సీటు కోసం ఇండియన్ సివిల్ సర్వీస్, ఇండియన్ ఫారిన్ సర్వీస్ అధికారులతో పాటు అత్యంత ప్రతిభావంతులు పోటీపడుతుంటారు. దేశ వ్యాప్తంగా లక్షలాది మంది పోటీ పడినప్పటికీ వంశీమోహన్ కఠినమైన రాత పరీక్షతో పాటు ఇంటర్వ్యూలోనూ ఎంపికై 40 శాతం స్కాలర్‌షిప్‌తో సీటు సాధించారు. ఎమ్మెల్యేగా తీరిక లేకుండా ప్రజాసేవలో ఉన్నా 12 నెలల పాటు నాలుగు టర్మ్‌లలో 26 కోర్ సబ్జెక్టులను అధ్యయనం చేసి అత్యుత్తమ ప్రతిభతో కోర్స్ పూర్తి చేశారు. పంజాబ్‌లోని మొహాలీలో ఐఎస్బీ క్యాంపస్‌లో సోమ వారం జరిగిన స్నాతకోత్సవంలో ప్రతమ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రుక్మిణీబెనర్జీ, భారతి ఎంటర్‌ప్రైజెస్ వైస్ చైర్మన్ రాకేష్ భారతీమిట్టల్, ఐఎస్బీ డీన్ మదన్ పిల్లుట్ల చేతుల మీదుగా వంశీమోహన్ డిగ్రీ పట్టా అందుకున్నారు. 1995లో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ నుంచి గోల్డ్ మెడల్‌తో ఎంవీఎస్సీ పూర్తి చేసిన ఆయన 20 ఏళ్ల తర్వాత ఐఎస్బీలో విజయవంతంగా కోర్స్ పూర్తి చేయడం ఆయన ప్రతిభకు నిదర్శనం. ప్రజలకు మేలు చేసేందుకు ఈ కోర్స్ ఉపయుక్తంగా ఉంటుందని భావిస్తున్నట్టు వంశీ చెప్పారు.

భారీగా బంగారం, వెండి, నగదు స్వాధీనం



పెదపాడు: ఎన్నికల వేళ ఏలూరు జిల్లాలో సోమవారం భారీగా బంగారు, వెండి ఆభరణాలు, నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పెదపాడు ఎస్ఐ శుభశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు జిల్లా పెదపాడు మండలంలోని కలపర్రు టోల్‌గేట్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ కారు (బీవీసీ లాజిస్టిక్ వాహనం)లో తరలిస్తున్న బంగారు, వెండి ఆభరణాలను గుర్తించారు. వాటిలో రూ.12 కోట్ల విలువైన 16.5 కేజీల బంగారు, 31 కేజీల వెండి ఆభరణాలు ఉన్నట్లు తేలింది. వాటికి సంబంధించి సరైన ఆధారాలు లేకపోవడంతో పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఆభరణాలను విజయవాడ నుంచి భీమవరానికి తరలిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. వాహన డ్రైవర్ కొండుబోతు దుర్గారావుపై కేసు నమోదు చేశారు. అలాగే హనుమాన్ జంక్షన్ నుంచి ఏలూరుకు ఓ వాహనంలో తరలిస్తున్న రూ.15 లక్షలను తనిఖీల్లో భాగంగా పోలీసులు గుర్తించారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చిన్నారికి స్థానం

సబ్బుతో జనగణమన అక్షరాలు చెక్కిన చైత్రపావని

పెనమలూరు: కృష్ణాజిల్లా తాడిగడపకు చెందిన చిన్నారి జాతీయ గీతం జనగణమన అక్షరాలను సబ్బుతో చెక్కి ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించింది. వివరాల్లోకి వెళితే.. తాడిగడపకు చెందిన మీసాల గణేష్, పూర్ణిమ దంపతులు ఉద్యోగ రీత్యా అమెరికాలోని టెక్సాస్‌లో స్థిరపడ్డారు. వారి కుమార్తె చైత్రపావని(12)కి డ్రాయింగ్‌లో ఉన్న ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు తమకు పరిచయస్తుడైన తాడిగడపకు చెందిన చిత్రకారుడు పామర్తి శివను సంప్రదించారు. చైత్రపావనికి మైక్రో క్వారియింగ్‌పై ఉన్న మక్కువను గమనించిన శివ ఆమెకు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇచ్చాడు. కొంత కాలం శిక్షణ అనంతరం చైత్రపావని ఈ ఏడాది ఫిబ్రవరి 17న సబ్బుతో జనగణమన 288 అక్షరాలు 12 గంటల్లో చెక్కింది. ఒక్కో అక్షరం 3 మిల్లీ మీటర్ల ఎత్తు, 4 మిల్లీ మీటర్ల వెడల్పుతో ఉంది. ఈ వివరాలు హరియాణాలో ఉన్న 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్' సంస్థకు పంపారు. దీనిని సంస్థ ప్రపంచ రికార్డుగా గుర్తించింది. ఆదివారం సాయంత్రం శివ ఆర్ట్స్ అకాడమీకి సర్టిఫికెట్ పంపారు. శివ మాట్లాడుతూ అమెరికాలో ఉండి చైత్రపావని దేశభక్తిని చాటుతూ జనగణమన అక్షరాలు పట్టుదలతో చెక్కి ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందటంపై ఆనందం వ్యక్తం చేశారు.


సబ్బుతో జనగణమన అక్షరాలు చెక్కుతున్న చైత్రపావని

'రాజ'సం ఎవరిదో...!

రాజస్థాన్‌లో బీజేపీ, కాంగ్రెస్ నువ్వా నేనా?

రెండు ఎన్నికల్లోనూ బీజేపీ క్లీన్‌స్వీప్

ఈసారి హ్యాట్రిక్ లక్ష్యంగా బరిలోకి

'మేనిఫెస్టో మేజిక్'పైనే కాంగ్రెస్ ఆశలు

గహ్లోత్–పైలట్ విభేదాలతో గుబులు

స్టేట్ స్కాన్



రాజస్థాన్‌లో రాజకీయ పోరు దశాబ్దాలుగా బీజేపీ, కాంగ్రెస్ మధ్యే కొనసాగుతోంది. రాష్ట్రంలో అధికారమూ ఈ రెండు పార్టీల మధ్యే మారుతూ వస్తోంది. కమలనాథులు హిందుత్వ, ఆర్థికాభివృద్ధిపైనే ఫోకస్ చేస్తుండగా సంక్షేమ హామీలు, మోదీ ప్రభుత్వంపై వ్యతిరేకతను కాంగ్రెస్ నమ్ముకుంటోంది. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో బంపర్ మెజారిటీతో కాంగ్రెస్ నుంచి అధికారాన్ని చేజిక్కించుకున్న బీజేపీ రెట్టింపు ఉత్సాహంతో లోక్‌సభ బరిలోకి దిగుతోంది. గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో మాదిరిగానే ఈసారి కూడా రాష్ట్రంలో క్లీన్ స్వీప్ చేసి హ్యాట్రిక్ కొట్టాలని పట్టుదలగా ఉంది. ఎంపీ ఎన్నికల్లో పుంజుకుని ఎలాగైనా సత్తా చాటే ప్రయత్నాల్లో కాంగ్రెస్ తలమునకలుగా ఉంది...

పటిష్టమైన సంస్థాగత నిర్మాణం, హిందుత్వ సిద్ధాంత దన్నుతో రాజస్థాన్ బీజేపీ బలమైన పునాదులు వేసుకుంది. తొలుత భైరాన్‌సింగ్ షెకావత్, అనంతరం వసుంధరా రాజె సింధియా వంటివారి నాయకత్వమూ పార్టీకి కలిసొచ్చింది. పట్టణ ప్రాంతాల్లో బీజేపీకి బాగా పట్టుంది. కాంగ్రెస్ కూడా రాష్ట్రంలో బలమైన శక్తిగా కొనసాగుతోంది. అశోక్ గహ్లోత్, సచిన్ పైలట్ వంటి నాయకుల సారథ్యానికి తోడు గ్రామీణ ఓటర్ల మద్దతు పార్టీకి పుష్కలంగా ఉంది. ఈ ఎడారి రాష్ట్రంలో 25 లోక్‌సభ సీట్లున్నాయి. 4 ఎస్సీలకు, 3 ఎస్టీలకు కేటాయించారు.

ఇటీవలే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన కాంగ్రెస్‌కు సార్వత్రిక సమరంలో నెగ్గుకురావడం సవాలే. మాజీ సీఎం అశోక్ గహ్లోత్, సచిన్ పైలట్ హామీల ద్వారా పేదలు, మధ్య తరగతి వర్గాలు, కార్మికులు, రైతుల పక్షాన పోరాటం చేస్తున్నామని రాహుల్ చెబుతున్నారు. ఆర్‌ఎల్‌పీ ఈసారి ఇండియా కూటమిలోకి రావడం కాంగ్రెస్‌కు ఊరటనిచ్చే అంశం.

కాంగ్రెస్‌లో అదే వర్గ పోరు



మధ్య వర్గ పోరు మళ్లీ రాజుకుంటుండటం తలనొప్పిగా మారుతోంది. ఎన్నికల్లో గహ్లోత్ ఓటమి నేపథ్యంలో రాష్ట్ర పార్టీపై పూర్తిగా పట్టు బిగించే వ్యూహాల్లో పైలట్ వర్గం ఉంది. జాలోర్ నుంచి గహ్లోత్ కుమారుడు వైభవ్ బరిలో ఉన్నారు. మ్యానిఫెస్టోలో ప్రకటించిన ఆరు న్యాయాలు, 25 గ్యారంటీలను కాంగ్రెస్ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తోంది. కుల గణన, రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) చట్టబద్ధత జాట్లలో బాగా ఆదరణ ఉన్న బెనీవాల్ ప్రభావం షెకావతీ, మార్వార్ ప్రాంతాల్లో... ముఖ్యంగా నాగౌర్, సికర్, చురు, జుంఝును వంటి లోక్‌సభ స్థానాల్లో కలిసొస్తుందని పార్టీ ఆశలు పెట్టుకుంది.

బీజేపీకి బెనీవాల్ బెంగ!



2014 లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 25 సీట్లనూ ఎగరేసుకుపోయిన బీజేపీ 2019లో సైతం క్లీన్ స్వీప్ చేసింది. 24 సీట్లను బీజేపీ, మిగతా ఒక్క స్థానాన్ని ఎన్డీఏ మిత్రపక్షం రాష్ట్రీయ లోక్ తాంత్రిక్ పార్టీ (ఆర్‌ఎల్‌పీ) గెలుచుకున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం బీజేపీ చతికిలపడింది. గత డిసెంబర్లో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మట్టికరిపించి తిరిగి అధికారాన్ని దక్కించుకుంది. అదే ఊపులో లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా మూడోసారి క్లీన్‌స్వీప్ చేయాలని తహతహలాడుతోంది. అందుకు తగ్గట్టే ప్రచారాన్ని మోదీ పీక్స్‌కు తీసుకెళ్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సభలతో హోరెత్తిస్తున్నారు. కాంగ్రెస్ అంటేనే వారసత్వ రాజకీయాలు, అవినీతికి పెట్టింది పేరంటూ విమర్శలు ఎక్కుపెడుతున్నారు. అయోధ్య రామమందిర నిర్మాణం బీజేపీకి ప్రధాన ప్రచారాస్త్రంగా మారింది. మోదీ ఫ్యాక్టర్, అభివృద్ధి నినాదాలనూ ప్రజల్లోకి తీసుకెళ్తోంది. అయితే గత ఎన్నికల్లో మిత్రపక్షంగా ఉన్న హనుమాన్ బెనీవాల్ సారథ్యంలోని ఆర్‌ఎల్‌పీ ఈసారి కాంగ్రెస్‌తో జతకట్టడం కమలం పార్టీకి కాస్త ప్రతికూలాంశమే. జాట్ నేత అయిన బెనీవాల్‌కు ఉన్న ఆదరణ షెకావతీ, మార్వార్ ప్రాంతాల్లో బీజేపీ అవకాశాలను ప్రభావితం చేయవచ్చంటున్నారు. పార్టీ తరఫున కేంద్ర మంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్ (జోధ్‌పూర్), అర్జున్ రామ్ మేఘ్వాల్ (బికనేర్), లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా (కోట) వంటి హేమాహేమీలు పోటీ చేస్తున్నారు. నలుగురు సిట్టింగులకు బీజేపీ మొండిచేయి చూపడంతో అసంతృప్తి జ్వాలలు భగ్గుమన్నాయి. దీనికి తోడు కాంగ్రెస్ నుంచి జంప్ చేసిన ఇద్దరు నేతలకు తొలి జాబితాలోనే చోటు దక్కింది. వీరిలో బలమైన గిరిజన నేతగా పేరున్న మహేంద్రజీత్‌సింగ్ మాలవీయ ఉన్నారు. పారాలింపిక్స్‌లో పసిడి సాధించిన పద్మభూషణ్ అవార్డు గ్రహీత దేవేంద్ర ఝుజారియాకు బీజేపీ అనూహ్యంగా చురు టికెటిచ్చింది. వసుంధరా రాజె కుమారుడు దుష్యంత్ సింగ్ ఝలావర్–బరన్ నుంచి పోటీ చేస్తున్నారు.



ఎన్నికల తేదీలు
ఏప్రిల్ 19, 26

కుల సమీకరణాలు కీలకం

రాజస్థాన్ రాజకీయాల్లో కులాలది కీలక పాత్ర. ప్రధానంగా జాట్లు, రాజ్‌పుత్‌లు, మీనాలు, గుజ్జర్లు అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం చూపుతున్నారు. 10% జనాభా ఉన్న జాట్ వర్గానికి మార్వార్, షెకావతీ ప్రాంతాల్లో గట్టి పట్టుంది. రాష్ట్ర జనాభాలో రాజ్‌పుత్‌ల వాటా 6–8%. రాజ కుటుంబీకులైన వసుంధరా రాజె, భైరాన్ సింగ్ షెకావత్ సీఎం పదవి చేపట్టినవారే. జాట్లు అప్పుడప్పుడూ ఊగిసలాడినా రాజ్‌పుత్‌ల మద్దతు కమలనాథులకు దండిగా ఉంటుందని గత ఎన్నికలు రుజువు చేస్తున్నాయి. 5 శాతమున్న గుజ్జర్లు గతంలో కాంగ్రెస్‌కు మద్దతిచ్చారు. వారిప్పుడు బీజేపీ వైపు మళ్లవచ్చంటున్నారు. రాష్ట్రంలో బ్రాహ్మణ సామాజికవర్గం 8% దాకా ఉంది. అగ్రవర్ణ పార్టీగా పేరొందిన బీజేపీ అనూహ్యంగా బ్రాహ్మణుడైన భజన్‌లాల్ శర్మను సీఎం చేసింది. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు సీపీ జోషిదీ ఇదే సామాజికవర్గం. ఇక ఎస్టీ సామాజిక వర్గమైన మీనాలు జనాభాలో 5% ఉన్నారు. వీరికి తూర్పు రాజస్థాన్‌లో పట్టుంది. 18% ఉన్న ఎస్టీ సామాజిక వర్గంలోని ఉప కులాలు పరిస్థితులను బట్టి ఇరు పార్టీలకూ మద్దతిస్తున్నారు. కాంగ్రెస్ కుల గణన హామీ ప్రభావం చూపవచ్చంటున్నారు.

సర్వేలు ఏమంటున్నాయి...

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ హిందీ బెల్టులో కీలకమైన రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో ఘన విజయం సాధించడం ఆ పార్టీలో ఫుల్ జోష్ తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీ క్వీన్‌స్వీప్ చేస్తుందని, కాంగ్రెస్‌కు వైట్‌వాష్ తప్పదని తాజా సర్వేలు చెబుతున్నాయి. రాజస్థాన్‌లో 25 సీట్లనూ తన ఖాతాలో వేసుకోవడం ద్వారా బీజేపీ హ్యాట్రిక్ కొడుతుందనేది మెజారిటీ ఒపీనియన్ పోల్స్ అభిప్రాయం.

– సాక్షి, నేషనల్ డెస్క్



ఎన్నికల విచిత్రం

ఇలా ఎడ్ల బండ్లపై బారులు తీరి వెళ్తున్నదెవరో తెలుసా? కర్ణాటకలోని చిక్కమగళూరు జిల్లా ఎన్నికల అధికారులు! ఓటింగ్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సోమవారం ఇలా వినూత్నంగా ప్రచారం చేశారు.

అలవిగాని హామీలు

ఊరూరా బారు మొదలుకుని బాల్య వివాహాల దాకా...

ఎన్నికల వేళ అభ్యర్థుల విచిత్ర విన్యాసాలు

ఎలక్షణీయం

'ఊరూరా బారు, బీరు. నెలకు 10 లీటర్ల బ్రాందీ. ఫారిన్ విస్కీ సరఫరా'. 'ఏకంగా చంద్రుడిపైకి ఫ్రీ ట్రిప్పు'. 'ఒక్కొక్కరి ఖాతాలో ఏటా రూ.కోటి జమ'. 'బాల్య వివాహాలకు మద్దతు'... ఇవన్నీ ఎన్నికల్లో అభ్యర్థులు గుప్పిస్తున్న చిత్ర విచిత్రమైన హామీలు! గెలుపే లక్ష్యంగా అలవిగాని హామీలు గుప్పించే సంస్కృతి పెరుగుతోంది. కొందరు అభ్యర్థులు వార్తల్లో నిలిచేందుకు చిత్ర విచిత్రమైన వాగ్దానాలు చేస్తున్నారు...

బీరు, బంగారం, రూ.10 లక్షలు

వనితా రౌత్. మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా చిమూర్‌వాసి. అఖిల భారతీయ మానవతా పార్టీ అభ్యర్థిగా ఈ లోక్‌సభ ఎన్నికల్లో చంద్రపూర్ నుంచి పోటీ చేస్తున్నారు. 'గమ్మత్తయిన' హామీలతో ఫేమస్ అయ్యారామె. తనను గెలిపిస్తే ప్రతి గ్రామంలో బీర్లతో బార్ ఏర్పాటు చేయిస్తానని, ఎంపీ లాడ్స్ నిధులతో విస్కీ, బీర్లు దిగుమతి చేసుకుని మరీ ఓటర్లకు ఉచితంగా సరఫరా చేస్తానని ప్రకటించారు. ''నిరుపేదలు ఎంతో కష్టించి పనిచేస్తారు. వారు మద్యం సేవించి సేదదీరుతారు. కానీ నాణ్యమైన విస్కీ, బీర్లు తాగే స్థోమత లేక దేశీయ లిక్కరే తాగుతుంటారు. అందుకే నాణ్యమైన లిక్కర్ దిగుమతి చేసుకుని వారికందించాలని అనుకుంటున్నా'' అంటూ రౌత్ తన హామీలను సమర్థించుకుంటున్నారు! 2019 లోక్‌సభ ఎన్నికల్లో, అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఇవే హామీలు గుప్పించారామె. 2019 ఎన్నికల్లో తమిళనాడులోని తిరుపూర్ లోక్‌సభ స్థానం నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన ఎ.ఎం.షేక్ దావూద్ కూడా ఇలాగే ప్రతి కుటుంబానికీ నెలకు 10 లీటర్ల స్వచ్ఛమైన బ్రాందీ సరఫరా చేస్తానని హామీ ఇచ్చారు! పెళ్లి చేసుకునే ప్రతి జంటకు ఏకంగా 10 సవర్ల బంగారం, ఎంపీ నిధుల నుంచి రూ.10 లక్షలిస్తానని, కుటుంబానికి నెలకు ఏకంగా రూ.25,000 ఇస్తాననీ వాగ్దానం చేశారు!

చంద్ర యాత్ర



2021 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో సౌత్ మదురై నుంచి ఇండిపెండెంట్‌గా బరిలో దిగిన శరవణన్ (33) అనే జర్నలిస్టు ఉచితంగా చంద్రుడిపైకి పంపిస్తానని, మినీ హెలికాప్టర్ ఇస్తానని, ఐఫోన్లు పంచిపెడతానని హామీలిచ్చారు. ప్రతి ఓటర్ ఖాతాలో ఏకంగా ఏటా రూ.కోటి జమ చేస్తానన్నారు! ఇంటి పనుల్లో సాయానికి గృహిణులకు ఉచిత రోబోలను అందిస్తానని, ప్రతి ఒక్కరికి స్విమ్మింగ్ పూల్‌తో కూడిన మూడంతస్తుల భవనం, ప్రతి మహిళకూ వివాహ సమయంలో 100 సవర్ల బంగారం, కుటుంబానికో పడవ, యువతకు వ్యాపారం ప్రారంభించేందుకు రూ.కోటి సాయం చేస్తానని వాగ్దానం చేశారు. పైగా తన నియోజకవర్గాన్ని ఎప్పుడూ చల్లగా ఉంచేందుకు 300 అడుగుల ఎత్తులో కృత్రిమ హిమ పర్వతాన్ని ఏర్పాటు చేయిస్తానన్న హామీ నవ్వులు పూయించింది. అయితే, 'తమిళనాడులో ప్రబలంగా ఉన్న ఉచిత తాయిలాల సంస్కృతి బారిన పడొద్దంటూ ఓటర్లలో అవగాహన కల్పించడమే తన లక్ష్యమని ముక్తాయించారాయన.

రైతును పెళ్లాడితే..

రైతు కుమారుడిని పెళ్లాడే మహిళకు రూ.2 లక్షల సాయం చేస్తామని 2023 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలప్పుడు మాజీ సీఎం, జేడీ(ఎస్) నేత కుమారస్వామి ఇచ్చిన హామీ తెగ వైరలైంది. ''రైతుల అబ్బాయిలను పెళ్లాడేందుకు అమ్మాయిలు ముందుకు రావడం లేదు. అందుకే రైతుల స్వీయ గౌరవాన్ని కాపాడేందుకు ఈ హామీ ఇచ్చాం'' అన్నారాయన.

బాల్య వివాహాలకు రైట్ రైట్

2018 రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలప్పుడు బీజేపీ అభ్యర్థి శోభా చౌహాన్ ఇచ్చిన హామీ చర్చనీయంగా మారింది. ''దేవాసీ సమాజంలో బాల్య వివాహాల సంస్కృతిలో పోలీసుల జోక్యాన్ని నివారిస్తాం. నన్ను గెలిపిస్తే బాల్య వివాహాల్లో పోలీసులు జోక్యం చేసుకోకుండా చూస్తాం'' అని ప్రకటించారు.

మునుగోడును అమెరికా చేస్తా

తెలంగాణలో 2022 మునుగోడు అసెంబ్లీ ఉప ఎన్నిక సందర్భంగా ప్రజా శాంతి పార్టీ వ్యవస్థాపకుడు కేఏ పాల్ ఇచ్చిన హామీ కూడా హైలైటే. తనను గెలిపిస్తే మునుగోడును అమెరికాలా మారుస్తానని, ఇతర పార్టీలు 60 నెలల్లో చేయలేనంత అభివృద్ధిని ఆరు నెలల్లోనే చేసి చూపిస్తానని హామీ ఇచ్చారాయన.

ప్రపంచవ్యాప్తంగానూ...

2012 అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో దిగేందుకు ప్రతినిధుల సభ మాజీ స్పీకర్ న్యూ గింగ్రిచ్ విఫలయత్నం చేశారు. తనను గెలిపిస్తే 2020 కల్లా టికి చంద్రుడిపై శాశ్వత అమెరికా కాలనీ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారాయన!

- అవే ఎన్నికల్లో వెర్మిన్ సుప్రీమ్ అనే ఆర్టిస్ట్ తనను గెలిపిస్తే ప్రతి అమెరికన్‌కు ఓ గుర్రాన్ని కానుకగా ఇస్తానని ప్రకటించారు.

- జింబాబ్వేలో 2018 ఎన్నికలప్పుడు ప్రజలకు ఐదేళ్లలో 15 లక్షల ఇళ్లు కట్టిస్తామంటూ జాను–పీఎఫ్ పార్టీ హామీనిచ్చింది. అంటే సగటున రోజుకు ఏకంగా 822 ఇళ్లన్నమాట!

– సాక్షి, నేషనల్ డెస్క్

ఎలక్షన్ బీట్

కాంగ్రెస్, ఎన్‌సీ పొత్తు ఖరారు

జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌లలో చెరో మూడు సీట్లకు పోటీ

న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కశ్మీర్, లద్దాఖ్‌లలోని చెరో మూడు సీట్లలో కలిసి పోటీ చేయాలని కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) నిర్ణయించుకున్నాయి. సోమవారం ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో ఎన్‌సీ నేత ఒమర్ అబ్దుల్లా, కాంగ్రెస్ నేత సల్మాన్ ఖుర్షీద్ ఈ విషయం వెల్లడించారు. ఉధమ్‌పూర్, జమ్మూ, లద్దాఖ్ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఎన్‌సీ మద్దతు ఇస్తుంది. అదేవిధంగా, అనంత్‌నాగ్, శ్రీనగర్, బారాముల్లాల్లో పోటీ చేసే ఎన్‌సీ అభ్యర్థులకు కాంగ్రెస్ మద్దతు ఇవ్వనుందని ఒమర్ అబ్దుల్లా చెప్పారు. పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీ(పీడీపీ) 'ఇండియా'కూటమిలో భాగస్వామే అయినప్పటికీ జమ్మూకశ్మీర్ చిన్న ప్రాంతం కావడంతో సీట్ల సర్దుబాటు సాధ్యపడలేదని వివరించారు.

ఆ నేతలంతా అవినీతిపరులే: నడ్డా

రాంపూర్: కాంగ్రెస్ పార్టీ ఆకాశం, పాతాళం, జలం ఈ మూడు లోకాల్లోనూ కుంభకోణాలకు పాల్పడిందని బీజేపీ చీఫ్ జేపీ నడ్డా ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ బొగ్గు కుంభకోణం, 2జీ, 3జీ స్కాములు, అగస్టావెస్ట్‌ల్యాండ్ స్కాము, సబ్‌మెరీన్ స్కాములకు పాల్పడిందని చెప్పారు.ఆ మాటకొస్తే ప్రతిపక్ష ఇండియా కూటమి కూడా ఈ మూడు లోకాల్లోనూ అవినీతికి తెరలేపిందన్నారు. ప్రధాని మోదీ అవినీతి పరులందరినీ జైలుకు పంపుతారన్నారు. నడ్డా సోమవారం యూపీలోని రాంపూర్‌లో జరిగిన బీజేపీ ఎన్నికల ర్యాలీలో ప్రసంగించారు.

జైల్లో వేయడమే 'మోదీ గ్యారెంటీ': మమత

బాంకుడా(పశ్చిమబెంగాల్): మోదీ కీ గ్యారెంటీ అంటే ఎన్నికల తర్వాత విపక్ష నేతలు అందరినీ కటకటాల వెనక్కి నెట్టడమేనని తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ ఎద్దేవాచేశారు. సోమవారం పశ్చిమబెంగాల్‌లోని బాంకుడాలో జరిగిన ఎన్నికల ప్రచారర్యాలీలో మమత మాట్లాడారు. ''అందర్నీ బంధించి భారత్‌ను ఒక బందీఖానాగా మార్చాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. ఎన్నికల వేళ మీ భర్తలను అరెస్ట్‌చేస్తే భార్యలు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేయాలి' అని పిలుపునిచ్చారు. ''బెంగాల్‌లో ఎన్నికల ర్యాలీల్లో ప్రసంగించేందుకు ప్రధాని మోదీ వస్తే మాకెలాంటి అభ్యంతరం లేదు. కానీ ఎన్నికల తర్వాత విపక్షాలపై కఠిన చర్యలకు దిగుతానంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఆమోదయోగ్యం కాదు. ప్రధాని మాట్లాడే పద్ధతేనా ఇది? నేను కూడా ఎన్నికలయ్యాక బీజేపీ నేతలను జైల్లో పడేస్తానంటే ఎలా ఉంటుంది?. అప్రజాస్వామికమైన ఇలాంటి మాటలు నేను మాట్లాడబోను. ఒక జేబులో ఈడీ, సీబీఐ, మరో జేబులో ఎన్ఐఏ, ఇన్‌కమ్ ట్యాక్స్ శాఖలను పెట్టుకుని మోదీ బెదిరిస్తున్నారు. వాటితో మమ్మల్ని భయపట్టలేరు'' అన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీరేంద్ర సింగ్

చండీగఢ్: కేంద్ర మాజీ మంత్రి బీరేంద్ర సింగ్ బీజేపీని వీడి, కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సోమవారం ప్రకటించారు. ఆయన భార్య, మాజీ ఎమ్మెల్యే ప్రేమలతా సింగ్ కూడా కాంగ్రెస్‌లో చేరారు. ఢిల్లీలో కాంగ్రెస్ నేత భూపిందర్ సింగ్ హుడాను కలిశారు. నెల రోజుల క్రితమే ఆయన కుమారుడు కూడా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కాంగ్రెస్‌తో దాదాపు 4 దశాబ్దాల అనుబంధాన్ని తెంచుకుని, పదేళ్ల క్రితం బీరేంద్ర సింగ్ బీజేపీలో చేరారు. మోదీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు.

మా మేనిఫెస్టోతో మోదీలో భయం: ఖర్గే

న్యూఢిల్లీ: కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో ముస్లింలీగ్ ఎన్నికల హామీలను కాపీ కొట్టినట్లుగా ఉందంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే తీవ్రంగా స్పందించారు. తమ మేనిఫెస్టోను చూసి మోదీలో భయం పట్టుకుందన్నారు. అందుకే 'హిందూ–ముస్లిం స్క్రిప్ట్‌ను తెరపైకి తీసుకువస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో బీజేపీ పరిస్థితి రోజురోజుకీ దిగజారుతుండటంతో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ సారథులకు ఇప్పుడిక ముస్లిం లీగ్‌తో నెరపిన పాత మైత్రి గుర్తుకొస్తోందని సోమవారం ఆయన 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు. 140 కోట్ల ప్రజల ఆశలు, ఆకాంక్షలకు కాంగ్రెస్ 'న్యాయ్ పత్ర'ప్రతిరూపమని చెప్పారు.

ఈసీ ఆఫీసు వద్ద టీఎంసీ నేతల ధర్నా

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల వేళ కేంద్ర దర్యాప్తు సంస్థలను మోదీ సర్కార్ విపక్ష పార్టీలపైకి ఉసిగొల్పుతోందని తృణమూల్ కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. విపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుని పనిచేస్తున్న ఎన్ఐఏ, ఈడీ, సీబీఐ,ఐటీ విభాగం చీఫ్‌లను మార్చాలంటూ టీఎంసీ నేతలు ఏకంగా ఢిల్లీలో ఈసీ కార్యాలయం ఎదుట 24 గంటల ధర్నాకు దిగారు. అంతకుముందు పార్టీ ఎంపీ డెరెక్ ఓబ్రియాన్ సారథ్యంలో 10 మంది ప్రతినిధుల టీఎంసీ బృందం కేంద్ర ఎన్నికల కమిషనర్లను కలిసింది.

20 ఏళ్ల తర్వాత ఓటు

న్యూఢిల్లీ: మావోయిస్టు ప్రభావిత జార్ఖండ్‌లోని సింగ్‌భూమ్ లోక్‌సభ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల ప్రజలు రెండు దశాబ్దాల అనంతరం మొదటిసారిగా 2024 ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఓటర్ల సౌలభ్యం కోసం మావోయిస్టులకు కంచుకోటల్లాంటి మారుమూల ప్రాంతాల్లో 118 బూత్‌లను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి కుల్దీప్ చౌదరి చెప్పారు. ఆసియాలోనే అత్యంత దట్టమైన సాల్ అడవుల్లో ఉన్న సరండా వంటి 118 గ్రామాల్లోకి మే 13వ తేదీన జరిగే పోలింగ్‌కు సిబ్బందితోపాటు సామగ్రిని హెలికాప్టర్ల ద్వారా పంపుతామన్నారు. నుగ్డి గ్రామంలోని మిడిల్ స్కూల్, బొరెరో గ్రామంలోని మధ్య విద్యాలయలో మొదటిసారిగా పోలింగ్ బూత్‌లను నెలకొల్పామన్నారు. కొన్ని ప్రాంతాల్లోకి సిబ్బంది నాలుగైదు కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సి ఉంటుందని వివరించారు. ఏ ప్రాంతాన్నీ వదలకుండా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. 'ఆపరేషన్ అనకొండ' ద్వారా భద్రతా బలగాలు తల్కోబాద్ వంటి 25 వరకు గ్రామాల్లో 15 కొత్త క్యాంపులను ఏర్పాటు చేసి, భద్రతను కట్టుదిట్టం చేశాయని పేర్కొన్నారు. 121 పోలింగ్ బృందాలను రైళ్ల ద్వారా పంపించామన్నారు. దివ్యాంగులు, 85 ఏళ్ల పైబడిన వారికి ఇళ్ల వద్దే ఓటు వేసే సదుపాయం కల్పించినట్లు చెప్పారు. ఎస్టీ రిజర్వుడు స్థానమైన సింగ్‌భూమ్‌లో బీజేపీ నుంచి మాజీ సీఎం మధు కోడా భార్య, సిట్టింగ్ ఎంపీ గీతా కోడా రంగంలో ఉన్నారు. ఇండియా కూటమి అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది.

లూటీ లైసెన్స్ రద్దు చేశా

- పేదల అవసరాలు అవినీతి కాంగ్రెస్‌కు ఏనాడూ కనిపించలేదు
- ఛత్తీస్‌గఢ్ ర్యాలీలో మోదీ ధ్వజం

రాయ్‌పూర్/జగ్‌దల్‌పూర్/చంద్రాపూర్: దశాబ్దాలుగా పేదల అవసరాలు, వారి బాధలు అవినీతి కాంగ్రెస్‌కు పట్టలేదని ప్రధాని మోదీ విమర్శల వాగ్బాణాలు సంధించారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా ఛోటే అంబాల్ గ్రామంలో సోమవారం బీజేపీ 'విజయ్ సంకల్ప్ శంఖనాదం' ర్యాలీలో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. '' గత కాంగ్రెస్ ప్రభుత్వాలు వాటి హయాంలో అవినీతిని దేశ గుర్తింపుగా మార్చేశాయి. అధికారంలో ఉండటమంటే లూటీ చేయడానికి లైసెన్స్ సంపాదించినట్లుగా కాంగ్రెస్ నిశ్చితాభిప్రాయానికి వచ్చేసింది. స్వాతంత్ర్యం వచ్చిననాటి నుంచి పేదల బాధను కాంగ్రెస్ ఏనాడూ అర్థంచేసుకోలేదు. అలాంటి పేదలు కోవిడ్ విలయకాలంలో ఏమైపోతారో అని చాలా మంది నన్ను ప్రశ్నించారు. వాళ్లకేమీ కాదు ఉచితంగా కరోనా వ్యాక్సిన్, ఆహారధాన్యాలు అందిస్తానని ఆనాడే చెప్పా. మా ప్రభుత్వ కృషి కారణంగానే దేశవ్యాప్తంగా 25 కోట్ల మంది ప్రజలు పేదరికం కోరల నుంచి బయటపడ్డారు'' అని చెప్పారు.



పేదల హక్కులను కాంగ్రెస్ హరించింది

''పేదల హక్కులను అవినీతి కాంగ్రెస్ మింగేసింది. 2014కు ముందు పలు కుంభకోణాలతో లక్షల కోట్ల ప్రజాధనం నొక్కేశారు. అభివృద్ధి పనుల కోసం కేటాయించే ప్రతి రూపాయిలో లబ్ధిదారునికి కేవలం 15 పైసలే చేరుతున్నాయని స్వయంగా నాటి ప్రధాని రాజీవ్‌గాంధీయే ఒప్పుకున్నారు. మిగతా 85 పైసలను ఎవరు కొట్టేశారు?. కాంగ్రెస్ కొనసాగించిన ఈ లూటీ లైసెన్స్ విధానానికి నేనే చరమగీతం పాడా. గత పదేళ్లకాలంలో బీజేపీ సర్కార్ లబ్దిదారుల ఖాతాలకు నేరుగా రూ.34 లక్షల కోట్ల మొత్తాలను బదిలీచేసింది. హస్తిన నుంచి విడుదలైన ప్రతి రూపాయి 100 శాతం పేదల చెంతకు చేరింది. ఇప్పటికీ కాంగ్రెస్సే అధికారంలో ఉండి ఉంటే ఈ రూ.34 లక్షల కోట్లలో 85 పైసలు అంటే రూ.28 లక్షల కోట్ల స్వాహా చేసేవారు' అని మోదీ ఆరోపణలు గుప్పించారు.

దేశంలో అన్ని సమస్యలకూ కాంగ్రెస్సే కారణం

దేశంలోని అన్ని సమస్యలకు కాంగ్రెస్ పార్టీయే కారణమని ప్రధాని మోదీ ఆరోపించారు. కాంగ్రెస్‌ను కాకరకాయతో పోల్చిన ఆయన..నెయ్యిలో వేయించినా, చక్కెర కలిపినా కాకర రుచి మాత్రం మారదన్నారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్‌లో సోమవారం ఎన్నికల ర్యాలీలో మాట్లాడారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలను ఆయన స్థిరత్వానికి, అస్థిరతకు మధ్య జరుగుతున్న పోరుగా పేర్కొన్నారు. అవినీతికి పాల్పడేందుకే ప్రతిపక్షాలు అధికారంలోకి రావాలనుకుంటున్నాయన్నారు.

ఎస్సీ, ఎస్టీ మహిళల ఖాతాలో లక్ష

రాహుల్ గాంధీ హామీ



సివనీ/షాదోల్: కేంద్రంలో అధికారంలోకి వస్తే ప్రతి ఎస్సీ, ఎస్టీ మహిళ బ్యాంక్ ఖాతాకు ఏటా రూ.లక్ష జమ చేస్తామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. మధ్యప్రదేశ్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా సివనీ జిల్లాలోని ధనోరాలో ర్యాలీలో గిరిజనులనుద్దేశిస్తూ రాహుల్ మాట్లాడారు.'' కేంద్రప్రభుత్వ విభాగాల్లో కీలకమైన ప్రభుత్వ పదవుల్లో 90 మంది ఐఏఎస్ అధికారులుంటే వారిలో కేవలం ఒకే ఒక్క గిరిజనుడు ఉన్నాడు. దేశజనాభాలో గిరిజనులు ఎనిమిది శాతంకంటే ఎక్కువే ఉంటారు. అయినా దేశంలోని టాప్ 200 కంపెనీల్లో ఒక్కదానికి కూడా గిరిజనులు యజమానులుగా లేరు. కనీసం ఆ సంస్థల్లో అత్యున్నత స్థాయి అధికారులుగానూ లేరు. దేశంలో ఒక్క మీడియా సంస్థకైనా ఆదివాసీ యజమానిగా ఉన్నారా? ఒక్కరైనా న్యూస్‌యాంకర్ ఉన్నారా?' అంటూ గిరిజనుల అభ్యున్నతికి మోదీ సర్కార్ కృషిచేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మేం అధికారంలోకి వస్తే ఏడాదిలోపు ఆదివాసీల భూ హక్కుల సమస్యను పరిష్కరిస్తాం. కేంద్ర ఉద్యోగాల్లో కాంట్రాక్ట్ వ్యవస్థకు చరమగీతం పాడి 30 లక్షల కేంద్ర ఉద్యోగాలను భర్తీచేస్తాం' అని అన్నారు.

న్యూజిలాండ్ వీసా నిబంధనలు కఠినతరం

వెల్లింగ్టన్: వలసలను నియంత్రించేందుకు వీసా నిబంధనలను న్యూజిలాండ్ కఠినతరం చేసింది. ఇకపై తక్కువ నైపుణ్యమున్న పనివారు కూడా ఇంగ్లిష్‌పై పట్టు సాధించాల్సి ఉంటుంది. వారికి ఐదేళ్ల నివాస పరిమితిని మూడేళ్లకు తగ్గించింది. వీసాదారులకు నైపుణ్యం, అనుభవాలకు సంబంధించి పలు నిబంధనలు విధించింది. వెల్డర్లు, ఫిట్టర్లు, టర్నర్లు తదితర 11 కేటగిరీల వారిని ఫాస్ట్ ట్రాక్ విధానంలో తీసుకోవాలనే ప్రతిపాదనను సైతం ప్రభుత్వం ప్రస్తుతానికి పక్కనబెట్టింది. అవసరమైతే వీసా నిబంధనలను మరింత కఠినం చేయొచ్చని కూడా సంకేతాలిచ్చింది.

ఆప్ ఎమ్మెల్యే పాఠక్, కేజ్రీవాల్ పీఏను...

ప్రశ్నించిన ఈడీ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలో ఆప్ ఎమ్మెల్యే దుర్గేశ్ పాఠక్‌తో పాటు ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పీఏ విభవ్ కుమార్‌ను సోమవారం ఈడీ ప్రశ్నించింది. సౌత్ గ్రూప్ నుంచి హవాలా రూపంలో తీసుకున్న రూ.45 కోట్లను గోవా అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి ఆప్ వాడిందని ఈడీ ఆరోపిస్తుండటం తెలిసిందే. ఆ ఎన్నికల్లో గోవాకు పాఠక్ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఎన్నికల వేళ జరిగిన నగదు లావాదేవీలపై ఆయన్ను ఈడీ ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ కేసులో కీలక పత్రాలకు సంబంధించిన వివరాల కోసం విభవ్‌ను విచారించింది.

ప్రచారం నుంచి దూరం చేసేందుకే: అతిశి

పాఠక్‌ను విచారించడంపై ఢిల్లీ మంత్రి అతిశి మండిపడ్డారు. ఆప్ నేతలను ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా చేసేందుకే విచారణ పేరుతో బీజేపీ కుట్ర పన్నుతోందని ఆరోపించారు.

ఎన్నికల ముందు ఎందర్ని జైల్లో వేస్తారు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: తమిళనాడు సీఎం స్టాలిన్‌పై అనుచిత వ్యాఖ్యల కేసులో సత్తై దురై మురుగన్ అనే యూట్యూబర్‌కు బెయిల్‌ను సుప్రీంకోర్టు పునరుద్ధరించింది. ''యూట్యూబ్‌లో ఆరోపణలు చేశారంటూ ఎన్నికల వేళ ప్రతి ఒక్కరినీ జైళ్లలో వేయడం ప్రారంభిస్తే ఎందరు కటకటాల పాలవుతారో ఊహించండి'' అని జస్టిస్ ఏఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ధర్మాసనం ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. నిరసన తెలపడం, అభిప్రాయాల వ్యక్తీకరణ ద్వారా స్వేచ్ఛను దుర్వినియోగపరిచినట్లుగా భావించరాదని పేర్కొంది. స్టాలిన్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు ఆపడం లేదన్న ఫిర్యాదుపై మద్రాస్ హైకోర్టు బెయిల్ రద్దు చేయడంతో మురుగన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

కేంద్ర మంత్రి కారు డోర్ తగిలి స్కూటరిస్టు దుర్మరణం

కృష్ణరాజపురం: కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే కారు తలుపును ఢీకొన్న ద్విచక్ర వాహనదారుడొకరు కిందపడగా అతడిపైకి బస్సు దూసుకెళ్లింది. ఈ ఘటనలో అతడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన సోమవారం బెంగళూరు కేఆర్ పురంలోని గణేశ్ ఆలయం వద్ద జరిగింది. బెంగళూరు ఉత్తర లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అయిన శోభ కరంద్లాజే ఎన్నికల ప్రచారం నిమిత్తం కారులో వెళ్తున్నారు. ఆ వెనుకే బీజేపీ కార్యకర్త ప్రకాశ్ (45) యాక్టివా స్కూటర్‌పై అనుసరిస్తూ వస్తున్నాడు. కారును ఆపి అకస్మాత్తుగా డోర్ తెరవడంతో దాన్ని ఢీకొట్టి కిందపడ్డాడు. వెనుకనే వస్తున్న బస్సు అతడిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ప్రకాశ్ అక్కడికక్కడే చనిపోయాడు. కేఆర్ పురం ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. కారు డ్రైవర్‌తో పాటు మరొకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేంద్ర మంత్రి శోభ ఆవేదన వ్యక్తం చేశారు.



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

ఈ మేలును మరచిపోం



మాది కాకినాడ జిల్లా ప్రత్తిపాడు గ్రామం. నా భర్త కదాలి వెంకట రమణ 20 ఏళ్ల కిందటే మృతి చెందారు. నాకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. ఐదుగురికి వాహాలయ్యాయి. కుమారులు ఇద్దరూ తెలంగాణ రాష్ట్రంలో రోజువారీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఆడపిల్లలు ఇక్కడే ఉంటున్నారు. నా భర్త మరణానంతరం వైఎస్సార్ ప్రభుత్వంలో నాకు పింఛన్ మంజూరైంది. ప్రతి నెలా రూ.3 వేలు వస్తోంది. నా కుమార్తెలు ముగ్గురికీ అమ్మ ఒడి కింద ఏటా రూ.15,000 చొప్పున అందుతోంది. వీటితోపాటు వీరికి ఆసరా, చేయూత పథకాలు వర్తిస్తున్నాయి. ఈ ప్రభుత్వం నిర్ణయాల వల్ల మాలాంటి పేదలు హాయిగా జీవిస్తున్నారు. పిల్లల చదువులకు దిగుల్లేకుండా పోయింది. ఇంటిల్లిపాది ఆరోగ్యానికి ప్రభుత్వమే అండగా నిలిచింది. ఆసరా, చేయూత పథకాల ద్వారా వచ్చిన సొమ్ముతో ఎంతో మంది సొంత కాళ్లపై నిలబడటం ఊరూరా కనిపిస్తోంది. ఇంత మేలు చేసిన సీఎం జగన్‌ను ఎవరు మరచిపోతారు?

– కదాలి రాములమ్మ, ప్రత్తిపాడు
(ప్రగడ రామకృష్ణ, విలేకరి, ప్రత్తిపాడు రూరల్)

అప్పులబారి నుంచి బయటపడ్డాం



మాది డా.బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి గ్రామం. నిరుపేద రజకుల కుటుంబం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనేక సంక్షేమ పథకాలు మాకు అందడంతో జీవనం హాయిగా సాగుతోంది. నాకు, నా కూతురికి ఒక్కొక్కరికి సంవత్సరానికి రూ.15 వేలు చొప్పున నాలుగు విడతల్లో రూ.1.20 లక్షలు వైఎస్సార్ ఆసరా అందింది. చేయూత పథకం కింద రూ.18,750 చొప్పున నాలుగు విడతల్లో రూ.75,000 అందాయి. జగనన్న చేదోడు కింద ఐదు విడతల్లో రూ.50 వేలు అందించారు. నా భర్తకు ప్రతి నెలా రూ.3 వేలు పింఛన్, మా అమ్మాయికి వికలాంగ పింఛన్ రూ.3 వేలు అందుతోంది. మా వలంటీర్ మాతో అన్నీ పూర్తి చేయించి ఈ సంక్షేమ పథకాలు అందేలా చేశారు. పథకాలతో వచ్చిన ఆర్థిక సాయంతో పాడి పశువులు పెంచుకుంటూ లబ్ధి పొందుతున్నాం. అప్పులు తీర్చుకున్నాం. సీఎం జగన్ చేసిన మేలు మరచిపోలేం.

– నందంపూడి సత్యవతి, గొల్లవిల్లి
(నల్లా విజయ్‌కుమార్, విలేకరి, ఉప్పలగుప్తం)

పాపను బతికిస్తున్న పింఛన్



థలసేమియా వ్యాధితో బాధ పడుతున్న నా కుమార్తె రక్షితకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి నెలా రూ.10 వేలు పింఛన్ అందిస్తున్నారు. నా కుమార్తె రక్షిత ప్రస్తుతం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. ఐదు నెలల వయస్సులో పాప అనారోగ్యానికి గురైంది. ఆస్పత్రికి తీసుకెళితే ఎనిమిదో నెల వయసులో థలసేమియాగా వైద్యులు నిర్ధారించారు. నా భర్త రవికుమార్ వ్యవసాయ కూలీ. ఇంతకు ముందు ఆటో ఉండేది. పాప వైద్యం కోసం అమ్మేశాం. ప్రస్తుతం పాప వయస్సు 11 ఏళ్లు. నెలకు రెండుసార్లు బీ పాజిటివ్ రక్తం ఎక్కించాలి. మందులు, రక్త మార్పిడికి నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చవుతోంది. సీఎంగా జగనన్న అధికారంలోకి రాగానే పాపకు నెలకు రూ.10 వేలు పింఛన్ అందించారు. పాప బతికి ఉండడానికి కారణం సీఎం జగనన్నే. ఆయన రుణం తీర్చుకోలేం. నాకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రుణమాఫీ అయింది. మాది పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు. పాపకు బోన్‌మ్యారో శస్త్ర చికిత్స చేయిస్తే మంచి ఫలితం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. సీఎం జగన్‌నే నమ్ముకున్నాం.

– కాంతామణి, వాలమర్రు
(కె.శాంతారావు, విలేకరి, పాలకొల్లు అర్బన్)

'హియర్ సే ఎవిడెన్స్' సాక్ష్యంగా చెల్లదు

వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌కు వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యం లేదు

- గూగుల్ టేక్ అవుట్ ప్రామాణికమని ఆ సంస్థే చెప్పదు
- వీటి ఆధారంగా నిందితులుగా పేర్కొనడం సాధ్యం కాదు
- కుమారుడితో తండ్రి మాట్లాడినా అదీ కుట్రే అంటున్నారు
- వైఎస్ వివేకా హత్య కేసులో భాస్కర్‌రెడ్డి తరఫు న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదనలు
- బెయిల్ పిటిషన్లపై తీర్పు రిజర్వు చేసిన న్యాయస్థానం



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో వైఎస్ భాస్కర్‌రెడ్డి, గజ్జల ఉదయ్‌కుమార్ రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. హియర్ సే ఎవిడెన్స్ (నాకు మరొకరు చెప్పారని సాక్ష్యం చెప్పడం) చట్ట ప్రకారం సాక్ష్యంగా చెల్లదని, గూగుల్ టేక్ అవుట్ ప్రామాణికమని ఆ సంస్థే ధ్రువీకరణ ఇవ్వదని భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది టి.నిరంజన్ రెడ్డి కోర్టుకు నివేదించారు. అలాంటి సాక్ష్యాలతో అరెస్టు సమర్థనీయం కాదని చెప్పారు. వైఎస్ వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తు పక్షపాత వైఖరితో సాగుతోందని, కావాలనే ఈ కేసులో తమను ఇరికించారని, తమకు వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యం లేదని, బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'మూడో చార్జీషీట్ (ఈ కేసులో 2వ మధ్యంతర చార్జిషీట్) దాఖలు చేసే వరకు పిటిషనర్లపై ఎలాంటి ఆరోపణలు లేవు. ఆ తర్వాత నిందితులుగా చేర్చడంలో కుట్ర కోణం దాగి ఉంది. అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు కోరుతూ సుప్రీం కోర్టును ఆశ్రయించిన వారు కిరాయి హంతకుడు దస్తగిరి (ఏ–4) యథేచ్ఛగా తిరగడానికి మాత్రం పూర్తిగా సహకరిస్తున్నారు. హత్య వెనుక భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ ఉన్నారని గంగిరెడ్డి తనకు చెప్పారంటూ దస్తగిరి వాంగ్మూలం ఇవ్వగా.., గంగిరెడ్డి మాత్రం తాను అలా చెప్పలేదని స్పష్టం చేశారు. దస్తగిరి చెప్పిన విషయానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న సీబీఐ.. ఇతరుల వాంగ్మూలాలను మాత్రం పట్టించుకోవడం లేదు' అని పేర్కొన్నారు. 'రెండున్నర నెలలు ఢిల్లీలో సీబీఐ కస్టడీలో ఉన్నానని దస్తగిరి చెప్పాడు. ఆ తర్వాతే అప్రూవర్‌గా మారి పిటిషనర్ల పేర్లు చెప్పాడు. దస్తగిరి బెయిల్‌కు సీబీఐ పూర్తిగా సహకరించింది. నాటి దర్యాప్తు అధికారి రాంసింగ్‌పై తీవ్ర ఆరోపణలున్నాయి. ఆయనపై సుప్రీం కోర్టులో పిటిషన్లు కూడా దాఖలయ్యాయి. దీంతో అత్యున్నత న్యాయస్థానం కేసు దర్యాప్తు బాధ్యత నుంచి ఆయన్ని తప్పించి, మరొకరిని నియమించింది. హత్య జరిగిన రోజున అవినాశ్‌రెడ్డికి భాస్కర్‌రెడ్డి ఫోన్ చేయడాన్ని కూడా సీబీఐ కుట్ర కోణంగా పేర్కొనడం సమంజసం కాదు. తండ్రి కుమారుడికి ఫోన్ చేయడం కూడా కుట్రేనా? కావాలనే ట్రయల్ కోర్టులో విచారణను సీబీఐ సాగదీస్తోంది. ముఖ్యంగా నాలుగు అంశాలను ఇక్కడ పరిశీలించాలి. ఇందులో మొదటిది పిటిషనర్లపై ఉన్నది ఆరోపణలు మాత్రమే. వాటికి సాక్ష్యాలు లేవు. రెండోది భాస్కర్‌రెడ్డి వయస్సు. ఆయన వయస్సు దాదాపు 72 ఏళ్లు. ఆయన ఆరోగ్య పరిస్థితి బాగాలేకపోవడం మూడో అంశం. ఆయన ఆరోగ్య పరిస్థితిని సమీక్షించిన ట్రయల్ కోర్టు పలుమార్లు మధ్యంతర బెయిల్ కూడా మంజూరు చేసింది. ఆయనకు అత్యవసరమైతే 30 నిమిషాల్లో నిపుణులైన వైద్యుల పర్యవేక్షణకు చేర్చాలి. జైలులో ఉంటే అది సాధ్యం కాదు. ఆయనకు ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు? నాలుగోది ఆయన్ని అరెస్టు చేసి సంవత్సరమయ్యింది. ఏడాదిగా జైలులో ఉంటున్నారు. వీటిని పరిగణనలోకి తీసుకుని భాస్కర్‌రెడ్డితోపాటు ఉదయ్‌కుమార్‌కు బెయిల్ మంజూరు చేయాలి. ఇదే హైకోర్టు శివశంకర్‌రెడ్డికి బెయిల్ మంజూరు చేసింది. అదే వీరికి కూడా వర్తిస్తుంది. సరైన సాక్ష్యాలు లేనప్పుడు నెలల తరబడి నిందితుల పేరుతో జైలులో ఉంచడం వారి హక్కులను హరించడం కిందకే వస్తుందని సుప్రీం కోర్టు పలుమార్లు చెప్పింది' అని నిరంజన్‌రెడ్డి వాదించారు. అనంతరం సీబీఐ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. బెయిల్ పిటిషన్లపై తీర్పు రిజర్వు చేశారు.

ఏపీఈఏపీ సెట్‌కు 3.05 లక్షల దరఖాస్తులు



ప్రొఫెసర్ వెంకటరెడ్డి

బాలాజీ చెరువు (కాకినాడ సిటీ): ఏపీ ఇంజనీరింగ్, అగ్రికల్చరల్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీఈఏపీసెట్–24కు ఇప్పటి వరకూ 3,05,724 దరఖాస్తులు వచ్చాయని సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ కె.వెంకటరెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో 2,35,417, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో 69,445, రెండు విభాగాలకు కలిపి 892 చొప్పున దరఖాస్తులు వచ్చాయన్నారు. ఏవిధమైన ఫైన్ లేకుండా ఈనెల 15వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరిస్తామని, ఓసీ అభ్యర్థులు రూ.600, బీసీలు రూ.550, ఎస్సీ, ఎస్టీలు రూ.500 చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. రూ.500 ఫైన్‌తో ఈనెల 30 వరకూ, రూ.1,000 ఫైన్‌తో మే 5 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అగ్రికల్చర్, ఫార్మసీకి మే 16, 17 తేదీల్లోను, ఇంజనీరింగ్‌కు మే 18 నుంచి 22 వరకూ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలోని 47 ఆన్‌లైన్ సెంటర్లతో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్‌లలో చెరొక ఆన్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకూ నిర్వహిస్తామన్నారు. మే 7వ తేదీ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు 0884–2359599, 0884–2342499 నంబర్లలో సంప్రదించాలని వెంకటరెడ్డి సూచించారు.

ఎమ్మెల్సీ ఇక్బాల్ రాజీనామాకు ఆమోదం

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్ రాజీనామాను శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు ఆమోదించారు. ఈ నెల 5వ తేదీన ఇక్బాల్ స్పీకర్ ఫార్మెట్‌లో నిబంధనల మేరకు రాజీనామా చేశారు. మండలి అధికారులు ఇక్బాల్‌కు ఫోన్‌చేసి రాతపూర్వకంగా ఇచ్చిన రాజీనామాపై వివరణ తీసుకున్నారు. తాను ఇష్టపూర్వకంగానే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసినట్టు ఇక్బాల్ చెప్పడంతో ఆయన రాజీనామాను చైర్మన్ సోమవారం ఆమోదించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు.

సమ్మర్ స్టోరేజీ ట్యాంకులకు నీరు సక్రమంగా చేరాలి

- కాలువల్లో నీటి సరఫరాను డ్రోన్ల ద్వారా పర్యవేక్షించండి
- నీటిని అక్రమంగా మళ్లించకుండా కాలువల వెంట నిఘా పెట్టండి
- కలెక్టర్లను ఆదేశించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: తాగునీటి అవసరాల కోసం ప్రకాశం బ్యారేజి, నాగార్జునసాగర్ కుడి ప్రధాన కాలువల ద్వారా విడుదల చేసిన నీరు సక్రమంగా శివారు ప్రాంతాలకు చేరేలా చూడాలని, అన్ని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను పూర్తిగా నీటితో నింపాలని కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కేఎస్.జవహర్‌రెడ్డి ఆదేశించారు. తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పథకం పనులు, విద్యుత్ సరఫరా పరిస్థితులపై సోమవారం వెలగపూడి రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. తాగునీటి అవసరాల నిమిత్తం ప్రకాశం బ్యారేజి నుంచి కాలువల ద్వారా ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, గుంటూరు, బాపట్ల జిల్లాలకు.. నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలువ నుంచి పల్నాడు, ప్రకాశం, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని పలు సమ్మర్ స్టోరేజి ట్యాంకులను నింపేందుకు నీటిని విడుదల చేశారన్నారు. ఈ నీరు చేపలు, రొయ్యల చెరువులకు అక్రమంగా మళ్లించకుండా సక్రమంగా ట్యాంకులకు చేరేలా మూడు నాలుగు రోజులు పాటు డ్రోన్ల ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్‌ల ద్వారా తాగునీటి సమస్యలను నిరంతరం పర్య వేక్షించాలన్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు కల్పిస్తున్న ఉపాధి పనులపై సీఎస్ జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. రాష్ట్ర జల వనరులు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్ మాట్లాడుతూ.. తాగునీటి అవసరాలకు ఈనెల 6న నుంచి ప్రకాశం బ్యారేజి నుంచి రోజుకు 2,500 క్యూసెక్కులు, ఈనెల 8 నుంచి నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలువ నుంచి 5,500 క్యూసెక్కులు కాలువల ద్వారా విడుదల చేయడం జరుగుతోందని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కె.కన్నబాబు, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వర్చువల్‌గా మాట్లాడారు.

సాగర్ కుడికాలువకు నీరు విడుదల

తాగునీటి అవసరాల కోసం 5,500 క్యూసెక్కులు

- పదిరోజుల్లో ఐదు టీఎంసీలు విడుదల చేయనున్న కృష్ణాబోర్డు
- ప్రకాశం, బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల తాగునీటి అవసరాలకు వినియోగం

సాక్షి, అమరావతి: ప్రకాశం, బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల్లో తాగునీటి అవసరాల కోసం రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదన మేరకు నాగార్జునసాగర్ కుడికాలువకు సోమవారం 5,500 క్యూసెక్కులను కృష్ణాబోర్డు విడుదల చేసింది. పదిరోజుల్లో ఐదు టీఎంసీలను విడుదల చేయనుంది. ఐదు టీఎంసీలను ఏప్రిల్, మే నెలల్లో తాగునీటి అవసరాల కోసం వినియోగించనున్నారు. గతేడాది అక్టోబర్ 9న తాగునీటి అవసరాల కోసం కేటాయించిన నీటిలో ఇప్పటిదాకా వినియోగించుకోగా మిగిలిన 5 టీఎంసీలను ఈనెల 8 నుంచి విడుదల చేయాలని కృష్ణాబోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్‌ను ఏపీ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కృష్ణాబోర్డు చైర్మన్.. సాగర్ కుడికాలువకు 5 టీఎంసీలను విడుదల చేయాలని ఆదేశించారు. ఆ మేరకు కృష్ణా బోర్డు అధికారులు సీఆర్పీఎఫ్ బలగాల పర్యవేక్షణలో సోమవారం నీటిని విడుదల చేశారు. ఇదిలా ఉండగా తెలంగాణ సర్కార్ కేటాయించిన నీటికంటే 8.66 టీఎంసీలను అధికంగా వాడుకుందని.. ఇకపై నీటిని వాడుకోకుండా నియంత్రించి, రాష్ట్ర హక్కులను పరిరక్షించాలని ఏపీ ఈఎన్‌సీ నారాయణరెడ్డి రాసిన లేఖపై కృష్ణాబోర్డు స్పందించింది.

ఈ అంశంపై చర్చించేందుకు ఈనెల 12న హైదరాబాద్‌లో త్రిసభ్య కమిటీ సమావేశాన్ని ఏర్పాటుచేసింది. ఆ సమావేశంలో రెండు రాష్ట్రాలు ఇప్పటిదాకా వాడుకున్న నీటి లెక్కలను తేల్చి.. లభ్యతగా ఉన్న జలాలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేయడంపై చర్చించి కృష్ణాబోర్డుకు సిఫార్సు చేయనుంది.

జగన్.. వైఎస్సార్ వారసుడు కానే కాదు

- వైఎస్సార్ పాలనకు, జగన్ పాలనకు పొంతనే లేదు
- జగన్‌ది హత్యా రాజకీయాలు చేసే పాలన
- సొంత బాబాయి హంతకుడిని కాపాడుతున్న పాలన
- బస్సు యాత్రలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ధ్వజం



మైదుకూరు మండలం వనిపెంటలో జనం లేక పోవడంతో వెళ్లిపోతున్న షర్మిల కాన్వాయ్

బ్రహ్మంగారిమఠం/దువ్వూరు/చాపాడు/ఖాజీపేట/మైదుకూరు: వైఎస్సార్ వారసుడిగా సీఎం వైఎస్ జగన్ ఆయన ఆశయాలను నిలబెడతారని తనతో పాటు రాష్ట్ర ప్రజలు కూడా నమ్మారని.. అయితే జగన్.. వైఎస్సార్ వారసుడు కానేకాదని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ధ్వజమెత్తారు. వైఎస్సార్ పాలనకు, జగన్ పాలనకు పొంతనే లేదని చెప్పారు. జగన్‌ది హత్యా రాజకీయాలు చేసే పాలన అని మండిపడ్డారు. సొంత బాబాయి హంతకుడిని కాపాడుతున్న పాలన జగన్‌దని దుయ్యబట్టారు. హత్య కేసులో అన్ని ఆధారాలున్నా అవినాష్‌రెడ్డిని కాపాడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ జిల్లా మైదుకూరు నియోజకవర్గంలో సోమవారం షర్మిల బస్సు యాత్రను నిర్వహించారు. బ్రహ్మంగారిమఠం, మైదుకూరు, దువ్వూరు, చాపాడు, ఖాజీపేట మండలాల్లో షర్మిల యాత్ర సాగింది. ఈ సందర్భంగా పలు చోట్ల బహిరంగ సభల్లో షర్మిల మాట్లాడుతూ.. వైఎస్సార్ రైతుల పక్షపాతి అని రుణమాఫీ చేసి, మద్దతు ధర ఇచ్చారన్నారు. కానీ జగన్ పాలనలో రైతు తీవ్రంగా నష్టపోయాడన్నారు. మద్య నిషేధం అని హామీ ఇచ్చాడని, అయితే చివరకు నిషేధం అనే మాట పక్కన పెట్టి ప్రభుత్వమే మద్యం అమ్ముతోందని ఎద్దేవా చేశారు. 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ అని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక కేవలం 6వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చారన్నారు.

ఆడది అంటే ఒక శక్తి: సునీత

ఆడది అంటే ఒక శక్తి అని, తమను అలానే పెంచారని మాజీ మంత్రి వైఎస్ వివేకా కుమార్తె సునీత అన్నారు. వివేకాను హత్య చేసి తమను రోడ్ల పాలు చేశారన్నారు. ఈ హత్య ఎవరు చేశారో అందరికీ తెలుసని చెప్పారు. కాగా షర్మిల బస్సుయాత్రకు ప్రజల ఆదరణ కరువైంది. ఆయా గ్రామాల మీదుగా బస్సు వెళ్లిందే కానీ ప్రజలెవరూ హాజరు కాలేదు.

షర్మిలకు ఝలక్

- ఎన్నికల ప్రచారంలో సీఎం వైఎస్ జగన్‌పై తీవ్ర విమర్శలు చేసిన పీసీసీ అధ్యక్షురాలు
- జై జగన్ అంటూ అభిమానుల నినాదాలు
- అక్కడ నుంచి కాదు.. తన వద్దకు వచ్చి మాట్లాడాలని షర్మిల సవాల్
- దీంతో ఆమె వద్దకు వెళ్లి సీఎం చేసిన మంచి పనులను వివరించిన ఓబుళరెడ్డి
- మాట రాక నిశ్చేష్టురాలైన షర్మిల



మాట్లాడుతున్న చంద్రఓబుళరెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప/చాపాడు: ఎన్నికల ప్రచారంలో ఉన్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు సోమవారం ఊహించని పరిణామం ఎదురైంది. వైఎస్సార్ జిల్లా దువ్వూరులో సీఎం వైఎస్ జగన్‌పై తీవ్ర విమర్శలు చేస్తూ షర్మిల మాట్లాడటాన్ని తట్టుకోలేని వైఎస్సార్ అభిమాని వేమిరెడ్డి చంద్రఓబుళరెడ్డి జై జగన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో అక్కడ ఉన్న ప్రజలంతా జగన్నినాదాలతో హోరెత్తించారు. ఈ క్రమంలో 'మైకు ఇస్తాను.. మీకు దమ్ముంటే ఇక్కడకు వచ్చి మాట్లాడండి.. జగన్‌కు ఎందుకు ఓట్లు వేయాలో చెప్పండి' అంటూ షర్మిల సవాల్ విసిరారు. దీంతో చంద్రఓబుళరెడ్డి స్టేజీపైకి వెళ్లి మైకు అందుకున్నారు. 'నమస్తే అక్కా.. జగనన్న 2011 నుంచి ప్రజల్లో ఉన్నారు, 2019 ఎన్నికలకు ముందు పాదయాత్ర చేశారు. మా సమస్యలు విన్నారు.. నేను ఉన్నా అన్నారు. ప్రజల కోసం 3,648 కిలోమీటర్ల పాదయాత్ర చేశారు' అంటూ గుక్క తిప్పుకోకుండా అనర్గళంగా మాట్లాడాడు. 'జగనన్న సీఎం అయ్యాక ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాయి. ఇక్కడికి వచ్చిన ఎవరిని అడిగినా ఆ విషయం చెబుతారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా జగనన్న అభివృద్ధి చేశారు. మీరు తెలంగాణలో పార్టీ పెట్టి అక్కడే ఉంటానని చెప్పారు.. ఎన్నికల్లో పోటీ కూడా చేస్తానన్నారు కానీ చేయలేదక్కా' అని చంద్రఓబుళరెడ్డి నిలదీశాడు. 'ఇప్పుడు ఇక్కడికి వచ్చి రాజశేఖరరెడ్డి బిడ్డ అని చెబుతున్నారు.. మీ వ్యక్తిగత సమస్యలతో సీఎం వైఎస్ జగన్ రాష్ట్రానికి ఏమీ చేయలేదనడం కరెక్ట్ కాదక్కా. రాజశేఖరరెడ్డి బిడ్డ అంటే మాకు గౌరవమే. మీరు జగనన్నతో కలిసి రండి.. రాష్ట్రాన్ని ఇంకా అభివృద్ధి చేసుకుందాం. జోహార్ వైఎస్సార్, జై జగన్' అంటూ తన ప్రసంగాన్ని ముగించాడు. దీంతో షర్మిల కాసేపు మాటరాక నిశ్చేష్టురాలయ్యారు.

సునీత పిటిషన్‌పై విచారణ వాయిదా

- దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి బెయిల్‌ను రద్దు చేయాలని పిటిషన్
- ప్రతివాదులకు సుప్రీంకోర్టు నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితుడు దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి బెయిల్‌ను రద్దు చేయాలంటూ నర్రెడ్డి సునీత దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీం కోర్టు వాయిదా వేసింది. శివశంకర్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టు మంజూరు చేసిన బెయిల్‌ను సవాల్ చేస్తూ సునీత దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం విచారించింది. విచారణ ఏ దశలో ఉంది? కేసులో బెయిల్ పొందిన నిందితులెవరనే అంశంపై ధర్మాసనం ఆరా తీసింది. కేసుకు సంబంధించి పలు పిటిషన్లు ఈ నెలలో ఇదే ధర్మాసనం ముందుకు రానున్నాయని పిటిషనర్ తరఫు న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ప్రతివాదులైన సీబీఐ, శివశంకర్‌రెడ్డి తదితరులకు ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. అనంతరం జూలై 22తో ప్రారంభమయ్యే వారంలో కేసును జాబితాలో చేర్చాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

'పది' మూల్యాంకనం పూర్తి

సాక్షి, అమరావతి: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం (స్పాట్ వేల్యూయేషన్) విజయవంతంగా ముగిసింది. మార్చి 30వ తేదీతో పబ్లిక్ పరీక్షలు ముగిశాయి. ఏప్రిల్ ఒకటో తేదీన మూల్యాంకనం ప్రారంభమైంది. ఎస్సెస్సీ బోర్డు పరీక్షల విభాగం ముందే ప్రకటించిన ప్రణాళిక మేరకు సోమవారంతో మొత్తం ప్రక్రియ పూర్తయినట్టు పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వారం రోజుల్లో మూల్యాంకనం పూర్తిచేసినట్టు పేర్కొన్నారు. 26 జిల్లాల్లో 25 వేలమంది ఉపాధ్యాయులు 47,88,738 జవాబు పత్రాలను మూల్యాంకనం చేసినట్టు తెలిపారు. వేసవి వాతావరణం, పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా అన్ని సెంటర్ల వద్ద ఫ్యాన్లు, తాగునీరు, మజ్జిగ, వైద్యసహాయం వంటి సదుపాయాలు కల్పించినట్టు తెలిపారు. ఈ ప్రక్రియలో పాల్గొన్న విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

షర్మిల వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలి

- పులివెందుల కౌన్సిలర్ల డిమాండ్
- వైఎస్ అవినాశ్‌రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు సమంజసం కాదు



మాట్లాడుతున్న కౌన్సిలర్లు

పులివెందుల: ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఎన్నికల ప్రచారంలో వైఎస్ అవినాష్‌రెడ్డిపై పదే పదే వ్యక్తిగత విమర్శలు చేస్తూ వివేకా హంతకుడు.. అని అనడం సమంజసం కాదని, ఎంపీ వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడమేనని.. షర్మిల వ్యాఖ్యలు ఎన్నికల నియమావళి ఉల్లంఘన కిందకొస్తాయని.. వైఎస్సార్ జిల్లా ఎన్నికల అధికారి వీటిని సుమోటోగా స్వీకరించి చర్యలు తీసుకోవాలని పులివెందులకు చెందిన కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లి కిషోర్‌లు అన్నారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ వైఎస్ అవినాష్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక బురదజల్లే యత్నం చేస్తూ ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తున్నారని చెప్పారు. కిరాతకంగా నరికి చంపిన దస్తగిరికి డబ్బులిస్తూ.. వీళ్లు ఏమి చెప్తే దస్తగిరి అదే చెప్పేలా చీకటి ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. దస్తగిరి ఇప్పుడు అనుభవిస్తున్న విలాసవంతమైన జీవితం మొత్తం సునీత నుంచి వచ్చిన డబ్బుతోనేనన్నారు. అందరూ కలిసి కుయుక్తులు పన్ని వైఎస్ అవినాష్‌రెడ్డిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. బీటెక్ రవికి ప్రజల్లో ఆదరణ లేక చేతగాని దద్దమ్మలా పదేపదే ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. ప్రజాక్షేత్రంలో డిపాజిట్ ఓట్లు దక్కించుకున్నాక ఆరోపణలు చేస్తే బాగుంటుందని వారు హెచ్చరించారు.

చంద్రబాబు, షర్మిల ఇద్దరూ ఒక్కటే..

మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



మైదుకూరు: చంద్రబాబు, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఇద్దరూ ఒకటేనని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి విమర్శించారు. సీఎం జగన్ వైఎస్సార్ వారసుడు కాదని షర్మిల చేస్తున్న వ్యాఖ్యలను ఎమ్మెల్యే ఖండించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన రాజకీయ జీవితంలో అణగారిన వర్గాల కోసం ఈ స్థాయిలో పనిచేసిన సీఎం వైఎస్ జగన్ వంటి నాయకుడిని ఇంతవరకూ చూడలేదన్నారు. 2014 ఎన్నికల్లో తాను ఎమ్మెల్యేగా, వైఎస్ అవినాష్ రెడ్డి ఎంపీగా పోటీ చేశామని.. ఆ ఎన్నికల్లో మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి తమ విజయం కోసం పనిచేశారని గుర్తు చేశారు. 2019లో మరోసారి ఇద్దరం అదే స్థానాల నుంచి పోటీ చేశామని, మార్చి 14న చాపాడు మండలం మడూరులో తమ విజయం కోసం వివేకానందరెడ్డి ప్రచారం నిర్వహించారని తెలిపారు. తన విజయం కోసం కృషి చేస్తున్న వ్యక్తిని ఎవరైనా చంపుకుంటారా? అని ప్రశ్నించారు. వివేకా హంతకులను వైఎస్ జగన్ కాపాడుతున్నారని షర్మిల పొరపాటు పడుతున్నారని, వివేకానంద హంతకుడి వైపు ఉన్నది నర్రెడ్డి సునీతేనని చెప్పారు. డ్రైవర్ దస్తగిరి వివేకాను నరికి చంపానని ఎన్నోసార్లు మీడియాతో అన్నాడని, అదే దస్తగిరి బెయిల్ కోరితే నర్రెడ్డి సునీత ఎలాంటి అభ్యంతరం చెప్పలేదని తెలిపారు. ఇతరులు బెయిల్ పిటిషన్ పెట్టుకుంటే అభ్యంతరం చెప్పే సునీత.. దస్తగిరికి ఎందుకు అభ్యంతరం చెప్పలేదని ప్రశ్నించారు. ఎవరు హంతకుల వైపు ఉన్నారో అక్కడే అర్థమవుతోందని తెలిపారు. అవినాష్‌రెడ్డి చట్ట సభలకు వెళ్లకుండా అడ్డుకోవడం షర్మిల తరం కాదన్నారు.

విద్యార్థినుల రక్షణకు చర్యలు తీసుకోండి

విద్యాసంస్థల బాధ్యులకు ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మి ఆదేశాలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని యూనివర్సిటీలు, కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థినుల రక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి విద్యాసంస్థల బాధ్యులను ఆదేశించారు. విద్యార్థినుల రక్షణకు ప్రస్తుతం ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో మహిళా కమిషన్‌కు నివేదించాలని కోరారు. ఈ మేరకు ఆమె సోమవారం ఆంధ్రప్రదేశ్ ఉన్నత, పాఠశాల, సాంకేతిక విద్యాశాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు, డైరెక్టర్లకు, విశ్వవిద్యాలయాల రిజిస్ట్రార్‌లకు లేఖ రాశారు. విశాఖ కొమ్మాదిలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని రూపశ్రీ ఆత్మహత్య తర్వాత ఆ ఘటనపై విచారణ కమిటీని వేసేందుకు తాను ఈ నెల 3వ తేదీన ఆ కళాశాలను పరిశీలించానని, ఆ కళాశాలలో విద్యార్థినుల రక్షణకు కనీస నిబంధనలు పాటించలేదని గుర్తించానని తెలిపారు. కళాశాలలో చాలాచోట్ల సీసీ కెమెరాలు లేకపోవడం, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్, యాంటీ ర్యాగింగ్ సిస్టం, ఐసీసీ కమిటీలు, కనీసం ఫిర్యాదుల బాక్స్ కూడా లేవని గుర్తించినట్లు వివరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని యూనివర్సిటీలు, కాలేజీలు, పాఠశాలల్లో మహిళలు, విద్యార్థినులకు లైంగిక వేధింపుల నుంచి రక్షణకు తీసుకుంటున్న చర్యలు, యాంటీ ర్యాగింగ్ కేసులు, తదితర వివరాలపై ఈ నెలాఖరులోగా నివేదిక పంపాలని ఆ లేఖలో కోరారు.





ప్రకాశం జిల్లా వెంకటాచలంపల్లిలో సామాజిక పింఛన్ లబ్ధిదారులతో సీఎం వైఎస్ జగన్ ముఖాముఖి సభకు హాజరైన అవ్వాతాతలు

అవ్వాతాతలూ ఆలోచించండి

పింఛనుదారులతో ముఖాముఖిలో ముఖ్యమంత్రి జగన్

సాక్షి, ప్రతినిధి, ఒంగోలు: "పేదలకు గానీ, అవ్వాతాతలకు గానీ, పిల్లలకు గానీ, ఏ వర్గానికైనా సరే.. మంచి చేసే విషయంలో జగన్‌తో పోటీ పడే నాయకుడు ఈ దేశంలోనే ఎక్కడా ఉండడు అని గర్వంగా చెబుతున్నా. వెసులుబాటును బట్టి అవకాశం ఉంటే ఎక్కడా మీ బిడ్డ తగ్గడు. మరీ ముఖ్యంగా అవ్వాతాతల విషయంలో అసలు తగ్గే అవకాశం, పరిస్థితి ఉండనే ఉండదు అని స్పష్టంగా చెబుతున్నా. మన ప్రమాణ స్వీకారం రోజు వలంటీర్ వ్యవస్థను మళ్లీ పునరుద్ధరించే కార్యక్రమంపైనే మొట్ట మొదటి సంతకం చేస్తా" అని ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మీ బిడ్డకు అబద్ధాలు ఆడటం, మోసం చేయడం తెలియదు కాబట్టి బాబు, ఆయన కూటమితో ఈ రెండు విషయాల్లో మాత్రం పోటీ పడలేడని వ్యాఖ్యానించారు. సోమవారం ప్రకాశం జిల్లా వెంకటాచలంపల్లి గ్రామంలో పెన్షనర్లతో సీఎం జగన్ ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ఏమన్నారంటే..



పింఛన్ లబ్ధిదారుల ముఖాముఖి సభలో అవ్వలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న సీఎం

అవ్వాతాతలపై ప్రేమతో...

ఈరోజు అవ్వాతాతలతోపాటు ప్రతి ఒక్కరూ కొన్ని విషయాలపై ఆలోచన చేయమని కోరుతున్నా. గత ప్రభుత్వ హయాంలో ఎన్నికలకు రెండు నెలల ముందు వరకూ ఇచ్చిన పెన్షన్ రూ.1,000 మాత్రమే. అది కూడా జన్మభూమి కమిటీలకు లంచాలు సమర్పించుకుంటేనే అందిన దుస్థితి. ఎన్నికలకు ఆర్నెల్ల ముందు వరకు కేవలం 39 లక్షల మందికి మాత్రమే పెన్షన్లు ఇచ్చారు. అప్పట్లో నెలకు వెచ్చించిన వ్యయం కేవలం రూ.400 కోట్లు. అలాంటి పరిస్థితుల్లో మొట్ట మొదటి సారిగా మీ బిడ్డ అవ్వాతాతల గురించి, వారి కష్టాలు, ఆత్మగౌరవం గురించి ఆలోచన చేశాడు. అధికారంలోకి రాగానే దేశంలో ఎప్పుడూ చూడని విధంగా గ్రామ స్వరాజ్యానికి నిర్వచనం ఇస్తూ ప్రతి గ్రామంలో సచివాలయాలను నెలకొల్పి వలంటీర్ వ్యవస్థను తెచ్చాం. ప్రతి నెలా 1వ తారీఖునే అది సెలవు రోజైనా, ఆదివారమైనా సరే ఇంటివద్దే నేరుగా అవ్వాతాతల చేతుల్లో పెన్షన్లు పెట్టిన పరిస్థితి 56 నెలలు మన ప్రభుత్వం హయాంలోనే జరిగింది. గతంలో 39 లక్షలు మంది మాత్రమే పింఛనుదారులుండగా ఈరోజు వివక్ష లేకుండా 66.34 లక్షల మందికి లంఛన్‌గా పెన్షన్ అందిస్తున్నాం. అది కూడా గత సర్కారు హయాంలో మాదిరిగా రూ.వెయ్యి కాకుండా ఏకంగా రూ.3 వేల దాకా పెంచుకుంటూ వెళ్లి అవ్వాతాతలకు మంచి చేశాం. ఈ తేడాను ఒక్కసారి గమనించండి. ఈ విషయాలన్నీ ప్రతి ఒక్కరికీ తెలిసి ఉండాలి. ఆ అవ్వలు, తాతలు, అభాగ్యుల పట్ల మనసులో నిజమైన ప్రేమ ఉంటేనే ఇలాంటి మంచి ఆలోచనలు వస్తాయి.

బాబు ఆ ఆలోచనే చేయలేదు..

మీరంతా గత పాలకులను చూశారు. చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా, మూడు సార్లు పరిపాలన చేశానని చెబుతుంటారు. కానీ ఏ ఒక్క రోజైనా మీ బిడ్డ మాదిరిగా అవ్వాతాతల గురించి ఆయన ఆలోచన చేశాడా? అవ్వాతాతల ముఖంలో చిరునవ్వులు చూడాలనే తాపత్రయం, మనసులో ప్రేమ ఉంటేనే చేతల్లో బయటకు వస్తుంది. ఇవాళ రాజకీయాలు పాతాళానికి దిగజారాయి. విలువలు, విశ్వసనీయత లేవు. ఈ వ్యవస్థను మార్చడానికి మీ బిడ్డ తొలిసారిగా అడుగులు వేగంగా వేశాడు. మేనిఫెస్టోలో చెప్పిన హామీల్లో ఏకంగా 99 శాతం అమలు చేసి చిత్తశుద్ధితో మీ ముందుకు వచ్చాడు. మీ బిడ్డకు అబద్ధాలు, మోసాలు తెలియవు. ఏదైనా చెప్పాడంటే కచ్చితంగా చేసి చూపిస్తాడు. మీ ముందు ఉంచుతున్న వాస్తవాలపై ఆలోచన చేయమని అందరినీ కోరుతున్నా.

దేశంలో రూ.3 వేలు పెన్షన్ ఇస్తున్న రాష్ట్రం మనదే

జనాభా ప్రకారం చూస్తే ఐదు కోట్ల మందిలో 66.34 లక్షల మందికి పెన్షన్లు, అత్యధికంగా పింఛన్ మొత్తాన్ని అందిస్తున్న రాష్ట్రం మనదే. నెలకు రూ.3 వేల పెన్షన్ ఇస్తున్న రాష్ట్రం దేశంలో మరొకటి లేదు. గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో పింఛన్ల కోసం నెలకు రూ.400 కోట్లు కూడా ఇవ్వని పరిస్థితి నుంచి ఈరోజు నెలకు రూ.2 వేల కోట్లు కేవలం పెన్షన్ల కోసమే అందచేస్తున్నాం. సంవత్సరానికి రూ.24 వేల కోట్లు పెన్షన్ల రూపంలో ఇస్తున్నాం. మీ బిడ్డ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ఏప్రిల్ కూడా కలిపితే ఏకంగా రూ.90 వేల కోట్లు పెన్షన్ల రూపంలో అవ్వాతాతల ముఖంలో చిరునవ్వులు చూసేందుకు చేతిలో పెట్టినట్లయింది. ఏటా రూ.24 వేల కోట్లు పింఛన్ల కోసం ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కాగా బిహార్‌లో రూ.4300 కోట్లు, ఉత్తరప్రదేశ్‌లో రూ.5,160 కోట్లు, కర్ణాటకలో రూ.4,700 కోట్లు, పక్కన తెలంగాణలో రూ.8,180 కోట్లు చొప్పున ఏటా పెన్షన్ల కోసం వ్యయం చేస్తున్నారు. ఈ విషయాలన్నీ ఎందుకు చెబుతున్నానంటే అవ్వాతాతలను మోసం చేసేందుకు రూ.4 వేలు.. రూ.5 వేలు.. రూ.6 వేలు అని చెబుతారు. ఇంకా అవసరం అయితే ఎలాగూ చేసేది లేదు కాబట్టి ప్రతి ఒక్కరికీ రూ.8 వేలు అని కూడా అంటారు. మేనిఫెస్టోలో చెప్పినా, చెప్పకపోయినా చేయగలిగిందే చెప్పాలి. చెయ్యలేనిది నా నోట్లో నుంచి రాదు. ఈ 58 నెలల పాలన చూస్తే చెప్పనివి కూడా చాలా చేసిన పరిస్థితి మీ అందరికీ కనిపిస్తుంది.

బాబును నమ్మితే పులి నోట్లో తల పెట్టినట్లే

2014లో చంద్రబాబు స్వయంగా సంతకం చేసి ప్రధాని మోదీ, దత్తపుత్రుడి ఫొటోలతో ఎన్నికల ప్రణాళికలో ఏం చెప్పాడో మీ అందరికీ తెలుసు. ఎన్నికలు ముగిసి అధికారంలోకి రాగానే ఏ ఒక్కటీ నెరవేర్చలేదు. చంద్రబాబు మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేశాడు. మీ అందరికీ అందుకే చెబుతున్నా. మోసం చేసే వాళ్లను, అబద్ధాలు చెప్పే వాళ్లను నమ్మొద్దండీ. మీ బిడ్డ పేదల సంక్షేమానికి సంవత్సరానికి దాదాపుగా రూ.70 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాడు. ఎక్కడా అవినీతి, వివక్ష లేకుండా మీ బిడ్డ సమూల మార్పులు తేవడంతో ఈరోజు ఇన్ని మంచి పనులు జరుగుతున్నాయి. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అని నమ్మబలుకుతున్న చంద్రబాబు హామీలు రూ.1.40 లక్షల కోట్లు దాటుతున్నాయి. సునాయాసంగా నోటికొచ్చిన అబద్ధాలు చెబుతున్నారు. చంద్రబాబుకు పొరపాటున ఓటేస్తే పులి నోట్లో తలకాయ పెట్టినట్లే అన్నది ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోండి. మీలో ఎవరైనా నాకు సూచనలు, సలహాలు ఇవ్వాలనుకుంటే స్లిప్పులో రాసి బాక్సులో వేస్తే నావద్దకు వస్తాయి. తెలుగువారి నూతన సంవత్సరాది ఉగాది సందర్భంగా మీ అందరికీ పండుగ శుభాకాంక్షలు



> ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే మన ప్రభుత్వం పెట్టే మొదటి సంతకం వలంటీర్ వ్యవస్థను పునరుద్ధరించడమే.
> -సీఎం వైఎస్ జగన్

ఎంత ఇబ్బంది బాబూ..



ఇన్నాళ్లూ వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే రూ.3 వేల పెన్షన్ మా చేతుల్లో పెడితే ఈనెలలో మాత్రం మూడు చోట్లకు తిప్పారు. సచివాలయానికి వెళితే అక్కడ కాదన్నారు. ఇంకో చోటకు వెళితే అక్కడా కాదన్నారు. మోకాళ్ల నొప్పితో ఎన్నిచోట్లకు తిరిగానో, ఎన్ని కష్టాలు పడ్డానో నాకే తెలుసు. మమ్మల్ని ఎన్ని ఇబ్బందులు పెడుతున్నాడో ఈ బాబు! ఈ ప్రభుత్వంలో ఎంతో మంచి జరుగుతుంటే అడ్డుపడుతున్నారు. మాకు వలంటీర్లు, వలంటీర్ల వ్యవస్థ కావాలి. కరోనాలో మాస్కులతో సహా ఇంటివద్దకే పంపించారు. ఇంటింటికీ రేషన్ పంపిస్తున్నారు. గడప గడపకు పథకాలు అందుతున్నాయి. వలంటీర్ల వ్యవస్థను తొలగిస్తే ఒప్పుకోం.

– పత్రా ప్రభావతి, దర్శి

చంద్రబాబు చేసిన పనికి...



నాకు కాలు విరగడంతో ఆపరేషన్లు జరిగాయి. అన్ని పథకాలు కలిపి రూ.3.40 లక్షలు అందాయి. నీ మేలు ఎప్పుడూ మరవలేం. చంద్రబాబు చేసిన పనికి చాలా కష్టం అయింది. నాకు ఆయాసం ఉంది. మూడుసార్లు కూర్చుని లేచి సచివాలయానికి వెళ్లా. తోడు కోసం ఓ పాపను తీసుకెళితే రాయి తగిలి కింద పడటంతో ఆమె ముక్కుకు గాయం అయింది. మమ్మల్ని ఇంత కష్టపడేలా చేసింది చంద్రబాబే. రైతుభరోసా సహా నాకు ఎన్నో పథకాలు అందాయి. మొన్ననే కంటి ఆపరేషన్ చేయించుకున్నా. నీవల్లే ధైర్యంగా బతుకుతున్నా.

- కర్నాటి సుబ్బులు, కుర్చేటి మండలం, అగ్రహారం

దివ్యాంగులు, వృద్ధులపై అక్కసు..



టీడీపీ హయాంలో దివ్యాంగులు ఎంత కష్టపడ్డారంటే జన్మభూమి కమిటీలకు ముడుపులు చెల్లించాల్సి వచ్చేది. మీరు (సీఎం జగన్) పాదయాత్ర చేసినప్పుడు కొన్ని హామీలిచ్చారు. అందులో ఇవ్వని హామీ ఒకటి ఏమిటంటే దేవుడి దూతలా వలంటీర్లను పంపించడం. వారు ఇంటింటికీ వచ్చి దివ్యాంగులకు పెన్షన్లే కాకుండా సదరం సర్టిఫికెట్ నుంచి ఆధార్ కార్డు దాకా ప్రతి ఒక్కటీ అందేలా చేశారు. బాబు మిమ్మల్ని ఏమీ చేయలేక అక్కసుతో దివ్యాంగులు, వృద్ధుల మీద పడ్డారు. పిటిషన్ వేసి మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారు. కచ్చితంగా చెబుతున్నా వాళ్లు మట్టి కొట్టుకుపోతారు. 70 ఏళ్ల వృద్ధురాలు పెన్షన్ కోసం వెళ్తూ మండుటెండలో సొమ్మసిల్లి పడిపోవటాన్ని నేను కళ్లారా చూశా. దీనికి ఎవరు కారణమనేది అందరూ ఆలోచన చేయాలి.

– నర్సింహారావు, దివ్యాంగ పెన్షన్ లబ్ధిదారుడు

నిన్నే నమ్ముకున్నానయ్యా..



నా పిల్లలకు అమ్మఒడి వచ్చింది. నాకు, నా కోడలికి వైఎస్సార్ ఆసరా వచ్చింది. నా కొడుక్కి రైతుభరోసా వచ్చింది. మాకు అన్నీ వచ్చాయి. నాకు వైఎస్సార్ ఇల్లు కట్టించాడు. నాకు నలుగురు కొడుకులున్నా నువ్వే నా కొడుకువి. నా కడుపులోనే ఉన్నావ్ నువ్వు. నాకు రూ.3 వేలు పెన్షన్ వస్తోంది బ్యాంకుల నుంచి రూ.23 వేలు వచ్చాయి. నేను నిన్నే నమ్ముకుని ఉన్నానయ్యా.

– గంగిరెడ్డి మంగమ్మ, బొట్టపాలెం


దోమలు కుడుతున్నా.. పింఛన్ కోసం



వైఎస్ రాజశేఖరరెడ్డి హయాం నుంచి మాకు పెన్షన్ వస్తోంది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెల్లవారుజామున 4 గంటలకే పెన్షన్ కోసం పంచాయతీ ఆఫీస్‌కు వెళ్లేవాడిని. నాకన్నా ముందే నలుగురు ఉండేవాళ్లు. అక్కడ 10 కుర్చీలే ఉండేవి. దోమలు కుడుతున్నా బయటకు వెళ్తే కుర్చీ పోతుందనే భయంతో వెళ్లేవాడ్ని కాదు. కండువా తీసుకుని ఆ దోమలను కొట్టుకుంటూ వుండేవాడ్ని. సిబ్బంది 8 గంటలకు వచ్చేవారు. అన్ని పూర్తి చేసేసరికి 9 గంటలు అయ్యేది. అప్పటికే దాదాపు రెండు మూడొందల మంది వచ్చి పుస్తకాలు పెట్టేవారు. తర్వాత వచ్చేవాళ్లను తరువాత రావాలని పంపేవారు. అలా వారం రోజులు పెన్షన్లు ఇచ్చేవారు. ఈ బాధ ఎప్పుడు పోతుందా అని అనుకునేవాడ్ని. జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వలంటీర్ ఇంటికే వచ్చి పెన్షన్ ఇస్తున్నాడు. ఎన్నో సంక్షేమ పథకాలు ఆయన బంగారు మెదడు నుంచి వచ్చిన ఆలోచనలే. అటువంటి మేధావి ముఖ్యమంత్రిగా ఉండటం మా అదృష్టం. రావణాసురుడు, హిరణ్యకశిపుడు లాంటి వారికి మే 13న ప్రజాకోర్టు శిక్ష వేస్తుంది. జూన్ 4న శిక్ష అమలు జరుగుతుంది.

– వెంకటపతి, దర్శి

పల్లెటూళ్లకు పాలన తెచ్చారు..



నవరత్నాల పథకాల వల్ల మాలాంటి పేదలకు నాలుగు వేళ్లు నోట్లోకి పోతున్నాయి. నాడు పరిపాలన కేవలం పట్టణాలకు మాత్రమే పరిమితమయ్యేది. నేడు పల్లెటూళ్లకు పరిపాలన తెచ్చిన ఘనత మన జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. గతంలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా మండల ఆఫీస్‌కు వెళ్లాల్సిందే. ఇప్పుడు అన్నీ గ్రామాల్లోనే లభిస్తున్నాయి. గుంపులు గుంపులుగా ఉన్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్, పురందేశ్వరి నీలాంటి దమ్ము, ధైర్యం ఉన్న నాయకుడ్ని చూసి భయపడుతున్నారు.

– శ్రీనివాస్‌రెడ్డి, బసిరెడ్డిపాలెం గ్రామం

నీ నీడన మేం ఉండాలి..



నా పెనిమిటి మరణించి 15 ఏళ్లు అయింది. నాకు ఇల్లూ వాకిలీ లేదు. ఒంటరి మహిళ పెన్షన్ వస్తోంది. ఇప్పటి వరకూ రూ.1.30 లక్షల మేర లబ్ధి పొందా. ఈనెల పెన్షన్ వలంటీర్ ఇవ్వలేదు. నా కుమారుడిని అడిగితే దర్శి వెళ్లి తెచ్చుకోవాలన్నాడు. నా ఆరోగ్యం బాగాలేదు. నడవలేను. ఎవరినో బతిమాలి వెళ్లి పెన్షన్ తెచ్చుకున్నా. జగనన్నా మళ్లీ నువ్వే రావాలి. 175కి 175 రావాలి. నీ నీడన మేం ఉండాలి. మంచి మనసున్న మారాజు నువ్వు. సొంత కొడుకులు, కోడళ్లు పదెకరాల ఆస్తి ఇచ్చినా మనల్ని చూడరు. కానీ అందరినీ చూసే మంచి మనసున్న మనిషి దైవబలంతో ఆ తల్లికి జన్మించాడు. అలాంటి జగనన్నను మనం గెలిపించుకోవాలి.

– వెంకాయమ్మ, శివాజీ నగరం వార్డు, దర్శి, వితంతు పెన్షన్ లబ్ధిదారు

ఐదు గద్దలు మాపై పడ్డాయి..



టీడీపీ హయాంలో వెయ్యి రూపాయలు అరకొర పెన్షన్లు ఇవ్వడంతోపాటు ఒక పింఛనుదారుడు చనిపోతేనే రెండో వ్యక్తికి జన్మభూమి కమిటీలు మంజూరు చేసేవి. వలంటీర్లను అడ్డుకునేందుకు రామోజీ రావు, రాధాకృష్ణ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్, పురందేశ్వరి లాంటి ఐదు గద్దలు తోడయ్యాయి. ఎలక్షన్ కమిషన్‌కు లేఖ రాసి నాలాంటి గుడ్డోళ్లు, ముసలోళ్లను దెబ్బ తీశారు. పది మంది చూపు పడితే బండ రాళ్లైనా పగిలిపోతాయి. 69 లక్షల మంది చూపు పడి ఆ ఐదుగురూ నామరూపాలు లేకుండా పోతారు.

– శ్రీను, పెద ఉయ్యాలవాడ, దివ్యాంగ పెన్షన్ లబ్ధిదారుడు



వెంకటాచలంపల్లి: వృద్ధురాలి సమస్యలు తెలుసుకుంటున్న సీఎం జగన్



చింతలచెరువు: అవ్వకు ఆత్మీయ పలకరింపు

సీఎం జగన్‌తో రాజశ్యామల సహస్ర చండీయాగ సంకల్పం



సాక్షి, అమరావతి: ప్రముఖ వేద పండితులు నల్లపెద్ది శివరామప్రసాదశర్మ, గౌరావర్జుల నాగేంద్రశర్మలు వెంకటాచలంపల్లి నైట్ స్టే పాయింట్ వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో రాజశ్యామల సహస్ర చండీయాగ సంకల్పం చేయించారు. అనంతరం సీఎం జగన్‌కు వారు వేద ఆశీర్వచనం అందజేశారు. 41 రోజుల పాటు శివరామప్రసాదశర్మ, నాగేంద్రశర్మలు ఈ యాగం నిర్వహించనున్నారు. ప్రజాహిత పాలన చేస్తున్న సీఎం జగన్‌కు విజయం సిద్ధించాలని ఆకాంక్షిస్తూ ఆరిమండ వరప్రసాదరెడ్డి, పడమట సురేష్‌బాబు ఆధ్వర్యంలో వేద పండితులు తాడేపల్లిలో ఈ యాగం చేపట్టారు.



బోధనంపాడు: అభిమానులు, పార్టీ శ్రేణులతో సీఎం వైఎస్ జగన్ కరచాలనం

వెంకటాచలంపల్లి అభిమాన నేతను చూసిన ఆనందంలో...



వినుకొండ: రాత్రివేళ తన కోసం ఎదురు చూస్తున్న అభిమానులు, పార్టీ శ్రేణులకు సీఎం జగన్ అభివాదం

పల్నాడు జిల్లా సిద్ధమా..?

మేమంతా సిద్ధం బస్సు యాత్ర 11వ రోజైన సోమవారం పల్నాడు జిల్లాలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా 'పల్నాడు జిల్లా సిద్ధమా?' అంటూ సీఎం వైఎస్ జగన్ ట్వీట్ చేశారు. మేమంతా సిద్ధమంటూ ప్రజలు భారీ సంఖ్యలో కదలివచ్చి సీఎం జగన్‌తో కలిసి బస్సు యాత్రలో పాల్గొని తమ మద్దతు తెలిపారు.

- సాక్షి, అమరావతి

అవ్వాతాతల ముఖంలో చిరునవ్వుల కోసమే..

సాక్షి, అమరావతి: 'కల్మషం లేని నా అవ్వాతాతలతో ముఖాముఖి' అంటూ ముఖ్యమంత్రి జగన్ ట్వీట్ చేశారు. 'పెన్షన్ కోసం అవ్వాతాతలు ఇబ్బంది పడకూడదని మీ బిడ్డ అధికారంలోకి వచ్చిన వెంటనే దేశంలోనే మొట్టమొదటి సారిగా ప్రతి గ్రామంలోనూ సచివాలయాలను ఏర్పాటు చేసి.. వాటికి అనుసంధానంగా వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చాడు. ప్రతి నెలా ఒకటో తారీఖున అవ్వాతాతల ముఖంలో చిరునవ్వులు చూసేందుకు పెన్షన్‌ను మీ బిడ్డ మీ ఇంటికే పంపించాడు' అని సీఎం జగన్ చెప్పారు.

స్టార్ క్యాంపెయినర్లతో

11 వ రోజు

సీఎం వైఎస్ జగన్

'మేమంతా సిద్ధం యాత్రలో 11వ రోజున నా స్టార్ క్యాంపెయినర్లతో..' అంటూ సీఎం వైఎస్ జగన్ సోమవారం కొన్ని ఫొటోలను ట్వీట్ చేశారు. కొందరు మహిళలు, వృద్ధులు తమ కష్టాలు చెప్పుకోగా.. వాటిని సావధానంగా విన్న సీఎం జగన్.. 'నేనున్నానంటూ' భరోసా ఇచ్చారు. అన్ని వర్గాల ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ.. వారితో మమేకమయ్యారు. మండే ఎండలో సీఎం జగన్‌ను చూసేందుకు ఓ అవ్వ రోడ్డు పైకి రాగా.. సీఎం ఆమెను ఆప్యాయంగా పలకరించారు. 'పది కాలాల పాటు చల్లంగుండు నాయనా' అంటూ ఆమె ఆశీర్వదించింది. - సాక్షి, అమరావతి













చింతలచెరువు: యువకుల ఆరోగ్య సమస్యలు తెలుసుకుని అండగా ఉంటానని భరోసా కల్పిస్తున్న సీఎం జగన్



కురిచేడు: సీఎం జగన్‌కు గజమాలతో ఘన స్వాగతం



వినుకొండ: రోడ్ షోకు భారీగా హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం

మీతోనే మా పయనం

'మేమంతా సిద్ధం' యాత్రలో జన నినాదం ● కురిచేడు, వినుకొండలో జన సంద్రాన్ని తలపించిన రోడ్‌షో

(మేమంతా సిద్ధం బస్సు యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

అడుగడుగునా జగన్ పాలనకు మద్దతు తెలుపుతూ జనం కదం తొక్కారు. ఇంటికే ప్రభుత్వాన్ని తీసుకొచ్చి.. చేతిలో పథకాలను పెట్టిన నాయకుడి వెంటే మేమంతా అంటూ జనం ఎలుగెత్తిచాటారు. ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గం వెంకటాచలంపల్లిలోని బస శిబిరం నుంచి ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం మేమంతా సిద్ధం బస్సు యాత్ర ప్రారంభమైంది. భారీ జనసందోహం నడుమ ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన యాత్రకు జన హారతి లభించింది. అనంతరం పింఛన్ లబ్ధిదారులతో సీఎం జగన్ ముఖాముఖి నిర్వహించారు. అక్కసుతోనే తమకు ఆసరాగా నిలిచిన వలంటీర్ వ్యవస్థను చంద్రబాబు అడ్డుకున్నారంటూ అవ్వాతాతలు ధ్వజమెత్తారు. పదికాలాల పాటు ముఖ్యమంత్రిగా సుపరిపాలన అందించాలని సీఎం జగన్‌కు ఆశీస్సులు అందించారు. వలంటీర్లే కావాలంటూ.. అందుకు మళ్లీ జగనే రావాలంటూ ముక్తకంఠంతో నినదించారు.

కదంతొక్కిన కురిచేడు..

అవ్వాతాతలతో ముఖాముఖి అనంతరం బోధనంపాడు మీదుగా బస్సుయాత్ర దిగ్విజయంగా ముందుకు సాగింది. మార్గం మధ్యలో సీఎం జగన్ బస్సు దిగి.. సంక్షేమ పథకాల లబ్ధిదారులు, అవ్వాతాతలు, చిన్నారులను ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వ పథకాల అమలు, వాటి వల్ల జరిగిన మంచిని అడిగి తెలుసుకున్నారు. రోడ్డుకు ఇరువైపుల అశేష జనవాహిని తమ అభిమాన నేత రాకను మనసారా స్వాగతించింది. ప్రకాశం జిల్లాలో ఆదివారం జన సునామీని తలపించిన బస్సు యాత్ర.. సోమవారం కురిచేడులోనూ అదే రీతిలో జనసంద్రంగా మారింది. మహిళలు సంక్షేమ సారథి విజయానికి మేమంతా సిద్ధం అంటూ ఘన స్వాగతం పలికారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా పోటెత్తారు. జన ప్రభంజనానికి అభివాదం చేస్తూ ముఖ్యమంత్రి జగన్ ముందుకు సాగారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 వరకు సీఎం జగన్ కురిచేడులో రోడ్‌షో నిర్వహించారు. ఆ తర్వాత ప్రకాశం జిల్లా నుంచి పల్నాడు జిల్లాలోని నూజెండ్ల మండలం చింతలచెరువులోకి బస్సుయాత్ర ప్రవేశించింది. పల్నాడు జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి, గజమాలలతో ఘన స్వాగతం పలికారు. ఐనవోలు గ్రామ శివారు, చింతలచెరువులో పెద్ద సంఖ్యలో అక్కచెల్లెమ్మలు రోడ్డుపై బారులుతీరారు. పాదిలి జంక్షన్‌లో జన హారతులు అందుకున్న సీఎం జగన్.. వినుకొండ అడ్డరోడ్డులో ప్రవేశించే సరికి మధ్యాహ్నం 3.30 గంటలు అయ్యింది. అనంతరం భోజన విరామం తీసుకున్నారు.



గుండ్లకమ్మ అడ్డరోడ్డు: సీఎం జగన్‌కు హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

చిన్నారి కంటి సమస్యకు పరిష్కారం



వినుకొండ టౌన్: తమ కుమార్తె ప్రైజీ(9) కంటి చూపు సమస్యను పరిష్కరించాలంటూ నూజెండ్ల మండలం కంభంపాడు గ్రామానికి చెందిన దంపతులు కీర్తిపాటి అనూరాధ, వేణుకుమార్‌లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు విన్నవించారు. చింతలచెరువు గ్రామం వద్ద వారు అర్జీ పట్టుకుని.. తనను కలవడానికి ప్రయత్నిస్తుండటాన్ని గమనించిన సీఎం.. తన సిబ్బంది ద్వారా అర్జీని తెప్పించుకొని, త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని చెప్పి పంపారు. అర్జీ ఇచ్చిన గంట వ్యవధిలోనే సీఎంవో నుంచి చిన్నారి తండ్రి వేణుకుమార్‌కు ఫోన్ వచ్చింది. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీంతో వారు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

అంతులేని అభిమానం

వినుకొండలో రోడ్ షో అట్టహాసంగా సాగింది. మెయిన్ రోడ్డుతోపాటు శివయ్య స్తూపం సెంటర్‌లో అభిమానులు గజమాలలతో సీఎం జగన్‌కు అపూర్వ స్వాగతం పలికారు. రోడ్లు, కూడళ్లు అభిమానులు, కార్యకర్తలతో కిక్కిరిసిపోయాయి. దారి పొడవునా గజమాలలు, తోరణాలతో సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతూ.. ఉత్సవాన్ని తలపించేలా ముందుకు నడిపించారు. మేమంతా సిద్ధమంటూ వడివడిగా యాత్ర వెంట నడిచారు. భోజన విరామం అనంతరం వినుకొండలో రెండు గంటలకు పైగా యాత్ర కొనసాగింది. విఠంరాజుపల్లి, శావల్యాపురం గ్రామాల మీదుగా రాత్రి 8.30 గంటలకు గంటావారిపాలెంలో ఏర్పాటు చేసిన రాత్రి బస శిబిరానికి సీఎం జగన్ చేరుకున్నారు. రాత్రయినా సరే జన నాయకుడిని చూసేందుకు చిన్నా, పెద్దా పోటీపడ్డారు. మార్గమధ్యంలో పలువురు అనారోగ్య బాధితులను చూసి చలించిపోయిన సీఎం జగన్.. వారికి వెంటనే అవసరమైన వైద్య సేవలు అందించాలంటూ అధికారులను ఆదేశించారు. చింతలపాలెంలో సీఎం జగన్‌కు కృతజ్ఞతలు చెప్పేందుకు కాన్వాయ్‌తో పోటీపడి పరుగుపెట్టిన యువకుడిని చూసి బస్సు దిగివచ్చి మరీ ఫొటో దిగి నేనున్నానంటూ భరోసా ఇచ్చారు.

అవ్వాతాతల భావోద్వేగం

సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమం, విద్య, వైద్యం, వ్యవసాయంలోని విప్లవాత్మ మార్పులకు తమ ఉజ్వల జీవితాలే నిదర్శనమంటూ ప్రజలు రోడ్లపైకి వచ్చారు. కన్నబిడ్డలు కూడు పెట్టకపోతే పింఛన్ సొమ్ము పొట్ట నింపుతోందంటూ భావోద్వేగానికి లోనయ్యారు.

బస్సుయాత్రలో

మేము సైతం..







కురిచేడు: రోడ్ షోకు హాజరైన అశేష జనసందోహానికి సీఎం వైఎస్ జగన్ అభివాదం



బోధనంపాడు: జగనన్నను చూసిన సంతోషంలో..

నేనున్నాను.. నేను విన్నాను

సమస్యలు విన్నవించిన బాధితులకు సీఎం వైఎస్ జగన్ భరోసా..

అర్జీలు స్వీకరించి పరిష్కారానికి హామీ

ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో సోమవారం జరిగిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర సందర్భంగా పలువురు అనారోగ్య బాధితులు, ప్రజలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసేందుకు వచ్చారు. వీరిని చూసి స్వయంగా బస్సు దిగి వచ్చిన సీఎం వారి సమస్యలను సావధానంగా విన్నారు. నేనున్నానని భరోసా ఇచ్చారు. అర్జీలు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. తనను కలిసేందుకు వచ్చిన ప్రజలు, లబ్ధిదారులను ఆత్మీయంగా పలకరించారు. దీంతో వారంతా ముగ్ధులైపోయారు. ఆనందం వ్యక్తం చేశారు. జై జగన్ అంటూ నినదించారు.

- కురిచేడు/మాచవరం / పిడుగురాళ్ల రూరల్/ వినుకొండ(నూజెండ్ల)/నరసరావుపేట రూరల్

దివ్యాంగురాలికి సీఎం ఆరోగ్యరక్ష



మా పాప పుట్టిన కొంతకాలానికి మూర్ఛ వ్యాధి వచ్చింది. సకాలంలో చికిత్స చేయించకపోవడంతో మతిస్థిమితం కోల్పోయింది. ఆ తర్వాత శారీరక వైకల్యమూ శాపంగా మారింది. పాపకు చికిత్స చేయించే స్తోమత లేక ఇబ్బంది పడుతున్నాం. బస్సు యాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మా సమస్యను విన్నవించాం. ఆయన పెద్ద మనసు చూపారు. చికిత్స చేయించేందుకు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. మాపాలిట ఆపద్బాంధవుడు సీఎం జగన్. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– నాగిశెట్టి రమాదేవి, సత్యనారాయణ, ఎస్‌ఎస్‌పీ కాలనీ, కురిచేడు, ప్రకాశం జిల్లా

అంధురాలి చదువుకు సీఎం అభయం



మా పాప చందన పుట్టుకతోనే అంధురాలు. బిడ్డకు ఇక కళ్లు రావని వైద్యులు చెప్పారు. కనీసం పాపను చదివించేందుకు ప్రభుత్వం తరఫున సాయం అందించాలని బస్సు యాత్రలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరాం. వెంటనే స్పందించిన సీఎం పాప చదువుకు అభయమిచ్చారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– చిప్పగిరి పాపయ్య, రమణమ్మ, కురిచేడు, ప్రకాశం జిల్లా

జగనన్న ధైర్యమిచ్చారు



మా పాప నర్రా వర్షిణి ఆరో తరగతి చదువుతోంది. పుట్టిన 9వ నెల నుంచి తలసేమియా వ్యాధితో బాధపడుతోంది. ఇప్పటికే లక్షలాది రూపాయలు చికిత్స కోసం ఖర్చు చేశాం. ఫలితం లేకపోయింది. ప్రతినెలా రక్త మార్పిడికి రూ.10 వేలు, వైద్య పరీక్షలు, మందులకు రూ.10 వేలు మొత్తం రూ.20 వేలు ఖర్చు అవుతోంది. నా భర్త ఆటో డ్రైవర్. నేను చిన్న పాటి హోటల్ నిర్వహిస్తున్నా. మా బాధలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లేందుకు వెళ్లగా, ఆయన బస్సు వద్దకు పిలిపించుకుని మా సమస్యను విని నేనున్నానని భరోసా ఇచ్చారు. మీకు ఇబ్బందులు లేకుండా చూస్తానని ధైర్యం చెప్పారు. ఆపరేషన్ చేయించి మీ కుటుంబం సంతోషంగా ఉండేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

– నర్రా శివ లావణ్య, కళ్యాణిపురం, వినుకొండ పట్టణం, పల్నాడు జిల్లా

వెన్నెముక దెబ్బతిన్న యువతికి అభయం



నేను ఎం ఫార్మసీ చదివాను. మా గ్రామంలో ప్రభ విరిగి పడడంతో నా వెన్నెముక దెబ్బతింది. కాళ్లు చచ్చుపడ్డాయి. వీల్‌చైర్‌కే పరిమితమయ్యాను. సీఎం బస్సు యాత్రగా వస్తున్నారని తెలిసి బంధువుల సాయంతో వచ్చాను. రోడ్డుపక్కన వేచి ఉన్న నన్ను చూడగానే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు దిగి వచ్చి సమస్య తెలుసుకున్నారు. అండగా ఉంటానని అభయం ఇచ్చారు. తన ముఖ్యకార్యదర్శి హరికృష్ణను కలవాలని సూచించారు. చాలా ఆనందంగా ఉంది. సీఎం స్పందించిన తీరు అద్భుతం.

– కొత్త తేజస్వీ, విఠంరాజుపల్లి, వినుకొండ రూరల్, పల్నాడు జిల్లా

చిన్నారి వైద్యసాయానికి భరోసా

మా బిడ్డ రోహిణికి 12 ఏళ్లు. ఐదేళ్ల నుంచి వెన్నెముక సమస్యతో బాధపడుతోంది. ఆరోగ్యశ్రీ వర్తించకపోవడంతో చికిత్స చేయించలేకపోయాం. రూ.ఐదు లక్షలు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పారు. బస్సు యాత్ర సందర్భంగా శావల్యాపురంలో సీఎం జగన్‌ను కలిసేందుకు ప్రయత్నించాం. మమ్మలను చూడగానే సీఎం బస్సు దిగి వచ్చి మా సమస్య అడిగి తెలుసుకున్నారు. వెంటనే స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆపరేషన్ చేయిస్తానని భరోసా ఇచ్చారు.

– పున్నారావు, ఝాన్సీ దంపతులు, శావల్యాపురం, పల్నాడు జిల్లా

నా భూమిని మాజీ ఎమ్మెల్యే జీవీ అనుచరులు ఆక్రమించారు

నాకు సీతారామపురం గ్రామంలో 2.46 ఎకరాల భూమి ఉంది. మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అనుచరులు ఆ భూమిని ఆక్రమించుకున్నారు. కేవలం 80 సెంట్లు మాత్రమే ఉన్నట్టు రెవెన్యూ రికార్డుల్లో చూపారు. నేను డాక్టర్‌ను. నడవలేని స్థితిలో ఉన్నా. నా సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చెబుదామని వచ్చాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బస్సు ఆపి నా దగ్గరకు వచ్చి సమస్య తెలుసుకున్నారు. పరిష్కరించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

– డాక్టర్ మోదుగుల వెంకటేశ్వరమ్మ, సీతారామపురం, వినుకొండ, పల్నాడు జిల్లా

సాగర్ జలాలకు హామీ

తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. మా గ్రామ చెరువుకు సాగర్ జలాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని బస్సుయాత్రగా గ్రామానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరాం. గ్రామ సర్పంచ్ వేమా శివ, మాజీ సర్పంచ్ బత్తుల చిన సుబ్బయ్య, నాయకుడు వేమా చిన్న ఆంజనేయులుతో కలిసి వెళ్లి సీఎంకు వినతిపత్రం ఇచ్చాం. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

– బోధనంపాడు గ్రామస్తులు, కురిచేడు మండలం, ప్రకాశం జిల్లా







Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+8 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 17

మంగళవారం 9-4-2024



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'



దేశీయంగా ఈవీ బ్యాటరీలు

ఎక్సైడ్ ఎనర్జీ సొల్యూషన్స్‌తో కియా, హ్యుందాయ్ మోటార్స్ జట్టు - బిజినెస్‌లో



చెన్నై విజయం

చెలరేగిన జడేజా, గైక్వాడ్.. కోల్‌కతాపై ఏడు వికెట్ల తేడాతో గెలుపు.. - స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి

మంగళవారం, 9 ఏప్రిల్ 2024

ఆగని డ్రాగన్ దురాశ

ఇది ఆందోళన రేపే వార్త. తక్షణమే అడ్డుకట్ట వేయడానికి ఆలోచించాల్సిన వార్త. పొరుగు దేశం చైనా 'వాస్తవాధీన రేఖ' (ఎల్ఏసీ) వెంట తన వైపున మరో 175కు పైగా గ్రామాలను నిర్మిస్తోందట. మన అరుణాచల్ ప్రదేశ్‌కు అభిముఖంగా సాగుతున్న ఈ కొత్త నిర్మాణాలు ఇప్పటికే ఎల్ఏసీ వెంట డ్రాగన్ సాగించిన 628 'షియావోకాంగ్' (సంపన్న గ్రామాలు)కు అదనం. ఎల్ఏసీ వెంట తన బలం, బలగం పెంచుకొనేందుకు బీజింగ్ మరోసారి దుష్టపన్నాగం పన్నుతోంది. అభిజ్ఞవర్గాలను ఉటంకిస్తూ ఓ జాతీయ పత్రిక ప్రచురించిన ఈ కథనం సంచలనం రేపుతోంది. ఈశాన్యంలోని అరుణాచల్ ప్రదేశ్‌తో పాటు జమ్ము-కశ్మీర్‌లో లద్దాఖ్ ప్రాంతం వెంట కూడా చైనా వైపున కొత్త గ్రామాలు వెలుస్తున్నాయి. ఇది అత్యంత ఆందోళనకరమైన పరిణామం. వెరసి, రానురానూ ఎల్ఏసీ మరింత వివాదాస్పదం కానుంది. ఇది మన బలగాలు, స్థానికులు తక్షణం జోక్యం చేసుకోవాల్సిన అంశం.

నిజానికి, వాస్తవాధీన రేఖ అనేది భూతలంపై స్పష్టంగా నిర్ణయించిన సరిహద్దు ఏమీ కాదు. చైనీయుల నియంత్రణలో ఉన్న భూభాగాన్నీ, భారత నియంత్రిత భూభాగాన్నీ వేరుపరచే ఊహాత్మక సరిహద్దు రేఖ. దీన్ని వాటంగా చేసుకొని, ఊహాత్మక సరిహద్దయిన ఎల్ఏసీ వెంట సైనిక సన్నద్ధతను పెంచుకోవాలనీ, ఆ క్రమంలో అక్కడ మరింత భూభాగంపై తమ హక్కును ప్రకటించుకోవాలనీ చైనా కుటిల ప్రయత్నం. అందుకే, ఆ జగడాలమారి దేశం ఎల్ఏసీ వెంట తన వైపున గ్రామాలకు గ్రామాలు నిర్మిస్తూ వస్తోంది. దాదాపుగా 900 ఎల్ఏసీ గ్రామాలను నిర్మించాలనేది చైనా వ్యూహం. అందులో 200 దాకా గ్రామాలు భారత సరిహద్దుకు సమీపంలో కట్టాలని దాని ప్రయత్నం. ఆ భారీ ప్రయత్నంలో భాగమే ఇప్పుడీ కొత్త నిర్మాణాలు. ఆ గ్రామాలు ఇటు గస్తీ పాయింట్లుగా, అటు భారత్‌తో ఘర్షణ తలెత్తితే చేతికి అందివచ్చే సైనిక స్థావరాలుగా ఉపకరిస్తాయనేది బీజింగ్ ఎత్తుగడ.

చైనా సైనిక వ్యూహం మాట అటుంచితే, కొత్త ఆవాసాలతో అనేక దీర్ఘకాలిక ప్రభావాలున్నాయి. అది మన దేశాన్ని మరింత కలవరపెడుతోంది. గమనిస్తే, భారత - చైనాల మధ్య 2005 నాటి 'సరిహద్దు రక్షణ సహకార ఒప్పందం' (బీడీసీఏ) ఉంది. ''సరిహద్దు ప్రాంతాల్లో స్థిరపడ్డ ప్రజానీకం ప్రయోజనాలను ఇరుపక్షాలూ సంరక్షించాలి'' అని బీడీసీఏలోని ఏడో ఆర్టికల్ పేర్కొంటోంది. ఎప్పుడైనా ఎల్ఏసీని కచ్చితంగా నిర్ణయించాల్సిన పరిస్థితి వస్తే, అప్పటికి జనావాసాలైన ఈ కొత్త గ్రామాలను కదిలించడానికి వీలుండదు. ఆ అంశాన్ని అడ్డం పెట్టుకోవాలనేది డ్రాగన్ దురాలోచన. అలా తన ప్రాదేశిక హక్కుల వాదనకు బలం చేకూర్చేలా ఈ కొత్త గ్రామాలు, అక్కడ తెచ్చి పెట్టిన జనాభాను వాడుకోవాలనేది దాని పన్నాగం. చైనా వైపు కడుతున్న ఈ కొత్త గ్రామాలకు ఎదురుగా భారత్ వైపున కూడా గ్రామాలు లేకపోలేదు. అయితే, వాటిలో జన సంఖ్య అంతంత మాత్రమే!

విస్తరణ కాంక్షతో ఊగుతున్న చైనా ఈ గ్రామాల నిర్మాణంతో ఆగడం లేదు. టిబెట్‌లో, ఎల్ఏసీ సమీప ప్రాంతాల్లో పెద్దయెత్తున ప్రాథమిక వసతి కల్పన ప్రాజెక్టులను చేపడుతోంది. ఇప్పటికే తన 14వ పంచవర్ష ప్రణాళిక (2021 -25)లో భాగంగా సిచువాన్ - టిబెట్ రైల్వేలైను సహా హైస్పీడ్ రైల్వే వ్యవస్థను విస్తరించే పని పెట్టుకుంది. అలాగే, వాస్తవాధీన రేఖ వెంట, భారత భూభాగానికి సమాంతరంగా సాగే రెండు జాతీయ రహదారులను (జీ-219, జీ-318) అప్‌గ్రేడ్ చేసే పనులూ కూడా ఆ ప్రణాళికలో భాగమే. వాటిలో ఒకటి (జీ-219) లద్దాఖ్, హిమాచల్ ప్రదేశ్‌లకు ఎదురుగా ఉంటే, మరొకటి (జీ-318) అరుణాచల్ ప్రదేశ్, సిక్కిమ్‌లకు అభిముఖమైనది కావడం గమనార్హం. తద్వారా ఒకపక్క టిబెట్‌ను తమలో భాగంగా ప్రచారం చేసుకోవడం, మరోపక్క ప్రాథమిక వసతుల పెంపు అనే రెండూ చైనా పెట్టుకున్న లక్ష్యాలు. అసలు 1959 మార్చి 28న దలైలామా నేతృత్వంలోని టిబెటన్ ప్రభుత్వాన్ని అక్రమంగా రద్దు చేసి, టిబెట్‌ను ఆక్రమించుకున్న చరిత్ర బీజింగ్‌ది. కానీ, మొన్న షిజాంగ్ (టిబెట్)లో ప్రజాస్వామ్య సంస్కరణకు 65వ వార్షికోత్సవం అంటూ ఎల్ఏసీ వెంట డ్రాగన్ సంబరాలు జరపడం ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నమే!

టిబెట్ నుంచి తైవాన్ దాకా అన్నీ తమవేననే డ్రాగన్ రాజ్య విస్తరణ వాదం ప్రపంచానికి కొత్త కాదు. చైనా సాగిస్తున్న ఈ కొత్త గ్రామాల నిర్మాణం నాటకాన్ని సైతం భారత్ గతంలోనే గమనించకపోలేదు. అందుకనే ఆ జనావాసాలను బీడీసీఏ కింద సరిహద్దు చర్చల నుంచి మినహాయించాలని తేల్చిచెప్పింది. డ్రాగన్ మాత్రం తన వంకర బుద్ధి వదులుకోలేదు. భారత్‌లోని లద్దాఖ్‌కు అభిముఖంగా తాను చట్టవిరుద్ధంగా దురాక్రమణ చేసిన ప్రాంతాల్లోనూ చకచకా గ్రామాలు కట్టే పని చేస్తూనే ఉంది. ఇందుకు ప్రతిగా మన దేశం ఎదురుదాడికి దిగింది. 'సచేతన గ్రామాల పథకం' పేర ఆ సరిహద్దులోని మన జనావాసాలను ఏడాది పొడుగూతా జనంతో ఉండే ఆధునిక పర్యాటక ఆకర్షణలుగా మార్చాలని ప్రయత్నిస్తోంది. అయితే అదింకా పూర్తి కాలేదు. పనులు సాగుతూనే ఉన్నాయి.

తరచూ కయ్యానికి కాలుదువ్వే చైనాకు ముకుతాడు వేయడానికి మనం చేయాల్సినవి ఇంకా చాలానే ఉన్నాయి. క్లిష్టమైన హిమాలయ ప్రాంతాల్లో మనం మనవైపు నిర్మిస్తున్న గ్రామాలు సైతం నిర్మానుష్యంగా మిగలకుండా స్థానిక ప్రజలు ఆవాసం ఉండేలా చూడాలి. దురాక్రమణలు జరగకుండా ఉండాలంటే, స్థానికులు ప్రతి ఒక్కరిలో తామే సరిహద్దును కాపాడే సైనికులమనే భావన కల్పించాలి. మాతృభూమి పరిరక్షణ స్ఫూర్తి రగిలించాలి. అది జరగాలంటే, ముందుగా లద్దాఖ్ లాంటి ప్రాంతాల్లో నిరసన తెలుపుతున్న ప్రజానీకపు న్యాయమైన కోరికలను మన్నించాలి. ప్రాంతీయ సంస్కృతి, ఆకాంక్షలకు అనుగుణంగా మన ఢిల్లీ పాలకులు వ్యవహరించాలి. సొంత ఇంటిని చక్కదిద్దుకొని, పొరుగు ప్రత్యర్థిపై పోరాడే క్రమంలో దేశ ప్రయోజనాల దృష్ట్యా అన్ని పక్షాలూ కలసిరావాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు
చైత్ర మాసం, **తిథి:** శు.పాడ్యమి రా.10.06 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** రేవతి ఉ.8.32 వరకు, తదుపరి అశ్విని, **వర్జ్యం:** రా.2.56 నుండి 3.44 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.19 నుండి 9.07 వరకు తదుపరి రా.10.53 నుండి 11.41 వరకు, **అమృతఘడియలు:** ఉ.6.20 నుండి 7.55 వరకు, ఉగాది పండగ.

సూర్యోదయం : 5.52
సూర్యాస్తమయం : 6.10
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

నిజంగా అంత నమ్మకం ఉందా?

విశ్లేషణ

ఎస్ఎన్ఎమ్ ఆబ్ది

అయోధ్యలో రామమందిరం ప్రారంభం ఎన్నికల సునామీని సృష్టిస్తుందని బీజేపీ భావించింది. అందుకే దేవాలయం ప్రారంభించిన వెంటనే బీజేపీ ఏకంగా 370 సీట్లు కైవసం చేసుకుంటుందనీ, ఎన్డీయే కూటమి సంఖ్య 400 దాటుతుందనీ గట్టిగా ప్రకటించింది. 1984లో ఇందిరాగాంధీ హత్యానంతరం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 400కు పైగా సీట్లు గెలుచుకుంది. అప్పటి నుంచి ఏ పార్టీ కానీ, కూటమి కానీ ఆ రికార్డును అధిగమించలేదు. బీజేపీ వంటి ఆచరణాత్మక పార్టీకి మూడింట రెండు వంతుల మెజారిటీని గెలవడం పిల్లల ఆట కాదని గ్రహించడానికి ఎక్కువ సమయం పట్టలేదు. అందుకే చేజారిపోతోందని భావిస్తున్న అధికారాన్ని ఎలాగైనా నిలబెట్టుకోవడానికి అన్ని ఉపాయాలనూ ఆశ్రయిస్తోంది.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీలో భారీ స్థాయిలో విశ్వాస లోపం స్పష్టంగా కనిపిస్తోంది. బీజేపీకి తన గెలుపు పట్ల కచ్చితంగా నమ్మకం ఉంటే, పార్లమెంటు ఎన్నికలకు ముందు జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, బీఆర్ఎస్ పార్టీకి చెందిన కల్వకుంట్ల కవిత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌లను ఈడీ (ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) లేదా సీబీఐ (సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్) అరెస్టు చేసేవా?

ప్రతిపక్ష నేతలపై ఈ విధమైన దాడి, అనివార్యంగా మోదీకి మూడోసారి ప్రధాని పదవి చేపట్టడంపై నమ్మకం లేదన్న సందేశాన్ని పంపుతోంది. మోదీ, ఆయన మనుషులు ఈ దఫా ఎన్నికల్లో 370 సీట్లు గెలుస్తామనీ, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే (నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్) తరఫున 400 మంది పార్లమెంటు సభ్యులను గెలిపించుకుంటామనీ బహిరంగంగా ప్రగల్భాలు పలుకుతున్నారు. కానీ వాస్తవానికి వారు స్వీయ సందేహంతోనూ, భయాందోళనలతోనూ కొట్టుమిట్టాడుతున్నారు. అలా కాకపోతే, బీజేపీని గెలిపించేందుకు మోదీ తన పాలనలో 'ప్రతిపక్ష ముక్త్' (ప్రతిపక్షం లేకుండా) ఎన్నికలను నిర్వహించాలని ఎందుకు నిశ్చయించుకుంటారు?

మోదీ చాలా చురుకైనవారు. చాలా తెలివైనవారు. పైగా రాజీ పడని, కరడు గట్టిన వాస్తవికవాది. ఊహాజనిత, భ్రమలు కలిగించే ప్రపంచంలో ఆయన జీవించరు. ఓటర్లు గుడ్డిగా భారతీయ జనతా పార్టీకి ఓటు వేయరని ఆయనకు బాగా తెలుసు. నిస్సందేహంగా ఆయన భారతదేశంలో అత్యంత బలమైన, ఆకర్షణీయమైన నాయకుడు. కానీ బీజేపీని విజయ తీరాలకు తీసుకెళ్లడానికి తన ముఖం, వ్యక్తిత్వం సరిపోవని ఆయనకు బాగా తెలుసు.

ప్రభుత్వ పనితీరును బేరీజు వేసుకుని ప్రజలు ఓట్లు వేస్తారని కూడా మోదీకి తెలుసు. నిరుద్యోగం తారాస్థాయికి చేరుకుంది. ఒకవైపు నిరుద్యోగ సంక్షోభం, ఉద్యోగాలు పొందే అదృష్టవంతుల ఆదాయంలో స్తబ్దత ఉండగా, మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలనంటుతున్నాయి, జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి. ధనవంతులు మరింత ధనికులుగా, పేదలు మరింత పేదలుగా మారడంతో అసమానత రోజురోజుకూ మరింత ప్రస్ఫుటమవుతోంది. మోదీ, ఆయన సహచరులు వేసుకుంటున్న అంతర్గత అంచనాలలో ఇవన్నీ బీజేపీ అవకాశాలపై అనుమానాలను రేకెత్తిస్తున్నాయి; వారిని గందరగోళానికి గురిచేస్తున్నాయి.

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఆఖరికి తమ మాజీ ముఖ్యమంత్రులను కూడా రంగంలోకి దింపేంత భయంకరమైన పరిస్థితి నెలకొంది. మధ్యప్రదేశ్‌కు చెందిన శివరాజ్‌సింగ్ చౌహాన్, కర్ణాటకకు చెందిన బసవరాజ్ బొమ్మై దీనికి ప్రధాన ఉదాహరణలు. అంతేగాక, పార్టీ అభ్యర్థుల భవితవ్యం తెలుసుకోవడం కోసం... ఉత్కంఠతతో,



విరామం లేకుండా శ్రమిస్తున్న అగ్ర నాయకులు... సీటు తర్వాత సీటు విషయంలో కలవరమైన అంకగణితాన్ని బేరీజు చేసుకుంటున్నారు.

1994-95లో కాంగ్రెస్ పార్టీ సమర్పించిన పన్ను ఖాతాలపై, ఆ పార్టీకి వ్యతిరేకంగా ఆదాయపు పన్ను శాఖ మదింపు చర్యలను తిరిగి ప్రారంభించాల్సినంత తీవ్రమైన అభద్రతాభావంతో బీజేపీ ఇప్పుడు కొట్టుమిట్టాడుతోంది. ఇది ఖననం చేసిన మూడు దశాబ్దాల తర్వాత పోస్ట్‌మార్టం పరీక్ష కోసం శవాలను తవ్వినట్లే అవుతుంది. ఒకవైపు కాంగ్రెస్ అవినీతిపై గురిపెడుతూ, దాన్ని దొంగలు, దొంగల పార్టీ అని మోదీ, ఇతర బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. మరోవైపు నేరచరిత్ర ఉన్న నేతలను బీజేపీ ఆలింగనం చేసుకుంటోంది.

20 పోలీసు కేసులు, అడవులు, గనులను దోచుకున్నందుకుగాను తొమ్మిది సీబీఐ కేసులతోపాటు తనపై కేసుల్లో బెయిల్ కోసం జడ్జికి 40 కోట్లు లంచం ఇవ్వడానికి ప్రయత్నించిన గాలి జనార్దన్ రెడ్డిని ఇప్పుడు బీజేపీ తనలో (తిరిగి) చేర్చుకుంది! అధికార పక్షాన్ని వాషింగ్ మెషీన్‌గా ప్రతిపక్షం అభివర్ణించడాన్ని ఇటువంటి ఫిరాయింపులు బలపరుస్తాయి. దీని ద్వారా కళంకిత నాయకులు నిష్కళంకంగా శుభ్రంగా బయటపడతారు. ఎనిమిది నెలల క్రితం బీజేపీలో చేరిన ప్రఫుల్ పటేల్‌పై ఉన్న భారీ అవినీతి కేసుపై సీబీఐ గత వారం మూసివేత నివేదికను దాఖలు చేసింది. బీజేపీ సిగలో మరో కలికితురాయి నవీన్ జిందాల్! 'కోల్‌గేట్' నిందితుడైన హరియాణాకు చెందిన ఈ కాంగ్రెస్ ఎంపీ, తన తల్లి సావిత్రి జిందాల్‌తో కలిసి భారతదేశాన్ని అభివృద్ధి చేయడం కోసం మోదీతో కలిసి పని చేసేందుకు బీజేపీలోకి వెళ్లారు. అవినీతి కేసుల్లో కూరుకుపోయిన ఇతర పార్టీలకు చెందిన రాజకీయ నాయకులను తన రెక్కల కింద పొదువుకోవడానికి బీజేపీని నడిపిస్తున్న కారణం ఏమిటి?

1984లో ఇందిరాగాంధీ హత్యానంతరం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 400కు పైగా సీట్లు గెలుచుకుంది. అప్పటి నుంచి ఏ పార్టీ కానీ, కూటమి కానీ ఆ రికార్డును ఇప్పటి వరకూ అధిగమించలేదు. 1984 తర్వాత మూడు దశాబ్దాల పాటు ఏ ఒక్క పార్టీ కూడా 272 సీట్లు కూడా గెలుచుకుని సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయింది. కానీ 2014లో కాంగ్రెస్ పార్టీ అసంఖ్యాక వైఫల్యాలను ఉపయోగించుకుని 'అచ్ఛే దిన్' (మంచి రోజులు) వాగ్దానం చేయడం ద్వారా బీజేపీకి 282 సీట్లు వచ్చాయి. ఇక 2019లో, పుల్వామాలో కేంద్ర బలగాలపై జరిగిన మారణకాండను ఉపయోగించుకోవడం ద్వారా బీజేపీ తన సంఖ్యను అనూహ్యంగా 303కు పెంచుకుంది. పుల్వామాలో రక్తపాతానికి ముందు, బీజేపీ చాలా తక్కువ సీట్లు గెలుచుకుంటుందని అంచనా వేశారు. కానీ పుల్వామా ఆ పార్టీకి గేమ్ ఛేంజర్ అయింది. జనవరి 22న అయోధ్యలో రామ మందిరాన్ని ప్రారంభించిన తర్వాత, అది ఏప్రిల్-మేలో ఎన్నికల సునామీని సృష్టిస్తుందని బీజేపీ భావించింది. అందుకే దేవాలయం ప్రారంభించిన వెంటనే బీజేపీ ఏకంగా 370 సీట్లు కైవసం చేసుకుంటుందనీ, ఎన్డీయే సంఖ్య 400 దాటుతుందనీ, లౌకిక-ఉదారవాద భారత్‌పై హిందుత్వ విజయానికి సంకేతంలా గొంతెత్తి ప్రకటించడం ప్రారంభించింది.

కానీ బీజేపీ వంటి ఆచరణాత్మక పార్టీకి ఈసారి మూడింట రెండు వంతుల మెజారిటీని గెలవడం పిల్లల ఆట కాదని గ్రహించడానికి ఎక్కువ సమయం పట్టలేదు. ఉత్తర భారతదేశంలో బీజేపీకి ఇప్పటికే ఉన్న దానికంటే ఎక్కువ సీట్లు కైవసం చేసుకునే అవకాశం లేదు. తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో దాని సంఖ్యను పెంచుకోవడానికి సంస్థాగతమైన శక్తి లేదు. 2019లో కర్ణాటకలోని 28 ఎంపీ స్థానాలకు గానూ బీజేపీ 25 స్థానాలను కైవసం చేసుకుంది. కానీ ఇప్పుడు సిద్ధరామయ్య, శివకుమార్‌లు అధికారంలో ఉన్నందున, బీజేపీ తక్కువ సీట్లు గెలుచుకున్నా ఆశ్చర్యపోనవసరం లేదు. ఏక్‌నాథ్ షిండేకి చెందిన శివసేనతో, అజిత్ పవార్‌కి చెందిన నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీతో పొత్తు ద్వారా మహారాష్ట్రలో బీజేపీ అధికారంలో ఉన్నప్పటికీ, ఎన్డీఏ 2019లో గెల్చుకున్న 48 సీట్లలో 41 స్థానాలకు మళ్లీ చేరుకునే అవకాశం లేదు. అదే విధంగా బిహార్‌లో ఎన్డీఏ 40కి 39 ఎంపీ సీట్లు గెలుచుకుంది. నితీష్ కుమార్ ఎన్ డీఏలోకి తిరిగి వచ్చినప్పటికీ ప్రస్తుత చిత్రం అంత ఆశాజనకంగా లేదు.

ఈ అంశాలన్నీ బీజేపీ విశ్వాస సంక్షోభాన్ని, తీవ్రమైన అభద్రతను, నిర్వీర్యపర్చే సందేహాలను వివరిస్తాయి. అందుకే నిజానిజాలు బయటపడే తరుణంలో బీజేపీ భయాందోళనలకు గురవుతోంది. అందుకే చేజారిపోతోందని భావిస్తున్న అధికారాన్ని ఎలాగైనా నిలబెట్టుకోవడానికి అన్ని ఉపాయాలనూ ఆశ్రయిస్తోంది.

వ్యాసకర్త విదేశాంగ విధానం, దేశీయ రాజకీయాల వ్యాఖ్యాత
('ఫ్రీ ప్రెస్ జర్నల్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఎందుకలా?

ఆజాద్ హింద్ ఫౌజ్‌లోని భిన్న దళాలకు సుభాష్, గాంధీ, నెహ్రూ, ఝాన్సీ రాణి పేర్లు పెట్టారు. ఎందుకు సుభాష్ చంద్రబోస్ వారసత్వాన్ని బీజేపీ లాక్కోవాలనుకుంటోంది?
- సందీప్ పాండే, సోషలిస్ట్ పార్టీ(ఇండియా) ప్రధాన కార్యదర్శి

ఎప్పుడూ రాజకీయాలేనా?

ఇప్పుడు వాళ్లు 400కు పైగా అని మాట్లాడుతున్నారు. మే నెల చివరి వరకు ఆగండి, అది 250 అవుతుంది. జూన్ మొదటి వారానికల్లా అది 175-200 వరకు ఉండవచ్చు.... నేను మాట్లాడుతున్నది అర డజను అల్ఫాన్సో మామిడిపళ్ల గురించి! ప్రతీ సందేశం రాజకీయాల గురించే కానక్కరలేదు!!
- ఎస్.వై. ఖురేషి, కేంద్ర మాజీ ఎన్నికల ప్రధానాధికారి

ఇక అవి ఉండవా?

ప్రస్తుత ఎన్నికల్లో ప్రమాదంలో ఉన్న ఒక ముఖ్యాంశం ఏమిటంటే, రాజ్యాంగం హామీ ఇచ్చిన భావస్వేచ్ఛ అనేది ఇక లేకుండా పోతుందా? రాజ్యాంగం పౌరులకు హామీ ఇచ్చిన శాంతియుత నిరసన హక్కు అనేది చరిత్ర కానుందా?
- సుధీంద్ర కులకర్ణి, పొలిటికల్ యాక్టివిస్ట్

అప్పుడే మొదలా?

యూకేలో 40 లక్షల మంది ముస్లింలు ఉన్నారు. అందులో మూడోవంతు మంది రానున్న ఇరవై ఏళ్లలో అక్కడ షరియా చట్టం కొద్దిమేరకు గానీ, చాలావరకుగానీ వాంఛనీయం అని నమ్ముతున్నారు. ఇలాంటివారి సంఖ్య సుమారు 15 లక్షలు.
- గీర్ట్ వైల్డర్స్, నెదర్లాండ్స్ నాయకుడు

సంప్రదాయమే తిరుగుబాటు

మీరు 18 ఏళ్ల పైబడిన వాళ్లయి, తిరుగుబాటు దారుగా ఉండాలనుకుంటే దీన్ని ప్రయత్నించండి: మీరు మీ దేశాన్ని ప్రేమిస్తామనీ, దేవుడిని నమ్ముతామనీ, పెళ్లి చేసుకోవాలనుకుంటున్నామనీ, పిల్లల్ని ఒక స్థిరమైన చిన్న కుటుంబంలో పెంచుతామనీ మీ క్లాస్‌మేట్స్‌కు చెప్పిచూడండి. ఏం జరుగుతుందో చూడండి.
- వివేక్ రామస్వామి, యూఎస్ఏ నాయకుడు

ఎన్నికల చదరంగం

పశ్చిమ ఉత్తరప్రదేశ్ కుల చదరంగంలో, ప్రతిపక్షం ముస్లింలను పక్కనపెట్టి, మరింతమంది అగ్రకుల అభ్యర్థులను నిలబెట్టింది. 2019 అంకెలతో పోల్చితే, 24 స్థానాల్లో ముస్లింలు, ఓబీసీల వాటాను కాంగ్రెస్-సమాజ్‌వాదీ తగ్గించి, హిందూ 'అగ్ర కులస్థు'లనూ, దళితుల సంఖ్యనూ పెంచాయి.
- అర్ఫా ఖానమ్ షేర్వానీ, జర్నలిస్ట్

ఉత్తమ పౌరులు

యూఎస్ఏలోని ప్రతీ ఐదుగురు వైద్యుల్లో ఒకరు భారతీయులు. వాళ్లు చట్టానికి లోబడి, అక్కడి ఉత్తమపౌరులుగా మసలుకుంటున్నారు. అది మన సంస్కృతి, సంప్రదాయాల్లోనే ఉంది. మన పూర్వీకులు మనకు నేర్పినదది. ఇదే మానవీయ అంశలో భారతీయులను అగ్రస్థానంలో నిలబెడుతోంది.
- అనిల్ చోప్రా, రిటైర్డ్ ఎయిర్ మార్షల్

ఇన్ బాక్స్

బౌద్ధ మార్క్సిస్ట్ మేధావి

యవ్వన దశలోనే ప్రపంచ పర్యటన చేసి అనేక గ్రంథాలు అవపోసన పట్టిన కేదార్‌నాథ్ పాండే... రాహుల్ సాంకృత్యాయన్‌గా ప్రసిద్ధి చెందారు. ఉత్తరప్రదేశ్‌లోని ఆజాంగఢ్ జిల్లా పందహా గ్రామంలో 1893లో ఏప్రిల్ 9న జన్మించారు. టిబెట్, శ్రీలంక, ఇరాన్, చైనా, రష్యాలలో పర్యటించి అనేక భాషల్లో ప్రావీణ్యం సంపాదించారు. అనేక గ్రంథాలను రచించడమే గాక మంచి వక్తగానూ పేరుగాంచారు.

రాహుల్ సాంకృత్యాయన్

పురాతన బౌద్ధ గ్రంథాలు వెలికి తీసి, అనువాదాలు చేసి, ప్రపంచంలో ఉన్న బౌద్ధులకు మహత్తర సాహిత్యాన్ని అందించారు. మతం, తత్వశాస్త్రం, భాష, సైన్స్, సోషియాలజీపై అనేక రచనలు చేశారు. అందులో 'ఓల్గా నుంచి గంగకు' ఒక మంచి రచన. నలంద, విక్రమశిల విశ్వవిద్యాలయాలు, కశ్మీర్-లద్దాఖ్ మీదుగా టిబెట్ వెళ్లి అనేక గ్రంథాలు సంపాదించారు. ఈ సమయంలోనే 'హిందీ-టిబెటన్' నిఘంటువు రచించారు. హ్యుయాన్‌త్సాంగ్ తరువాత అత్యధిక పుస్తకాలు సేకరించిన వ్యక్తి సాంకృత్యాయన్.

రాహుల్ స్వాతంత్ర్య ఉద్యమంలో మంచి పాత్ర పోషించారు. దేశ స్వాతంత్ర్యం కోసం మూడేళ్లు జైలుశిక్ష అనుభవించారు. 1940లలో మార్క్సిస్ట్‌గా మారి, భౌతిక వాదిగా పేరుపొందారు. 'అఖిల భారత కిసాన్ సభ' అధ్యక్షుడుగా అనేక పోరాటాలు చేశారు. ఉద్యమ సమయంలో లాఠీ దెబ్బలు తిన్నారు. ఒక సందర్భంలో తలపై బలమైన గాయమైంది. జీవితం చివరి రోజులను మతిమరపుతో గడిపారు. 1958లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, 1963లో పద్మభూషణ్ పురస్కారం అందుకున్నారు. ఈయనపై ఉన్న గౌరవంతో పర్మపథ్ గ్రామ ముఖద్వారానికి 'రాహుల్ గేట్' అని పేరు పెట్టారు. చిన్నతనం నుండి మరణించే వరకు తన జీవితాన్ని సత్యం కోసం, సర్వమానవాళి సౌభాగ్యం కోసం ధారపోసిన మహా మనీషి ఆయన.

- ఐ. ప్రసాదరావు, కాకినాడ
(నేడు రాహుల్ సాంకృత్యాయన్ జయంతి)

కులవృత్తుల ఆరంభ దినం

సందర్భం

నాగపట్ల భక్తవత్సల రెడ్డి

సంప్రదాయ వృత్తులే జీవనాధారంగా బతికే పల్లెల్లో... వృత్తినీ, పనిముట్లనూ గౌరవ చిహ్నంగా గుర్తిస్తారు. తమ వృత్తి కార్యకలాపాలకు ఉగాది పర్వదినాన్ని ఆరంభ దినంగా భావిస్తారు. ఒక వృత్తి మరో వృత్తి మీద ఆధారపడుతూ పరస్పరం సహకరించుకొంటూ, పరిపోషించుకొంటూ సాగిన సంప్రదాయ వృత్తిని కొనసాగించడంలో పారంపర్యంగా అందిన అనుభవ పూర్వక నైపుణ్యం, క్రమ విధానం, పనిముట్లు తదితర వృత్తి విశేషాలను యువతరానికి గుర్తు చేస్తూ, తాము గుర్తుకు తెచ్చుకొనే పండగ ఇది. వృత్తి దైవదత్తమనీ, పవిత్రమైందనీ, ఒక తరం మరో తరానికి ప్రతీకాత్మకంగా చూపే పండగ ఉగాది. కాని దురదృష్టవశాత్తు నేడు పంచాంగ శ్రవణానికీ, ఉగాది పచ్చడికీ మాత్రమే పరిమితమైపోయింది. అసలు పోయి కొసరు మిగిలింది.

ఈ రోజు లక్ష్మీదేవి పేటలో ఉగాది నాడు ఎడ్లను కడిగి సింగారించి, కొత్త పగ్గాలు, వార్నెలు కట్టి 'ఎడ్ల పండగ' చేస్తారు. ఇంటి బలగాలం ఉన్న వ్యక్తి ముందు కొంఢ్ర వేస్తాడు. బూర్గుపేటలోని నేతగాని వారు కొత్త సాలు వేస్తారు. నారాయణపూర్‌లో మున్నూరు కాపులు తమ పొలంలో ఉన్న చెట్టును నరికి, నాగలి కట్టి చేను దున్నుతారు.

ఆదిలాబాదులోని కోలాములు తెల్లవారు జామునే లేచి ఇంటిని అలంకరించుకుని, కందుల గుడాలు, మక్కపిండితో చేసిన కుడుములు మోదుగ ఆకుల్లో పెట్టుకుని అరక, ఎద్దులతో చెలకకు పోతారు. అక్కడ చెత్తా చెదారం తోసి కాల్చి, గుడాలు, కుడుములతో చెలక మధ్యలో నైవేద్యం పెట్టి, ఎడ్లకు తినిపించి అరక కట్టి అయిదు సాళ్లు దున్నుతారు. ఇది 'వరుడేకాద్'గా ప్రసిద్ధి. గోండులు గోధుమలు, కందులు, మక్కలతో గుడాలు చేసి సాగుభూమిలో చల్లు తారు. పొలంలో తూర్పు వైపున్న చెట్టు నరికి పేడ ఏరి అక్కడ గుడాలు, పానకం చల్లి... కొంత తాము తిని ఇంటికి వస్తారు. దీని తర్వాత ఎప్పుడైనా పొలం పని ఆరంభించవచ్చు.

తూర్పు గోదావరి జిల్లా ఆదుర్రులో కాపులు



తలంటు స్నానం చేసి, అరకు కడిగి పసుపు, కుంకుమ పెట్టి పూజించి ఎవ్వరూ తమను చూడకుండా వెళ్లి చేనులో మూడుసాళ్లు దున్ని ఇంటికి వస్తారు. దీన్నే 'దొంగేరు' అంటారు. పల్లిపాలెంలో తెల్లవారు జామున లేచి స్నానం చేసి అరకు, మేడి, చెర్నాకోల, ఎద్దుల్ని అలంకరించుకుని, పూజించి పొలంలో ఈశాన్యం మూల తూర్పు ముఖంగా కొంఢ్ర వేసి అయిదు సాళ్లు దున్ని వస్తారు. ఇది దొంగ ఏరువాక.

అమ్మాపురంలో విశ్వ బ్రాహ్మణులకు ఉగాది అతి పెద్ద పండుగ. తమ వృత్తి పనిముట్లను కడిగి; పసుపు, నూనె కలిపి పనిముట్లకు పూసి, కుంకుమ బొట్లు పెట్టి కంకణాలు కట్టుకుని వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ముందు పెడతారు. సెనగపప్పు వేసి వండిన పరమాన్నంలో ఎండు కుడుక, బెల్లం, నెయ్యి కలిపి ఐదు పడులుగా... ఉగాది పచ్చడి, భక్ష్యాలతో పాటు దేవునికి నైవేద్యం ఇస్తారు. ఈ సందర్భంలో అష్టకాలు కూడా చదువుతారని అంటారు. అప్పుడు కైవత్తులు (చీపురుపుల్ల కొసకు దూది చుట్టినవి) నూనెలో ముంచి వెలిగిస్తారు. ఉగాది రోజు రాత్రి కానీ, తెల్లవారు జామున కానీ వర్జ్యం లేకుండా చూసి ఇంటి యజమాని దేవుని పూజించి పనిముట్లను కదిలించి హస్తవాసి ఉన్న రైతును పిలిచి కంకణం కట్టి పని ప్రారంభిస్తారు. ఆ రైతు ధాతు పూజగా సోలెడు బియ్యం, ఐదు రూపాయలు పెడతారు. గొల్లవారు ఉగాది రోజు శుచిగా చెరువు కట్ట దగ్గరకు పోయి తుమ్మల మైసమ్మను పూజించి, నైవేద్యం వండి ఐదు పడులు పెట్టి కల్లు లేదా సారా ఆరబోసి, యాటను కోసి పూజిస్తారు.

చొల్లపల్లిలో కోమట్లు ఉగాది పచ్చడి, భక్ష్యాలు, పరమాన్నం నైవేద్యంగా పెట్టి ఉగాది పచ్చడి తాగుతారు. హస్తవాసి ఉన్న ఒకరిని పిలిచి అతనికి పసుపు, కుంకుమ, బెల్లం మాత్రమే మొదట అమ్మి... డబ్బు తీసుకొన్నాకనే ఇతరులకు అమ్ముతారట. కురుమ వాళ్లు పొద్దున్నే మందకాడికి పోయి గొర్రెలను తెచ్చి గొంగడి పరిచి వాటి తోకలు, డెక్కలు తీస్తారు. పాలు పిండి వాటిని పుట్టలో పోస్తారు. చెలకలున్నవారు కొమ్ము కొట్టుకొచ్చుకొంటారు. అగ్రంపాడులో అవుసలి వారు తమ పనిముట్లను శుభ్రంగా కడిగి వాటికి కంకణాలు కట్టి పూజిస్తారు. ఇలా తెలుగు నేల అంతటా వ్యవసాయదారుల దగ్గర నుంచి ఇతర కుల వృత్తులను అనుసరించేవారి వరకూ అందరూ ఉగాదిని ఆనందోత్సాహాలతో జరుపుకొంటారు.

వ్యాసకర్త విశ్రాంత ఆచార్యులు
మొబైల్: 94401 70703

నిత్య నూతన వత్సరం

కొత్త సంవత్సరానికి స్వాగతం చెప్పే సమయం వచ్చింది. ఈ ఏడు ఉగాది పండుగ (9 ఏప్రిల్), ఎన్నికల పండగతో కలిసి రావడం విశేషం. ఇందువల్ల సంవత్సర ఫలాలు ఎలా ఉంటాయన్న ఉత్కంఠ ఎప్పటికన్నా ఎక్కువగా ఉండటం సహజం. కాబట్టి ఈసారి పంచాంగ శ్రవణ కార్యక్రమాలకు ఎప్పటికన్నా అధికంగా ప్రజాదరణ లభించడం ఖాయం.

జ్యోతిర్మయం

నిజానికి, 'రాబోయే కొత్త సంవత్సరం ఎలా ఉండబోతున్నది?' అన్న ప్రశ్న 'ఈ ఏటి ఉగాది పచ్చడి ఎలా ఉండబోతున్నది?' అన్న ప్రశ్న లాంటిది. దినుసులూ అవే, తయారీ విధానం అదే కనుక ఈ ఏటి ఉగాది పచ్చడి రుచి, ఇప్పటివరకు రుచి చూసిన ఉగాది పచ్చళ్ళ కంటే చెప్పుకోదగ్గంత భిన్నంగా ఉండే అవకాశం లేదు. ఈ ఏటి పచ్చడి కూడా తీపీ, చేదూ, వగరూ, ఉప్పనా, ఘాటూ, పులుపూ అనే షడ్రుచుల కలగలుపుగానే ఉంటుంది. ఉత్సాహంతో, ధైర్యంతో, ఆశాభావంతో కొత్తను ఆప్యాయంగా ఆహ్వానించే ధీరుడికి ఆ కలగలుపు ఎప్పటిలాగే కమ్మగానే ఉంటుంది. 'నాకుషస్సులు లేవు, నాకుగాదులు లేవు' అని భీష్మించుకు కూర్చొని, కష్టం రాకముందే దుఃఖించడం ఆరంభించే నిస్సంతోషులకు ఉగాది పచ్చడిలో వేపపూత చేదు మాత్రమే స్ఫురిస్తుంది.

కాలం ఎలాగూ మార్పుల ప్రవాహమే. సుఖ దుఃఖాలూ, శుభాశుభాల నిరంతర పరంపర. ఈ సుఖాసుఖాల కలగలుపులన్నీ ఇంతకు ముందు కూడా చూస్తూ వచ్చినవే. మారుతూ ఉండటంలో మార్పు లేదు, కానీ కనిపిస్తూ వచ్చే మార్పులు ఎప్పటికప్పుడు నిత్య నూతనాలు, నవనవోన్మేషాలు. సర్వమూ ఈశ్వర ప్రసాదమూ, భగవద్విలాసమూ అని భావించి నారాయణుడి మీద నమ్మకం ఉంచినవాళ్ళు కాలగతిలో కలిగే సుఖ దుఃఖాల వల్ల విచలితులు కారు అంటుంది భాగవతం. అన్ని రుచులూ కలిస్తేనే అందమైన అనుభవం. అలాంటి అందమైన అనుభవాలను ఆహ్వానించి, ఆస్వాదించే ఆత్మస్థైర్యాన్ని ఆ జగదీశ్వరుడు అందరికీ ప్రసాదించాలని, క్రోధి నామ వత్సర ఉగాది శుభ సమయంలో ప్రార్థన.

- ఎం. మారుతి శాస్త్రి
(నేడు ఉగాది పర్వదినం)

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
మంగళవారం । 9 । ఏప్రిల్ । 2024



కలెక్టర్‌తో 'ఎన్జీవో' నాయకులు

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీని సోమవారం ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఆ జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు.



దీపక్‌మిశ్రాకు స్వాగతం

గన్నవరం: రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక పోలీసు పరిశీలకులు దీపక్‌మిశ్రా సోమవారం గన్నవరం విమానాశ్రయానికి రాగా.. కృష్ణా కలెక్టర్ బాలాజీ, ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ స్వాగతం పలికారు.



ఉగాది సందడి

ఉగాదిని పురస్కరించుకుని మార్కెట్లు సందడిగా మారాయి. మామిడాకులు, వేపపూత, పూలు, పండ్ల కొనుగోళ్లతో విజయవాడలోని కాళేశ్వరరావు మార్కెట్ కళకళలాడింది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహరి (బుధ)
విజయవాడ	6.27	4.38
జగ్గయ్యపేట	6.29	4.43
మచిలీపట్నం	6.26	4.35
గుడివాడ	6.27	4.38

న్యూస్‌రీల్

క్రీడాకారులకు ఉగాది పురస్కారాల ప్రదానం



విజయవాడస్పోర్ట్స్: జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణిస్తూ ఉమ్మడి కృష్ణాజిల్లా కీర్తిని చాటుతున్న క్రీడాకారుల సేవలను జెన్‌కో అడిషనల్ ఎస్పీ మెహర్‌బాబు, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ కిషోర్ రాయల్ కొనియాడారు. గ్లోబల్ స్పోర్ట్స్ అకాడమీ, స్టార్ టెన్నిస్ అకాడమీ ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన 30 మంది జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను సోమవారం ఉగాది పురస్కారాలతో సత్కరించాయి. విజయవాడ రూరల్ మండలం, నిడమానూరు గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఏఎస్పీ మెహర్‌బాబు, అసిస్టెంట్ కమిషనర్ కిషోర్‌రాయల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించడం సులభం కాదన్నారు. అంకుంఠిత దీక్షతో కష్టపడి ఆ స్థాయి ఎదిగిన క్రీడాకారులను గౌరవించడం మన బాధ్యత అని గుర్తు చేశారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(శాయ్) రిటైర్డ్ కోచ్ రాజేంద్రప్రసాద్, జాతీయ టెన్నిస్ క్రీడాకారుడు రామ్‌కుమార్, గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ కార్యదర్శి జి.వి.ఎస్.ప్రసాద్, స్టార్ టెన్నిస్ అకాడమీ డైరెక్టర్ కె.డోలగోపాలరావు పాల్గొన్నారు.

ఎంసీఎంసీ కార్యకలాపాలు సజావుగా సాగాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) కార్యకలాపాలు సజావుగా సాగేందుకు కృషిచేయాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో ఎంసీఎంసీ, సోషల్ మీడియా సెల్ కార్యకలాపాలను సోమవారం కలెక్టర్ ఢిల్లీరావు పరిశీలించారు. రాజకీయ ప్రకటనలకు ఇచ్చే సర్టిఫికేషన్, వివిధ మాధ్యమాల్లో ప్రచురితమైన, ప్రసారమైన వార్తలు, కథనాలపై వచ్చే ఫిర్యాదుల పరిశీలన, పరిష్కారం తదితరాలకు సంబంధించి కమిటీ చేపడుతున్న కార్యకలాపాలను పరిశీలించారు. ప్రస్తుతం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున వివిధ వార్తా చానళ్లలో వస్తున్న వార్తలు, కథనాల పర్యవేక్షణకు చేసిన ఏర్పాట్లను కూడా పరిశీలించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి యు.సురేంద్రనాథ్ తదితరులు ఉన్నారు.

22లోగా పోస్టల్ బ్యాలెట్‌లకు ప్రతిపాదనలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పోస్టల్ బ్యాలెట్‌లకు ఈ నెల 22వ తేదీలోగా సంబంధిత శాఖల నుంచి అవసరమైన ప్రతిపాదనలు పంపాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఢిల్లీరావు అధికారు లను ఆదేశించారు. సాధారణ ఎన్నికల్లో భాగంగా పోస్టల్ బ్యాలెట్ల నిర్వహణపై పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులతో నగరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. స్పెషల్ ఓటర్లు, సర్వీస్ ఓటర్లు, ఓటర్స్ ఆన్ ఎలక్షన్ డ్యూటీ, ఎలక్టోస్ సబ్జెక్టు టూ ప్రివెంటివ్ డిటెన్షన్, నోటిఫైడ్ ఓటర్స్ ఇంక్లూడింగ్ ఆబ్సెంటీస్ ఓటర్స్ ఎక్స్‌ఎన్షియల్ సర్వీసెస్(ఏవీఈఎస్), ఐదు కేటగిరీలకు చెందిన వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందని తెలిపారు. అధికారులు శాఖల వారీగా పోస్టల్ బ్యాలెట్‌కు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. డీఆర్వో వి.శ్రీనివాసరావు, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి కె.శ్రీనివాసరావు, ఎలక్షన్స్ ట్రైనింగ్ నోడల్ ఆఫీసర్ ఎస్.వి.శివప్రసాద్‌యాదవ్ పాల్గొన్నారు.

జనసేన జెండా పీకేశారు

- బెజవాడ జనసేన పార్టీలో ముసలం
- పార్టీకి పోతిన మహేష్ రాజీనామా
- పవన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు
- పార్టీ కార్యాలయంలో జెండాలు, బ్యానర్లు దగ్ధం
- విజయవాడ తూర్పు ఇన్‌చార్జి బత్తిన సహా పలువురు పార్టీకి దూరం
- పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లో సైతం పవన్ తీరుపై పార్టీ నాయకుల ఆగ్రహం



జనసేన జెండాలు, ఫ్లెక్సీలను తగలబెడుతున్న ఆ పార్టీ కార్యకర్తలు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: జనసేన పార్టీలో ముసలం పుట్టింది. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, విజయవాడ నగర అధ్యక్షుడు పోతిన మహేష్ పార్టీ బాధ్యతలు, క్రియాశీలక సభ్యత్వానికి సోమవారం రాజీనామా చేశారు. పవన్‌కల్యాణ్ తీరును నిరసిస్తూ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయంలో బ్యానర్లు, జెండాలను తగలబెట్టారు. పవన్‌ది అంతా నటన అని, తన స్వార్థం కోసమే పార్టీ పెట్టాడని పోతిన మహేష్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. త్యాగాలకు బీసీలు కావాలా? కమ్మ సామాజికవర్గం అందుకు పనికిరాదా అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీలో కలకలం రేపుతున్నాయి. పవన్ సిద్ధాంతాలు అన్నీ స్వార్థ పూరితమని, పార్టీ కోసం కష్టపడిన వారిని నట్టేట ముంచారని, కులాల మధ్య చిచ్చు రేపుతున్నారని చేసిన విమర్శలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. టీడీపీ కోసమే జనసేన పార్టీ పెట్టారనే భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది.

ఇప్పటికే పలువురు నేతలు దూరం

గత ఎన్నికల్లో జనసేన తరఫున విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి పోటీచేసిన బత్తిన రాము ఇప్పటికే పార్టీకి రాజీనామా చేశారు. వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. జనసేన జిల్లా ప్రచార కమిటీ కార్యక్రమాల సమన్వయకర్త యడవల్లి సతీష్‌తో పాటు పెద్ద ఎత్తున జనసేన కార్యకర్తలు దేవినేని అవినాష్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పెనమలూరు నియోజకవర్గంలో పెద్ద ఎత్తున జనసేన కార్యకర్తలు మంత్రి జోగి రమేష్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పెడన టిక్కెట్‌ను టీడీపీకి కేటాయించడంపై జనసేన కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లా జనసేన అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ టీడీపీకి కోవర్టుగా పనిచేస్తున్నారని ఆయన దిష్టిబొమ్మను తగలబెట్టారు. పెడనలో జనసేన నాయకుడు సమ్మెట బాబు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అవనిగడ్డ సీటు టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు కేటాయించడంతో జనసేన నాయకులు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండలి బుద్ధప్రసాద్‌కు సహకరించే ప్రసక్తే లేదని చెబుతున్నారు. పార్టీ కోసం కష్టపడినా పవన్‌కల్యాణ్ పట్టించుకోకపోవడంతో పలువురు నేతలు పార్టీని వీడేందుకు సిద్ధమవుతు న్నారు. ఇప్పటికే జనసేన పదవులకు జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, జిల్లా సమన్వయకర్త చెన్నగిరి సత్యనారాయణ, అవనిగడ్డ టౌన్ ప్రధాన కార్యదర్శి సహా పలువురు ద్వితీయ శ్రేణి నాయకులు రాజీనామా చేశారు.

రోడ్డునపడ్డ కుటుంబాలు

పదేళ్లపాటు బెజవాడలో పోతిన మహేష్ జనసేన పార్టీ జెండా మోశారు. పార్టీ కోసం, పవన్‌కల్యాణ్ బెజవాడలో చేపట్టిన ప్రతికార్యక్రమానికి డబ్బు ఖర్చు చేశారు. రాజకీయాల్లోకి వచ్చి ఆస్తులు పోగొట్టుకున్నారు. జనసేన పార్టీ జెండా మోసిన పలు కుటుంబాలు రోడ్డునపడ్డాయి. పవన్‌కు డబ్బు మూటలు అందగానే ప్లేటు ఫిరాయించి, పోతినకు హామీ ఇచ్చిన విజయవాడ పశ్చిమ సీటును బీజేపీకి చెందిన సుజనా చౌదరికి కేటాయించారు. ఈ పరిణామం బీసీలు, జనసేన కార్యకర్తలను ఆలోచింపజేసింది. కాపు సామాజికవర్గం, యువతలో సైతం టీడీపీ కోసమే పవన్ కల్యాణ్ తమను పావులుగా వాడుకొంటున్నారనే భావన వ్యక్తమవుతోంది.

టీడీపీ నేతకు అవనిగడ్డ సీటు

ఉమ్మడి కృష్ణా జిల్లాలో పొత్తులో భాగంగా దక్కిన ఒకేఒక్క అవనిగడ్డ సీటును టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు కేటాయించడాన్ని జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. క్షేత్రస్థాయిలో తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి పనిచేసేందుకు జనసేన కార్యకర్తలు ససేమిరా అంటున్నారు. ప్రజారాజ్యం పార్టీని భూస్థాపితం చేసి చిరంజీవిని క్షోభకు గురిచేసి, రాజకీయంగా తప్పుకొనేలా చేసిన ఘటనలు తలచుకొంటున్నారు. వంగవీటి రంగా ఉదంతాన్ని గుర్తు చేసుకుంటున్నారు. చంద్రబాబు మోసానికి కేరాఫ్ అడ్రస్ అని, తేనె పూసిన కత్తిలాంటి వాడనే భావన కాపుల్లో వ్యక్తమవుతోంది. పార్టీ కోసం కష్టపడిన వారిని పవన్ కల్యాణ్ దారుణంగా మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల తరువాత తమ పార్టీ టీడీపీలో కలిసిపోతుందనే చర్చ ప్రస్తుతం జనసేన పార్టీలోనే సాగుతోంది. చంద్ర బాబు నాయుడు కేవలం కాపుల ఓట్ల కోసమే పవన్‌కల్యాణ్‌తో జనసేన పార్టీ పెట్టించి నాటకం ఆడిస్తున్నారనే అనుమానం పలువురిలో వ్యక్తమవుతోంది.

అవనిగడ్డలో ఇండిపెండెంట్‌గా పోటీ!

46 శాతం ఓట్లున్న టీడీపీని వీడి ఆరు శాతం ఓట్లున్న జనసేనలోకి తాను ఎందుకు వస్తానని గతంలో వ్యాఖ్యానించిన మండలి బుద్ధప్రసాద్ ఇప్పుడు ఎందుకు పార్టీ మారారని పలువురు ప్రశ్నిస్తున్నారు. అవనిగడ్డ నుంచి జనసేన టిక్కెట్ ఆశించిన పలువురు నాయకులు హైదరాబాద్‌లో సమావేశం అయ్యేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. అవసరమైతే స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. మొత్తం మీద ఉమ్మడి కృష్ణా జిల్లాలో పలువురు నాయకులు ఇప్పటికే జనసేన పార్టీకి రాంరాం చెప్పారు. మరికొంత మంది పార్టీని వీడేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఎన్నికలకు ముందే జనసేన కూటమి పుట్టి మునగడం ఖాయం అని విశ్లేషకులు సైతం భావిస్తున్నారు.

పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనుల్లో భాగంగా పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు, మరి కొన్ని దారి మళ్లించనున్నట్లు విజయవాడ డివిజన్ రైల్వే పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ మండ్‌రూప్‌కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ–గుంటూరు మధ్య నడిచే 07464, 07465, 07976 నంబరు రైళ్లను ఈ నెల పది నుంచి 30వ తేదీ వరకు తాత్కాలికంగా రద్దు చేశామని తెలిపారు. హుబ్లీ నుంచి విజయవాడ వచ్చే 17329 నంబర్ రైలు ఈ నెల 9 నుంచి 29వ తేదీ వరకు గుంటూరు వరకే నడుస్తుందని పేర్కొన్నారు. విజయవాడ – హుబ్లీ మధ్య నడిచే 17330 నంబరు రైలు ఈ నెల పది నుంచి 30వ తేదీ వరకు గుంటూరు నుంచి బయలుదేరుతుందని తెలిపారు. చెన్నయ్ సెంట్రల్ నుంచి విజయవాడ వచ్చే 12077 నంబరు రైలు ఈ నెల పది నుంచి 30వ తేదీ వరకు మంగళవారం మినహా మిగతా రోజుల్లో తెనాలి, దుగ్గిరాల, కృష్ణా కెనాల్ మీదుగా దారి మళ్లించినట్లు పేర్కొన్నారు. చెన్నయ్ సెంట్రల్ ఎస్‌వీడీ కత్రాల మధ్య నడిచే 16031 నంబరు రైలు పదో తేదీ నుంచి 28వ తేదీ వరకు, చెన్నయ్ సెంట్రల్ – లక్నో మధ్య నడిచే 16093 నంబరు రైలు 13 నుంచి 30వ తేదీ వరకు తెనాలి, దుగ్గిరాల, కృష్ణా కెనాల్ మీదుగా నడుస్తాయని వివరించారు. విశాఖపట్నం – లింగంపల్లి మధ్య నడిచే 12805 (జన్మభూమి) నంబరు రైలు ఈ నెల 9, 12, 13,15,16 తేదీల్లో 45 నిమిషాలు ఆలస్యంగా ఉదయం 7.05 బయలుదేరుతుందని తెలిపారు.

జిల్లా ప్రజలకు కలెక్టర్ ఉగాది శుభాకాంక్షలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లా ప్రజలకు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సోమవారం ఒక ప్రకటనలో శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. విద్య, వైద్య, ఆరోగ్య, వ్యవసాయం, విద్యుత్తు, రవాణా తదితర రంగాల్లో జిల్లా మరింత పురోభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. శ్రీ క్రోధి నామ సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితంలో సుఖసంతోషాలు నింపాలని, శాంతియుత, సామరస్య పూర్వక జీవన విధానానికి పునాదిగా నిలవాలని పేర్కొన్నారు.

నోటా.. తూటా!

ఫలితాలను తారుమారు చేసే తిరస్క'రణం'

- గెలుపోటములు శాసించే ఆయుధంగా మారిన నోటా
- అభ్యర్థుల తలరాత మారుస్తున్న ఖైనం
- ఎన్నికల బరిలో నిలిచిన వారు నచ్చకపోతే ఇదే ఆప్షన్
- 2019 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో నోటాకి 24 వేల ఓట్లు



సాక్షి, మచిలీపట్నం: ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల తల రాతలను నోటా మారుస్తోంది. పోటీ చేసే వారిలో ఎవరూ నచ్చకపోతే 'నన్ ఆఫ్ ది ఎబోవ్' అనే ఆప్షన్ బటన్ నొక్కుతున్నారు. అయితే, ఇది అభ్యర్థుల్లో టెన్షన్ పుట్టిస్తోంది. ప్రజా సేవ చేయాలనో.. అసెంబ్లీలో అడుగుపెట్టి ప్రజా వాణి వినిపించాలనో బరిలో నిలిచే నేతల 'నోటా' మాట లేకుండా చేస్తోంది. ఇలా ఎంతో మంది భవిష్యత్తును తారుమారు చేస్తోంది నోటా. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి కృష్ణా జిల్లాలో నోటాకి 24వేల ఓట్లకు పైగా పడ్డాయి.

నచ్చకపోతే 'నోటా'

ఎన్నికల్లో నిలిచిన అభ్యర్థులు నచ్చకపోతే తిరస్కరణ ఓటు వేసే అధికారాన్ని కేంద్ర ఎన్నికల కమిషన్ ఓటర్లకు అవకాశం కల్పించింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో అభ్యర్థుల గుర్తుతో పాటు నోటా (నన్ ఆఫ్ ది ఎబవ్)ను ఏర్పాటు చేశారు. ఎవరికైనా ఓటు వేయాలంటే సదరు అభ్యర్థికో, పార్టీకో ఓ గుర్తు ఉంటుంది. ఆ గుర్తుకు ఓటర్లు ఓటు వేస్తూ ఉంటారు. అయితే, బరిలో ఉన్న నాయకులు నచ్చలేదనే ఆలోచన ఉన్న ఓటర్ల కోసం నోటా ఆప్షన్‌ను ఈవీఎంలలో పొందుపరిచారు.

2009లో తెరపైకి..

నోటా అవకాశం ఇప్పటికే చాలా దేశాల్లో ఓటర్లకు అందుబాటులో ఉంది. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్‌లో 'నోటా'ను అందుబాటులోకి తేవాలనుకుంటున్నట్లు ఎన్నికల కమిషన్ 2009లో తొలిసారిగా సుప్రీం కోర్టుకు తెలిపింది. ప్రభుత్వం వ్యతిరేకించినా, పౌర హక్కుల సంస్థ పీయూసీఎల్ దీనికి మద్దతుగా ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. ఎట్టకేలకు ఎన్నికల్లో 'నోటా'ను అమలులోకి తేవాలంటూ సుప్రీం కోర్టు 2013 సెప్టెంబర్ 27న రూలింగ్ ఇచ్చింది. ఒకవేళ ఆ నియోజకవర్గంలో బరిలో ఉన్న అభ్యర్థులకు పడిన ఓట్లకన్నా నోటాకు ఎక్కువ ఓట్లు పడితే ఆ నియోజకవర్గం నుంచి తిరిగి ఎన్నికల ప్రక్రియ, ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వవలసి ఉంటుంది.

హక్కు దుర్వినియోగం కాకుండా..

ఎన్నికల బరిలో నిలిచిన వారిలో ఎవరూ నచ్చకపోయినా ఓటర్లు ఎవరికో ఒకరికి ఓటు వేస్తున్నారు. కొన్ని సార్లు వాస్తవ ఓటర్లు ఓటు వేసేందుకు రాకపోతే దుర్వినియోగం అయ్యే అవకాశాలు ఉన్నాయని గుర్తించారు. దీంతో పోటీ చేసే అభ్యర్థులు ఎవరూ నచ్చకపోతే నోటా ద్వారా తమ తీర్పును వెల్లడించే అవకాశం కల్పించారు. నోటా బటన్ నొక్కితే ఓటరు ఓటు ఎవరికీ పడదు. కానీ ఓటు హక్కు మాత్రం వినియోగించుకున్నట్లు అవుతుంది.

ఉమ్మడి కృష్ణా జిల్లాలో 2019 అసెంబ్లీ ఎన్నికల్లో నోటాకుపడిన ఓట్లు..

నియోజకవర్గం పేరు	నోటాకు వేసిన ఓట్ల సంఖ్య
గన్నవరం	1,818
గుడివాడ	3,285
పెడన	1,407
మచిలీపట్నం	1,258
అవనిగడ్డ	1,778
పామర్రు	1,934
పెనమలూరు	1,550
తిరువూరు	1,746
నూజివీడు	2,244
కైకలూరు	1,526
విజయవాడ వెస్ట్	769
విజయవాడ సెంట్రల్	1,012
విజయవాడ ఈస్ట్	1,061
మైలవరం	814
నందిగామ	1,023
జగ్గయ్యపేట	1,038
మొత్తం	24,263



ఈవీఎంలో నోటా బటన్

వసంత వేడుక.. కమనీయ వేదిక

నేటి నుంచి ఇంద్రకీలాద్రిపై వసంత నవరాత్రోత్సవాలు

- ఉదయం 9 గంటల తర్వాత అమ్మవారి దర్శనం
- విశేష పుష్పార్చనకు ఏర్పాట్లు
- ఆలయ ప్రాంగణంలో ఉగాది వేడుకలు
- నేడు భక్తుల కోసం 8 ఉచిత బస్సు సర్వీసులు



దుర్గ గుడి ప్రాంగణంలో వేసిన చలువ పందిళ్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై క్రోధి నామ సంవత్సర వేడుకలు, వసంత నవరాత్రోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారుజామున అమ్మవారికి స్నపనాభిషేకం, విశేష అలంకరణ, నిత్య పూజల అనంతరం ఉదయం 9 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. మరో వైపున వసంత నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి పుష్పాలతో విశేష అర్చన నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీగణపతి విగ్రహం వద్ద అమ్మవారి ఉత్సవ మూర్తికి ఈ విశేష పుష్పార్చన నిర్వహిస్తారు. పుష్పార్చన అనంతరం అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు పుష్పాలను పంపిణీ చేస్తారు. మధ్యాహ్నం మూడు గంటలకు రాజగోపురం ఎదుట ధర్మపథం వేదికపై పంచాంగ పఠనం జరుగుతుంది. తెల్లవారుజామున జరిగే పలు ఆర్జిత సేవలను దేవస్థానం రద్దు చేయగా, ఉదయం 7.30 గంటలకు ప్రారంభమయ్యే లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణం అరగంట ఆలస్యంగా ప్రారంభమవుతాయి. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని సాయంత్రం శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు నిర్వహించే వెండి రథోత్సవాన్ని వైభవంగా జరిపేందుకు దేవస్థానం ఏర్పాట్లు చేసింది.

నేడు బస్సు సర్వీసులు ఉచితం

ఉగాది పర్వదినం, వసంత నవరాత్రోత్సవాల నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తుల సౌలభ్యం కోసం దేవస్థానం ఎనిమిది ఉచిత బస్సు సర్వీసులను నడుపుతుంది. భక్తులు తమ వాహనాలను వీఎంసీ కార్యాలయం ఎదుట ఉన్న ఖాళీ స్థలంలో నిలుపుకుని అక్కడి నుంచి దేవస్థాన బస్సులలో కొండపైకి చేరుకోవాలని సూచిస్తుంది. మరో వైపున బస్టాండ్, రైల్వేస్టేషన్‌ల నుంచి నాలుగు సర్వీసులు, పున్నమీ ఘాట్ నుంచి రెండు సర్వీసులు, దుర్గా ఘాట్ నుంచి కొండపైకి మరో రెండు సర్వీసులను నడుపుతోంది. ఈ ఎనిమిది బస్సులలో భక్తులు ఉచితంగా ప్రయాణం చేయవచ్చని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.

వీఐపీ దర్శనాలు రద్దు

అమ్మవారికి మహా నివేదన సమయంలో వీఐపీ దర్శనాలను నిలుపుదల చేస్తున్నట్లు ఆలయ ఈఓ కె.ఎస్.రామరావు ఆదేశాలు జారీ చేశారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు వీఐపీలతో పాటు అన్ని ప్రొటోకాల్, డిపార్ట్‌మెంట్, వృద్ధులు, వికలాంగులకు దర్శనాలు నిలిపివేసింది. అమ్మవారికి ప్రతి నిత్యం మధ్యాహ్నం 12 గంటలకు మహా నివేదన సమర్పిస్తారు. ఉదయం 11.40 నుంచి 12.15 గంటల వరకు అన్ని దర్శనాలు నిలిపివేయడంతో క్యూలైన్‌లో భక్తుల రద్దీ పెరుగుతుంది. సామాన్య భక్తులు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు దేవస్థానం ఈ నిర్ణయం తీసుకుంది. మధ్యాహ్నం 1.30 గంట తర్వాత వీఐపీ దర్శనాలు తిరిగి ప్రారంభమవుతాయని పేర్కొంది.

వేడుకగా ఉగాది పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో వేముల హజరత్తయ్య గుప్తా తదితరులు

విజయవాడ కల్చరల్: కళాకారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా సూచించారు. కళామంజరి సాంస్కృతిక సేవా సంస్థ, సి.రామ్మోహనరావు కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో క్రోధినామ సంవత్సర ఉగాది వేడుకలు, కళామంజరి విశిష్టరత్న పురస్కారాల ప్రదాన కార్యక్రమం దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాల ప్రాంగణంలో సోమవారం జరిగింది. హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ.. కళాకారులు సాంస్కృతిక వారధులని వారి సేవలను గుర్తించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. న్యాయవాది ఎ.వి.రమణ మాట్లాడుతూ.. ఏటా ఉగాది సందర్భంగా వివిధ రంగాల ప్రముఖులను గుర్తించి ప్రోత్సహిస్తున్న నిర్వాహకుల కృషిని అభినందించారు. ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ చాంబర్ మాజీ అధ్యక్షుడు అంబటి మధుమోహన కృష్ణకు కళామంజరి విశేష విశిష్టరత్న పురస్కారం, జంధ్యాల పరదేశిబాబు, మోపిదేవి దుర్గాలక్ష్మి, మల్లెల త్రివేది, ఆళ్ల యోగానందీశ్వరరెడ్డి, డాక్టర్ రావి అరుణ, జొన్నలగడ్డ జగన్మోహనరావు, చుండూరి సుబ్బారావు, మద్దాలి సత్యవాణి, దొంతాల ప్రకాష్, సూర్యదేవర జగన్నాథరావు, దోమ మాధవి, ఓరుగంటి నీలిమ, లంకా నాగ సాయిసుస్మిత, ఉద్దంటి ఉజ్వల సాయికి విశిష్ట రత్న పురస్కారాలను అందజేశారు. ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి, కళామంజరి వ్యవస్థాపకుడు పి.వి.ఎల్.నృసింహం, వెనిగళ్ల భాస్కర్, చివుకుల హరగోపాల్, మాడుగుల రామకృష్ణ, ఆచంట బాలాజీనాయుడు, వేముల నాగేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా డాక్టర్ గడ్డం ప్రియాంక భరతనాట్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మద్దాలి సాయి చంద్రిక, చింతారవి బాలకృష్ణ బృందం సంప్రదాయ నృత్యాలను, శిష్టా హైమవతి బృందం వీణావాద్య కచేరీ, రంగస్థల నటుల ఏకపాత్రాభినయం ఆకట్టుకున్నాయి.

• కొత్త ఉషస్సుల క్రోధి



ఇంటింటా మామిడాకుల తోరణాలు.. వీధివీధినా మంగళ నాదాలు.. వీనుల విందైన కోకిలమ్మల రాగాలు తెలుగు వారి నూతన సంవత్సరాదిని ఆహ్వానిస్తున్నాయి. శ్రీ క్రోధి నామ సంవత్సరాన్ని ఘనంగా జరుపుకొనేందుకు ఉమ్మడి జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో నవ ఉషస్సులు నిండాలని ఆకాంక్షిస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









కూటమి అభ్యర్థులను తరిమికొట్టాలి

- ఎన్నికల తర్వాత విజయవాడలో కనిపించరు
- సుజనా చౌదరి కేంద్ర మంత్రిగా ఉన్నా విజయవాడకు చేసింది శూన్యం
- ఎంపీ కేశినేని నాని ఫైర్



చిరు వ్యాపారితో ముచ్చటిస్తున్న కేశినేని నాని, షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కూటమి తరఫున విజయవాడ ఎంపీగా, పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఇద్దరూ పొలిటికల్ టూరిస్టులు అని విజయవాడ ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని) విమర్శించారు. ఎన్నికల అనంతరం వారిద్దరూ విజయవాడలో కనిపించరని చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి షేక్ ఆసిఫ్‌తో కలిసి కేశినేని నాని సోమవారం 37వ డివిజనులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రమణయ్య కూల్‌డ్రింక్ షాప్ సెంటర్ నుంచి ప్రచారాన్ని ప్రారంభించారు. కేటీరోడ్డు, సామారంగం చౌక్, బ్రాహ్మణవీధి తదితర ప్రాంతాల మీదుగా ముందుకు సాగారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పూలబావి వీధిలో ఉన్న జైన్ దేవాలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కేశినేని నాని మాట్లాడుతూ ప్రస్తుతం కూటమి తరఫున పోటీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఇద్దరూ మోసగాళ్లని మండిపడ్డారు. వారిని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. సుజనాచౌదరి 12 ఏళ్లు రాజ్యసభ సభ్యుడిగా, మూడేళ్లు కేంద్రమంత్రిగా ఉన్నా కూడా విజయవాడకు, రాష్ట్రానికి చేసిందేమీ లేదని చెప్పారు. ఆయన వ్యవహారాలు చక్కబెట్టుకోవడానికి చంద్రబాబుకు బ్రోకర్‌గా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీ అభ్యర్థి నకిలీ ఎంపీ స్టిక్కర్లు వేసుకుని హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ దందా నడిపాడని తెలిపారు. ఆయన వందలాది మంది పేదల భూములు తీసుకుని మోసం చేయడంతో కేశినేని డెవలపర్స్ అనే సంస్థపై రియల్ ఎస్టేట్ అథారిటీ ఆఫ్ తెలంగాణ భారీ జరిమానా కూడా విధించినట్లు మీడియాలో వచ్చిందని వివరించారు. తనపై చిన్న మచ్చ కూడా లేదని నాని స్పష్టం చేశారు. తన ఆస్తులను అమ్ముకుని నమ్మకాన్ని నిలబెట్టుకున్నానని, ఎక్కడా అవినీతికి పాల్పడలేదని కేశినేని నాని చెప్పారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో స్థానికుడైన ఆసిఫ్‌ను భారీ మెజారిటీతో ప్రజలు గెలిపించడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ నాన్ లోకల్ పెత్తందారులను పశ్చిమ ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోరని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రతి గడపలోనూ సీఎం వైఎస్ జగన్ చేసిన మంచి గురించి తమకంటే ప్రజలే ఎక్కువగా చెబుతున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఏపీ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, స్థానిక కార్పొరేటర్ మండేపూడి ఛటర్జీ, నాయకులు జిలానీ, గ్రంధి బుజ్జి తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలి

- ఓటు లేకుంటే ఫారం–6 ద్వారా తక్షణమే నమోదు చేసుకోండి
- ట్రాన్స్‌జెండర్లకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు పిలుపు



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, ట్రాన్స్‌జెండర్లు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటే కీలకమని, ట్రాన్స్‌జెండర్లు ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు పిలుపునిచ్చారు. నగరంలోని ఐవీ ప్యాలెస్‌లో సోమవారం స్వీప్ కార్యక్రమం జరిగింది. డీఆర్‌డీఏ, విజయవాడ నగరపాలక సంస్థ, విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్లు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్ ఓటర్లకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఓటు వివరాలు తెలుసుకునేందుకు, కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు, ఓటు వేరే చోట ఉంటే ఫారం–8 ద్వారా బదిలీ చేసుకునేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. వయసు, కుల ధ్రువీకరణ, ఆధార్, ట్రాన్స్‌జెండర్ గుర్తింపు కార్డు తదితర సేవలు పొందేందుకు కూడా సిబ్బందితో కౌంటర్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేయాలని, అవగాహన కల్పించాలనే ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో ప్రత్యేకంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో సుమారు 16.91లక్షల మంది ఓటర్లు ఉండగా, అందులో థర్డ్ జెండర్ ఓటర్లు 144 మాత్రమే ఉన్నారన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదై ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

చేయిపట్టి నడిపించేందుకు ఏర్పాట్లు

విజయవాడ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ డీఆర్డీఏ, విజయవాడ నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఓటు ఉందా.. లేదా? అనే విషయాన్ని తెలుసుకోవడంతో పాటు ఒకవేళ ఓటు లేకుంటే కొత్తగా నమోదుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకొని ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. డీసీపీ అధిరాజ్ సింగ్ రాణా మాట్లాడుతూ వివిధ శాఖలను ఒకే వేదిక వద్దకు చేర్చి ట్రాన్స్‌జెండర్లకు అవసరమైన సేవలందించడం సంతోషకరమన్నారు. ఆర్డీఓ బీహెచ్ భవానీ శంకర్ ఓటు హక్కును వినియోగించడాన్ని ఓ గొప్ప బాధ్యతగా గుర్తెరిగి సద్వినియోగం చేసుకోవాలన్నారు. అడిషనల్ డీసీపీ, ఇన్‌చార్జ్ డీసీపీ (అడ్మిన్) ఎం.కృష్ణమూర్తి నాయుడు మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లు తప్పనిసరిగా ఓటు హక్కును నమోదు చేయించుకుని ఓటు వేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, విభిన్న ప్రతిభావంతులు, టీజీ, వయోవృద్ధుల సంక్షేమ అధికారి వాడ్రేవు కామరాజు, జిల్లా పౌరసరఫరాల అధికారి జి.మోహన్‌బాబు, స్వీప్ నోడల్ అధికారి యు.శ్రీనివాసరావు, గ్రామ, వార్డు సచివాలయ అధికారి కె.అనూరాధ, డీసీహెచ్ఎస్ బీసీకే నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో ప్రస్తుత వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా ప్రణాళికాయుతంగా చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పథకం పనులు, విద్యుత్ సరఫరా పరిస్థితులపై సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ క్యాంపు కార్యాలయ వీసీ హాలు నుంచి కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు డ్వామా పీడీ జె.సునీత తదితరులతో కలిసి హాజరయ్యారు. ఎక్కడా తాగునీటికి ఇబ్బంది లేకుండా తీసుకోవాల్సిన చర్యలతో పాటు ఉపాధి హామీ పథకం కింద కూలీలకు కల్పిస్తున్న పనులపై సీఎస్ జవహర్‌రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ముఖ్యంగా మధ్యస్థ కరువు మండలాలైన తిరువూరు, గంపలగూడెం ప్రాంతాలతో పాటు ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికారుల బృందాలు నిరంతర పర్యవేక్షణతో సమస్యలు లేకుండా చూస్తున్నట్లు వెల్లడించారు. జల వనరులు, గ్రామీణ నీటి సరఫరా, మునిసిపల్ అధికారుల సమన్వయంతో ఎక్కడా నీటి వృథా లేకుండా తగిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కాల్వల నుంచి వచ్చే నీటిని మంచినీటి అవసరాలకు వినియోగించేలా చర్యలు తీసుకున్నామన్నారు. శివారు ప్రాంతాలకు కూడా తాగునీరు అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. వేసవి నేపథ్యంలో ఉపాధి హామీ పథకం కూలీలకు మంచినీటితో పాటు చేయాల్సిన ఇతర ఏర్పాట్లపై కలెక్టర్ ఢిల్లీరావు సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు.

పాడుబడిన బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

హనుమాన్‌జంక్షన్ రూరల్: వీరవల్లిలో జాతీయ రహదారి వెంబడి ఉన్న పెట్రోల్ బంక్ వెనుక పాడుబడిన బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉండటం సోమవారం కలకలం రేపింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు వీరవల్లి పోలీసులు ఘటనాస్థలానికి వచ్చి మృతదేహాన్ని బయటకు తీసి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి 40 నుంచి 45 ఏళ్ల వయస్సు ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుని ఎడమ చేతిపై ఇంగ్లిషు అక్షరాలతో 'జెయుఎస్ఎల్' పచ్చబొట్టు ఉందని, ఎడమచేతి మణికట్టు వద్ద 'బి' అనే అక్షరంతో మరో పచ్చబొట్టు ఉందని వీరవల్లి ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వ్యక్తులు ఎస్ఐ ఫోన్ నంబర్ 94407 96445కు వివరాలు తెలియజేయాలని కోరారు.

పోలంపల్లి డ్యాం పరిశీలించిన అధికారులు



ఆనకట్టను పరిశీలించి తగు సూచనలు చేస్తున్న ఇరిగేషన్ ఉన్నతాధికారులు

పోలంపల్లి(వత్సవాయి): మండలంలోని పోలంపల్లి డ్యాంను సోమవారం ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. రిటైర్డు ఈఎంసీ గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్, శివకుమార్‌రెడ్డి బృందం పరిశీలించింది. గత వర్షాకాలంలో మునేటికి పెద్ద ఎత్తున వరద పోటెత్తడంతో బ్రిటీష్ కాలంలో నిర్మాణం చేసిన ఆనకట్ట కొట్టుకుపోయింది. ఈ ఆనకట్ట ద్వారానే మునేటి కాలువ నుంచి రైతుకు సాగునీరు అందేది. ఆనకట్ట కొట్టుకుపోవడంతో రైతులు సాగునీటికి ఇబ్బందులు పడతారని గ్రహించిన ఎమ్మెల్యే ఉదయభాను ఆనకట్టకు తాత్కాలిక మరమ్మతులు చేసి నీటి ఎద్దడి లేకుండా చూశారు. అయితే ఆనకట్టకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో వెంటనే ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి నూతనంగా ఆనకట్ట నిర్మాణం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం ఇరిగేషన్ అధికారులతో నివేదిక అందించాలని సూచించారు. డ్యాంను పరిశీలించిన అధికారులు మాట్లాడుతూ పాత ఆకనట్ట స్థానంలో మరొకటి ఏర్పాటుచేసి రానున్న ఖరీఫ్ లో రైతులకు సాగునీటికి ఇబ్బందులు లేకుండా చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఈ ప్రసాద్‌బాబు, ఈఈ గంగయ్య, డీఈ రామకృష్ణ, జేఈ నరసింహారావు పాల్గొన్నారు.

భార్యను హత్యచేసిన భర్త

గుడివాడరూరల్: పట్టణంలోని దనియాలపేట చెరువుగట్టు సమీపంలో నివసిస్తున్న క్లోపల్లి శంకరరావు, దేవి(32) దంపతులకు ఇద్దరు కుమార్తెలు. శంకరరావు ఇస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తుండగా, భార్య ఇళ్లల్లో పని చేస్తుంటుంది. ఈ క్రమంలో గత నెలరోజుల నుంచి భార్య ఎవరితోనో ఫోన్ మాట్లాడుతుండటంతో శంకరరావు అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి శంకరరావు క్షణికావేశంలో భార్యను పీక పిసికి చంపేశాడు. వన్‌టౌన్ సీఐ కె.ఇంద్ర శ్రీనివాస్ ఘటనాస్థలానికి చేరుకుని శంకరరావును అదుపులోకి తీసుకున్నారు. మృతురాలి సోదరుడు నాగేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ప్రజలందరికీ దేవినేని అవినాష్ ఉగాది శుభాకాంక్షలు



లబ్బీపేట(విజయవాడ తూర్పు): దేశ విదేశాల్లో ఉన్న తెలుగు ప్రజలు అందరికీ తెలుగు నూతన సంవత్సరాది సందర్భంగా తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ క్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. పండుగ పర్వదినాన్ని ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీకి ఈ నూతన సంవత్సరంలో ఘన విజయం అందించి ఆశీర్వదించాలని ఈ సందర్భంగా అవినాష్ ప్రజలకు పిలుపునిచ్చారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

పోలీస్ కమిషనర్ టీకే రాణా



విజయవాడస్పోర్ట్స్: ఇఫ్తార్ విందు మత సమరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా అన్నారు. జిల్లా పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఎ కన్వెన్షన్ హాల్లో ఇఫ్తార్ విందు సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీ రాణా మాట్లాడుతూ సర్వమతాలను గౌరవించడం మన దేశ సంప్రదాయమని తెలిపారు. అన్ని మతాలను సమానంగా ఆదరిస్తున్న మన దేశం ప్రపంచ వ్యాప్తంగా కీర్తి సాధించిందని పేర్కొన్నారు. ఆధ్యాత్మికతను సంతరించుకున్న రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందని చెప్పారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఇఫ్తార్ విందును అందిస్తున్నామన్నారు. డీసీపీలు అధిరాజ్‌సింగ్ రాణా, కె.శ్రీనివాసరావు, టి.హరికృష్ణ, కె.చక్రవర్తి, ఉదయరాణి, రామకృష్ణ, ఏడీసీపీలు కనకరాజు, కృష్ణమూర్తినాయుడు, డి.ప్రసాద్, శ్రీహరిబాబు, కె.ఆర్.ప్రసాద్, శశికాంత్ పాల్గొన్నారు.

ముస్లింలకు పవిత్రమైన పండుగ రంజాన్



కృష్ణలంక(విజయవాడతూర్పు):ముస్లింలకు పవిత్రమైన పండుగ రంజాన్ అని తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. కృష్ణలంక, 21వ డివిజన్‌లోని రెహమాన్ స్ట్రీట్‌లో సోమవారం ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని వడ్డించారు. తొలుత ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం విశేషమన్నారు. అల్లా ఆశీస్సులు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై మెండుగా ఉండాలని, రాష్ట్రంలో, తూర్పులో వైఎస్సార్ సీపీ జెండా ఎగరాలని అల్లాను ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 21వ డివిజన్ కార్పొరేటర్ పుప్పాల కుమారి,ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్ సుభాని, డైరెక్టర్ మీర్ హుస్సేన్, జాకీర్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

223 మంది వలంటీర్లు రాజీనామా



లబ్బీపేట(విజయవాడతూర్పు):ప్రజలకు సేవ చేస్తున్న తమపై రాజకీయ పార్టీల నేతలు నిందలు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ తూర్పు నియోజకవర్గంలోని 223 మంది వలంటీర్లు సోమవారం తమ విధుల నుంచి తప్పుకున్నారు. ఈ మేరకు సర్కిల్ 3 కార్యాలయంలోని జోనల్ కమిషనర్‌కు తమ రాజీనామా లేఖలను అందచేశారు. ప్రజలకు సేవ చేస్తున్న తమపై రాజకీయ నాయకులు నిందలు వేయడాన్ని నిరశిస్తూ రాజీనామాలు అందచేసినట్లు తెలిపారు. చంద్రబాబు తన మనిషి ద్వారా ఎన్నికల కమిషన్‌ను లేఖ ఇచ్చి, ఫించన్‌ల పంపిణీని అడ్డుకున్నారని పేర్కొన్నారు.

నేడు అమరావతి కన్వెన్షన్ హాల్లో ఉగాది వేడుకలు

గాంధీనగర్: విముదా ఇన్ ఫ్రా ప్రాజెక్ట్స్, లైన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఫైన్ ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు లయన్ డి దుర్గాప్రసాద్, డాక్టర్ రామ్ చంద్, లయన్ పి రమేష్, లయన్ అప్పారావు తెలిపారు. గాంధీనగర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉగాదిని పురస్కరించుకుని విద్య, వైద్య, సామాజిక రంగాల్లో విశేష సేవలు అందించిన వారికి ఉగాది పురస్కారాలు అందజేయనునట్లు తెలిపారు. అమరావతి కన్వెన్షన్ లో జరిగే వేడుకలకు ముఖ్య అతిథిగా నూతన హీరోయిన్ శాంతి ప్రియ (దర్శిని మూవీ ఫేమ్) హాజరవుతారన్నారు.

అభివృద్ధి, సంక్షేమంతో ప్రజల్లోకి అవినాష్

- జోరుగా అవినాష్ ప్రచారం
- చేసిన మంచిని చెబుతూ ఓట్లు అభ్యర్థిస్తున్న వైనం



అవినాష్‌కు ఆత్మీయంగా స్వాగతం పలుకుతున్న మహిళలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తూర్పు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలే దేవినేని అవినాష్ ప్రచారాస్త్రాలుగా మారాయి. ఐదేళ్లలో చేసిన మంచినే చెబుతూ ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఏ ఇంటికి వెళ్లినా తమకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని మహిళలు హారతులిస్తూ స్వాగతం పలుకుతున్నారు. అవినాష్ వలనే తమ కాలనీ అభివృద్ధి చెందిందంటూ సత్కారాలతో ముంచెత్తుతున్నారు. ఇలా ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజలు తమ ప్రాంతానికి చేసిన అభివృద్ధిని చెబుతూ మీలాంటి నాయకుడు మాకు కావాలంటున్నారు.

ఇంటింటికీ సంక్షేమం....

తూర్పు నియోజకవర్గంలో నవరత్నాల ద్వారా రూ.924 కోట్లు మహిళలకు నేరుగా తమ ఖాతాల్లో నగదు జమ చేయడం జరిగింది. అంతేకాదు మరో రూ.300 కోట్లు విలువైన ఇంటి స్థలాలను 32 వేల కుటుంబాలకు అందించారు. ఇలా ఇంటింటికీ అందించిన సంక్షేమాన్నే ప్రజలకు వివరిస్తున్నారు. గతంలో ఏ నాయకులు, ఏ ప్రభుత్వం అందించని విధంగా, సిఫార్సులను , రాజకీయాలకు తావు లేకుండా సంక్షేమ పథకాలు అందించిన తీరును వివరిస్తూ, అలాంటి పాలన మళ్లీ రావాలంటే, సంక్షేమ పథకాలు నిరంతరాయంగా కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ రావాలని చెబుతున్నారు.

దమ్ముగా అభివృద్ధిని చెబుతూ...

టీడీపీ అభ్యర్థి గద్దే రామ్మోహన్ పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ తూర్పులో చేసిన అభివృద్ధి ఏమీ లేదు. కానీ దేవినేని అవినాష్ రూ. 650 కోట్లుతో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తున్నారు. రూ.360 కోట్లుతో రిటైనింగ్ వాల్, రూ.120 కోట్లుతో బెంజిసర్కిల్ రెండో ఫ్లై ఓవర్, నాడు-నేడులో స్కూళ్ల అభివృద్ధి, రూ.20 కోట్లుతో అధునాతన సబ్‌స్టేషన్లు ఏర్పాటు గురించి వివరిస్తున్నారు. నియోజకవర్గంలోని 21 డివిజన్‌లలో ఏ డివిజన్‌లో ఎంత అభివృద్ధి చేసింది, ఎన్ని పనులు చేశారో కూడా దమ్ముగా లెక్కలతో చెబుతూ ప్రచారం చేస్తున్నారు.

ప్రత్యర్థుల ఆరోపణలు తిప్పికొడుతూ...

తాము చెప్పుకునేందుకు ప్రజలకు చేసింది ఏమీ లేక టీడీపీ నేతలు అబద్దాలు, అసత్య ప్రచారాలతో నిత్యం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఆరోపణలు తిప్పకొడుతూ దేవినేని అవినాష్ ప్రజల్లోకి వెళ్తున్నారు. వాళ్లు చేస్తున్న గారడీలు, మాయలను ప్రజలకు వివరిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలోనే సంచలనంగా మారిన కాల్‌మనీ సెక్స్ రాకెట్‌కు కేంద్ర బిందువు తూర్పు నియోజకవర్గమే కాక, అందులో సూత్రదారులెవరో కూడా ప్రజలకు వివరిస్తూ మంచి మనస్సున్న వారినే ఆదరించాలని కోరుతున్నారు.

నిత్యం ప్రజల్లోనే..ప్రజలతోనే..

దేవినేని అవినాష్ నిత్యం ప్రజల్లోనే, ప్రజల మధ్యనే ఉంటూ, వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నారు. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించినవి ఎన్నో ఉన్నాయి. ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ వంటి దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం చూపారు. ప్రజల్లో ఉండే వ్యక్తినే గెలిపించేందుకు తూర్పు ప్రజలు సైతం నిర్ణయించుకున్నారు.

వైఎస్సార్ సీపీకి బ్రహ్మరథం



రామలింగేశ్వరనగర్‌లో కొల్లిపారవీధిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బెల్లం దుర్గ

ఆటోనగర్(విజయవాడతూర్పు):వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ అన్నారు. రామలింగేశ్వరనగర్‌లోని కొల్లిపారవీధి, రాయపాటి రమణమ్మవీధితోపాటు నెమ్మలివారివీధిలో తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని) తరఫున సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఏ ఇంటికి వెళ్లినా నవరత్నాలు అందాయని సంతోషంగా చెబుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అందిన సంక్షేమ పథకాలు గతంలో ఎవ్వరూ ఇవ్వలేదని మహిళలు చెబుతున్నారు. 15వ డివిజన్ లో రూ.33 కోట్లతో అభివృద్ధి చేశామని దుర్గ చెప్పారు. గతంలో తూర్పు ఎమ్మెల్యే గద్దె పాత 14, ప్రస్తుతం 15వ డివిజన్‌ను దత్తత తీసుకొని.. కనీసం ఒక్కపైసా నిధులు కేటాయించలేదని విమర్శించారు. పైగా రిటైనింగ్ వాల్ టీడీపీ ఆధ్వర్యంలో నిర్మించినట్టు గొప్పలు చెప్పడం దారుణమని దుయ్యబ్టారు. టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి పై చర్చించడానికి సిద్ధమా అని సవాల్ విసిరారు. చేయని పనులు చెప్పి ప్రజలను మోసం చేయాలని చూస్తే వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓటుతో గట్టిగా బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, బాలాజీ, నాగభూషణం, సత్యనారాయణ, గల్లా వెంకటేశ్వరరావు, కాటూరి వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, విశ్వేశ్వరరావు, దశరథరామయ్య పాల్గొన్నారు.

అవినాష్‌ను ఆశీర్వదించండి



22వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దేవినేని సుధీర

కృష్ణలంక(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ సతీమణి సుధీర విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కృష్ణలంక, 22వ డివిజన్‌లోని ఆనంద్‌భవన్ రోడ్డు, గంగానమ్మ గుడి రోడ్డు, బైరెడ్డి వారి వీధి, సతీష్‌కుమార్ రోడ్డులలో సోమవారం ఆమె ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లును కలిసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా సుధీర మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయమని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్ సీపీ గెలుపునకు నాంది అన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. సంక్షేమ పథకాలు అమలు కావాలంటే సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగాలన్నారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యేగా దేవినేని అవినాష్‌ను, ఎంపీగా కేశినేని శ్రీనివాస్ (నాని)ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 22వ డివిజన్ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలతో లబ్ధి



7వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న దేవినేని క్రాంతి

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చేయడంతో పాటు, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేసిందని ఆ పార్టీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ సోదరి దేవినేని క్రాంతి అన్నారు. ఆమె ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం 7వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో వారికి చేసిన మంచిని వివరిస్తూ రానున్న ఎన్నికల్లో దేవినేని అవినాష్, కేశినేని శ్రీనివాస్‌లను గెలిపించాలని కోరారు. ప్రజలకు మంచి చేసింది ఎవరూ, నిత్యం అందుబాటులో ఉంటున్నది ఎవరూ ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. అందరికీ ఆత్మీయుడైన దేవినేని నెహ్రూ తనయుడు అవినాష్‌ను గెలిపించాలని కోరారు. ఆమె వెంట కార్పొరేటర్ మెరకనపల్లి మాధురి, స్థానిక నేతలు సంపత్, మట్టా ప్రేమలత, మెరకనపల్లి కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారికంగానే పూలే జయంతి నిర్వహించాలి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):గత 15 ఏళ్లుగా ప్రభుత్వమే జ్యోతిరావు పూలే జయంతిని నిర్వహిస్తుందని, ఈ ఏడాది కూడా అధికారికంగా నిర్వహించాలని బీసీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్వీ.రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ 11వ తేదీన జ్యోతిరావు పూలే జయంతి కాగా ఇంత వరకు అధికారులకు ఎటువంటి ఆదేశాలు జారీ కాలేదన్నారు. ఎన్నికల కోడ్‌ను నేపథ్యంలో ఆదేశాలు జారీ కాకపోవడంతో బాధకరమన్నారు. జనాభాలో 55 శాతం మంది ఉన్న బడుగు, బలహీన వర్గాలకు జ్యోతిరావు పూలే ఆదర్శప్రాయులని తెలిపారు.

నరసం జాతీయ స్థాయి కవితల పోటీ విజేతలు

విజయవాడ కల్చరల్: నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం (నరసం) జాతీయ స్థాయిలో ఓటరు చైతన్యం అంశంగా నిర్వహించిన కవితల పోటీ విజేతల వివరాలను సంస్థ గౌరవ అధ్యక్షురాలు తేళ్ల అరుణ, అధ్యక్షురాలు చిన్నలక్ష్మి కళావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ బహుమతిని హైదరాబాద్‌కు చెందిన వంజారి రోహిణి రాసిన కవిత మరువ బోకు, ద్వితీయ బహుతి పశ్చిమ గోదావరికి పాలకొల్లుకు చెందిన వై.శ్రీదేవి రచించిన ఓటరు గెలుపు, తృతీయ బహుమతి నిజామాబాద్‌కు చెందిన ఇక్కడ ఓట్లు అమ్ముడు బోవు, ప్రోత్సాహ బహుమతులు వైకే సంధ్యాశర్మ చిత్తూరు, కె.కవిత కర్నూలు గెలుచుకున్నట్లు తెలిపారు. విజేతలకు బహుమతులను వ్యక్తిగతంగా అందజేస్తామన్నారు.

త్రైత సిద్ధాంత ఉగాది తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



త్రైత సిద్ధాంత తెలుగు క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర్ల దివ్య ఆశీసులతో త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్ -(త్రైతశకం -46) జిల్లా కలెక్టరు యస్.ఢిల్లీ రావు ఆవిష్కరించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి ప్రతినిధులు భగవద్గీత, హిందూ సంప్రదాయాల గ్రంథాలు కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ఈ గ్రంథాలు ఎంతో గొప్పవని, దైవ జ్ఞానం ఉన్నవని పేర్కొన్నారు. ఈ గ్రంథాలు చదవడం ద్వారా మానవుడు కర్మ నుంచి బయట పడవచ్చన్నారు. అనంతరం త్రైత శకం తెలుగు క్యాలెండర్‌లను పలువురికి వితరణ చేశారు. సమితి సభ్యులు తిరుపతి మాట్లాడుతూ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు స్వామి రచించిన ఈ జ్ఞాన తెలుగు కాలసూచికలో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి ప్రతి ఒక్కరికీ సరళమైన భాషలో అర్థం అయ్యే విధంగా రూపొందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సమితి, హిందూ జ్ఞాన వేదిక, విజయవాడ కమిటీ అధ్యక్షుడు సభ్యులు జె.సురేష్, తిరుపతి, సత్యం, పైడప్పడు, దుర్గారావు , శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మార్వాడీ యూనివర్శిటీలో అత్యుత్తమ విద్య



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వర్శిటీ ప్రతినిధులు శ్రీధరన్, వెంకట వినయ్‌చౌదరి, మహేంద్ర

లబ్బీపేట(విజయవాడతూర్పు): దేశంలో ప్రముఖ విద్యా సంస్థల్లో ఒకటైన మార్వాడీ యూనివర్శిటీలో చదివిన విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారని ఆ యూనివర్శిటీ ఫ్యాకల్టీ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ డీన్ డాక్టర్ ఆర్.శ్రీధరన్ అన్నారు. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో ఉన్న తమ యూనివర్శిటీలో అన్ని కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. లబ్బీపేటలో ఏర్పాటు చేసిన మార్వాడీ యూనివర్శిటీ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యాలయాన్ని సోమవారం డాక్టర్ ఆర్ శ్రీధరన్ లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు మంచి కోర్సులు అందించేందుకు ముందుకు వచ్చామని తెలిపారు. జాతీయ స్థాయిలో రాణించేందుకు యూనివర్శిటీలో బోధన, స్కిల్స్ దోహదం చేస్తాయని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న యూనివర్శిటీల కంటే అతి తక్కువ ఫీజులని వెల్లడించా. తమ యూనివర్శిటీలో 54 దేశాలకు చెందిన విద్యార్థులు ఉన్నట్లు వివరించారు. ఈ సందర్భంగా సౌత్ ఇండియా మార్కెటింగ్ ప్రతినిధి వెంకట వినయ్‌చౌదరి, ఆంధ్రా, తెలంగాణ ఇన్‌చార్జి ఎస్. మహేంద్రనాయుడులతో కలిసి యూనివర్శిటీలోని కోర్సుల బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

చక్కటి ప్రణాళికతో విద్యలో రాణింపు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సహాయ భాస్కరన్ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు):విద్యలో రాణించి విజేతగా నిలవాలంటే చక్కని ప్రణాళికతో పాటు, కఠిన శ్రమ, అంకితభావం అవసరమని ఆంధ్రా లయోలా కళాశాల ఫిజిక్స్ విభాగాధిపతి జి. సహాయభాస్కరన్ అన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే వీటిని అలవర్చుకుంటే ఉన్నత స్థానాలను అధిరోహించి బంగారు భవిషతను సొంతం చేసుకుంటారని చెప్పారు. మహాత్మాగాంధీరోడ్డులోని సెయింట్‌జాన్స్ పాఠశాల 39వ వార్షిక బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా అకడమిక్స్, కో కరిక్యులర్, స్పోర్ట్స్‌లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సహాయ భాస్కరన్ మాట్లాడుతూ విజేతగా నిలిచిన ప్రతి విద్యార్థి వెనుక ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషి ఎంతగానో ఉంటుందని చెప్పారు. విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించి , వారిని తీర్చిదిద్దేందుకు బాటలు వేస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రెసిడెంట్ టి.మోనికా సుమన్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సుమన్‌త్యాగరాజ్‌లు ప్రతిభ చూపిన చిన్నారులను అభినందించారు. కాగా 2023-24 విద్యా సంవత్సరంలో 10/10 జీపీఏ సాధించిన, వందశాతం హాజరు ఉన్న వారికి, క్రీడల్లో రాణించిన వారికి ప్రత్యేకంగా బహుమతులు అందచేశారు. అకడమిక్ డీన్ కేవీ కళ్యాణి, ప్రిన్సిపాల్ చిల్లకూరి భారతి, అకడమిక్ కో ఆర్డినేటర్ పావని తదితరులు పాల్గొన్నారు.

పండుగల విశిష్టతను భావి తరాలకు అందించాలి



విజయవాడ కల్చరల్: తెలుగు పండుగల విశిష్టతను భావి తరాలకు అందించాలని నవోదయ స్కూల్ మాచవరం బ్రాంచ్ ప్రిన్సిపాల్ శ్రీధరరెడ్డి అన్నారు. పాఠశాలలో సోమవారం ఉగాది, రంజాన్ పండుగల విశిష్టతను తెలియజేయడానికి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు నూతన సంవత్సరంలో తొలిసారిగా జరుపుకొనే పండుగ ఉగాది అని, సర్వమానవ సౌభాతృత్వాన్ని చాటేది రంజాన్ అని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సంప్రదాయ వస్త్రధారణ, పండుగ విశిష్టతను తెలియజేసే బుర్రకథ, తెలుగు శతక ధారణ, వంద శతక పద్యాలతో అవధాన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులతోపాటు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, బాలబాలికల తల్లితండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమాలను పాఠశాల నిర్వాహకురాలు లలితారెడ్డి పర్యవేక్షించారు.

5 శాతం రాయితీతో పన్ను చెల్లించవచ్చు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుల చెల్లింపులపై 5 శాతం రాయితీతో ఈ నెలాఖరులోపు చెల్లించవచ్చని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులపై ప్రభుత్వం ఇచ్చిన 5 శాతం రాయితీ గడువు ఈ నెల 30వ తేదీ వరకు మాత్రమేనని పేర్కొన్నారు. నగరంలోని పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నగరంలోని అన్ని క్యాష్ కౌంటర్లు ఈ నెలాఖరు వరకు పని దినాలు, సెలవు దినాల్లోకూడా ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేస్తాయని తెలియ చేశారు. పన్నులు సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాగళ్ళ విద్యాకన్నా, సంస్థ ఉద్యోగులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):వేసవి కాలం సందర్భంగా తమ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి మే 2 తేదీ వరకు స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ నాగళ్ళ విద్యాకన్నా చెప్పారు. స్థానిక రావిచెట్టు సెంటర్‌లో ఉన్న సంస్థ కార్యాలయంలో స్వయం ఉపాధి కోర్సులకు సంబంధించి బ్రోచర్‌ను సోమవారం ఆవిష్కరించారు. విద్యాకన్నా మాట్లాడుతూ ఫ్యాబ్రిక్ పెయింటింగ్, ఫ్లవర్ మేకింగ్, మెహందీ, హౌస్ డెకరేటివ్ ఆర్టికల్స్, వాషింగ్ మెషిన్ లిక్విడ్స్, డిటర్జంట్స్ మేకింగ్, ఇన్‌స్టంట్ ఫుడ్ ఐటమ్స్, చాక్లెట్స్ మేకింగ్, న్యాచురల్ హెయిర్ ఆయిల్ అండ్ షాంపు తయారు చేసే కోర్సుల్లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ప్రతి రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తరగతులు జరుగుతాయన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 14 తేదీ లోగా తమ సంస్థ కార్యాలయంలో నేరుగా కానీ 0866-2470420 నెంబరులో కానీ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. సంస్థ పోగ్రామ్ ఆఫీసర్‌తో పాటుగా ఉద్యోగులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీఎస్‌ఓ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ



లబ్బీపేట(విజయవాడతూర్పు): అంతర్జాతీయ ప్రతిభాన్వేషణ్ ఒలింపియాడ్ పరీక్ష (ఐఎన్‌టీఎస్‌ఓ) ఫలితాల్లో పటమటలంకలోని శ్రీ చైతన్య విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ఆ స్కూల్ ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మి తెలిపారు. తమ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు, వివిధ కేటగిరిల్లో బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను సోమవారం ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మితో పాటు ఆ విద్యాసంస్థల ఏజీఎం మురళీకృష్ణ, ఆర్ఐ పద్మ, డీన్ దుర్గసాయి, ప్రైమరీ ఇన్‌చార్జి ఇందిరా, ఉపాధ్యాయులు అభినందించారు.

సందడిగా పాఠశాల వార్షికోత్సవం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే చిన్నారులు సోమవారం వాటిని పక్కన పెట్టి సినిమా, జానపద పాటలకు నృత్యాలు చేస్తూ నాటికలు ప్రదర్శిస్తూ ఉత్సాహంగా గడిపారు. స్థానిక సిద్ధార్థ నగర్‌లోని లిటిల్ బ్రెయిన్స్ స్కూల్ పాఠశాల పండుగ (వార్షికోత్సవం) సున్నపుబట్టీల సెంటర్‌లోని ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో సోమవారం సాయంత్రం జరిగింది. పిల్లల మానసిక వికాస నిపుణుడు ఫణి ప్రసాద్ ముక్తేవి మాట్లాడుతూ జీవితంలో బాల్య దశ చాలా కీలకమని, ఆ దశలో విద్యను ఒత్తిడి లేకుండా అందించాలన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ సుధా ప్రవీణతో పాటుగా ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు పంచాంగ పఠనం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): సిద్ధార్థ ఆడిటోరియంలో తమ కళాపీఠం ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర సందర్భంగా పంచాంగ పఠనం మంగళవారం నిర్వహిస్తున్నామని ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం అధ్యక్షుడు పాలడుగు లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. బ్రహ్మశ్రీ కప్పగంతు సుబ్బరామ సోమయాజీ హాజరై పంచాంగ పఠనం చేస్తారని చెప్పారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
9-4-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	494	74,742
నిఫ్టీ ▲	153	22,666

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,273	▲	24
డోజోన్స్	38,930	▲	26
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,943	▲	32
డాక్స్	18,314	▲	139
హాంఫై	3,047	▼	22
నికాయ్	39,315	▲	305

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్లు)	71,064
బంగారం (22 క్యారెట్లు)	65,095
వెండి (కిలో)	84,500

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		82.87	83.89
£	బ్రిటన్ పౌండ్		104.04	106.59
€	యూరో		89.17	91.53
¥	జపాన్ ఎన్ (100)		54.33	55.55
AU$	ఆస్ట్రేలియా డాలర్		53.83	55.76
S$	సింగపూర్ డాలర్		59.42	64.11
SAR	సౌదీ రియాల్		21.32	22.88
UAE D	యూఏఈ దిర్హామ్		21.80	23.58
¥	చైనా యువాన్		10.40	12.47

దేశీయంగా ఈవీ బ్యాటరీల తయారీ

ఎక్సైడ్ ఎనర్జీ సొల్యూషన్స్‌తో కియా, హ్యుందాయ్ మోటార్స్ జట్టు



న్యూఢిల్లీ: దేశీయంగా ఎలక్ట్రిక్ వాహన బ్యాటరీల తయారీని చేపట్టే దిశగా ఎక్సైడ్ ఎనర్జీ సొల్యూషన్స్‌తో దక్షిణ కొరియా ఆటోమొబైల్ దిగ్గజాలు హ్యుందాయ్, కియా జట్టు కట్టాయి. భారత్‌లో తమ ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) విస్తరణ ప్రణాళికలకు అనుగుణంగా ఇందుకు సంబంధించి ఎక్సైడ్ ఎనర్జీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు హ్యుందాయ్ తెలిపింది. దీని ప్రకారం లిథియం–ఐరన్–ఫాస్ఫేట్ (ఎల్‌ఎఫ్‌పీ) సెల్స్ తయారీపై ప్రధానంగా దృష్టి పెట్టనున్నట్లు వివరించింది. స్థానికంగా తయారీ వల్ల బ్యాటరీ వ్యయాలు కొంత మేర తగ్గగలవని, తద్వారా ఇతర సంస్థలతో మరింత మెరుగ్గా పోటీపడగలమని హ్యుందాయ్ మోటర్.. కియా ఆర్‌అండ్‌డీ విభాగం హెడ్ హుయి వాన్ యాంగ్ తెలిపారు. భారత మార్కెట్లో తమ బ్యాటరీల అభివృద్ధి, ఉత్పత్తి, సరఫరా తదితర కార్యకలాపాల విస్తరణకు ఎక్సైడ్ ఎనర్జీతో వ్యూహాత్మక భాగస్వామ్యం తోడ్పడగలదని ఆయన పేర్కొన్నారు. హ్యుందాయ్ ప్రస్తుతం భారత్‌లో అయోనిక్ 5, కోనా ఎలక్ట్రిక్ వాహనాలను, కియా ఇండియా ఈవీ6 మోడల్‌ను విక్రయిస్తున్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

9-4-2024 ఫామ్ ధర...

విశాఖ	405–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	390–00
విజయవాడ	390–00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	375–00
వరంగల్	377–00
రిటైల్ ధర	4.35

జీఆర్‌టీ తగ్గింపు ఆఫర్లు



హైదరాబాద్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని జీఆర్‌టీ జ్యువెలర్స్ ప్రత్యేక తగ్గింపు ఆఫర్లు ప్రకటించింది. ఈ మేరకు వెలువడిన ఒక ప్రకటన ప్రకారం– ఆభరణాల కొనుగోలుపై గ్రాముకు రూ.50 రిబేట్, వజ్రాలు, అన్‌కట్ వజ్రాల విలువపై 10 శాతం తగ్గింపు (సాలిటైర్స్ మినహా) వెండి వస్తువుల మేకింగ్ చార్జీలపై 25 శాతం తగ్గింపు, వెండి ఆభరణాల ఎంఆర్‌పీపై 10 శాతం రిబేట్ వంటి ఆఫర్లు వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయి. వినియోగదారులకు స్వర్ణ ఉగాది అనుభూతిని అందించడమే లక్ష్యమని సంస్థ తెలిపింది.

రికార్డులను తిరగరాస్తున్న బంగారం ధరలు

- న్యూఢిల్లీలో రూ.350 పెరిగి రూ.71,700కు చేరిక
- అంతర్జాతీయంగా ఆల్ టైమ్ హై 2,372 డాలర్లకు అప్




న్యూఢిల్లీ: బంగారం ధర గత వారం రోజులుగా ఏరోజుకారోజు కొత్త రికార్డులకు చేరుతోంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో సోమవారం పూర్తి స్వచ్ఛత 10 గ్రాముల ధర రూ.350 పెరిగి 71,700కు చేరింది. అంతర్జాతీయంగా కూడా ధరలు సరికొత్త రికార్డులను తాకడం దీనికి నేపథ్యం. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ (31.1 గ్రాములు) ధర జూన్‌తో ముగిసే కాంట్రాక్ట్ ఒక దశలో భారీగా క్రితం ముగింపుతో పోల్చితే 27 డాలర్లు పెరిగి 2,372డాలర్లపైకి ఎగసింది. అమెరికా ఫెడ్ వడ్డీరేట్లు తగ్గించవచ్చన్న అంచనాలు, ఈజీ మనీ, ద్రవ్యోల్బణం భయాలు, సెంట్రల్ బ్యాంక్‌ల కొనుగోళ్లు, భౌగోళిక ఉద్రిక్తతలు పసిడి పరుగునకు కారణమవుతున్నాయి. 2024లో దేశంలో పసిడి 10 గ్రాములకు రూ.7,700 పెరిగినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు ఫ్యూచర్స్ మార్కెట్– మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో పసిడి విలువ 10 గ్రాములకు ఏకంగా రూ.71,080కి ఎగసింది. సోమవారం ఈ వార్త రాసే సమయానికి క్రితం ముగింపుతో పోల్చితే రూ.158 లాభంతో రూ.70,794 వద్ద ట్రేడవుతోంది.

వెండి కూడా...

ఇదిలావుండగా, వెండి కూడా న్యూఢిల్లీలో కొత్త గరిష్టాలను చూసింది. సోమవారం కేజీకి రూ.800 ఎగసి రూ.84,000 స్థాయిని చూసింది. దేశీయ ఫ్యూచర్స్ మార్కెట్‌లో వెండి కేజీ ధర (మే కాంట్రాక్ట్) ఒక దశలో 82,109ని తాకింది. ఈ వార్త రాసే రాత్రి 9 గంటల సమయానికి ధర రూ.942 ఎగసి రూ.81,805 వద్ద ట్రేడవుతోంది.

తనిష్క్ పండుగ కలెక్షన్



హైదరాబాద్: ఆభరణాల రిటైల్ బ్రాండ్ తనిష్క్– ఉగాది సందర్భంగా అత్యంత ఆకర్షణీయమైన ఆఫర్లను అందిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు విడుదలైన ప్రకటన ప్రకారం, ప్రత్యేక కలెక్షన్‌లో నెక్లెస్‌లు, చెవి పోగులు, ఉంగరాలు, అందమైన ఆభరణాలు ఉన్నాయి. దీనితోపాటు కస్టమర్లు తమ పాత బంగారాన్ని ఆకర్షణీయమైన కొత్త డిజైన్‌లుగా మార్చుకునేందుకు తనిష్క్ ప్రత్యేకంగా 'గోల్డ్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్'ను ఆవిష్కరించింది. వినియోగదారులు ప్రతి ఆభరణం కొనుగోలుతో ఉచిత బంగారు నాణెం పొందే ఆఫర్ ఏప్రిల్ 9తో ముగుస్తుంది.

స్టాక్స్ బుల్ సవారీ

సరికొత్త గరిష్టాలకు మార్కెట్లు



ముంబై: ప్రధానంగా బ్లూచిప్స్‌లో కొనుగోళ్లతో దేశీ స్టాక్ మార్కెట్లు మరోసారి హైజంప్ చేశాయి. వెరసి ప్రామాణిక ఇండెక్సులు సరికొత్త గరిష్టాలకు చేరాయి. సెన్సెక్స్ 494 పాయింట్లు ఎగసి 74,742 వద్ద ముగిసింది. నిఫ్టీ 153 పాయింట్లు జమ చేసుకుని 22,666 వద్ద స్థిరపడింది. ఒక దశలో సెన్సెక్స్ 621 పాయింట్లు పురోగమించి 74,869ను తాకింది. ఇక నిఫ్టీ 183 పాయింట్లు బలపడి 22,697 వద్ద గరిష్టాన్ని అందుకుంది. ప్రపంచ స్టాక్ మార్కెట్ల ర్యాలీ సెంటిమెంటుకు ప్రోత్సాహాన్నిచ్చినట్లు మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. వారాంతాన యూఎస్ మార్కెట్లు లాభపడిన సంగతి తెలిసిందే.

మార్కెట్ విలువ రికార్డ్

ఇన్వెస్టర్ల సంపదగా పేర్కొనే బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల ఉమ్మడి మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ) తొలి సెషన్‌లో రూ. 401 లక్షల కోట్లను అధిగమించింది. మార్కెట్ చరిత్రలో ఇది తొలిసారికాగా.. డాలర్లలో 4.81 ట్రిలియన్లను తాకింది. చివరికి బీఎస్‌ఈ మార్కెట్ విలువ రూ. 4,00,86,722 వద్ద స్థిరపడింది. గతేడాది జులైలో తొలిసారి బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల విలువ రూ. 300 లక్షల కోట్లను తాకిన విషయం విదితమే.

బ్లూచిప్స్ దన్ను

ఎన్‌ఎస్‌ఈలో ప్రధానంగా ఆటో, ఆయిల్, రియల్టీ, మెటల్ రంగాలు 2.2–1.2 శాతం మధ్య పుంజుకోగా.. పీఎస్‌యూ బ్యాంక్స్, మీడియా, ఐటీ 0.5 శాతం స్థాయిలో బలహీనపడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో ఐషర్, ఎంఅండ్ఎం, మారుతీ, ఎన్‌టీపీసీ, ఎస్‌బీఐ లైఫ్, జేఎస్‌డబ్ల్యూ, గ్రాసిమ్, టాటా కన్జూమర్, ఎల్అండ్‌టీ, ఆర్‌ఐఎల్, యాక్సిస్, హీరోమోటో, ఎయిర్‌టెల్ 4–1 శాతం మధ్య ఎగశాయి. అయితే అదానీ పోర్ట్స్, నెస్లే, అపోలో హాస్పిటల్, విప్రో, సన్ ఫార్మా 1.6–0.6 శాతం మధ్య నీరసించాయి.

మే 20న మార్కెట్లకు సెలవు

ముంబైలో సాధారణ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో మే 20న బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలకు సెలవు ప్రకటించారు. ఈ నెల 11న ఈద్(రంజాన్), 17న శ్రీరామ నవమి, మే 1న మహారాష్ట్ర డే సందర్భంగా సైతం స్టాక్ మార్కెట్లు పనిచేయవు.

ఆధార్ హౌసింగ్ ఐపీవోకు రెడీ



ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. ఇందుకు సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఐపీవో ద్వారా రూ. 5,000 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉంది.

అనధికారిక ఫారెక్స్ ప్లాట్‌ఫాంలపై నిఘా పెంచాలి..

బ్యాంకులకు శక్తికాంత దాస్ సూచన



న్యూఢిల్లీ: అనధికారిక ఫారెక్స్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌ల విషయంలో అప్రమత్తత వహించాలని బ్యాంకులకు రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ సూచించారు. కొందరు వ్యక్తులు, సంస్థలు వీటిలో లావాదేవీలు నిర్వహించేందుకు నిధుల కోసం బ్యాంకింగ్ మాధ్యమాన్ని ఉపయోగించుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ తరహా ప్లాట్‌ఫామ్‌లలో జరుగుతున్న మోసాలపై ఫిర్యాదులు వస్తుండటంతో వాటిల్లో ట్రేడింగ్ చేయరాదంటూ ఆర్‌బీఐ ఇప్పటికే సూచన జారీ చేసినట్లు దాస్ చెప్పారు. బార్సెలోనాలో జరిగిన ఎఫ్ఐఎంఎండీఏ–పీడీఏఐ వార్షిక సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ అంశాలు వివరించారు. మరోవైపు, రూపీ డెరివేటివ్స్‌లో భారతీయ బ్యాంకుల పాత్ర మరింతగా పెరగాలని దాస్ సూచించారు.

టెలికం చందాదార్లు 119.7 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశవ్యాప్తంగా 2024 ఫిబ్రవరి నాటికి టెలికం చందాదార్ల సంఖ్య 119.7 కోట్లకు చేరింది. జనవరితో పోలిస్తే 0.38 శాతం వృద్ధి నమోదైంది. టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) ప్రకారం.. మొత్తం టెలికం సబ్‌స్క్రైబర్స్‌లో పట్టణ ప్రాంతాల నుంచి 66.37 కోట్లు, గ్రామీణ ప్రాంతాల వారు 53.13 కోట్ల మంది ఉన్నారు. ఈ ఏడాది జనవరితో పోలిస్తే ఫిబ్రవరిలో అర్బన్ కస్టమర్ల సంఖ్య 0.40 శాతం, గ్రామీణ వినియోగదార్ల సంఖ్య 0.34 శాతం పెరిగింది.

2023-24లో వాహనాల జోరు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశవ్యాప్తంగా గత ఆర్థిక సంవత్సరంలో అన్ని విభాగాల్లో కలిపి 2,45,30,334 వాహనాలు రోడ్డెక్కాయి. 2022–23తో పోలిస్తే విక్రయాల్లో 10 శాతం వృద్ధి నమోదైందని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ (ఎఫ్ఏడీఏ) తెలిపింది. '2023–24లో ప్యాసింజర్ వెహికిల్స్ రిటైల్ అమ్మకాలు 8 శాతం అధికమై 39,48,143 యూనిట్లను తాకాయి. త్రిచక్ర వాహనాలు 49% దూసుకెళ్లి 11,65,699 యూనిట్లకు చేరాయి. ట్రాక్టర్ల సేల్స్ 8,29,639 నుంచి 8,92,313 యూనిట్లకు, టూ–వీలర్స్ విక్రయాలు 9% అధికమై 1,75,17,173 యూనిట్లకు చేరాయి. వాణిజ్య వాహనాల సంఖ్య 5% ఎగసి 10,07,006 యూనిట్లు నమోదయ్యాయి.


షార్ప్ ఇండియా చైర్మన్‌గా సుజయ్



న్యూఢిల్లీ: జపాన్ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం షార్ప్ తమ భారత విభాగం చైర్మన్‌గా సుజయ్ కరమ్‌పురిని నియమించింది. ఈ ఏడాది మార్చి 1 నుంచి ఆయన నియామకం అమల్లోకి వచ్చిందని సంస్థ తెలిపింది. డిస్‌ప్లే వ్యాపార విభాగానికి సారథ్యం వహిస్తూ భారత్‌లో షార్ప్ బ్రాండ్‌ను వృద్ధిలోకి తేవడం, ఇంజినీరింగ్ ఉత్పత్తులు.. సొల్యూషన్స్ తయారీ, టెక్నాలజీ బదలాయింపునకు వ్యూహాత్మక భాగస్వాములతో ఒప్పందాలు కుదుర్చుకోవడం తదితర బాధ్యతలు ఆయన నిర్వర్తిస్తారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో సుజయ్ పలు కీలక హోదాల్లో పని చేశారు.

మళ్లీ పలికిన బాబు చిలక

వరదలో కొట్టుకుపోతున్న వాడికి గడ్డిపోచ దొరికినా ఆశగా దాన్ని పట్టుకుంటాడు. అలాగే ప్రజా వ్యతిరేక వరదలో కొట్టుకుపోతున్న చంద్రబాబు.. ప్రశాంత్ కిషోర్ అనే గడ్డిపోచ పట్టుకుని ఎన్నికల్లో గట్టెక్కేయాలని తెగ ఆరాట పడుతున్నారు. అయితే ఈ గడ్డిపోచ పరిస్థితి ఇప్పటికే తెగిన గాలిపటంలా మారిందని దేశ వ్యాప్తంగా అందరికీ తెలుసు. మాకక్కర్లేదని రెండు జాతీయ పార్టీలు విసిరికొడితే ఉనికి కోసం పాట్లు పడుతున్న ఇతగాడు చంద్రబాబు గూటికి చేరారు. అలాగని ఆ విషయాన్ని ధైర్యంగా బయటకు చెప్పే ధైర్యం లేదు. రాజకీయాలకు పనికి రాక, ఒంటరిగా ఏమీ చేయలేక.. బాబు ఇచ్చింది పుచ్చుకుని ఆయన చెప్పిన మాటలను వల్లె వేస్తున్నారు.



సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల్లో జనసేన–బీజేపీతో జట్టు కట్టినా.. కాంగ్రెస్‌తో కలిసి కుట్రలు చేస్తున్నా వైఎస్సార్‌సీపీ ప్రభంజనంలో కొట్టుకుపోవడం ఖాయమని.. గత ఎన్నికల కంటే ఘోర పరాజయం తప్పదని గ్రహించిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఉనికి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. గత ఎన్నికల్లో లగడపాటి రాజగోపాల్‌తో ఎప్పటికప్పుడు టీడీపీ గెలుస్తుందంటూ చిలక జోస్యం చెప్పించిన చంద్రబాబు.. ఇప్పుడు అదే రీతిలో ప్రశాంత్ కిశోర్(పీకే)తో టీడీపీకి అనుకూలంగా జోస్యం చెప్పిస్తున్నారు. నెల క్రితం వల్లె వేసిన మాటలనే ఆదివారం పీటీఐ ప్రతినిధుల భేటీలో మరోమారు చెప్పించారు. అటు దేశంలో.. ఇటు రాష్ట్రంలో విస్తృత యంత్రాంగం ఉన్న టైమ్స్‌నౌ–ఈటీజీ, జీన్యూస్ వంటి ప్రతిష్టాత్మక జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన డజనుకుపైగా సర్వేల్లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధిస్తుందని స్పష్టమైంది. కానీ.. ఏ యంత్రాంగం లేని ప్రశాంత్ కిశోర్ – ప్యాకేజీ కోసం చంద్రబాబు చెప్పే మాటలనే జోస్యంగా వెల్లడిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలు పూర్తయ్యాక లగడపాటిలానే ప్రశాంత్ కిశోర్ కూడా మాయం కావడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.


ప్రశాంత్ కిశోర్ జోస్యాలన్నీ తప్పే

పశ్చిమబెంగాల్ ఎన్నికల తర్వాత ఎన్నికల వ్యూహకర్తగా పని చేయబోనని భీషణ ప్రతిజ్ఞ చేసి.. ఐప్యాక్ నుంచి తప్పుకుని.. బీహార్‌లో రాజకీయ అరంగేట్రం చేశారు. తొలుత బీహార్ సీఎం నితీశ్‌కుమార్ పంచన చేరి, జేడీ(యూ) నేతగా చలామణి అయ్యారు. ఆ తర్వాత నితీశ్‌తో విభేదించి.. సొంత కుంపటి పెట్టుకుని బీహార్‌లో పాదయాత్ర చేశారు. అయినప్పటికీ బీహార్‌లో ఎలాంటి ప్రభావం చూపలేకపోయారు. అంటే.. అక్కడ చెల్లని కాసుగా ముద్రపడ్డారు. ఇదే సమయంలో ఇక్కడ స్కిల్ స్కామ్‌లో చంద్రబాబును అరెస్టు చేయడంతో భయపడి ఢిల్లీలో తలదాచుకున్న లోకేశ్.. రాజకీయంగా బీహార్‌లో గిట్టుబాటుకాని ప్రశాంత్ కిశోర్‌ను కలిశారు. తమకు ఎన్నికల వ్యూహకర్తగా పని చేయాలని కోరారు. ఆ క్రమంలోనే చంద్రబాబు బెయిల్‌పై విడుదలయ్యాక.. ప్రశాంత్ కిశోర్‌ను సీఎం రమేష్ స్పెషల్ ఫ్లైట్‌లో లోకేశ్ విజయవాడకు తీసుకొచ్చారు. ఆ తర్వాత ఉండవల్లిలోని తమ అక్రమ నివాసంలో చంద్రబాబు ఎదుట కూర్చోబెట్టారు. అప్పుడు మాత్రం తాను ఏ పార్టీకి వ్యూహకర్తగా పని చేయనని ప్రశాంత్ కిశోర్ చెప్పారు. ఈ క్రమంలోనే గతేడాది ఆఖర్లో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మిజోరాం రాష్ట్రాల శాసనసభలకు జరిగిన ఎన్నికల్లో ప్రశాంత్ కిశోర్ జోస్యాలన్నీ తప్పాయి. తెలంగాణలో బీఆర్‌ఎస్ గెలుస్తుందని ప్రశాంత్ కిశోర్ కుండబద్దలు కొడితే.. అక్కడ కాంగ్రెస్ గెలిచింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో కాంగ్రెస్ గెలుస్తుందని చెబితే.. ఆ మూడు రాష్ట్రాల్లోనూ బీజేపీ గెలిచింది.

డబ్బుల కోసమే ఆ మాటలు..

ఐప్యాక్ నుంచి తప్పుకున్న ప్రశాంత్ కిశోర్.. డబ్బుల కోసమే చంద్రబాబు చెప్పిన మాటలను తన జోస్యంగా వల్లె వేస్తున్నారని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. ఎలాంటి యంత్రాంగం, వ్యవస్థ లేని ప్రశాంత్ కిశోర్.. ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ పరిస్థితులను ఎలా అంచనా వేయగలుగుతారని ప్రశ్నిస్తున్నారు. గత 58 నెలలుగా సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో రాష్ట్రాన్ని సీఎం జగన్ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపారు. అందుకే సీఎం జగన్ నాయకత్వంపై ప్రజల్లో విశ్వసనీయత రోజురోజుకూ పెరుగుతోంది. ఇది సిద్ధం సభల్లో.. బస్సు యాత్రలో ప్రస్ఫుటితమవుతోంది. చెప్పిన మాటపై నిలబడని చంద్రబాబు మోసం చేస్తాడనే భావన ప్రజల్లో బలంగా నాటుకుపోయింది. ప్రజాగళం పేరుతో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి నిర్వహించిన సభకు.. చంద్రబాబు నిర్వహిస్తున్న సభలకు జనం మొహం చాటేయడమే అందుకు నిదర్శనం. కూటమికి ఘోర పరాజయం తప్పదన్నది కళ్ల ముందే కన్పిస్తుండటంతో ఉనికి చాటుకోవడానికి ప్రశాంత్ కిశోర్‌తో పదే పదే తన మాటలను జోస్యంగా చంద్రబాబు చెప్పిస్తున్నారనే భావన ప్రజల్లో బలంగా వ్యక్తమవుతోంది.

బాబు ప్యాకేజీ మాటలవి



- ప్రశాంత్ కిశోర్‌పై మండిపడ్డ మంత్రి బొత్స సత్యనారాయణ
- వైఎస్ జగన్ అంటే భరోసా, స్థైర్యం, ధైర్యం
- చంద్రబాబు అంటే మోసం, మాయ, మేనేజ్‌మెంట్
- ఏపీ అన్ని రంగాల్లో ముందంజలో ఉందని నీతి ఆయోగ్ వంటి సంస్థలు వెల్లడి
- ఏపీలో 11.77 శాతం నుంచి 4.2 శాతానికి తగ్గిన పేదరికం
- సివిల్ సర్వీస్ అధికారులందరినీ తప్పు పట్టడం దారుణం
- మార్గదర్శి, హెరిటేజ్ ఉద్యోగులతో ఎన్నికలు నిర్వహించాలా?

సాక్షి, విశాఖపట్నం: చంద్రబాబు హయాంలో రాష్ట్రం అధోగతిలో ఉండగా.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ పరిస్థితిని పూర్తిగా మార్చేసి, అద్భుతంగా సుపరిపాలన అందిస్తున్న విషయాన్ని పట్టించుకోకుండా ప్రశాంత్ కిషోర్ ప్యాకేజీ మాటలు మాట్లాడుతున్నారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. విశాఖపట్నం లాసన్స్‌బేలోని వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఐదేళ్లలో ఏపీలో పేదరికం 11.77 శాతం నుంచి 4.2 శాతానికి వచ్చిందని, విద్యా రంగంలో ఏపీ దేశంలోనే అగ్రగామిగా ఉందని.. జీఎస్‌డీపీ వృద్ధిలో మొదటి స్థానం అంటే ఊరకనే రాదన్న విషయాన్ని ప్రశాంత్ కిషోర్ తెలుసుకోవాలన్నారు. చంద్రబాబు ఇచ్చిన ప్యాకేజీతో వాస్తవాలు తొక్కిపెట్టి మాట్లాడటం సరికాదని హితవు పలికారు. సీఎం వైఎస్ జగన్ దార్శనికుడు, పరిపాలనా దక్షుడు కాబట్టే ఇవన్నీ సాధ్యమయ్యాయని స్పష్టం చేశారు. లీడర్ అంటే.. ప్రజలకు ధైర్యాన్ని, స్థైర్యాన్ని, భరోసా ఇచ్చేవాడని.. ఆయనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. చంద్రబాబు లీడర్‌షిప్ అంటే ఒక బ్రోకర్, మాయగాడు, మోసగాడు, మేనేజ్‌మెంట్ మాత్రమేనని విమర్శించారు. సీఎం జగన్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందంజ వేస్తూ పేదరిక నిర్మూలన, విద్య, వైద్యం, ఉపాధి కల్పన రంగాల్లో దేశంలోనే నాలుగో స్థానానికి చేరడం శుభ పరిణామమని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల ప్రజల కొనుగోలు శక్తి పెరిగిందని తెలిపారు. వీటన్నింటినీ సహించలేని ప్రతిపక్షాలు తమ ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నాయని.. న్యూటన్ చెప్పినట్లు చర్యకు ప్రతిచర్య ఉంటుందని స్పష్టం చేశారు.

అది పీకే బాధ్యతారాహిత్యం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సంస్కరణలు సత్ఫలితాలిచ్చాయని, ఇవేమీ అర్థంకాని ప్రశాంత్ కిశోర్ బాధ్యతా రాహిత్యంగా మాట్లాడటం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమని మంత్రి బొత్స ధ్వజమెత్తారు. బీహార్లో ప్రజా తిరస్కారానికి గురైన పీకేను ఏపీ ప్రజలు పరిగణనలోకి తీసుకోరని చెప్పారు. గత టీడీపీ పాలనలో కంటే రాష్ట్రంలో తమ పాలన అన్ని విధాలా మెరుగు పడిందన్నారు. నాయకుడంటే నమ్మకం, భరోసా ఉండాలనీ.. రాష్ట్ర ప్రజలు సీఎం జగన్‌ను సంపూర్ణంగా నమ్ముతున్నందునే ఎక్కడకు వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారనే విషయాన్ని పీకే తొలుత తెలుసుకోవాలని సూచించారు. ఇంట్లో మంచి జరిగితేనే ఓటు వేయండని చెబుతున్న నాయకుడిని దేశంలో ఎక్కడైనా చూశావా ప్రశాంత్ కిషోర్? అని ప్రశ్నించారు.

నిరాధార ఆరోపణలు తగవు

నిజాయితీగా పని చేస్తున్న సివిల్ సర్వీస్ అధికారులపై నిరాధార ఆరోపణలు చేయడం గర్హనీయమని.. దీనికి వత్తాసు పలుకుతూ పచ్చపత్రికలు బురద జల్లే కథనాలు రాయడాన్ని మంత్రి బొత్స తీవ్రంగా ఖండించారు. ఈ అధికారులు చాలా కాలంగా పలువురి ప్రభుత్వాల్లో కీలకంగా పని చేశారని తెలిపారు. ఇద్దరో ముగ్గురో కొన్ని పొరపాట్లు చేసినంత మాత్రాన అందరిపైనా అభాండాలు వేసి, నిరాధార ఆరోపణలు చెయ్యడం సరికాదన్నారు. అందర్నీ ఎన్నికల విధులు నుంచి తప్పించేస్తే.. ఆ పనులు ఎవరు చేస్తారని ప్రశ్నించారు. మార్గదర్శి, హెరిటేజ్ ఉద్యోగులకు ఎన్నికల విధులు అప్పగించాలని చంద్రబాబు, పురందేశ్వరి లేఖలు రాస్తారనుకుంటానని ఎద్దేవా చేశారు. వలంటీర్లపై ఈసీకి లేఖ రాసిన టీడీపీ అండ్ కో.. వారు తీసిన గోతిలో వారే పడ్డారని విమర్శించారు. తమ ప్రభుత్వం వచ్చాక కరోనా సమయంలోనూ తలసరి ఆదాయం రూ.1.5 లక్షల నుంచి రూ.2.20 లక్షలకు పెరిగిందన్నారు. బీచ్ రోడ్‌లో ఉన్న జీవీఎంసీ అతిథి గృహాన్ని క్యాంప్ కార్యాలయంగా వినియోగించుకోవాలని ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని స్పష్టం చేశారు. నిలకడ లేని మాటలు మాట్లాడే పవన్‌కళ్యాణ్ గురించి స్పందించడం టైమ్ వేస్ట్ అని కొట్టి పారేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి పాల్గొన్నారు.

ఆదరించిన పార్టీకి ఇక్బాల్ ద్రోహం

ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మునీర్ అహ్మద్

సాక్షి, అమరావతి: ఆదరించి అందలం ఎక్కించిన వైఎస్సార్‌సీపీకి ఇక్బాల్ నమ్మకం ద్రోహం చేశారని ఆంధ్రప్రదేశ్ ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) రాష్ట్ర కన్వీనర్ షేక్ మునీర్ అహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇక్బాల్‌ను చరిత్ర క్షమించదని పేర్కొన్నారు. ముస్లిం సమాజంలో విద్యావంతుడిగా ఇక్బాల్‌ను గుర్తించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల్లో హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీచేసే అవకాశం కల్పిస్తే ఓడిపోయాడని గుర్తుచేశారు. అయినప్పటికీ ఇక్బాల్‌ను ఆదరించి రెండుసార్లు ఎమ్మెల్సీ ఇచ్చి గౌరవించారని తెలిపారు. ఆదరించిన పార్టీని వీడి టీడీపీలో చేరిన ఇక్బాల్ వైఎస్సార్‌సీపీ తనకు ఏమీచేయలేదని విమర్శించడం దుర్మార్గమని పేర్కొన్నారు. రాజకీయాలకు దూరమని చెప్పిన ఇక్బాల్ ముస్లింలకు వ్యతిరేకంగా మతతత్వ బీజేపీతో పొత్తుపెట్టుకున్న టీడీపీలో చేరడం తగదని తెలిపారు.

ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్ కొట్టివేత

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణానికి సంబంధించి మనీలాండరింగ్ చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు కొట్టేసింది. ఈ కేసులో సాక్ష్యాలను నాశనం చేయడంతోపాటు సాక్షులను ప్రభావితం చేయడంలో కవిత ప్రమేయం ప్రాథమికంగా కనిపిస్తోందని కోర్టు అభిప్రాయపడింది. ఆమెను బలిపశువుగా మార్చే యత్నం జరుగుతోందనేందుకు వీల్లేదని వ్యాఖ్యానించింది. కవిత నిస్సందేహంగా పలుకుబడిగల వ్యక్తి అయినందున బెయిల్ ఇస్తే మరోసారి సాక్షులను ప్రభావితం చేసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొంది. అందువల్ల ఆమెకు మధ్యంతర బెయిల్ నిరాకరిస్తున్నట్లు స్పష్టం చేసింది. మైనర్ కుమారుడి వార్షిక పరీక్షల నేపథ్యంలో తల్లిగా తన పర్యవేక్షణ అవసరమైనందున మధ్యంతర బెయిల్ ఇవ్వాలంటూ కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కావేరి బవేజా సోమవారం ఈ మేరకు తీర్పు వెలువరించారు. మైనర్ కుమారుడి పరీక్షలకు ఆమె నైతిక మద్దతు అక్కర్లేదన్నారు. బెయిల్ నిరాకరణకు కారణాలను 21 పేజీల తీర్పులో పేర్కొన్నారు.

నేడు న్యాయమూర్తి ముందుకు కవిత

కాగా జ్యుడీషియల్ కస్టడీ పూర్తి కానుండటంతో మంగళవారం తీహార్ జైలు అధికారులు కవితను న్యాయమూర్తి కావేరి బవేజా ముందు హాజరుపరచనున్నారు. అంతకుముందు మధ్యంతర బెయిల్‌ను కోర్టు నిరాకరించడంతో రెగ్యులర్ బెయిల్ కోసం వేసిన పిటిషన్‌ను త్వరగా విచారించాలని కవిత తరఫు న్యాయవాదులు జడ్జిని కోరారు. దీంతో గత విచారణ సమయంలో రెగ్యులర్ బెయిల్‌పై ఈ నెల 20న విచారిస్తానన్న న్యాయమూర్తి.. తాజాగా ఈ నెల 16న విచారణ చేపడతానని తెలిపారు.

లాయర్లు, రౌడీమూకలతో పోలీస్‌స్టేషన్‌కు సీఎం రమేష్

- చోడవరంలో బుచ్చిరాజు ట్రేడర్స్ కేసులో విచారణకు హాజరు
- డీఆర్ఐ అధికారులపై సీఎం రమేష్ దౌర్జన్యం కేసులో 41ఏ నోటీసులు
- అర్ధగంట విచారించిన అనకాపల్లి డీఎస్పీ అప్పలరాజు
- విచారణ సాగినంతసేపు పోలీస్‌స్టేషన్ చుట్టూ రౌడీమూకల హల్‌చల్



పోలీసు స్టేషన్ నుంచి బయటకు వస్తున్న రమేష్

చోడవరం (అనకాపల్లి జిల్లా): జీఎస్టీ ఎగ్గొట్టి అక్రమ వ్యాపారం సాగిస్తున్న బుచ్చిరాజు ట్రేడర్స్‌లో తనిఖీలకు వెళ్లిన డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారుల విధులకు ఆటంకం కలిగించి దౌర్జన్యానికి పాల్పడిన కేసులో పోలీసులు విచారణ వేగవంతం చేశారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, చోడవరం అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కె.ఎస్.ఎన్.ఎస్.రాజుతో సహా ఆరుగురిపై చోడవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో సీఎం రమేష్, కె.ఎస్.ఎన్.ఎస్.రాజులను విచారణకు హాజరు కావాలని 41ఏ నోటీసులు జారీచేసిన విషయం తెలిసిందే. ప్రధాన నిందితుడైన సీఎం రమేష్‌తోపాటు కేఎస్ఎన్ఎస్ రాజు, బుచ్చిరాజు ట్రేడర్స్ యాజమానులు బుచ్చిరాజు, రామకృష్ణ, వారిద్దరి కుమారులను సోమవారం అనకాపల్లి డీఎస్పీ అప్పలరాజు విచారించారు. డీఆర్ఐ అధికారులు తనిఖీలు చేస్తున్న ప్రదేశానికి ఎందుకు వెళ్లారని, వారి విధులకు ఎందుకు ఆటంకం కలిగించారని, ప్రభుత్వ ఉద్యోగుల చేతుల్లో ఫైల్స్ ఎందుకు లాక్కున్నారని డీఎస్పీ ప్రశ్నించారు. తమ వద్ద ఉన్న రికార్డులను, సీజ్‌చేసిన సెల్‌ఫోన్లను లాక్కున్నట్టు డీఆర్ఐ అధికారులు ఫిర్యాదు చేశారని చెప్పారు. తాను రికార్డులు, సెల్‌ఫోన్లు అధికారుల నుంచి లాక్కోలేదని రమేష్ బదులిచ్చారు. అన్యాయంగా తమపై అధికారులు దాడులు చేస్తున్నారని షాపు యజమాని తనకు సమాచారం ఇవ్వడంతో అక్కడకు వెళ్లినట్లు వారు చెప్పారు. కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారందర్నీ విచారించిన డీఎస్పీ.. మళ్లీ విచారణకు రావాల్సి ఉంటుందని వారికి తెలిపారు. విచారణకు రమేష్ ముగ్గురు లాయర్లను, రౌడీమూకలను వెంటబెట్టుకుని వెళ్లారు. అర్ధగంట సాగిన ఈ విచారణ సమయంలో పోలీస్‌స్టేషన్ చుట్టూ రౌడీమూకలు సంచరిస్తూనే ఉన్నాయి.

రమేష్ వ్యాఖ్యలపై విస్మయం

విచారణ అనంతరం బీజేపీ నేత రమేష్ మీడియాతో మాట్లాడిన విషయాలు అందర్నీ ఆశ్చర్యానికి గురిచేశాయి. కంపెనీలో టైల్స్ కొనుగోలు చేసినప్పుడే జీఎస్టీ చెల్లిస్తున్న వ్యక్తి మళ్లీ ఇక్కడ అమ్మినప్పుడు జీఎస్టీ కట్టనవసరంలేదని ఆయన చెప్పడం చర్చనీయాంశమైంది. హోల్‌సేల్‌గా తెచ్చిన సరుకును రిటైల్‌గా అమ్ముతున్నప్పుడు కూడా జీఎస్టీ వర్తిస్తుందని రమేష్‌కు తెలియకపోవడం విడ్డూరంగా ఉందని స్థానిక వ్యాపారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.



క్రోధిని కార్యసాధనంగా మలచుకుందాం!

ఉగాది తెలుగువారి తొలిపండుగ. ప్రభవతో మొదలు పెట్టి అక్షయ వరకు తెలుగు సంవత్సరాలు 60. ఈ వరుసలో ఇప్పుడు మనం జరుపుకుంటున్న ఉగాదికి క్రోధి నామ సంవత్సర ఉగాది అని పేరు. క్రోధి అంటే కోపం కలవారని సామాన్యార్థం. క్రోధి అనే పదానికి కొన్ని నిఘంటువులు కోప స్వభావులైన కుక్క, దున్నపోతు అని అర్థం చెప్పినప్పటికీ, దానిని పరిగణనలోకి తీసుకోనక్కరలేదు. అన్ని స్వభావాల లాగే మనిషికి కోపం లేదా క్రోధం కూడా అవసరమే. మనకు ఎంత అవసరమో, అంతవరకు మాత్రమే కోపాన్ని ఉంచుకోవాలి. మిగిలిన దానిని నిగ్రహించుకోవాలి. ధర్మమూర్తి అయిన శ్రీరామచంద్రుడు కూడా కొన్ని సందర్భాలలో కోపించాడు. అలా మన జీవితాలకు అవసరమైన మేరకు మాత్రమే కోపాన్ని ఈ ఉగాది ఇస్తుందని, ఇవ్వాలనీ ఆశిద్దాం.

ఉగాదితో చాంద్రమాన సంవత్సరం మొదలవుతుంది. పౌర్ణమిచంద్రుడు చిత్త లేదా చిత్ర నక్షత్రంతో కూడి ఉన్న మాసాన్ని చైత్రమాసంగా పిలుస్తారు. చైత్రమాసం తొలిరోజు అంటే చైత్రశుక్ల పాడ్యమి రోజు ఉగాది అవుతుంది. చంద్రుడు ఒక నక్షత్రంతో మొదలుపెట్టి, భూమి చుట్టూ తిరిగి మళ్లీ ఆ నక్షత్రం దగ్గరకు రావడానికి పట్టే కాలం నక్షత్ర మాసం అవుతుంది. ఆ రోజు పగలు, రాత్రి సమానంగా ఉంటాయి. కాలానికి సూర్య, చంద్ర గమనాలు ప్రాతిపదిక కాబట్టి ఈ మేరకు చాంద్ర–సౌర సంవత్సరం అవుతుంది.

వ్యావహారిక శకానికి పూర్వం తొలిదశలో సప్తఋషులు నక్షత్ర సంవత్సరాన్ని, చాంద్ర–సౌర సంవత్సరాన్ని కలిపి పంచాంగాన్ని అమలులోకి తెచ్చారు. మూడు, ఐదు సంవత్సరాలలో వచ్చే అధికమాసాలను కలుపుకుని ఐదు సంవత్సరాలతో ఒక యుగం అని పంచాంగ పరంగా అమలు చేశారు. అప్పట్లో ఆ యుగం ఆరంభం శరత్ విషువత్, శరత్ ఋతువులో ఉండేది. ఈ ఐదు సంవత్సరాల యుగంలో మొదటి సంవత్సరంలో మొదటి రోజు యుగాది అయింది; అదే ఉగాది అయింది. ఈ యుగం జ్యోతిష శాస్త్రానికి అనుగుణంగా కూడా రూపొందింది. 'జ్యోతి' అంటే నక్షత్రం అనీ 'షం' అంటే సంబంధించిన అనీ అర్థం. జ్యోతిషం అంటే నక్షత్రానికి సంబంధించినది అని అర్థం.

చాంద్ర– సౌర గమనాల ప్రాతిపదికన మన పంచాంగం నిర్మితమైంది. పంచాంగం ప్రకారం మనకు ఉగాది నిర్ణీతమైంది. విశ్వామిత్ర మహర్షి పంచాంగంలోనూ, కాలగణనంలోనూ కొన్ని ప్రతిపాదనలను, మార్పులను తీసుకు వచ్చాడు. ఆ తరువాత కాలక్రమంలో జరుగుతూ వచ్చిన ఖగోళమార్పులకు తగ్గట్లు గర్గ మహాముని సంవత్సరాదిని వసంత విషువత్‌కు మార్చాడు. ఆర్యభట్టు, వరాహమిహిరుడు దాన్నే కొనసాగించారు. అదే ఇప్పటికీ కొనసాగుతోంది. సాంప్రదాయిక సంవత్సరాన్ని లేదా ఆచార వ్యవహారాల కోసం సంవత్సరాన్ని చైత్ర మాసంతో మొదలుపెట్టారు.

వసంతం, వసంతంతోపాటు ఉగాది... ఈ రెండు ప్రాకృతిక పరిణామాల్ని మనం మన జీవితాలకు ఆదర్శంగా తీసుకోవాలి, వసంత ఋతువు రావడాన్ని వసంతావతారం అని కూడా అంటారు. వసంతావతారం సంవత్సరానికి ఉన్న అవతారాలలో గొప్పది, ఆపై శోభాయామానమైంది. సంవత్సరానికి శోభ వసంతం. వసంతం మనకు వచ్చే ఋతువుల్లో ప్రధానమైంది లేదా కేంద్రభాగం అని చెప్పుకోవచ్చు. ఎందుకంటే, చెట్లకు కొత్త చివుళ్లు, కోయిలల గానాలు, పచ్చదనం, పువ్వుల కళకలను తీసుకు వచ్చేది వసంతమే. అందుకే వసంతంలో ఎక్కువ వేడి, చలి ఉండవు. వాతావరణం ఉల్లాసకరంగా ఉంటుంది. వసంతం శ్రేష్ఠమైంది కాబట్టే శ్రీకృష్ణుడు భగవద్గీతలో తాను ఋతువుల్లో వసంతాన్ని అని చెప్పాడు. నాటి కవులు, పండితులు మొదలుకొని కళాకారుల వరకు అందరికీ వసంత రుతువంటేనే మక్కువ.

కాలం ఒక ప్రవాహం

కాలం నదిలాంటిది. ముందుకు ప్రవహిస్తుందే కానీ, వెనక్కి తిరగదు. అలా ముందుకు ప్రవహించే నదిలో ఎన్నో సెలయేర్లు, వాగులు, వంకలు కలిసి ఉన్నట్టే... కాలవాహినిలో తృటి, క్షణం, ముహూర్తం, దినం మొదలైన కాలగతి సూచికలు మిళితమై ఉంటాయి. వీటిన్నింటి మేలు కలయికే కాల ప్రవాహం. ఇటువంటి కాలాన్ని ఉగాది రూపంలో ఆరాధించాలన్నది ప్రాచీనుల నిర్దేశ్యం. ప్రతి కొత్త సంవత్సరం శుభపరంపరలతో కొనసాగాలని కోరుకోవడంతోపాటు శుభాచరణకు మనల్ని మనం సమాయత్తం చేసుకుంటూ ముందుకు సాగుదాం.


ఆరు రుచులలో అనేక అర్థాలు

ఉగాదికి సంకేతంగా చెప్పుకునే ఆరు రుచుల కలయికలో అనంతమైన అర్థముంది. ప్రకృతి లేనిదే జీవి లేదు. జీవి లేని ప్రకృతి అసంపూర్ణం. కాబట్టి సరికొత్త ప్రకృతి అందించే తీపి, పులుపు, ఉప్పు, కారం, వగరు, చేదు రుచుల సమ్మేళనంతో తయారయ్యే ఉగాది పచ్చడి సేవనం ఆరోగ్యదాయకం. జీవితమంటే కేవలం కష్టాలు లేదా సుఖాలే కాదు, అన్ని విధాలైన అనుభవాలూ, అనుభూతులూ ఉంటాయి. ఉండాలి! అలా ఉన్నప్పుడే జీవితానికి అర్థం పరమార్థం. ఈ సత్యాన్ని బోధిస్తూనే ఆరోగ్యాన్ని చేకూరుస్తుంది ఉగాది పచ్చడి.



వసంతాన్ని కుసుమాకరం అనీ, కుసుమాగమం అనీ అంటారు. కుసుమానికి పుష్పం, పండు, ఫలం అని అర్థాలు ఉన్నాయి. ఈ మూడూ మనకు ఎంతో అవసరం అయినవి. తప్పకుండా మనం వీటిని పొందాలి. మన జీవితాలు కూడా నిండుగా పుష్పించాలి, పండాలి, ఫలవంతం అవ్వాలి. వసంతాన్ని ప్రకృతి ఇస్తున్న సందేశంగా మనం గ్రహించాలి. వసంతం ఒక సందేశం దాన్ని మనం అందుకోవాలి, అందుకుందాం.

సంవత్సరంలో ఉండే మంచితనం వసంతం. వసంతం ప్రకృతి నుంచి మనకు అందివచ్చే మంచితనం. '...సంతో వసంతవల్లోక హితం చరంతః ...' అని వివేక చూడామణిలో జగద్గురు ఆదిశంకరాచార్యులవారు అన్నారు. అంటే మంచి వాళ్లు వసంతంలాగా లోకహితాన్ని ఆచరిస్తారు అని అర్థం. వసంతం వంటి హితం. హితం వంటి వసంతం మనకు, సంఘానికి, దేశానికి, ప్రపంచానికి ఎంతో అవసరం.



శుభానికి తొలి అడుగుగా, మంచి తనానికి మారు పేరుగా అన్ని ఆరంభాలకూ ఆది అయిన తొలి పండుగగా ఉగాదికి విశిష్టత ఉంది. ఇతర పండుగలలా కాకుండా ఉగాది కాలానికి, ప్రకృతికి సంబంధించిన పండుగ. మనిషి కాలానికి, ప్రకృతికి అనుసంధానం అవ్వాలని తెలియజెప్పే ఒక విశిష్టమైన పండుగ.

ఆరు ఋతువులకు ఆదిగా వచ్చేది ఈ పండుగ.

పంచాంగ శ్రవణ ఫలమేమిటి?

ఉగాదినాటి పంచాంగ శ్రవణం గంగాస్నాన ఫలంతో సమానమని శాస్త్రం చెబుతోంది. అంతేకాదు. ఉగాది పంచాంగ శ్రవణం వల్ల, భూమి, బంగారం, ఏనుగులు, గోవులతో కూడిన సర్వలక్షణ లక్షితమైన కన్యను యోగ్యుడైన వరునకు దానం చేస్తే కలిగే ఫలంతో సమానమైన ఫలాన్నిస్తుందని శాస్త్రోక్తి. వీటితోపాటు సంవత్సరానికి అధిపతులైన రాజాది నవనాయకుల గ్రహఫలితాలను శాస్త్రోక్తంగా వినడం వల్ల గ్రహదోషాలు నివారితమై, వినేవారికి ఆరోగ్యాన్ని, యశస్సును, ఆయుష్షునూ వృద్ధి చేసి, సంపదతో కూడిన సకల శుభఫలాలనూ ఇస్తుందంటారు పెద్దలు. కాబట్టి ఉగాదినాడు పంచాంగ ఫలాలను తెలుసుకోవడం వల్ల భవిష్యత్ కార్యాచరణను చేపట్టవచ్చు.

సంవత్సరంలోని ఆరు ఋతువులకు ప్రతీకలుగా తీపి, కారం, చేదు, వగరు, ఉప్పు, పులుపుల్ని తీసుకుని ఆ రుచుల కోసం కొత్త బెల్లం, మిరియాలపొడి, వేపపువ్వు, మామిడి పిందెలు, ఉప్పు, కొత్త చింతపండు కలిపి తయారు చేసిన ఉగాది పచ్చడిని మనం తీసుకుంటున్నాం. నింబకుసుమ భక్షణం అని దీనికి పేరు. ఇది ఉగాది పండుగలో ముఖ్యాంశం. మరో ముఖ్యాంశం పంచాంగ శ్రవణం. ఆదిలోనే ఎవరి రాశి ప్రకారం వారికి సంవత్సరంలో జరగడానికి అవకాశం ఉన్న మేలు, కీడులను ఆయా రాశి గల వ్యక్తులకు సూచనప్రాయంగా పంచాంగం తెలియచెబుతుంది. పంచాంగ శ్రవణానికి ముందుగా మనం అభ్యంగన స్నానం చేసి, మామిడి తోరణాలతో, పుష్పాలతో ఇళ్లను అలంకరించుకుని దైవ పూజ చెయ్యాలి.

ప్రకృతి ఇచ్చిన సందేశాలుగా అందివచ్చిన ఉగాదిని, వసంతాన్ని ఆకళింపు చేసుకుని, ఆదర్శంగా తీసుకుని, మనం మనకు, ఇతరులకు ఈ ఏడాదిలోని అన్ని ఋతువుల్లోనూ హితకరం అవుదాం.

నూతనత్వానికి నాంది


బ్రహ్మదేవుడు సృష్టిని ప్రారంభించినదీ, ప్రజానురంజకంగా పాలించిన శ్రీరాముడికి పట్టాభిషేకం జరిగినదీ, వెయ్యేళ్లపాటు రాజ్యపాలన చేసిన విక్రమార్క చక్రవర్తి రాజ్యాన్ని చేపట్టినదీ, శకకారుడైన శాలివాహనుడు కిరీట ధారణ చేసినదీ, కౌరవ సంహారం అనంతరం ధర్మరాజు హస్తిన పీఠాన్ని అధిష్ఠించిందీ ఉగాదినాడేనని చారిత్రక, పౌరాణిక గ్రంథాలు చెబుతున్నాయి. కాబట్టి నూతనకార్యాలు ప్రారంభించడానికి ఉగాదిని మించిన శుభతరుణం మరొకటి లేదనే కదా అర్థం.

– డి.వి.ఆర్. భాస్కర్

సాగుబడి
రేవతి కార్తె: మార్చి 31 నుంచి

అరుదైన పంటల అడవులు!

- మండుటెండల్లోనూ కన్నుల పండుగ చేస్తున్న సౌరాష్ట్ర రైతుల 'ఫుడ్ ఫారెస్ట్‌లు'
- 5 దొంతర్ల పంటల అడవిలో పండ్లు, కూరగాయలు తదితర పంటల సాగు
- రైతు కుటుంబానికి ఏడాది పొడవునా పౌష్టికాహారంతో పాటు ఆదాయ భద్రత
- గుజరాత్‌లో ఫుడ్ ఫారెస్ట్‌లను 400 మంది రైతులకు ఇటీవల స్వయంగా చూపించిన పద్మశ్రీ పురస్కార గ్రహీత సుభాష్ పాలేకర్


రైతు కరన్ని పర్మర్


కరన్ని తోటలో పంటలను ఆశ్చర్యంగా చూస్తున్న రైతు

నరోత్తం భాయ్ జాదవ్.. చిన్న రైతు. కరన్ని అభయ్‌సింగ్ పర్మర్.. పెద్ద రైతు. వీరిది గుజరాత్ రాజధాని అహ్మదాబాద్ నగరానికి 150 కి.మీ. దూరంలోని బొటాడ్ జిల్లా. వీరు 9 నెలల క్రితం చెరొక ఎకరంలో 5 దొంతర్ల పంటల అడవి సాగును ప్రారంభించారు. సుభాష్ పాలేకర్ కృషి (ఎస్.పి.కె.) పద్ధతిలో ఎకరానికి 2 టన్నుల ఘన జీవామృతం వేస్తూ, 10–15 రోజులకోసారి ద్రవ జీవామృతం డ్రిప్, పిచికారీ చేస్తూ తొలి ఏడాదే గణనీయంగా ఆదాయం పొందుతున్నారు. ఎత్తు మడులపై కొలువుదీరిన ఈ వత్తయిన ఉద్యాన తోటలు చూపరులకు కన్నుల పండుగ చేస్తున్నాయి. పద్మశ్రీ పురస్కార గ్రహీత డా. సుభాష్ పాలేకర్ ఈ 5 లేయర్ మోడల్ క్షేత్రాలను మార్చి 31న సుమారు 500 మంది రైతులకు స్వయంగా చూపించి ఆశ్చర్యచకితులను చేశారు. ఈ క్షేత్రాలను సందర్శించిన 'సాక్షి సాగుబడి' ప్రతినిధి పంతంగి రాంబాబు గ్రౌండ్ రిపోర్ట్.


ఫుడ్ ఫారెస్ట్‌లో నరోత్తమ్‌తో పాలేకర్

బొటాడ్ జిల్లాలో వార్షిక సగటు వర్షపాతం 500–600 ఎం.ఎం. మాత్రమే. ఎక్కువ మంది రైతులు వర్షాధారంగానే పంటలు పండిస్తారు. పత్తి, గోధుమ, సోంపు తదితర పంటలను ఏక పంటలుగా అక్కడి రైతులు రసాయనిక పద్ధతిలో పండిస్తారు. అయితే, పాలేకర్ పద్ధతిలో పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, దుంపలు, ఇతరత్రా పంటలతో కూడిన 5 దొంతర్ల సాగు అల్ప వర్షపాత ప్రాంతాల్లో సైతం రైతులకు ఏడాది పొడవునా పౌష్టికాహార భద్రతను, ఆదాయ భద్రతను అందిస్తాయని ఈ ఇద్దరు రైతులు రుజువు చేస్తున్నారు. ఈ సుసంపన్న క్షేత్రాలను స్వయంగా రైతులకు చూపించిన సుభాష్ పాలేకర్.. అందుకు దోహదం చేసిన ప్రకృతి సేద్య సూక్ష్మాలను రైతులకు విశదీకరించారు. 3 రోజుల శిక్షణా శిబిరంలో ప్రతి చిన్న విషయాన్నీ విడమర్చి చెప్పి, నోట్సు రాయించారు. శ్రద్ధగా రాసుకున్న ప్రతినిధుల్లో సాధారణ రైతులతో పాటు ఇద్దరు డాక్టర్లూ ఉండటం విశేషం.

5 అడుగుల బెడ్లపై 70 పంటలు!

నరోత్తమ్ భాయ్ జాదవ్ (96872 57381– హిందీ/గుజరాతీ) స్వగ్రామం గుజరాత్ బొటాడ్ జిల్లా రాంపూర్ తాలూకాలోని నగనేశ్. ఆయనకు 5 ఎకరాల నల్లరేగడి మెట్ట భూమి ఉంది. 2017 నుంచి పాలేకర్ పద్ధతిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. 9 నెలల క్రితం ఒక ఎకరంలో.. చివరి దుక్కిలో 2 వేల కిలోల ఘనజీవామృతం వేశారు. 5 అడుగుల వెడల్పున ఎత్తుమడులు, పక్కన 3 అడుగుల వెడల్పున కాలువలు ఏర్పాటు చేశారు. బొప్పాయి, చెరకు, అరటి, మునగ, చిక్కుడు, కంది, జామ, సొర, కాకర, టొమాటో, మిరప, పసుపు, గాజర్, ఉల్లి, శనగ, తులసి, సోంపు, బీట్‌రూట్, ముల్లంగి, ఆకుకూరలతో పాటు కొబ్బరి, బాదం, అంజీర, జీడిమామిడి, సీతాఫలం, రామాఫలం, బత్తాయి, దానిమ్మ, అవకాడో తదితర పండ్ల మొక్కల్ని కూడా నాటారు. బెడ్లపై ఆ చివరన, ఈ చివరన వై ఆకారంలో పంగల ఇనుప స్టాండ్లను పాతి.. వాటికి పైన 8, కింద 4 తీగలు కట్టి.. వాటిపైకి చిక్కుడు, ఆనప, కాకర వంటి పంటలను పాకించారు. పంట వ్యర్థాలతో బెడ్లపై మొక్కల మధ్య ఆచ్ఛాదన చేశారు. బెడ్లపైన పంటలకు నాలుగు డ్రిప్ లైన్ల ద్వారా బోరు నీటిని అందిస్తున్నారు. పంటలన్నీటినీ ఒకేసారి కాకుండా 3 నెలల్లో దశల వారీగా నాటామని రైతు నరోత్తమ్ వివరించారు. 'నా భార్య, ఇద్దరు కుమార్తెలు కూడా రోజువారీ తోట పనుల్లో భాగస్వాములవుతారు. ఒక కూలీ కూడా పనిచేస్తుంటారు. హైవే పక్కనే ఉండటం వల్ల పంట ఉత్పత్తులను తోట దగ్గర కొన్ని అమ్ముతాం. మిగతా వాటిని అహ్మదాబాద్‌లో గురు, ఆదివారాల్లో అమ్ముతున్నాం. కిలో రూ. 80 నుంచి 140 ధరకు నేరుగా వినియోగదారులకే అమ్ముతున్నాం ..' అన్నారాయన. 5 లేయర్ మోడల్ పంటల సాగుకు ఎకరానికి అన్నీ కలిపి రూ. 3,50,000 పెట్టుబడి పెట్టగా.. ఇప్పటి వరకు 9 నెలల్లో రూ. 2,87,000 ఆదాయం వచ్చిందని, మరో మూడు నెలల్లో పెట్టుబడి పెట్టిన దానికన్నా ఎక్కువ మొత్తంలోనే ఆదాయం వస్తుందని నరోత్తమ్ ధీమాగా చెప్పారు. పండ్ల చెట్లు పెరిగిన తర్వాత ఏడాదికి ఆదాయం రూ. 6 లక్షలకు పెరుగుతుందన్నారు. సుమారు 70 రకాల ఉద్యాన పంటలను 5 దొంతర్లలో సాగు చేస్తుండటం సందర్శకులను ఆశ్చర్యానికి గురిచేసింది.

పంటల అడవులు.. పలు ప్రత్యేకతలు..

నేల: నల్లరేగడి (ఏ నేలలోనైనా చేయొచ్చు)
విస్తీర్ణం: 1 ఎకరం. **ఎరువు:** సుభాష్ పాలేకర్ కృషి (ఎస్.పి.కె.) పద్ధతిలో సాగు. చివరి దుక్కిలో ఎకరానికి 2 టన్నుల ఘన జీవామృతం (పాలేకర్ ఎకరానికి 400 కిలోలు చాలంటున్నా రైతులు 2 టన్నులు వేశారు). **బెడ్లు:** 5 అడుగుల వెడల్పున ఎత్తు మడులు (బెడ్ల మధ్య 3 అడుగుల దూరం). గడ్డీగాదంతో ఆచ్ఛాదన ముఖ్యం. ఎత్తు మడులపై ఏ పంటైనా పండించొచ్చు. వర్షం ఎక్కువైనా, తక్కువైనా తట్టుకుంటాయి. **పంటల వైవిధ్యం:** ఖాళీ లేకుండా 20–70 వరకు వత్తుగా 4 వరుసలుగా రకరకాల ఎత్తు పెరిగే సీజనల్, దీర్ఘకాలిక పంటలు. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, తీగజాతులు, దుంపలు, ఔషధ మొక్కలు, సుగంధ ద్రవ్య పంటలు, పప్పుధాన్యాలు, చెరకు.. బెడ్లపైనే 'వై' ఆకారపు ఇనుప ఫ్రేమ్‌లకు ప్లాస్టిక్ తాళ్లు కట్టి అనేక రకాల తీగజాతి కూరగాయల సాగు. **దేశీ వంగడాలు:** పంట ఏదైనా దేశీ విత్తనమే. ప్రతి రైతూ విత్తన రేతే. **డ్రిప్:** బెడ్లపై 4 లైన్ల డ్రిప్ (మన నేలలకు డ్రిప్ కన్నా స్ప్రింక్లర్లు మేలు: పాలేకర్). 10 రోజులకోసారి నీటితోపాటు ద్రవ జీవామృతం. **పిచికారీ:** 15 రోజులకోసారి ద్రవజీవామృతం. అవసరాన్ని బట్టి కషాయాలు. **దిగుబడి:** నిరంతరం. పూర్తయ్యే పంట పూర్తవుతుంటే విత్తే పంట విత్తుకోవాలి. అనుదినం పనితో పాటు ఏడాది పొడవునా పౌష్టికాహార, ఆదాయ భద్రత. **మార్కెటింగ్:** రైతే ధర నిర్ణయించుకొని, నేరుగా వినియోగదారులకే అమ్మకం. **ఆదాయం:** తొలి ఏడాదే రూ. 2 లక్షల ఆదాయం. ఆరేళ్ల నుంచి రూ. 6 లక్షల ఆదాయం.


నరోత్తమ్ ఫుడ్ ఫారెస్ట్‌లో రైతులతో పాలేకర్


గుజరాత్‌లోని వెజల్క గ్రామంలో కరన్ని సృష్టించిన దట్టమైన పంటల అడవి

ప్రతి రైతుకూ ఫుడ్ ఫారెస్ట్!

5 దొంతర్ల ఫుడ్ ఫారెస్ట్ నమూనా ఒక అద్భుతం. ఆహార సార్వభౌమత్వాన్ని, స్వావలంబనను అందించే ఫుడ్ ఫారెస్ట్ రైతు కుటుంబానికి ఎంతో అవసరం. కనీసం ఒక ఎకరంలో ఏర్పాటు చేసుకోవాలి. అనేక పంటలు పండించుకుంటూ ఇంటిల్లపాదీ తినటం, మిగతా పంటలను నేరుగా వినియోగదారులకే తాము నిర్ణయించిన ధరకు అమ్ముకోవటం ద్వారా ఏడాది పొడవునా మంచి ఆదాయం కూడా పొందవచ్చు. రకరకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో పాటు పప్పుధాన్యాలు, ఔషధ మొక్కలు, మసాలా దినుసులు, చివరకు చిరుధాన్యాలను కూడా పండించుకోవటానికి ఈ నమూనాలో అవకాశం ఉంది. చెరకు సాగు చేసుకొని ఇంట్లోనే బెల్లం తయారు చేసుకోవచ్చు. నీరు నిలవని,సున్నపు రాళ్లు లేని భూముల్లో (రాళ్ల భూమైనా ఫర్వాలేదు) ఫుడ్ ఫారెస్ట్‌ను 5 అడుగుల వెడల్పున ఎత్తు మడులు చేసి, వాటి మధ్యన 3 అడుగుల కాలువలు తవ్వుకోవాలి. బెడ్స్ తయారు చేసుకోవడానికి ముందే వర్షం పడినప్పుడు లేదా తడులు పెట్టి అయినా రెండు సార్లు కలుపు మొలిపించి, నిర్మూలిస్తే ఆ తర్వాత ఇక కలుపు సమస్య ఉండదు. దుక్కిలో ఎకరానికి 400 కిలోల ఘనజీవామృతం సరిపోతుంది. అయితే, గుజరాత్ రైతులు అందుబాటులో ఉంది కాబట్టి 2 వేల కిలోలు వేశారు. దేశీ విత్తనాలు, రకాలే వాడాలి. నర్సరీ మొక్కలు వద్దు. సొంతంగానే మొక్కలను తయారు చేసుకొని నాటుకోవాలి. స్వావలంబన ద్వారా రైతులు అన్ని విధాలుగా సుస్థిరత సాధించాలి. 5 లేయర్ ఫుడ్ ఫారెస్ట్‌ల ద్వారా ఎకరానికి తొలి ఏడాదే రూ. 2 లక్షల (ఆరేళ్ల నుంచి రూ. 6 లక్షల) ఆదాయం పొందుతున్న ఈ రైతుల నుంచి దేశంలో రైతులందరూ స్ఫూర్తి పొందాలి.

– పద్మశ్రీ గ్రహీత డా. సుభాష్ పాలేకర్ (98503 52745)

కనువిందు చేసిన పంటల అడవి

కరన్ని అభయ్‌సింగ్ పర్మర్ (99793 59711 హిందీ/గుజరాతీ) స్వగ్రామం బొటాడ్ జిల్లా రాంపూర్ తహశీల్ వెజల్క. 40 ఎకరాల ఆసామి. మెట్ట వ్యవసాయం. 2019 నుంచి పాలేకర్ పద్ధతిలోనే సేద్యం అంతా. 5 ఆవులు ఉన్నాయి. 6 వేల లీటర్ల జీవామృతం ట్యాంకు కట్టి, నేరుగా డ్రిప్ ద్వారా జీవామృతం పది రోజులకోసారి పంటలకు ఇస్తున్నారు. పది రోజులకోసారి పిచికారీ చేస్తున్నారు. 20 ఎకరాల్లో బీటీ పత్తి వేస్తారు. 5 ఎకరాల్లో పచ్చిగడ్డి, గోధుమ, మిగతా పొలంలో మొక్కజొన్న, శనగ,పెసర, జీలకర, సోంపు వంటి పంటలు వేస్తారు.

ఒక ఎకరంలో 9 నెలల క్రితం పాలేకర్ పద్ధతిలో 5 దొంతర్ల నమూనాలో అనేక పంటలను 5 అడుగుల వెడల్పు బెడ్స్‌పై డ్రిప్‌తో సాగు చేస్తున్నారు. చివరి దుక్కిలో 2 వేల కిలోల ఘనజీవామృతం వేశారు. 5 అడుగుల వెడల్పున ఎత్తుమడులు ఏర్పాటు చేసి 20 పంటలను సాగు చేస్తున్నారు. బెడ్స్‌పై ఆ చివరన, ఈ చివరన వై ఆకారంలో పంగల ఇనుప స్టాండ్లను పాతి.. వాటికి పైన 8, కింద 4 తీగలు కట్టి.. వాటిపైకి చిక్కుడు, ఆనప తీగలను పాకించారు. కరన్నికి చెందిన నల్లరేగడి భూమిలో ఏర్పాటైన 5 లేయర్ తోటలో ఎత్తుగా, ఆకుపచ్చగా ఆరోగ్యంగా ఎదిగిన మధుబిందు అనే దేశీ రకం బొప్పాయి చెట్లు, అరటి గెలలు, ఎత్తుగా ఎదిగిన దేశీ టొమాటో పొదలు, వంగ చెట్లు కన్నుల పండుగ చేస్తున్నాయి. ఆ చెట్లకు ఉన్న కాతను చూసి రైతులు అవాక్కయ్యారు.

మార్చి ఆఖరు నాటికి చుట్టూతా ఒకటి అరా పొలాల్లో సోంపు, గోధుమ పంటలు మాత్రమే కోతకు సిద్ధంగా ఉన్నాయి. కానీ, అనేక పంటలతో పచ్చగా ఉంది కరన్ని తోట మాత్రమే. సుభాష్ పాలేకర్ ఈ ఫుడ్ ఫారెస్ట్ గురించి ఒక్కమాటలో చెప్పాలంటే అద్భుతం అని అభివర్ణించారు.

రైతు కరన్ని మాట్లాడుతూ, తాను 9 నెలల క్రితం మొదట చెరకు నాటానన్నారు. తర్వాత నాలుగు అడుగులకు ఒకచోట అరటి, బొప్పాయి, మునగ, మామిడి, సపోట, జామ, నిమ్మ, కొబ్బరి, అవిశ,పోక, తమలపాకు, ఆపిల్, ఉల్లి, గాజర్ తదితర మొక్కలు పెట్టుకుంటూ వచ్చానన్నారు. అంచుల్లో దుంప పంటలు పెట్టానన్నారు. ఏ పంటైనా మార్కెట్ ధర కన్నా రూ. 20 ఎక్కువ ధరకు అమ్ముతున్నామన్నారు. ఈ 5 లేయర్ ఫుడ్ ఫారెస్ట్‌ను ఎకరంలో నిర్మించడానికి ఇప్పటి వరకు రూ. 1,40,000 ఖర్చు చేశానని, 9 నెలల్లో రూ. 1,38,000 ఆదాయం వచ్చిందన్నారు. మరో 2 నెలల్లో మరో రూ. లక్షకు పైగా ఆదాయం వస్తుందన్నారు.

ఈ ఫుడ్ ఫారెస్ట్‌లో టొమాటో, వంగ మొక్కలు మనిషి ఎత్తు పెరిగి మంచి దిగుబడి ఇస్తున్నప్పటికీ వాటికి వైరస్ ఆశించటాన్ని గమనించిన రైతులు పాలేకర్‌ను వివరణ అడిగారు. నల్లరేగడి భూమిలో నీటిని ఎక్కువగా ఇవ్వటమే ఇందుకు కారణమని పాలేకర్ అన్నారు. డ్రిప్ కన్నా స్ప్రింక్లర్లు మేలన్నారు.



జాతీయ హాకీ శిబిరానికి జ్యోతి రెడ్డి

మహిళల ప్రొ హాకీ లీగ్ సన్నాహాల కోసం 33 మందితో కూడిన ప్రాబబుల్స్‌ను హాకీ ఇండియా ప్రకటించింది. వీరందరికీ మే 16వ తేదీ వరకు బెంగళూరులోని భారత స్పోర్ట్స్ అథారిటీ కేంద్రంలో శిక్షణ శిబిరం నిర్వహిస్తారు. ఈ ప్రాబబుల్స్‌లో హైదరాబాద్‌కు చెందిన ఈదుల జ్యోతి రెడ్డికి స్థానం లభించింది. గత ఏడాది జరిగిన జూనియర్ ప్రపంచకప్ టోర్నీలో జ్యోతి రెడ్డి భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. ప్రొ హాకీ లీగ్ మే 22 నుంచి బెల్జియం, బ్రిటన్‌లలో జరుగుతుంది.



హ్యారీ బ్రూక్ స్థానంలో లిజాడ్

ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఇంగ్లండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ స్థానాన్ని దక్షిణాఫ్రికా సీమర్ లిజాడ్ విలియమ్స్‌తో భర్తీ చేసుకుంది. గత డిసెంబర్‌లో జరిగిన మినీ వేలంలో ఢిల్లీ ఫ్రాంచైజీ రూ. 4 కోట్లకు బ్రూక్‌ను కొనుగోలు చేసింది. అయితే ఫిబ్రవరిలో బ్రూక్ నానమ్మ చనిపోవడంతో ఈ సీజన్‌లో ఆడేందుకు బ్రూక్ రాలేదు. దీంతో అతని స్థానంలో 30 ఏళ్ల లిజాడ్‌ను కనీస ధర రూ.50 లక్షలకు తీసుకుంది. లిజాడ్ దక్షిణాఫ్రికా తరఫున 2 టెస్టులు, 4 వన్డేలు, 11 టి20లు ఆడాడు.



హంపి పరాజయం

టొరంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్ మహిళల విభాగంలో భారత నంబర్‌వన్, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపికి తొలి పరాజయం ఎదురైంది. నాలుగో రౌండ్‌లో బల్గేరియా గ్రాండ్‌మాస్టర్, ప్రపంచ 36వ ర్యాంకర్ నుర్గుల్ సలీమోవా 62 ఎత్తుల్లో ప్రపంచ ఐదో ర్యాంకర్ హంపిపై సంచలన విజయం సాధించింది. భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ వైశాలి ఈ టోర్నీలో రెండో 'డ్రా' నమోదు చేసుకుంది. ప్రపంచ మూడో ర్యాంకర్ అలెగ్జాండ్రా గొర్యాచ్‌కినా (రష్యా)తో జరిగిన నాలుగో రౌండ్ గేమ్‌ను వైశాలి 40 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. ఓపెన్ విభాగం నాలుగో రౌండ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్స్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. విదిత్ సంతోష్ గుజరాతి 44 ఎత్తుల్లో నిపోమ్‌నియాషి (రష్యా) చేతిలో ఓడిపోయాడు. నకమురా (అమెరికా)తో గేమ్‌ను ప్రజ్ఞానంద 24 ఎత్తుల్లో...ఫాబియానో కరువానా (అమెరికా)తో గేమ్‌ను గుకేశ్ 74 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించారు.

ప్రిక్వార్టర్ ఫైనల్లో అశ్విని-తనీషా జోడీ



నింగ్బో (చైనా): పారిస్ ఒలింపిక్స్‌కు చివరి అర్హత టోర్నీ అయిన ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ నేడు ప్రారంభమవుతుంది. మంగళవారం క్వాలిఫయింగ్ మ్యాచ్‌లు జరుగుతాయి. బుధవారం మెయిన్ 'డ్రా' మ్యాచ్‌లు మొదలవుతాయి. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో అశ్విని-తనీషాలతో తలపడాల్సిన ఫెబ్రియానా-ప్రతివి (ఇండోనేసియా) జోడీ గాయంతో వైదొలిగింది. దాంతో అశ్విని జోడీకి తొలి రౌండ్‌లో 'వాకోవర్' లభించడంతోపాటు ప్రిక్వార్టర్ ఫైనల్లో స్థానం లభించింది. పురుషుల సింగిల్స్‌లో భారత్ నుంచి ప్రణయ్, లక్ష్య సేన్, కిడాంబి శ్రీకాంత్, ప్రియాన్షు...మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు, ఆకర్షి కశ్యప్ బరిలో ఉన్నారు.



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రవీంద్ర జడేజా



రుతురాజ్

చెన్నై చెలరేగింది

- కూల్చేసిన తుషార్, జడేజా
- రాణించిన రుతురాజ్
- 7 వికెట్లతో కోల్‌కతాపై జయభేరి

చెన్నై: ఈ సీజన్‌లో భారీ స్కోర్లతో, హ్యాట్రిక్ విజయాలతో దూసుకెళ్తున్న కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై చెన్నై సూపర్‌కింగ్స్ చెలరేగింది. సోమవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో చెన్నై ఆల్‌రౌండ్ షో ముందు నైట్‌రైడర్స్ చేతులెత్తేసింది. దీంతో సూపర్‌కింగ్స్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా నైట్‌రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 137 పరుగులు చేసింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (33 బంతుల్లో 34; 3 ఫోర్లు) టాప్ స్కోరర్! సూపర్‌కింగ్స్ బౌలర్లు రవీంద్ర జడేజా (3/18), తుషార్ దేశ్‌పాండే (3/33), ముస్తఫిజుర్ (2/22) మూకుమ్మడిగా వికెట్లను పడేశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన చెన్నై 17.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 141 పరుగులు చేసి గెలిచింది. రుతురాజ్ గైక్వాడ్ (58 బంతుల్లో 67 నాటౌట్; 9 ఫోర్లు) రాణించగా, శివమ్ దూబే (18 బంతుల్లో 28; 1 ఫోర్, 3 సిక్స్‌లు) మెరిపించాడు.

కోల్‌కతా విలవిల...

నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్ ఆరంభం నుంచి ఆఖరిదాకా కష్టాలతోనే సాగింది. తుషార్ ఇన్నింగ్స్ మొదటి ఓవర్ తొలి బంతికే ఫిల్ సాల్ట్ (0) డకౌటయ్యాడు. ఓపెనర్‌గా చెలరేగిపోతున్న సునీల్ నరైన్ (20 బంతుల్లో 27; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), రఘువంశీ (18 బంతుల్లో 24; 3 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి కాసేపు ధాటిగా ఆడారంతే! పవర్‌ప్లేలో జట్టు 56/1 స్కోరు చేసింది. ఇక్కడిదాకా బాగానే ఉన్నా... జడేజా బౌలింగ్‌కు దిగడంతో కోల్‌కతా కష్టాల పాలైంది. తన తొలి ఓవర్లో (ఇన్నింగ్స్ 7వ) వాళ్లిద్దర్నీ అవుట్ చేసిన జడేజా మరుసటి ఓవర్లో వెంకటేశ్ అయ్యర్ (3)ను పెవిలియన్ చేర్చాడు. 64 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయింది. రమణ్‌దీప్ (13) ఐదో వికెట్‌గా వెనుదిరిగాడు. శ్రేయస్ చేసిన ఆమాత్రం స్కోరుతో కష్టంగా వంద పరుగులు దాటింది. తర్వాత తుషార్ దెబ్బకు కోల్‌కతా కుదేలైంది. హిట్టర్లు రింకూ సింగ్ (9), రసెల్ (10)లను అవుట్ చేయడంతో స్కోరులో జోరుకు ఆస్కారమే లేకపోయింది.

రుతురాజ్ అర్ధసెంచరీ

సులువైన లక్ష్యం కావడంతో హిట్టింగ్ ఓపెనర్ రచిన్ రవీంద్ర (8 బంతుల్లో 15; 3 ఫోర్లు) ఆరంభంలోనే అవుటైనా చెన్నై దూకుడుకు ఢోకా లేకపోయింది. రుతురాజ్, మిచెల్ (19 బంతుల్లో 25; 1 ఫోర్, 1 సిక్స్)తో కలిసి ఇన్నింగ్స్‌ను సాఫీగా నడిపించారు. తొలి సగం (10) ఓవర్లలో 81/1 స్కోరు చేసింది. రుతురాజ్ 45 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకోగా, మిచెల్‌ను అవుట్ చేయడం ద్వారా నరైన్ ఈ జోడీని విడగొట్టాడు. దీంతో రెండో వికెట్‌కు 70 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇంపాక్ట్ ప్లేయర్‌గా క్రీజులోకి వచ్చిన శివమ్ దూబే సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. లక్ష్యానికి చేరువలో దూబే బౌల్డవగా లాంఛనాన్ని ధోని (1 నాటౌట్), రుతురాజ్ ముగించారు.

స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి) జడేజా (బి) తుషార్ 0; నరైన్ (సి) తీక్షణ (బి) జడేజా 27; రఘువంశీ (ఎల్బీడబ్ల్యూ) (బి) జడేజా 24; శ్రేయస్ (సి) జడేజా (బి) ముస్తఫిజుర్ 34; వెంకటేశ్ (సి) మిచెల్ (బి) జడేజా 3; రమణ్‌దీప్ (బి) తీక్షణ 13; రింకూ (బి) తుషార్ 9; రసెల్ (సి) మిచెల్ (బి) తుషార్ 10; అనుకుల్ (నాటౌట్) 3; స్టార్క్ (సి) రవీంద్ర (బి) ముస్తఫిజుర్ 0; వైభవ్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 137. వికెట్ల పతనం:** 1-0, 2-56, 3-60, 4-64, 5-85, 6-112, 7-127, 8-135, 9-135. **బౌలింగ్:** తుషార్ 4-0-33-3, ముస్తఫిజుర్ 4-0 -22-2, శార్దుల్ 3-0-27-0, తీక్షణ 4-0-28-1, జడేజా 4-0-18-3, రచిన్ 1-0-4-0.

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రచిన్ (సి) వరుణ్ (బి) వైభవ్ 15; రుతురాజ్ (నాటౌట్) 67; మిచెల్ (బి) నరైన్ 25; దూబే (బి) వైభవ్ 28; ధోని (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (17.4 ఓవర్లలో 3 వికెట్లకు) 141. వికెట్ల పతనం:** 1-27, 2-97, 3-135. **బౌలింగ్:** స్టార్క్ 3-0-29-0, వైభవ్ 4-0-28-2, అనుకుల్ 1.4-0- 18-0, నరైన్ 4-0-30-1, వరుణ్ చక్రవర్తి 4-0- 26-0, రసెల్ 1-0-8-0.

ఐపీఎల్‌లో నేడు

పంజాబ్ × హైదరాబాద్
వేదిక: ముల్లాన్‌పూర్
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	4	4	0	8	1.120
కోల్‌కతా	4	3	1	6	1.528
లక్నో	4	3	1	6	0.775
చెన్నై	5	3	2	6	0.666
హైదరాబాద్	4	2	2	4	0.409
పంజాబ్	4	2	2	4	-0.220
గుజరాత్	5	2	3	4	-0.797
ముంబై	4	1	3	2	-0.704
బెంగళూరు	5	1	4	2	-0.843
ఢిల్లీ	5	1	4	2	-1.370

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్



సుమిత్ సంచలనం

- ప్రపంచ 38వ ర్యాంకర్‌పై విజయం
- మోంటెకార్లో మాస్టర్స్ టోర్నీ

మోంటెకార్లో (మొనాకో): ఈ ఏడాది తన జోరు కొనసాగిస్తూ భారత టెన్నిస్ నంబర్‌వన్ సుమిత్ నగాల్ మరో గొప్ప విజయం సాధించాడు. ప్రతిష్టాత్మక మోంటెకార్లో మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీలో రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లాడు. క్వాలిఫయర్ హోదాలో మెయిన్ 'డ్రా'లో అడుగు పెట్టిన ప్రపంచ 93వ ర్యాంకర్ సుమిత్ తొలి రౌండ్‌లో ప్రపంచ 38వ ర్యాంకర్ మాటియో అర్నాల్డిని బోల్తా కొట్టించాడు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో సుమిత్ 5-7, 6-2, 6-4తో అర్నాల్డిపై గెలిచి క్లే కోర్టు మాస్టర్స్ సిరీస్ టోర్నీల్లో రెండో రౌండ్‌కు చేరిన తొలి భారతీయ ప్లేయర్‌గా గుర్తింపు పొందాడు. 2 గంటల 37 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ తొలి సెట్‌ను కోల్పోయినా ఆందోళన చెందలేదు. రెండో సెట్‌లో అద్భుతంగా ఆడి అర్నాల్డి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసి సెట్‌ను సొంతం చేసుకున్నాడు. నిర్ణాయక మూడో సెట్‌లోనూ సుమిత్ తన దూకుడు కొనసాగించి మూడో గేమ్‌లో, ఏడో గేమ్‌లో అర్నాల్డి సర్వీస్‌లను బ్రేక్ చేసి తన సర్వీస్‌లను నిలబెట్టుకొని చిరస్మరణీయ విజయాన్ని అందుకున్నాడు. రెండో రౌండ్‌లో ప్రపంచ ఏడో ర్యాంకర్ హోల్గర్ రూనె (డెన్మార్క్)తో సుమిత్ ఆడతాడు. రెండో రౌండ్‌లోకి ప్రవేశించడం ద్వారా సుమిత్ వచ్చే ర్యాంకింగ్స్‌లో కెరీర్ బెస్ట్ 80వ స్థానానికి చేరుకోనున్నాడు. ఈ ఏడాది సుమిత్ ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ తొలి రౌండ్‌లో ప్రపంచ 27వ ర్యాంకర్ అలెగ్జాండర్ బుబ్లిక్ (కజకిస్తాన్)ను ఓడించి రెండో రౌండ్‌కు చేరగా... చెన్నై ఓపెన్ చాలెంజర్ టోర్నీలో విజేతగా నిలిచాడు. దుబాయ్ ఓపెన్ ఏటీపీ-500 టోర్నీ, ఇండియన్ వెల్స్ మాస్టర్స్-1000 టోర్నీ మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో ఓడిపోయాడు.

రన్నరప్ శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ



కల్యాణి (బెంగాల్): ఐ-లీగ్ జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టుకు మరో మ్యాచ్ మిగిలి ఉండగానే రన్నరప్ స్థానం ఖరారైంది. ఇంటర్ కాశీ ఎఫ్‌సీ (వారణాసి) జట్టుతో సోమవారం జరిగిన మ్యాచ్‌ను శ్రీనిధి జట్టు 1-1తో 'డ్రా' చేసుకుంది. శ్రీనిధి తరఫున కాస్టనెడా (41వ ని.లో)... ఇంటర్ కాశీ తరఫున జులెన్ (87వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. 13 జట్ల మధ్య జరుగుతున్న ఈ లీగ్‌లో 23 మ్యాచ్‌లు ఆడిన శ్రీనిధి జట్టు 13 మ్యాచ్‌ల్లో గెలిచి, ఆరింటిని 'డ్రా' చేసుకొని, నాలుగు మ్యాచ్‌ల్లో ఓడి 45 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. ఈనెల 13న చివరి లీగ్ మ్యాచ్‌లో షిల్లాంగ్ ఎఫ్‌సీ జట్టుతో శ్రీనిధి జట్టు తలపడుతుంది. మొహమ్మదాన్ స్పోర్టింగ్ క్లబ్ మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 52 పాయింట్లతో టైటిల్‌ను ఖరారు చేసుకుంది. 2022-2023 సీజన్‌లోనూ శ్రీనిధి జట్టుకు రెండో స్థానం దక్కింది.

సినిమా



● అల్లు అర్జున్

మాస్ జాతర

పుట్టినరోజు సందర్భంగా లేడీ గెటప్‌లో ప్రత్యక్షమయ్యారు అల్లు అర్జున్. సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా 'పుష్ప'కి సీక్వెల్‌గా రూపొందుతున్న 'పుష్ప 2: ది రూల్' చిత్రంలోని లుక్ ఇది. సోమవారం (ఏప్రిల్ 8) అల్లు అర్జున్ బర్త్ డే సందర్భంగా ఈ మూవీ టీజర్‌ని విడుదల చేశారు మేకర్స్. గంగమ్మ జాతరలో వచ్చే సన్నివేశంతో ఈ టీజర్ కట్ చేశారు. నిమిషం ఉన్న ఈ టీజర్‌లో ఒక్క డైలాగ్ కూడా లేదు. కానీ చీర కట్టులో ఊర మాస్ లుక్‌లో కనిపించి ఆశ్చర్యపరిచారు అల్లు అర్జున్. రష్మికా మందన్న హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీలో ఫాహద్ ఫాజిల్, ధనుంజయ్, సునీల్, అనసూయ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 15న రిలీజ్ కానుంది.



● సిద్ధు జొన్నలగడ్డకు షీల్డ్ అందిస్తున్న ఎన్టీఆర్‌తో త్రివిక్రమ్, విశ్వక్ సేన్...

వారిద్దర్నీ చూస్తుంటే గర్వంగా ఉంది - ఎన్టీఆర్

''విశ్వక్ సేన్‌కి, సిద్ధుకి చాలాసార్లు చెప్పాను. మీపై నమ్మకం ఉంది.. ఇండస్ట్రీ ముందుకు వెళ్లడానికి చాలా సాయపడతారు, కష్టపడతారు అని. ఈ రోజు వారిద్దర్నీ చూస్తుంటే చాలా గర్వంగా, ఆనందంగా ఉంది. కొత్త ఆలోచనలను ముందుకు తీసుకెళ్లటానికి చిత్ర పరిశ్రమకి ఇలాంటి డేర్ డెవిల్స్ కావాలి'' అని హీరో ఎన్టీఆర్ అన్నారు. సిద్ధు జొన్నలగడ్డ, అనుపమా పరమేశ్వరన్ జంటగా మల్లిక్ రామ్ దర్శకత్వం వహించిన చిత్రం 'టిల్లు స్క్వేర్'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం మార్చి 29న విడుదలైంది. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన 'డబుల్ బ్లాక్ బస్టర్ సెలబ్రేషన్స్ ఆఫ్ టిల్లు స్క్వేర్' వేడుకకి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎన్టీఆర్ మాట్లాడుతూ– ''నవ్వించడం ఓ వరం. నవ్వకపోవడం అనేది శాపం. నేను నవ్వడం మొదలుపెడితే ఆపుకోవడం కష్టం. అలాంటిది నేను ఇక నవ్వలేను బాబోయ్ అనేలా 'టిల్లు స్క్వేర్'తో నవ్వించాడు సిద్ధు.. చాలామందిని నవ్వించాడు. మల్లిక్ రామ్‌గారు 'టిల్లు స్క్వేర్'ని అద్భుతంగా తీశారు. అనుపమ, నేహాశెట్టి లేకపోతే ఈ సినిమా ఇంత హిట్టయ్యేది కాదు. ఇక 'దేవర' సినిమా రిలీజ్ లేట్ అయినా సరే.. రేపు మీరందరూ (ఫ్యాన్స్) కాలర్ ఎగరేసుకునేలా ఆ చిత్రాన్ని అందించటానికి ప్రయత్నిస్తాం'' అన్నారు. డైరెక్టర్ త్రివిక్రమ్ మాట్లాడుతూ– ''టిల్లు స్క్వేర్' వంద కోట్లు చేసింది. 'దేవర'తో ఎన్టీఆర్ వెయ్యి కోట్ల వసూళ్లు సాధించాలి'' అన్నారు. సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ–''త్రివిక్రమ్‌గారి నుంచి ఎంతో నేర్చుకున్నాను. 'డీజే టిల్లు', 'టిల్లు స్క్వేర్' సినిమాలకి నీకు ఏవైనా అవార్డులు వచ్చాయా? అని నన్ను చాలామంది అడిగారు. వారందరికీ ఎన్టీఆర్ అన్న నా గురించి మాట్లాడిన వీడియో చూపించి.. ఇంతకంటే పెద్ద అవార్డు ఏదైనా ఉందా? అన్నాను'' అన్నారు. ''అందరి కృషి వల్లే ఈ సినిమా బ్లాక్‌బస్టర్ అయ్యింది'' అన్నారు మల్లిక్ రామ్.



● ప్రభాస్

స్వాతంత్ర్యం రాక ముందు...?

ఇప్పటికే 'సలార్ 2', 'కల్కి 2898 ఏడీ' చిత్రాలు అంగీకరించిన ప్రభాస్ తదుపరి సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' చేయనున్నారు. అరవై శాతం స్క్రిప్ట్ వర్క్ పూర్తయిందని, డిసెంబరులో షూటింగ్ ఆరంభిస్తామని సందీప్ రెడ్డి ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఇక తాజాగా ప్రభాస్ సైన్ చేసిన మరో సినిమా ప్రకటన వచ్చింది. హను రాఘవపూడి దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఇది ఫిక్షనల్ పీరియాడిక్ యాక్షన్ మూవీ అని మేకర్స్ పేర్కొన్నారు. కాగా స్వాతంత్ర్యం రాక పూర్వం రజాకార్ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని టాక్. యుద్ధం నేపథ్యంలో తెరకెక్కనుందని ప్రచారం జరుగుతోంది. చిత్రసంగీత దర్శకుడు విశాల్ చంద్రశేఖర్ నేతృత్వంలో ఇప్పటికే మూడు పాటలు కంపోజ్ చేశామని దర్శకుడు హను తెలిపారు.

లవ్ గురు నవ్వులు పంచుతుంది - నిర్మాత రవిశంకర్



● రవిశంకర్, నవీన్, విజయ్

''విజయ్ ఆంటోనిగారి 'బిచ్చగాడు' సినిమా ఇప్పటికీ ఫ్యామిలీ ఆడియన్స్‌కి ఫేవరెట్ మూవీ. ఆయన నటించిన 'లవ్ గురు' సినిమా నవ్వులు పంచుతుంది'' అన్నారు నిర్మాత రవిశంకర్. విజయ్ ఆంటోని, మృణాళినీ రవి జంటగా వినాయక్ వైద్యనాథన్ దర్శకత్వం వహించిన చిత్రం 'లవ్ గురు'. మీరా విజయ్ ఆంటోని సమర్పణలో విజయ్ ఆంటోని నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 11న విడుదలవుతోంది. తెలుగులో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ రిలీజ్ చేస్తోంది. సోమవారం నిర్వహించిన 'లవ్ గురు' ప్రీ రిలీజ్ వేడుకలో నిర్మాత నవీన్ ఎర్నేని మాట్లాడుతూ– ''లవ్ గురు' చాలా బాగుంది. ఈ సినిమా తమిళంలోనే కాదు.. తెలుగులోనూ మంచి హిట్ అవుతుంది'' అన్నారు. హీరో, నిర్మాత విజయ్ ఆంటోని మాట్లాడుతూ– ''లవ్ గురు' కథ విన్నాక నా కెరీర్‌లో 'బిచ్చగాడు' తర్వాత అంత పెద్ద హిట్ అవుతుందని వినాయక్‌కు చెప్పాను. ఈ సినిమాను హిందీలో వినాయక్ డైరెక్షన్‌లోనే చేస్తాను'' అన్నారు. ''ఈ ప్రపంచంలో ప్రేమ ద్వారా ఏదైనా సాధించొచ్చు అనే అంశాన్ని మా మూవీలో చెబుతున్నాం'' అన్నారు వినాయక్ వైద్యనాథన్.

ఇక సినిమాల్లో చేయడానికి ఏమీ లేదు!



● ఉడీ అలెన్

హాలీవుడ్ సినీ చరిత్రలో దర్శకుడు-నటుడు ఉడీ అలెన్‌ది ప్రముఖ స్థానం. ముఖ్యంగా రొమాంటిక్ జానర్‌లో ఆయన తెరకెక్కించిన 'అన్నీ హాల్, మాన్‌హాట్టన్, మిడ్‌నైట్ ఇన్ ప్యారిస్, టు రోమ్ విత్ లవ్, ఎ రెయినీ డే ఇన్ న్యూయార్క్' వంటివి ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. పలు రొమాంటిక్ చిత్రాలు తెరకెక్కించిన ఉడీ అలెన్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో 'రొమాన్స్ ఆఫ్ ఫిల్మ్ మేకింగ్ ఈజ్ గాన్' అన్నారు. ఇక సినిమాలపరంగా చేయడానికి ఏమీ లేదన్నట్లుగా మాట్లాడారు 88 ఏళ్ల ఉడీ. ఆయన తెరకెక్కించిన 'కూప్ ది చాన్స్' గత ఏడాది ఫ్రాన్స్‌లో విడుదలైంది. దర్శకుడిగా ఉడీకి ఇది 50వ చిత్రం. ఇదే చివరి చిత్రం అన్నట్లుగా పేర్కొన్నారు. ఈ చిత్రం రిలీజ్ నార్త్ అమెరికాలో లేట్ అయింది. ఆ ఇంటర్వ్యూలో ఉడీ అలెన్ మాట్లాడుతూ – ''నేనొక సినిమా చేశాక దాని గురించి పట్టించుకోను. డిస్ట్రిబ్యూషన్ అనేది నా పని కాదు. ఇప్పుడు పంపిణీ అంటే ఏ మూవీ అయినా రెండు వారాలే. ఒకప్పుడు నా 'అన్నీ హాల్' సినిమా న్యూయార్క్ థియేటర్లలో ఏడాది ఆడింది. ఒక థియేటర్లో 6, 7 నెలలు ఆడాక వేరేవాళ్లు తీసుకునేవారు. అక్కడ కొన్ని నెలలాడేది. కానీ ఇప్పుడు సినిమా వ్యాపారం మారిపోయింది. ఈ మార్పు ఆకర్షణీయంగా లేదు'' అన్నారు.



హారర్... కామెడీ సమానంగా ఉంటాయి - అంజలి

''గీతాంజలి మళ్లీ వచ్చింది' సినిమా పాయింట్‌ను కోన వెంకట్‌గారు నాలుగేళ్ల ముందే చెప్పారు. అయితే అప్పుడు నేను బిజీగా ఉండటం, ఆ తర్వాత ఈ సినిమాలోని ఇతర నటీనటులు బిజీగా ఉండటంతో కుదరలేదు. మధ్యలో కరోనా వచ్చింది. హారర్, కామెడీని బ్యాలెన్స్ చేస్తూ చేసిన ఈ మూవీ ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు హీరోయిన్ అంజలి. 'గీతాంజలి'కి సీక్వెల్‌గా రూపొందిన చిత్రం 'గీతాంజలి మళ్లీ వచ్చింది'. శివ తుర్లపాటి దర్శకత్వంలో ఎంవీవీ సినిమాస్‌తో కలిసి కోన వెంకట్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 11న రిలీజవుతోంది. ఈ సందర్భంగా అంజలి మాట్లాడుతూ– ''గీతాంజలి'కి ఇది సీక్వెల్ కాబట్టి పాత్రలని మార్చలేదు. కానీ, కొత్త క్యారెక్టర్స్‌ను (అలీ, సునీల్, సత్య) తీసుకొచ్చాం. రొటీన్‌గా చేస్తే నటిగా నాకు ఆసక్తి ఉండదు కాబట్టి ప్రతి సినిమాకి కొత్తగా ఉండాలనే చూస్తున్నాను. ఈ ఉగాదికి 'గీతాంజలి మళ్లీ వచ్చింది'తో వస్తుండటం హ్యాపీ'' అన్నారు.

నీదేలే జన్మ



● కృష్ణ, అమృత

ప్రేయసిని ఉద్దేశించి 'నీదేలే జన్మ...' అంటూ కన్నడ ప్రముఖ నటుడు-దర్శకుడు డార్లింగ్ కృష్ణ పాట అందుకున్నారు. డార్లింగ్ కృష్ణ హీరోగా నటించి, స్వీయదర్శకత్వంలో రూపొందించిన కన్నడ చిత్రం 'లవ్ మాక్‌టైల్ 2'. నకుల్ అభయాన్కర్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'నీదేలే నీదేలే జన్మ..' పాటను విడుదల చేశారు. గురుచరణ్ సాహిత్యం అందించిన ఈ పాటను సురేంద్రనాథ్ పాడారు. మిలినా నాగరాజ్, అమృతా అయ్యంగార్ ముఖ్య పాత్రలు పోషించారు. తెలుగులో ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్న ఎంవీఆర్ కృష్ణ మాట్లాడుతూ – ''తెలుగులోనూ 'లవ్ మాక్‌టైల్ 2' హిట్టవుతుందనే నమ్మకం ఉంది. ఈ వేసవిలోనే చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అన్నారు.

ప్రియమైన మాజీల్లారా...!



● నిత్య

కూలింగ్ గ్లాసెస్, ఒక చేతిలో మాక్‌టైల్.. మరో చేతిలో మొబైల్ ఫోన్‌తో ఆధునిక యువతిలా కనిపిస్తూనే... పసుపురంగు చీరలో సంప్రదాయబద్ధంగానూ కనిపించారు నిత్యా మీనన్. ఆమె నటిస్తున్న తాజా చిత్రం 'డియర్ ఎక్సెస్' (ప్రియమైన మాజీల్లారా) లోని లుక్ ఇది. సోమవారం (ఏప్రిల్ 8) నిత్యా పుట్టిన రోజు సందర్భంగా ఈ చిత్రం టైటిల్ ప్రకటించి, లుక్ రిలీజ్ చేశారు. కామినీ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. ఓ యువతికి ఎదురయ్యే సవాళ్లు, అనుబంధాలపై ఆమె దృక్పథం నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది.

డియర్ కథ సహజంగా ఉంటుంది - సందీప్ కిషన్



● జీవీ ప్రకాశ్, ఐశ్వర్య, సందీప్ కిషన్

''డియర్' టీజర్, ట్రైలర్ చూస్తుంటే సినిమా సహజంగా ఉంటుందనిపిస్తోంది. ఈ సినిమా పెద్ద హిట్టవ్వాలి'' అని హీరో సందీప్ కిషన్ అన్నారు. జీవీ ప్రకాశ్ కుమార్, ఐశ్వర్యా రాజేశ్ జంటగా ఆనంద్ రవిచంద్రన్ దర్శకత్వం వహించిన చిత్రం 'డియర్'. వరుణ్ త్రిపురనేని, అభిషేక్ రామిశెట్టి, జి. పృథ్వీరాజ్ నిర్మించిన ఈ చిత్రం తమిళంలో ఈ నెల 11న, తెలుగులో 12న విడుదలవుతోంది. ఈ మూవీని ఆంధ్రప్రదేశ్‌లో అన్నపూర్ణ స్టూడియోస్, తెలంగాణలో ఏషియన్ సినిమాస్ రిలీజ్ చేస్తున్నాయి. సోమవారం నిర్వహించిన 'డియర్' ప్రీ రిలీజ్ వేడుకకి సందీప్ కిషన్, నిర్మాత నాగవంశీ, దర్శకులు వెంకీ అట్లూరి, నందినీ రెడ్డి అతిథులుగా పాల్గొన్నారు. ''ఈ సినిమా అందరూ ఎంజాయ్ చేసేలా ఉంటుంది'' అన్నారు జీవీ ప్రకాశ్ కుమార్.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.